

'నిరుపేదలకు పట్టెడన్నం దొరికేటట్లు చేయడం ప్రభుత్వ ధర్మం, అందుకు ఎన్ని కోట్లు ఖర్చయినా వెనుకాడకూడదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 154

గురువారం 24-8-2017



రూ.200 నోట్లు వచ్చేస్తున్నాయ్

మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు ఆర్‌బీఐకి కేంద్ర ప్రభుత్వం అనుమతి - 14లో



ప్రిక్వార్టర్స్‌లోకి సాయిప్రణీత్

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల జోరు - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ప్రక్షాళనకు ప్రణాళిక

వచ్చేనెల 15 నుంచి డిసెంబర్ వరకు భూముల రికార్డులు సరిచేసే ప్రక్రియ

- కొత్త రికార్డుల ఆధారంగానే పెట్టుబడి సాయం పథకం
- సెప్టెంబర్ 1 నుంచి గ్రామాల్లో రైతు సంఘాల ఏర్పాటు
- ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక్కో బృందం
- సీఎంతోపాటు ప్రజాప్రతినిధులకు ఒక్కో యూనిట్ బాధ్యత
- నెల రోజులపాటు గ్రామ సభలు.. అందరి సహకారంతో కొత్త రికార్డులకు రూపు.. ముందుగా వివాదాల్లేని భూములు.. తర్వాత కోర్టుల్లో ఉన్న భూములు
- తుది రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదు
- రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సరళతరం.. కొత్త పాస్ పుస్తకాలు కొరియర్ ద్వారా రైతు చెంతకు
- భూముల సర్వే, రికార్డుల ప్రక్షాళనపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్ష

2లో



ఇదీ కార్యాచరణ..

సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు
గ్రామ రైతు సంఘాల సమన్వయ సమితి ఏర్పాటు. గ్రామంలో వ్యవసాయ భూమి ఉన్నవారంతా రైతు సంఘంలో సభ్యులుగా ఉంటారు. 11 మందితో సమన్వయ సమితులు ఏర్పాటవుతాయి.

సెప్టెంబర్ 10 నుంచి 15 వరకు
మండల స్థాయిలో సమితుల సదస్సుల నిర్వహణ

సెప్టెంబర్ 15న
రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది.

సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు
రెవెన్యూ గ్రామం యూనిట్‌గా రికార్డుల ప్రక్షాళన.

మరో రైలు ప్రమాదం

యూపీలో ట్రక్కును ఢీకొన్న కైఫియత్ ఎక్స్‌ప్రెస్



- పట్టాలు తప్పిన 10 బోగీలు.. ఐదు రోజుల్లో రెండో ప్రమాదం
- 100 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం
- ప్రమాదాలకు నైతిక బాధ్యత తనదేనన్న సురేశ్‌ప్రభు
- రాజీనామాకు సిద్ధపడ్డ రైల్వే మంత్రి.. వారించిన ప్రధాని

- వివరాలు 10లో

ఓటెత్తిన నంద్యాల

ఉప ఎన్నికలో 79.20% పోలింగ్

- దశాబ్దాల తర్వాత అత్యధిక పోలింగ్
- ఉదయం నుంచే ఓటర్ల బారులు
- అధికార పార్టీ ఎమ్మెల్యేల హల్‌చల్
- చివరి మూడు గంటలూ దౌర్జన్యం
- గెలుపు తమదే అంటున్న ఇరు పార్టీల అభ్యర్థులు
- 28న ఓట్ల లెక్కింపు - 11లో



బుధవారం నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలం దీబగుంట్ల పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



విక్టోరియా మెమోరియల్ హోమ్ ఇక చరిత్రే?

- క్రమంగా చేజారిపోతున్న ట్రస్టు స్థలాలు
- మొత్తం 73 ఎకరాల్లో పళ్ల మార్కెట్, జగ్జీవన్‌రామ్ భవన్, రిలయన్స్ బంకు, రోడ్డు విస్తరణతో 28 ఎకరాలు ఫట్
- ఇప్పుడు రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు 10 ఎకరాలు కేటాయింపు
- మరో 26 ఎకరాల్లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి ప్రతిపాదనలు
- ఇక మిగిలేది అరకొరే

- వివరాలు 5లో

210 మండలాల్లో లోటు వర్షపాతం

- నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 22 మండలాల్లో లోటు
- ఇటీవలి వర్షాలతో పుంజుకున్న వరినాట్లు
- వ్యవసాయ శాఖ నివేదిక
- రేపటి నుంచి మూడు రోజులు భారీ వర్షాలు

- వివరాలు 6లో

ఓబీసీ క్రీమీలేయర్ రూ.8 లక్షలు

- పరిమితిని పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం
- ఓబీసీ వర్గీకరణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ప్రస్తుత రిజర్వేషన్ వ్యవస్థను ముట్టుకోం
- ఎస్సీ వర్గీకరణ ప్రతిపాదనలు లేవని స్పష్టీకరణ
- ఫుడ్ ప్రాసెసింగ్ పథకం పేరు మార్పు.. రూ.6 వేల కోట్లు కేటాయింపు

- వివరాలు 10లో

'మహాప్రస్థానం'లా పంజాగుట్ట శ్మశానం

ఫీనిక్స్ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీకాంత్ బాడిగ వెల్లడి



హైదరాబాద్: పంజాగుట్టలోని శ్మశానాన్ని మరో మహాప్రస్థానంగా తీర్చిదిద్దుతామని ఫీనిక్స్ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీకాంత్ బాడిగ అన్నారు. ఇప్పటికే మహాప్రస్థానం తరహాలో సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లోని శ్మశానాల ఆధునీకరణ పనులు పూర్తయ్యాయని, ఖమ్మం, సిరిసిల్లాలోని శ్మశానాల ఆధునీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాయదుర్గంలోని మహాప్రస్థానం దేశంలోనే ఒక ఆదర్శ శ్మశానవాటికగా మారిందన్నారు. దీని స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఒక మహాప్రస్థానం నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కలెక్టర్లకు ఆదేశించారన్నారు. అదే తరహాలో రాష్ట్రంలోని నాలుగు వేల శ్మశానవాటికల అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం రూపొందించారన్నారు. ఈ వైకుంఠ మహాప్రస్థానం పనులను 2014 ప్రారంభించి మార్చి 30, 2015లో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గత మూడేళ్ళ కాలంలో అయిదు అవార్డులను పొందామన్నారు. రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో నిత్యం ఉచిత భోజనాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

✦ నిరాడంబరంగా ప్రియమణి వివాహం



సాక్షి, బెంగళూరు: వ్యాపారవేత్త ముస్తఫారాజ్‌ను సినీ నటి ప్రియమణి పెళ్లిచేసుకున్నారు. బెంగళూరులోని జయనగర రిజిస్ట్రార్ కార్యాలయంలో దండలు మార్చుకుని నిరాడంబరంగా ఒక్కటయ్యారు. వీళ్ల నిశ్చితార్థం గత ఏడాది జరిగింది. వివాహానికి వీరిద్దరి కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. బంధుమిత్రులు, ఆప్తుల కోసం గురువారం బెంగళూరు శివార్లలోని ఎలెన్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా రిసెప్షన్ ఏర్పాటుచేశారు.

వావ్ ఫ్యాక్టర్



దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా రికార్డును బ్రేక్ చేయబోతున్న మరో కట్టడం నమూనా. ప్రస్తుతం ఇది నిర్మాణంలో ఉంది

పెద్ద గీత.. చిన్న గీత కాబోతోంది!

ప్రపంచంలోనే ఎత్తైన భవనం ఏది? దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా! కానీ ఈ ముచ్చట ఇంకో మూడేళ్లే! బుర్జ్ ఖలీఫాకు కొంచెం దూరంలోనే ఇంకో ఎత్తైన భవనాన్ని కట్టేసి దుబాయి తన రికార్డును తానే బద్ధలు కొడుతోంది. మల్లెపూవు ఆకారాన్ని పోలినట్టు ఉండే ఆ భవనం ఎలా ఉండబోతోందో ఫొటోలో చూడవచ్చు. దుబాయ్ కేంద్రంగా పనిచేస్తున్న ఎమ్మార్ ప్రాపర్టీస్ ఈ ఎత్తైన భవంతిని కడుతోంది. డిజైన్ చేసింది శాంటియాగో కలట్రావాస్ అనే ఆర్కిటెక్చర్ సంస్థ. దాదాపు ఆరు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కట్టే ఈ భవనం ఎత్తు దాదాపు 3,045 అడుగులు. బుర్జ్ ఖలీఫా కంటే 300 అడుగులు ఎక్కువ. దుబాయ్ అంటేనే ఏడారి దేశం కాబట్టి.. ఇసుక నేలలపై భవనాలు కట్టడం అంత ఆషామాషీ ఏం కాదు. అందుకే ఈ కొత్త భవనానికి పునాది ఎంత గట్టిగా వేశారంటే.. అది కాస్తా 236 అడుగుల లోతుకు చేరేంత. పైగా ఒక్క పునాదుల్లోనే దాదాపు 16 లక్షల ఘనపుటడుగుల కాంక్రీట్‌ను దిమ్మరించారు. ఇక ఈ భవనానికి ఉన్న మరో ప్రత్యేకత... దీనికి ఊతమిచ్చేందుకు దాదాపు 110 కిలోమీటర్ల పొడవైన ఇనుపతీగలను వాడటం. బలమైన గాలులకు భవనం ఊగిపోకుండా అన్నమాట! అన్నీ బాగానే ఉన్నాయిగానీ దీంట్లో ఏముంటాయి? దుబాయ్ మొత్తాన్ని పై నుంచి చూసేందుకు పది వరకూ అబ్జర్వేషన్ డెక్స్ ఉంటాయి. అంతేకాకుండా బాబిలోనియాలోని వేలాడే ఉద్యానవనాల మాదిరిగా దీంట్లోనూ బోలెడన్ని మొక్కలు, పచ్చదనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. బిల్డింగ్ లోపల చల్లగా ఉంచేందుకు అత్యంత సమర్థవంతమైన వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. ఈ వ్యవస్థ ద్వారా సేకరించే నీటితో బిల్డింగ్ ముందుభాగాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా ఏర్పాట్లు ఉన్నాయి. దీంట్లో ఉన్న కొన్ని బాల్కనీలు అవసరమైనప్పుడు బిల్డింగ్ బయటభాగానికి వచ్చేస్తాయి. ఆ తరువాత లోనికి తిరిగేస్తాయి. గత ఏడాది ఈ భవన నిర్మాణం మొదలుకాగా.. ఇంకో మూడేళ్లలో అంటే 2020లో జరిగే దుబాయ్ ఎక్స్‌పో సమయానికి నిర్మాణం పూర్తి అవుతుందని అంచనా.

- సాక్షి నాలెడ్జ్ సెంటర్

ప్రక్షాళనకు ప్రణాళిక

భూముల సర్వే, రికార్డుల ప్రక్షాళనపై సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్ష

సాక్షి, హైదరాబాద్

భూవివాదాల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్రంలో రికార్డులను ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ వరకు మూడు నెలల వ్యవధిలో అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు తేదీలను ఖరారు చేశారు. ప్రక్షాళన చేసిన రికార్డుల ఆధారంగానే రైతులకు వ్యవసాయ పెట్టుబడి పథకం అమలు చేస్తామని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 నుంచి రైతు సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. భూముల సర్వే, రికార్డుల ప్రక్షాళన, రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు తదితర అంశాలపై బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, జోగు రామన్నతోపాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. భూ రికార్డుల ప్రక్షాళనకు అవలంబించాల్సిన పద్ధతులపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ రావు నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించారు. భూరికార్డులు సక్రమంగా, సమగ్రంగా ఉంటేనే పెట్టుబడి పథకం విజయవంతమవుతుందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ''భూ రికార్డులను ప్రక్షాళన చేయడం వల్ల ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయి. ఏ భూమి పరిస్థితి ఏంటో తెలియడం వల్ల వివాదాలు, ఘర్షణలకు తావుండదు. నిజానికి ఇది పెద్ద సవాల్. చాలా పీటముళ్లుంటాయి. కానీ చిత్తశుద్ధి ఉంటే చేయడం అసాధ్యం కాదు. రికార్డుల ప్రక్షాళన జరిగితే భూ దందాలు కూడా బంద్ అవుతాయి''అని సీఎం అభిప్రాయపడ్డారు. ''భూ రికార్డులను సరిచేసే కార్యక్రమం సెప్టెంబర్ 15న పెద్దఎత్తున ప్రారంభం కావాలి. అన్ని మండలాల్లో ప్రారంభ కార్యక్రమం నిర్వహించాలి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా తలా మూడు గ్రామాలను తీసుకుని ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొనాలి. నేను కూడా మూడు గ్రామాలు ఎంపిక చేసుకుంటా. వ్యవసాయ, రెవెన్యూ శాఖ ఉద్యోగులు, రైతు సంఘాలు చురుకైన పాత్ర పోషించాలి. సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా క్రియాశీల పాత్ర పోషించాలి. ఈ ప్రక్షాళనకు కొంతమంది ఉద్యోగులను కూడా తాత్కాలిక పద్ధతిపై తీసుకుంటాం'' అని ముఖ్యమంత్రి తెలిపారు.

సమస్త భూముల వివరాల సేకరణ

రికార్డుల ప్రక్షాళన సందర్భంగా రైతుల అధీనంలో ఉన్న వ్యవసాయ భూముల తోపాటు గ్రామంలో అటవీ, ప్రభుత్వ, దేవాదాయ, ప్రజోపయోగ కార్యక్రమాల కోసం వినియోగిస్తున్న భూములతోపాటు ప్రభుత్వ భవనాల కింద, చెరువులు, కుంటల కింద ఉన్న భూముల వివరాలన్నీ సేకరించాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయేతర అవసరాలకు బదిలీ చేసిన వ్యవసాయ భూములు, ప్రభుత్వం సేకరించిన భూ వివరాలు, అసైన్ చేసిన వివరాలు కూడా నమోదు చేయాలన్నారు. అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేసుకునే పేదలకు కూడా పెట్టుబడి పథకం కింద ఆర్థిక సాయం అందిస్తామని సీఎం ప్రకటించారు. గ్రామ కంఠాన్ని కూడా నిర్ధారించాలని సూచించారు. మొదటి దశలో వివాదాల్లేని భూములు రికార్డులను సరిచేయాలని చెప్పారు. రెండో దశలో రాష్ట్రంలోని మొత్తం భూభాగాన్ని సర్వే చేయించి, కొత్త మ్యాపులు రూపొందిస్తామన్నారు. తెలంగాణ భూభాగంలో జరిగే మార్పులు ఎప్పటికప్పుడు వెంటనే నమోదయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సీఎం చెప్పారు.



ప్రగతి భవన్‌లో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో జోగు రామన్న, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు..

రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా జరగాలని సీఎం ఆదేశించారు. ''క్రయ విక్రయాలు జరిపే రైతులిద్దరూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలి. రిజిస్ట్రార్‌కు ఇద్దరి పాస్ పుస్తకాలు ఇవ్వాలి. రిజిస్ట్రార్.. అమ్మే వారి పాస్ పుస్తకం నుంచి భూమిని తొలగించి కొనేవారి పాస్ పుస్తకంలో ఎంటర్ చేయాలి. ఆ రెండు పాస్ పుస్తకాలను కొరియర్ ద్వారా ఎమ్మార్వోకు పంపాలి. నాలుగు పని దినాల్లో ఎమ్మార్వో ఆ క్రయ విక్రయాలకు సంబంధించిన వివరాలు తన కార్యాలయంలోని రికార్డుల్లో నమోదు చేసుకోవాలి. పాస్ పుస్తకాలపై అటెస్ట్ చేయాలి. పేరు మార్పిడి చేయాలి. తిరిగి రిజిస్ట్రార్‌కు పంపాలి. రిజిస్ట్రార్ తన రికార్డుల్లో నమోదు చేసుకుని కొరియర్ ద్వారా రైతులకు పంపాలి. అమ్మేవారు.. కొనేవారు ఒక్కసారి మాత్రమే రిజిస్ట్రార్ ఆఫీస్‌కు రావాలి. తిరగడం, పైరవీలు చేసే పని ఉండకూడదు''అని స్పష్టంచేశారు.

కొత్త పాస్ పుస్తకాలు రూపొందించండి

పాస్ పుస్తకాలు, పహాణీల నిర్వహణ మరింత సరళతరం చేయాలని, అవసరం లేని కాలమ్స్ తీసేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ''పాస్ పుస్తకాలు కొత్తవి ఇవ్వాలి. నీటిలో పడినా తడవకుండా, పాడవకుండా ఉండేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. పాస్ పుస్తకాల సైజు తగ్గించాలి. స్టాంపుల చట్టాలను, రిజిస్ట్రేషన్ చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అవసరమైన మార్పులు చేయాలి. భవిష్యత్‌లో ప్రతీ మండలానికి ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలి. వీలైతే ఎమ్మార్వోకే రిజిస్ట్రేషన్ కూడా చేసే అధికారం ఇచ్చే అవకాశాలు పరిశీలించాలి. రెవెన్యూ కోర్టులు కూడా ఇన్ని ఉండాలా? కేవలం కలెక్టర్ వద్ద ఒక్క కోర్టు మాత్రమే నిర్వహించాలా? అనే విషయంలో కూడా నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధిత జాబితా తయారు చేయాలి. ఆ భూములు రిజిస్ట్రేషన్ కాకుండా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలి'' అని సీఎం అధికారులను ఆదేశించారు.

వచ్చే ఏడాదికి కాళేశ్వరం

''రైతులకు కావాల్సింది సాగునీరు, పెట్టుబడి, గిట్టుబాటు ధర. ఇప్పటికే రాష్ట్రంలో సాగునీరు అందివ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది నాటికి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా దాదాపు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది''అని సీఎం వెల్లడించారు. ''పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోంది. అవసరం ఉన్నంత ఉచిత విద్యుత్ అందడం వల్ల రైతులు భూగర్భ జలాలను గరిష్ట స్థాయిలో ఉపయోగించుకోగలుగుతున్నారు. తర్వాత దశలో గిట్టుబాటు ధర కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతులను సంఘటితం చేసే పనికి ప్రభుత్వమే పూనుకుంది. రైతులు సంఘటితమై గిట్టుబాటు ధర పొందే ప్రణాళిక కూడా అమలు చేస్తున్నాం''అని వివరించారు.

1,100 యూనిట్లు.. 3,600 బృందాలు..

ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. రాష్ట్రం మొత్తాన్ని 1,100 యూనిట్లుగా విభజించారు. మొత్తం 3,600 బృందాలను ఎంపిక చేస్తారు. రెవెన్యూ అధికారి, వ్యవసాయాధికారి, గ్రామ రైతు సంఘం సమన్వయంతో ఒక్కో గ్రామంలో ఒక్కో బృందం నెల రోజుల పాటు ఉండి గ్రామ సభలు నిర్వహిస్తుంది. రైతులందరి సహకారం, అంగీకారంతో భూ రికార్డులను సరిచేస్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఒక్కో యూనిట్‌కు బాధ్యత తీసుకుని భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు.

అందుకే ఈ ప్రక్షాళన..

''1932–36 మధ్య నిజాం హయాంలో భూ సర్వే జరిగింది. మళ్లీ జరగలేదు. భూ రికార్డుల నిర్వహణ గందరగోళంగా ఉంది. వ్యవసాయ శాఖ వద్ద వివరాలకు, రెవెన్యూ శాఖ వద్ద ఉన్న వివరాలకు పొంతన లేదు. దీంతో ప్రభుత్వం ఇవ్వాలనుకునే పెట్టుబడి సాయం ఏ ప్రాతిపదికన అందించాలో తెలియని పరిస్థితి. ఈ పొరపాట్లతో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగే అవకాశం ఉంటుంది. మంచి చేయబోతే చెడు అవుతుంది. అందుకే ఏ భూమి ఎవరి అధీనంలో ఉందో, పెట్టుబడి ఎవరికి అందాలో తెలుసుకునేందుకే ఈ ప్రక్షాళన చేస్తున్నాం'' అని ముఖ్యమంత్రి వివరించారు.

ఇకపై అంతా ఆన్‌లైన్‌లో..

భూ రికార్డులు సరిచేసిన తర్వాత ఆ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టాలని, ఆ తర్వాత చిన్న మార్పు జరిగినా ఆన్‌లైన్‌లో తెలిసిపోవాలని సీఎం సూచించారు. ''బ్యాంకులు అనుసరించే కోర్ బ్యాంకింగ్ విధానంలా భూ రికార్డుల నిర్వహణ జరగాలి. ఏటీఎం ద్వారా ఏ బ్యాంకులో, ఏ ప్రదేశంలో డబ్బులు విత్ డ్రా చేసుకున్నా వెంటనే తెలిసిపోతుంది. అదే తరహాలో పాస్ పుస్తకాల్లో ఎక్కడ మార్పు జరిగినా అంతటా తెలిసిపోవాలి. అందుకు ప్రతీ రెవెన్యూ కార్యాలయంలో ఒక ఐటీ అధికారిని నియమించాలి. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా రెవెన్యూ శాఖలో వెయ్యి మందిని నియమించాలి. తగిన సామర్థ్యం ఉన్న కంప్యూటర్లు, ఇంటర్నెట్ కనెక్షన్‌తో అన్ని రెవెన్యూ కార్యాలయాల అనుసంధానం జరుగుతుంది'' అని ముఖ్యమంత్రి వివరించారు.

వివాదాల్లేనివి ఫస్ట్..

ఎలాంటి వివాదాలు లేని భూములు దాదాపు 85 నుంచి 95 శాతం వరకు ఉంటాయని అంచనా. ఈ భూములకు సంబంధించిన రికార్డులన్నింటినీ ముందుగా ప్రక్షాళన చేస్తారు. పేర్ల మార్పిడి, క్రయ విక్రయాలు జరిగిన వివరాలు తీసుకుంటారు. రికార్డులకు తుదిరూపం ఇస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో ఉంచుతారు. రెండో దశలో వివాదాస్పద భూములకు సంబంధించి పరిష్కార మార్గాలు చూస్తారు. కోర్టు వివాదాలుంటే, తీర్పులననుసరించి యాజమాన్య హక్కులను నిర్ణయిస్తారు. డిసెంబర్ నెలాఖరు నాటికి రికార్డులన్నీ సరిచేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. దీని ఆధారంగానే రైతులకు పెట్టుబడి పథకం అమలు చేస్తారు.

నీటా.. అధికరణం 371-డీనా?

హెల్త్ వర్సిటీల సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీపై నేడు హైకోర్టు తీర్పు

సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయాల పరిధిలోని డీఎం, ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీపై దాఖలైన కేసులో హైకోర్టు తన తీర్పును గురువారం నాటికి వాయిదా వేసింది. నీట్ సీట్ల భర్తీపై సుప్రీంకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నందున ఈ అంశంపై గురువారం తమ తీర్పును వెల్లడిస్తామని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. 371–డి అధికరణ ప్రకారం 85 శాతం సీట్లను రాష్ట్ర అభ్యర్థుల (స్థానికుల)తో భర్తీ చేయాలని ఉండగా.. కేంద్ర ప్రభుత్వం జాతీయ కౌన్సెలింగ్ ద్వారా సీట్లను భర్తీ చేయాలని ఉత్తర్వు లిచ్చింది. అయితే దీనిని వ్యతి రేకిస్తూ వైద్యుడు బి.సతీశ్ కుమార్, మరో 12 మంది రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఏపీ, తెలంగాణ అభ్యర్థులకు నీట్ కింద కేటాయించిన సీట్లను ఇతర రాష్ట్రాలు ఇవ్వకపోవడంపై కూడా మరికొందరు విద్యార్థులు పిటిషన్లు దాఖలు చేశారు. 85% సీట్లను స్థానికులతో భర్తీ చేయాలని, మిగిలిన 15% సీట్లను ఇతర అభ్యర్థులతో భర్తీ చేయవచ్చునన్న వెసులుబాటు తెలుగు రాష్ట్రాలకు ఇవ్వడం చెల్లదని సీనియర్ న్యాయవాదులు ఎస్.రామచంద్రరావు, సీవీ మోహన్‌రెడ్డి, డీవీ సీతారాంమూర్తి, రవిచందర్ నీట్ తరపున వాదించారు.

బస్‌భవన్ ఒక్కటే ఉమ్మడి ఆస్తి

- గట్టిగా వాదించనున్న తెలంగాణ ఆర్టీసీ
- నేడు విజయవాడలో ఆర్టీసీ బోర్డు భేటీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీకి సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య జనాభా దామాషా ప్రకారం పంచుకోవాల్సిన ఉమ్మడి ఆస్తి బస్‌భవన్ ఒక్కటేనని తెలంగాణ ఆర్టీసీ గట్టిగా వాదించేందుకు సిద్ధమైంది. హైదరాబాద్‌లో ఆర్టీసీకి చెందిన 14 ఆస్తులను ఉమ్మడిగా పరిగణించి పంచాలన్న ఏపీఎస్ ఆర్టీసీ వాదనను తోసి పుచ్చాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం విజయవాడలో జరగనున్న ఆర్టీసీ బోర్డు సమావేశంలో 'హెడ్క్వార్టర్' అంటే బస్‌భవన్ ఒక్కటేనంటూ ఇటీవల కేంద్ర హోం శాఖ జారీ చేసిన ఆదేశాన్ని బలంగా ప్రస్తావించనుంది.

బస్ భవన్ స్థలం నిజాం నాటిది..: 'హెడ్క్వార్టర్'కు అర్థం చెబుతూ కేంద్రం జారీ చేసిన ఆదేశాన్ని ఏపీఎస్ ఆర్టీసీ వ్యతిరేకిస్తోంది. హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఆస్తులన్నీ 2 రాష్ట్రాల మధ్య పంచాల్సిందేనని పేర్కొం టోంది. ఆర్టీసీ ఆస్పత్రి, మియాపూర్‌లోని బస్‌బాడీ యూనిట్‌లపై పట్టుపడుతోంది. బస్‌భవన్ స్థలం నిజాం కాలం నాటిది కాబట్టి దానిపై ఏపీఎస్ ఆర్టీసీకి హక్కుండదని, భవనం విలువలోనే హక్కు ఉంటుందని టీఎస్‌ఆర్టీసీ వాదిస్తోంది. సిబ్బంది పంపిణీ, సీనియారిటీ, స్పౌజ్, అనారోగ్య కారణాలతో అధికారుల బట్వాడా అంశాలను కూడా సమావేశంలో చర్చించనున్నట్టు సమాచారం.

రూపన్ వాలా కమిషన్ నివేదికను తిరస్కరించాలి

ప్రజాసంఘాల డిమాండ్

- దోషులను కాపాడేందుకు కుటిలయత్నం




సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రామయ్య. చిత్రంలో కాకి మాధవరావు, మల్లేపల్లి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు

సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యపై రూపన్‌వాలా కమిషన్ నివేదికను పార్లమెంటు తిరస్కరించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. దోషులను కాపాడేందుకు బాధితుల వాదనలను వినకుండానే నివేదికను తయారు చేశారని ఆరోపించాయి. కన్సర్న్ సిటిజన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రజాసంఘాల తరపున వక్తలు పాల్గొని ప్రసంగించారు. కమిషన్ నివేదికను తిప్పికొట్టాలని విద్యావేత్త చుక్కా రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం పిలుపునిచ్చింది. చుక్కారామయ్య మాట్లాడుతూ వివక్షకు వ్యతిరేకంగానే రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. రోహిత్ మరణంపై కమిషన్ నిరాధారంగా నివేదికనిచ్చిందని ప్రభుత్వ మాజీ కార్యదర్శి కాకి మాధవరావు ఆరోపించారు. రెవెన్యూ విభాగం మాత్రమే కులాన్ని ధృవీకరించాలన్న కోర్టు అభిప్రాయాన్ని కమిషన్ ధిక్కరించి రోహిత్ కులాన్ని నిర్ధారించేందుకు ఎక్కువ ప్రయాసపడిందన్నారు. సెంటర్‌ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ పార్లమెంటులో రూపన్‌వాలా కమిషన్ నివేదికను అన్ని రాజకీయపార్టీలు తిరస్కరించాలన్నారు. కొత్తగా మరో కమిటీని నియమించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

రాజకీయ ఒత్తిడితోనే బహిష్కరణ

రోహిత్, ప్రశాంత్ సహా మరో ముగ్గురు విద్యార్థుల బహిష్కరణ నిర్ణయం తీసుకున్న ప్రొక్టోరల్ కమిటీ లెటర్‌లో ప్రొక్టార్ అలోక్‌పాండ్యా సంతకమే ఉందని, కేవలం రాజకీయ ఒత్తిడితోనే విద్యార్థులపై చర్య తీసుకున్నారని ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. 2015 ఆగస్టు 12న అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్, ఏబీవీపీకి చెందిన వారిని ఘర్షణ విషయమై హెచ్చరించి వదిలేయాలని మాత్రమే ప్రొక్టోరల్ కమిటీ నిర్ణయించిందని, కానీ ఆగస్టు 31, 2015 కల్లా విద్యార్థుల బహిష్కరణకు ఎలా దారితీసిందో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 13 నుంచి, నవంబర్ 19 వరకు రెండు నెలల కాలంలోనే కేంద్ర మానవ వనరుల శాఖ వర్సిటీకి ఐదు లేఖలు రాయడం, వాటిలో సుశీల్ కుమార్‌పై దాడికి ప్రయత్నించారని ప్రస్తావించడం, దానికి కారణాలేంటో కూడా తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ డైరెక్టర్ వై.బి.సత్యనారాయణ, ప్రొఫెసర్ కె.వై.రత్నం, ఏఎస్‌ఏ కన్వీనర్ సన్నంకి మున్నా, సిద్ధోజి, ప్రతీక్, రవి పాల్గొన్నారు.

ఇదంజగత్



ఇతర రాష్ట్రాలకు వెళ్లిన ఇంజనీరింగ్ విద్యార్థులు 8 వేలపైనే



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ చదువుల కోసం ఈసారి ఇతర రాష్ట్రాలకు 8 వేల మందికి పైగా విద్యార్థులు తరలివెళ్లారు. అందులో సగం మంది వరకు జాతీయ స్థాయి ఇంజనీరింగ్ విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా సంస్థల్లో సీట్లను సాధించారు. ఇలా ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 8,351 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి మైగ్రేషన్ సర్టిఫికెట్లను తీసుకొని ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయారు. గడిచిన మూడేళ్లలో ఇప్పటివరకు 22,077 మంది విద్యార్థులు మైగ్రేషన్ సర్టిఫికెట్లను పొందారు. ముఖ్యంగా తెలంగాణ ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి ఉత్తీర్ణులై జేఈఈ మెయిన్ ద్వారా ఎన్ఐటీల్లో దాదాపు 3 వేల మందికి పైగా విద్యార్థులు సీట్లను సాధించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా మరో 2 వేలకు పైగా విద్యార్థులు ఐఐటీల్లో సీట్లను సాధించగా, మిగితా వారు ట్రిపుల్ ఐటీ, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారం కొనసాగే జాతీయ స్థాయి ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో, ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేటు ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో సీట్లను పొందినట్లు అధికారులు భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల విద్యార్థులు, విదేశాల నుంచి వచ్చిన ఎన్ఆర్ఐ విద్యార్థులు 1,182 మంది రాష్ట్రంలో ఇంజనీరింగ్ వంటి కోర్సులను చదువుకునేందుకు ముందుకు వచ్చారు.

కామన్ మ్యాన్‌లా ఆస్పత్రికి..

'గాంధీ'కి వచ్చిన గవర్నర్

కాలి మడమ ఆనెతో ఇబ్బంది పడుతున్న నరసింహన్
చిన్నపాటి శస్త్రచికిత్స అవసరమన్న వైద్యులు..
తర్వాత చేయించుకుంటానన్న గవర్నర్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు గవర్నర్ ఈఎస్ఎల్ఎన్ నరసింహన్ బుధవారం గాంధీ జనరల్ ఆస్పత్రికి ఓ సాధారణ రోగిలా వచ్చారు. ఆయన కుడికాలి మడమ వద్ద ఆనె ఏర్పడింది. నడిచే సమయంలో నొప్పి రావడంతో చికిత్స కోసం ఎలాంటి హడావుడి లేకుండా మధ్యాహ్నం 12 గంటలకు ఆస్పత్రికి వచ్చారు. ఇటీవల ఆస్పత్రిలో 65 పడకల ఆధునిక ఐసీయూను ప్రారంభించి, ఇకపై తాను కూడా గాంధీలోనే వైద్య చికిత్స చేయించుకుంటానని గవర్నర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్ ఆయన్ను ఇన్‌పేషెంట్ విభాగం ఐదో అంతస్తులోని చర్మవ్యాధుల విభాగానికి తీసుకువెళ్లారు. చర్మవ్యాధి నిపుణులు వైద్యపరీక్షలు చేసి ప్లాస్టిక్ సర్జరీ విభాగ వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ సుబోధ్ కుమార్ ఆపరేషన్ థియేటర్‌లో ఉండటంతో ఆయన వచ్చే వరకు వేచి ఉన్నారు. ఆపరేషన్ థియేటర్‌లో ఉన్న ఆయన్ను పిలిచేందుకు వైద్యులు యత్నించగా గవర్నర్ వారిని వారించారు. అనంతరం అక్కడకు చేరుకున్న డాక్టర్ సుబోధ్ కుమార్, జనరల్ సర్జరీ విభాగాధిపతి ఎన్‌వీఎన్‌రెడ్డి గవర్నర్ కాలి మడమను పరీక్షించారు. నొప్పికి మడమ పైభాగంలో ఏర్పడిన ఆనె కారణమని గుర్తించారు. చిన్నపాటి సర్జరీ చేసి దాన్ని తొలగించాలని, సర్జరీ తర్వాత రెండు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. అయితే, ప్రస్తుతం తనకు బిజీ షెడ్యూల్ ఉందని, వీలు చూసుకుని మళ్లీ వచ్చి, ఇక్కడే సర్జరీ చేయించుకుంటానని గవర్నర్ చెప్పినట్లు తెలిసింది. ఆయన ఆస్పత్రి నుంచి వెళ్లిపోయిన తర్వాత గవర్నర్ వ్యక్తిగత వైద్యుడు సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి గురువారం తాను స్వయంగా ఆస్పత్రికి వస్తానని, సంబంధిత వైద్యులతో చర్చించిన తర్వాతే సర్జరీ కోసం తేదీని నిర్ణయిద్దామని చెప్పినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.



బుధవారం గాంధీ ఆస్పత్రికి వచ్చిన గవర్నర్ నరసింహన్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

వైద్య పరీక్షల అనంతరం పాలనాయంత్రాంగంతో గవర్నర్ మాట్లాడుతూ 'స్కానింగ్‌ల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది, మరో ఎమ్మారై స్కానింగ్ యంత్రం అవసరం ఉందా.. అని ఆరా తీశారు. గతంలోనే ప్రతిపాదనలు పంపామని అధికారులు వివరించారు. స్టాఫ్ నర్సులు, పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్యులు, సిబ్బంది కొరత ఉందని అధికారులు తెలపడంతో ఈ విషయాలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానని గవర్నర్ హామీనిచ్చారు. నిరుపేదలతోపాటు అన్నివర్గాల వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

వజ్ర బస్సుల్లోనూ టికెట్!

ప్రధాన లోపాన్ని సరిదిద్దుకున్న ఆర్టీసీ

- డ్రైవర్ల ట్యాబ్‌లకు ప్రింటర్లతో అనుసంధానం
- ప్రయాణికుడు డబ్బు చెల్లించగానే ఫోన్‌కు మెసేజ్
- 'సాక్షి' వరుస కథనాలతో కదిలిన ఉన్నతాధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, హైదరాబాద్: అనుభవం అయితే కానీ ఆర్టీసీ యాజమాన్యానికి వాస్తవం బోధపడలేదు. దేశంలోనే కొత్త ప్రయోగంగా అమల్లోకి తెచ్చిన వజ్ర బస్సుల విషయంలో చేతులు కాల్చుకున్న ఆర్టీసీ క్రమంగా దిద్దుబాటు చర్యలు చేపడుతోంది. బస్సులో టికెట్ ఇచ్చే వీల్లేకుండా ప్రయాణికుల నుంచి ఆదరణ లేకుండా చేసుకున్న యాజమాన్యం ఎట్టకేలకు తన పొరపాటును గుర్తించింది. ఆన్‌లైన్ ద్వారానే కాకుండా నేరుగా మధ్యలో ఎక్కే ప్రయాణికులు డ్రైవర్ ద్వారా టికెట్ పొందేలా ఏర్పాటు చేసింది. ఇందుకు ప్రత్యేకంగా డ్రైవర్ల వద్ద ఉన్న ట్యాబ్‌లకు మినీ ప్రింటర్లను జత చేశారు. ప్రయాణికుడు డబ్బులివ్వగానే డ్రైవర్లే టికెట్ బుక్ చేసి టికెట్ ప్రింట్ అందజేస్తారు. దీన్ని బుధవారం నుంచే అమల్లోకి తెచ్చారు.

పలు బస్టాండ్లలోకి అనుమతి..

ఈ సర్వీసులు మొదలైనప్పుడే డ్రైవర్లకు ట్యాబ్‌లు అందించారు. ముందుగా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారికి వివరాలు అందులో కన్పిస్తాయి. ప్రయాణికులు ఎక్కడ బస్సు ఎక్కుతారో వాటి ద్వారానే డ్రైవర్లకు తెలుస్తుంది. ఇప్పుడు ఆ ట్యాబ్‌ల ద్వారానే ప్రయాణికులకు టికెట్ జారీ చేసేలా ఏర్పాటు చేశారు. మధ్యలో బస్సెక్కిన ప్రయాణికులకు డ్రైవర్ ట్యాబ్‌లో టికెట్ బుక్ చేస్తాడు. టికెట్ వివరాలు ప్రయాణికుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో వెళుతుంది. టికెట్ కావాలంటే ఆ ట్యాబ్‌లకు అనుసంధానం చేసిన ప్రింటర్ల ద్వారా జారీ అవుతుంది. గతంలో బస్టాండుల్లోకి బస్సులు వెళ్లేవి కావు. ఇప్పుడు హైదరాబాద్‌లోని ఇమ్లీబన్, జేబీఎస్‌ల వద్దకు బస్సులు వెళ్తున్నాయి.

త్వరలో రామగుండం, గోదావరిఖనిలకు సర్వీసులు..

ఈ నెలాఖరున కానీ సెప్టెంబర్ మొదటివారంలో కానీ రామగుండం, గోదావరిఖనిలకు వజ్ర బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు 8 చొప్పున 16 బస్సులను కేటాయించారు.



డ్రైవర్లకిచ్చే ట్యాబ్, ప్రింటర్

ముందే చేసి ఉంటే..

వజ్ర ఏసీ బస్సులు హైదరాబాద్–వరంగల్, హైదరాబాద్–నిజామాబాద్ మధ్య తిరుగుతున్నాయి. ప్రస్తుతం ఆక్యుపెన్సీ రేషియో సగటున 30% మించట్లేదు. ఇప్పటివరకు యాప్ ద్వారానో, ఆన్‌లైన్‌లోనో, ఉప్పల్ కూడలి, సుచిత్ర కూడలిలో ఉన్న అధీకృత ఏజెంట్ వద్దే టికెట్ బుక్ చేసుకోవాల్సి ఉండేది. మధ్యలో బస్సు ఎక్కితే తొలుత నో చెప్పినా 'సాక్షి' కథనాల ప్రభావంతో వారిని ఎక్కేందుకు అనుమతిస్తున్నారు. అయితే టికెట్ ఇవ్వకుండా ఏజెంట్ వద్దే కొనాలని కండీషన్ పెట్టారు. ఈ నిబంధనతో ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది. క్రమంగా ఇది నష్టాలకు దారి తీస్తుండటంతో అధికారులు మేలుకున్నారు. వజ్ర బస్సు డ్రైవర్లు కూడా టికెట్ ఇచ్చేలా ఏర్పాటు చేశారు. డ్రైవర్లకు టిమ్ యంత్రాలు ఇవ్వాలని డిపో మేనేజర్లు మొదట్నుంచీ మొత్తుకుంటున్నా ఉన్నతాధికారులు పెడచెవిన పెట్టారు.

సర్వీసు రూల్స్ మార్పుపై డీజీపీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: పోలీస్ శాఖలో ఏళ్ల నుంచి పీటముడిగా ఉన్న పలు సర్వీసు రూల్స్‌ను మార్చేందుకు ఏర్పాటైన కమిటీతో బుధవారం డీజీపీ అనురాగ్‌శర్మ సమీక్ష నిర్వహించారు. పోలీస్ శాఖలో సబార్డినేట్ సర్వీసు రూల్స్‌తో పాటు ఉమ్మడి ఏపీలో తీసుకువచ్చిన పలు నియమాలను సరిదిద్దాల్సి ఉందని కమిటీ చైర్మన్ రిటైర్డ్ డీఐజీ గంగాధర్ డీజీపీకి తెలిపారు. స్పెషల్ బెటాలియన్స్ నుంచి సివిల్ విభాగంలోకి మారే అధికారులు, సిబ్బంది సర్వీసు రూల్స్‌తో పాటు సివిల్ విభాగంలో సమస్యగా మారిన సీనియారిటీ, ఇతరత్రా వ్యవహారాలపై సమీక్షలో అధికారులు చర్చించారు. 52 అంశాలకు సంబంధించిన సర్వీసు రూల్స్‌ను మార్చాలని అధికారులు నిర్ణయించారు.

డిగ్రీలో సీట్లు రాని వారికి
మరో విడత కౌన్సెలింగ్

25 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం..



సాక్షి, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల్లో ఇప్పటివరకు మీసేవ కేంద్రాల్లో అథెంటికేషన్, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని సీట్లు లభించని విద్యార్థులకు మరో విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు తెలంగాణ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) కసరత్తు చేస్తోంది. ఇన్‌వ్యాలిడ్ అథెంటికేషన్, అథెంటికేషన్ రద్దు అయిన వారికి కూడా అవకాశం కల్పించాలని భావిస్తోంది. ఈనెల 25 నుంచి 28 వరకు అథెంటికేషన్ ఇన్‌వ్యాలిడ్ అయిన వారితోపాటు, రద్దు అయిన వారికి మీసేవ కేంద్రాల్లో అథెంటికేషన్, రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అవకాశం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతోపాటు వారికి వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించనున్నారు. వచ్చే నెల 2 లోగా చివరి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు లభించిన విద్యార్థులు కాలేజీల్లో చేరేలా చర్యలు చేపట్టాలని భావిస్తోంది. మొదటి విడత, రెండో విడత, మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా ఇప్పటివరకు 1,85,887 మంది విద్యార్థులు కాలేజీల్లో చేరగా, ఇంకా 2,24,390 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

'పోలీస్' అభిప్రాయ సేకరణ గాలికి

రెండేళ్ల క్రితం నిర్వహించిన ఐఎస్‌బీ విద్యార్థులు


సాక్షి, హైదరాబాద్: పోలీస్ శాఖలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులు, చేపట్టాల్సిన ఆధునీకరణ కార్యక్రమాలపై గతంలో ఉన్నతాధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేయించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) విద్యార్థులతో 2015, సెప్టెంబర్‌లో ఈ అభిప్రాయ సేకరణ జరిపించారు. కేవలం 15 రోజుల్లోనే అభిప్రాయ సేకరణ పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు విద్యార్థులు అందజేశారు. అయితే నివేదికలోని అంశాలను మళ్లీ చర్చించకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, రెండేళ్ల క్రితం తాము సర్వే చేయించిన మాట వాస్తవమేనని, అయితే విద్యార్థులకు సమయం లేకపోవడంతో అతి తక్కువ సమయంలో నివేదిక ఇచ్చారని పోలీస్ ముఖ్య కార్యాలయం అధికారులు తెలిపారు. అందులో బలమైన అంశాలు లేకపోవడంతో పక్కనబెట్టినట్లు పేర్కొన్నారు. త్వరలో మళ్లీ అభిప్రాయ సేకరణ చేయించే ఆలోచనలో ఉన్నామని అధికారులు తెలిపారు.

సీపీఎస్ రద్దు కోసం నిరసనలు, ధర్నాలు

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30, 31, వచ్చే నెల 1న నిరసనలు, ధర్నాలు నిర్వహించాలని టీఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. ఈనెల 30, 31 తేదీల్లో ఉద్యోగులు ర్యాలీలు నిర్వహించడం, 1న అన్ని జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాలు, హైదరాబాద్‌లోని ప్రభుత్వ కార్యాలయాల్లో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలతోపాటు ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. టీఎన్‌జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. వివిధ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు.

63 వేల గొర్రెల యూనిట్ల పంపిణీ

షీప్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 63,736 గొర్రెల యూనిట్లు పంపిణీ చేశామని షీప్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కె.రాజయ్య యాదవ్ చెప్పారు. దీనిద్వారా 3,62,445 మందికి లబ్ధి చేకూరిందని, వీరందరికీ 13 లక్షల పైచిలుకు గొర్రెలను అందించామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గొర్రెలను మేపడానికి అవసరమైన గడ్డి కోసం 45 లక్షల ఎకరాల అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేశామని తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్ 1962 ద్వారా గొర్రెల మంద వద్దకే మొబైల్ వైద్య బృందం చేరుకుని వైద్యం అందిస్తుందని పేర్కొన్నారు.

సాక్షి

గురువారం, ఆగస్టు, 24

ట్రంప్ 'అఫ్ఘాన్' భేరి

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మొత్తంగా దక్షిణాసియాపై, ప్రత్యేకించి అఫ్ఘానిస్తాన్‌పై అమెరికా కొత్త విధానాన్ని ప్రకటించారు. ఇది ఒబామా హయాం నుంచి అనుసరిస్తూ వస్తున్న విధానానికి మాత్రమే కాదు... ట్రంప్ తన ఎన్నికల ప్రచారసభల్లో హోరెత్తించిన వ్యాఖ్యలకు కూడా విరుద్ధమైనది. తాజా విధానం ప్రకారం అఫ్ఘానిస్తాన్‌లో ఇప్పటికే ఉన్న 8,500మంది అమెరికా సైనికులకు అదనంగా మరో 4,000మందిని పంపుతారు. అఫ్ఘాన్‌లోని అమెరికా సైనికులను దశలవారీగా తగ్గిస్తామని 2009లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా చెప్పారు. అందుకు సంబంధించి వేర్వేరు గడువులు ప్రకటిస్తూ పోయినా అరకొరగానే అది అమలైంది. ఇప్పటికీ అక్కడ 8,500మంది అమెరికా సైనికులున్నారు. అయితే వారంతా దాదాపుగా కీలకమైన గ్రీన్ జోన్‌కు కట్టుదిట్టమైన భద్రత కల్పించే పనికి, అఫ్ఘాన్ సైనికులకు శిక్షణనిచ్చేందుకు పరిమితమయ్యారు. అమెరికా నిఘా డ్రోన్‌లు, ఆయుధాలున్న డ్రోన్‌లు మాత్రమే ఇప్పుడక్కడ సంచరిస్తున్నాయి. రోజువారీ ఆపరేషన్ల బాధ్యతను అఫ్ఘాన్ సైనికులకే వదిలిపెట్టారు. అఫ్ఘాన్‌కు సైన్యాన్ని పంపి వందల కోట్ల డాలర్లను వృథా చేస్తున్నారని తన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ఆరోపించేవారు. ఈ యుద్ధం ఘోర తప్పిదమనేవారు. అధ్యక్షుడయ్యాక సైనికులందరినీ వెనక్కు పిలిపిస్తాననేవారు. అయినా ఈ విషయంలో ఇంతవరకూ మౌనంగానే ఉండిపోయారు. ఇన్ని నెలల తర్వాత హఠాత్తుగా ఆయన తన వైఖరిని మార్చుకున్నారు. ఉన్నట్టుండి అఫ్ఘాన్ నుంచి బయటికొస్తే ఆ దేశం మళ్లీ ఉగ్రవాదుల చేతుల్లోకి పోతుందని ఒప్పించడంలో ట్రంప్ సలహాదారులు విజయం సాధించారని తాజా నిర్ణయం వల్ల అర్థమవుతుంది.

అమెరికా దళాలు అఫ్ఘాన్ గడ్డపై ప్రవేశించి పదహారేళ్లు కావస్తోంది. దేశంలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించడం, పార్లమెంటుతోపాటు వివిధ సంస్థలు సజావుగా పనిచేయడం వంటివి తాము సాధించిన విజయంగా అమెరికా చెప్పుకుంటున్నా ఆచరణలో ఏం జరుగుతున్నదో ప్రపంచానికంతకూ తెలుసు. దేశం తాలిబన్ల చెప్పుచేతల్లోకి పోలేదన్న పేరేగానీ చాలా భూభాగంలో ఇప్పటికీ వారి ఆదేశాలే అమలవుతున్నాయి. కాబూల్ వంటిచోట్ల అడపా దడపా ఉగ్రదాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అదనంగా సైనిక దళాలను పంపడం వల్ల ఇదంతా తలకిందులవుతుందని, అఫ్ఘాన్‌లో ఇకపై విజయ పరంపర తథ్యమని ఎవరూ అనుకోవడం లేదు. అఫ్ఘాన్ నుంచి అమెరికా ఇప్పట్లో బయటకు రాబోదని, ట్రంప్ అనంతరం వచ్చే అధ్యక్షులు సైతం దాని భారం మోయక తప్పదని ఆయన ప్రకటన చెబుతోంది. ఈ యుద్ధం గెలుస్తామని ఇప్పుడు ట్రంప్ నిశ్చయంగా చెబుతున్నారు. అంతకుమించి ఇప్పుడు అనుసరిస్తున్న వ్యూహానికి మించి ఏం చేయబోతున్నారనేది చెప్పలేదు. ఈ తాజా ప్రకటనతో ఆయన ఇకపై కాబూల్‌లోనో, కాందహార్‌లోనో లేక మరొక చోటనో జరిగే ఘటనలకు ఒబామాను నిందించలేరు. అంతేకాదు... అమెరికాలో 2001 ఉగ్రవాదులు సృష్టించిన విధ్వంసం తర్వాత 'ఉగ్రవాదంపై యుద్ధం' పేరిట అమెరికా ప్రపంచవ్యాప్తంగా సాగిస్తున్న చర్యలన్నీ సబబేనని ఆయన ఒప్పుకోక తప్పదు. ఇంతవరకూ మాజీ అధ్యక్షులపై చేస్తూ వస్తున్న విమర్శలను ఇక విరమించుకోవాల్సి వస్తుంది.

అఫ్ఘాన్‌లో మన దేశం పాత్ర పెరగాలని, ఆ దేశం సాయం తమకు అవసరమని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పారు. ఇంతక్రితం ఒబామా సైతం ఇలాంటి మాటలు చెప్పినా అది ఆచరణలోకి రాకుండా పాకిస్తాన్ చూడగలిగింది. అఫ్ఘాన్‌లో ఉగ్రదాడులకు పాల్పడే తాలిబన్లకు, అల్ కాయిదాకు పాక్ ఐఎస్ఐ, సైన్యం అండదండలున్నాయని ట్రంప్ అనడంతోపాటు భారత్ సాయం కోరడం పాక్ సైనికాధికారులను ఎంతవరకూ కలవరపరిచిందో చెప్పలేం. ఎందుకంటే గతంలో విదేశాంగమంత్రిగా ఉన్న హిల్లరీ క్లింటన్ కూడా ఇలాగే అనేవారు. తీరా సైనిక సాయం అందించే సమయానికల్లా ఏదో ఒక సాకు చెప్పి కొనసాగిస్తూ వచ్చేవారు. పాకిస్తాన్‌పై ఎలాంటి ఆర్థిక ఆంక్షలు విధించినా అది దివాలా దశకు చేరుకుంటుందని, ఆ పరిస్థితి ఉగ్రవాదానికి ఊతమిస్తుందని వారి భయం. నేరుగా పాక్ భూభాగం లోని ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు జరిపితే దాని పరిణామాలెలా ఉంటాయోనన్న బెంగ సరేసరి. ఎందుకంటే ఆ గడ్డపై అణ్వస్త్రాలున్నాయి. ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు మొదలుపెడితే అది మరో అఫ్ఘాన్‌లా, మరో ఇరాక్‌లా అరాచకంగా, అస్థిరంగా మారదన్న గ్యారెంటీ లేదు. ఇలాంటి అంచనాలను దాటుకుని నిర్ణయాత్మకంగా వ్యవహరించడం ట్రంప్‌కు సాధ్యమవుతుందని ఎవరూ భావించలేరు. సీనియర్ బుష్‌తో మొదలుపెట్టి ఒబామా వరకూ ఈ బూచిని చూపే పాక్ సైనికాధికారులు అమెరికా తమ జోలికి రాకుండా చూసుకోగలిగారు. ఇప్పుడు సైతం అందుకు భిన్నంగా ఏమీ జరగకపోవచ్చు.

నిజానికి ట్రంప్ అఫ్ఘాన్‌పై ప్రకటించిన విధానానికి దారి తీసిన కారణం విచిత్రమైనది. అఫ్ఘాన్ మహిళలు మినీ స్కర్ట్‌లు ధరించిన నాలుగు దశాబ్దాలనాటి ఫొటోలను అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మెక్‌మాస్టర్ ట్రంప్‌కు చూపించి 70వ దశకం వరకూ అక్కడ పాశ్చాత్య ప్రభావం బలంగా ఉండేదని, గట్టిగా ప్రయత్నిస్తే అది మళ్లీ సాధ్యమేనని చెప్పాక ఆయన ఈ కొత్త విధానానికి సరేనన్నారని మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇలాంటి కారణాలు ఆ దేశానికి అదనంగా సైన్యాన్ని పంపడానికి స్ఫూర్తినిచ్చాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. పైగా దేనిపైనా నిలకడగా మాట్లాడటం, నిర్ణయం తీసుకోవడం అలవాటులేని ట్రంప్ ఇప్పుడు ప్రకటించిన విధాన నిర్ణయానికి ఎంతకాలం కట్టుబడి ఉంటారో చెప్పలేం. అఫ్ఘాన్‌లో శాంతి స్థాపనే ధ్యేయం అనుకుంటే అందుకు భారత్ మాత్రమే కాదు... ఇరాన్, పాక్, చైనా, రష్యా, ఉజ్బెకిస్తాన్ తదితర దేశాల ప్రమేయం కూడా తప్పనిసరి. అలా కానట్టయితే ఎప్పటిలా అఫ్ఘానిస్తాన్‌లో వైఫల్యాలు తప్పవు. అన్ని అంశాలనూ, పర్యవసానాలనూ సమగ్రంగా పరిశీలించి, అమెరికా తాజా విధాన ప్రకటన విషయంలో మన దేశం ఆచి తూచి వ్యవహరించడమే ఉత్తమం.




యుద్ధం ఏ కాలంలోనూ,
ఏ సమస్యకు కూడా చివరి
పరిష్కారం కానే కాదు.

– ఏపీజే అబ్దుల్ కలామ్
భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి శు.తదియ రా.9.29 వరకు, నక్షత్రం ఉత్తర సా.4.01 వరకు, తదుపరి హస్త, వర్జ్యం రా.12.36 నుంచి 2.15 వరకు, దుర్ముహూర్తం ఉ.9.57 నుంచి 10.47 వరకు, తదుపరి ప.2.57 నుంచి 3.47 వరకు, అమృతఘడియలు ఉ.8.46 నుంచి 10.20 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.18
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	4.46	మగ్రీబ్	6.36
జొహర్	12.18	ఇషా	7.50
అసర్	4.45		

విద్యాహక్కును హరించే విధానం

విశ్లేషణ



చుక్కా రామయ్య

విద్యార్థులను చదువు అనే ఏకైక మూసలోనుంచి చూడటం మానేయాలి. చదువుతోపాటు వారిలో ఉన్న ఇతర ప్రావీణ్యాలను వెలికి తీసే విద్యా విధానం కావాలి. సమాజానికి అన్ని రకాల అవసరాలు ఉంటాయి. వివిధ రంగాల్లో వారి నైపుణ్యానికి సానబట్టే వ్యవస్థలుండాలి. అతను ఏ విద్యలో ప్రావీణ్యుడో గ్రహించే సామర్థ్యం మన విద్యా విధానంలో ఉండాలి, తీసుకురావాలి. జీడీపీ రేట్ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పైన ఆధారపడి ఉంటుంది. ప్రతి మనిషి శ్రమ చేసేలా విద్య అందుబాటులో ఉండాలి.

మధ్యలోనే చదువు మానేసి వెళుతున్న విద్యార్థుల సంఖ్య లక్షల్లోనేనంటే ఆశ్చర్యంగా ఉంది. కానీ ఇది నిజం. ప్రభుత్వం విద్యా పరిరక్షణకు చేపడుతున్న చర్యలను ఈ సంఖ్య ప్రశ్నార్థకం చేసింది. పేద, బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం గణనీయంగా ఏర్పాటు చేస్తోన్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలొకపక్క ఆశను రేకెత్తిస్తోంటే మరోవైపు గత పదేళ్లలో కనీసం 50 శాతం కూడా తగ్గని డ్రాపౌట్స్ శాతం ఆందోళనకి గురిచేస్తోంది. ఇదే విషయాన్ని ఇటీవల విడుదలైన సోషియో ఎకనమిక్ సర్వే ఖరారు చేస్తోంది. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా వివిధ కారణాలతో ఇప్పటికే చదువుకి దూరం అవుతోన్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ప్రభుత్వం తలపెడుతోన్న డిటెన్షన్ విధానం మరింత ఆందోళనకు గురిచేస్తోంది.



ఏ వర్గాలకోసం ఈ చదువులు...

ఇరవయ్యవ శతాబ్దంలో చదువు లక్ష్యం వేరు. ఆ లక్ష్యాన్ని బట్టి అక్కడున్నటు వంటి పదాల అర్థం సైతం మారిపోతుంది. ఆరోజుల్లో సమర్థవంతమైన (విధేయత కలిగిన) యంత్రాంగాన్ని సృష్టించడమే లక్ష్యంగా విద్యావిధానం ఉండేది. అది బ్రిటిష్ వారి ఎత్తుగడ. కేవలం వారి వర్గ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే విద్యగరిపేవారు. ఏ వర్గాలైతే ప్రభుత్వానికి విధేయులుగా ఉంటారో వారికే చదువు అందుబాటులో ఉంచడం, ఎవరైతే పాలకులను శంకిస్తారో వారిని దూరంగా, చదువుకి ఆమడ దూరంలో ఉంచడం జరిగేది. ఆనాడు చదువు ఒక ప్రివిలేజ్. కాబట్టి తాము అనుకున్న ప్రమాణాలు రాకపోతే నిర్బంధంగా అదే తరగతిలో కొనసాగించడం పరిపాటి. ఆనాడు విద్య హక్కు కాదు. పాలనావర్గం ప్రజలకిచ్చిన ప్రివిలేజ్‌గా మాత్రమే భావించేవారు. నేను అనుకున్న ప్రయోజనం రాలేదు కనుక నిన్ను నిర్బంధించే అధికారం, అదే చదువు అర్థం అయ్యేవరకు అదే తరగతిలో ఉంచి కొనసాగించే అధికారం నాకుంది అన్నారు. నిర్బంధించడం(డిటైన్) అని వాడారు. కానీ ఇప్పుడు విద్య మనకొక హక్కుగా సంక్రమించాక సైతం ప్రభుత్వాలు డిటెన్షన్ విధానం అని మాట్లాడటం బాధాకరం.

నిజానికి ఇప్పుడు ఓ విద్యార్థికి చదువు రాకపోవడానికి కారణం ఏమిటో? కారకులెవ్వరో ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. సమాజమా? తల్లిదండ్రులా? ఉపాధ్యాయులా? ప్రభుత్వ వ్యవస్థా? అనేది పరిశీలించాలి. ఎవరు ఓ విద్యార్థి పాస్‌కాకపోవడానికి కారణం అనేది తేల్చకుండా పిల్లవాణ్ణి దోషిగా నిలిపి అతడిని శిక్షించడం విద్యని హక్కుగా భావిస్తున్న తరుణంలో ఎంతవరకు సమంజసమో అర్థం కావడంలేదు.

గ్రామీణ ప్రాంతాల్లో హైస్కూలు స్థాయిలో బాలికల చదువుకి ఎదురవుతున్న ఆటంకాలకి అనేక కారణాలున్నాయి. పిల్లల సంరక్షణా బాధ్యత ఆడపిల్లలను బడికి దూరం చేస్తోందని సోషియో ఎకనమిక్ సర్వే తేల్చింది. అలాగే బతుకుదెరువుకోసం వలసలెళ్లాల్సి రావడం కూడా ఆయా కుటుంబాల్లో బాలబాలికలిద్దరూ బడిమానేయాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నాయని ఈ సర్వే భావించింది. అలాగే అమ్మాయిల్లో శారీరక మార్పుల వల్ల ఏర్పడే అసౌకర్యాలు, ప్రకృతి వైపరీత్యాలు (కరువు తదితరాలు) కూడా డ్రాపౌట్స్‌కి కారణాలుగా సర్వే భావించింది. ఐసిడిఎస్‌లను 8 గంటలపాటు పనిచేయించడం వల్ల కూలినాలికి వెళ్లే తల్లులు లేనిసమయంలో చిన్న పిల్లల సంరక్షణ బాధ్యత బడి ఈడు పిల్లలపై పడకుండా జాగ్రత్తపడవచ్చని ఈ సర్వే భావించింది.

పరీక్షా విధానంలో లోపం లేదా?

మన విద్యావ్యవస్థలో పరీక్షా విధానం ఎలా ఉంది? మనం కేవలం సమాచారాన్నే పరీక్షిస్తున్నామా? లేక విద్యార్థి అవగాహనాస్థాయిని పరీక్షిస్తున్నామా? ఏడాదంతా చదివిన చదువుని మూడు గంటల్లో కక్కేయడానికి అతనేమీ మిషన్ కాదు. అలాగే మన పరీక్షలన్నీ అతడి జ్ఞాపక శక్తిని అంచనా వేయడానికే తప్ప, అతని పరిజ్ఞానాన్ని కాదు. కేవలం అతను బట్టీకొట్టిన విషయాలను రాబట్టడానికే ఈ పరీక్షలు సరిపోతున్నాయి. అయితే ప్రపంచం మారిపోయింది. ఇప్పుడు తారీఖులు, దస్తావేజుల సమాచారాన్నంతా బుర్రలో ఉంచుకోవాల్సిన అవసరం లేదు. మొబైల్ కావచ్చు, ల్యాప్‌టాప్ కావచ్చు, కంప్యూటర్ కావచ్చు. మీట నొక్కితే సమాచారం మీ ముంగిట్లో ఉంటుంది. కానీ విద్యార్థికి విషయం పట్ల అవగాహన అవసరం. ఆ సమస్యని పరిష్కరించే మేధ విద్యార్థికి ఉన్నదా లేదా అనేది పరీక్షించాలి. కావాల్సింది సమాచారం కాదు, వివేచన, వేగవంతమైన ఆలోచనాశక్తి. దాన్ని పరీక్షించే నైపుణ్యం మనకు కావాలి. అటువంటి విధానం కావాలి. అటువైపుగా విద్యావ్యవస్థ పురోగమించాలి. అంతేకానీ అదేతరగతిలో ఉంచి మరింత అగమ్యగోచరంగా తయారు చేయడం కాదు.

చదువు ఎందుకు రాదు... కారణాలేమిటి?

ఒక విద్యార్థికి విషయం అర్థం కాకపోవడానికి అనేక కారణాలుంటాయి. ఆ విద్యార్థి మానసిక పరిస్థితి, అతని సామాజిక పరిస్థితి, అతని కుటుంబ వ్యవస్థ కారణాలే. అతను ఎక్కడి నుంచి వచ్చాడు? ఏ పరిస్థితుల నుంచి వచ్చాడు? అతని కుటుంబ ఆర్థిక, సామాజిక పరిస్థితులేమిటి అనేవి అతని అవగాహనా శక్తి మీద ప్రభావం చూపుతాయి. చిన్నప్పటినుంచి అన్ని సదుపాయాలతో, అన్ని అవకాశాలనూ అందుకుంటూ ఉన్న పిల్లవాడు అయితే అతని అవగాహనా శక్తి కూడా అందుకనుగుణంగా ఉంటుంది. కానీ తినడానికి తిండి లేక, కనీసం పౌష్టికాహారం కూడా లేని స్థితి నుంచి వచ్చే విద్యార్థులు తరగతి గదిలో విషయాలను అర్థం చేసుకునే పరిస్థితికీ మిగిలిన విద్యార్థుల పరిస్థితికీ చాలా తేడా ఉంటుంది.

దళిత, ఆదివాసీ సామాజిక వర్గాల నుంచి వచ్చే పిల్లలు, బాలికలు ఇప్పుడిప్పుడే బడిమెట్లను ఎక్కగలుగుతున్నారు. ప్రధానంగా ఈ వర్గాల నుంచి వచ్చేవారు తొలితరం విద్యార్హతనొందిన వారు. వారిని పాఠశాల స్థాయిలోనే డిటెన్షన్ పేరుతో నిలిపివేస్తే వారి విద్యాహక్కుని కాలరాసినట్టే అవుతుందనడంలో సందేహం లేదు. వీరికి యూనివర్సిటీ స్థాయిలో సైతం ప్రత్యేక తరగతులు అవసరమని థోరట్ కమిషన్ లాంటివి సిఫార్సు చేస్తే ఇప్పటికీ అమలు జరుగుతున్న దాఖలాలు లేవు. అటువంటప్పుడు ప్రాథమిక దశలోనే వారిని తరగతి దాటకుండా డిటెయిన్ చేయడం వల్ల వారి ఉపాధి హక్కుని, ప్రధానంగా రిజర్వేషన్లను పొందే పరిస్థితిని సైతం అడ్డుకుంటున్నట్టే అవుతుంది తప్ప మరొకటి కాదు.

అవమాన భారంతో బడికే దూరం...

తెలుగు పద్యం రానందుకు పదే పదే వేస్తున్న శిక్షను భరించలేక మూడవ తరగతి విద్యార్థి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మనకు తాజా ఉదాహరణ. అంత సున్నితమైన చిన్నారుల మనసెరిగి వారికి మరింత ప్రోత్సాహకంగా విద్యనందించే ప్రత్యామ్నాయ మార్గాలను వెతకాల్సింది పోయి డిటెయిన్ చేయడం వల్ల ఒరిగేదేముంటుంది? తన తోటి విద్యార్థులంతా పై తరగతులకు వెళ్తుంటే తాను మాత్రం అదే తరగతిలో కొనసాగడం వల్ల అవమానభారంతో అసలు చదువుకే స్వస్తి పలికి బడిమానేసే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. లేదంటే పైన చెప్పుకున్న ఘటనలు పునరావృతం అయినా ఆశ్చర్యపడనక్కర్లేదు.

దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలు, బాలికల ఇంటి వాతావరణాన్ని, పరిస్థితులను మెరుగుపర్చకుండా విద్యా వ్యవస్థలో మార్పును ఆశించడం సరి కాదు. సమాజం నిర్లక్ష్యం కారణంగానే చదువు రావడం లేదు తప్ప, విద్యార్థి అందుకు కారణం కానేకాదు. విద్యార్థి చేయని తప్పుకి అతడిని బలిచేయడం సమంజసం కాదు. అతని దారిద్ర్యం, తరతరాలుగా వారి కుటుంబాలు చదువుకి దూరంగా ఉండడం, ప్రత్యేక శిక్షణ లేకపోవడం అతని వైఫల్యానికి కారణాలు, దానికితోడు మన విద్యావ్యవస్థ కూడా అందుకు దోహదం చేసేదిగానే ఉంది.

విదేశాల్లో డిటెన్షన్ విధానం లేదు....

అన్నింటికీ విదేశాలను ఉదాహరణగా తీసుకునే మనం డిటెన్షన్‌లో మాత్రం మనదైన ప్రత్యేక పరిస్థితిని విదేశీయులు వదిలివెళ్లిన పద్ధతినే మోస్తున్నాం. విదేశాల్లో డిటెన్షన్ విధానాన్ని తొలగించారు. అక్కడ విద్య అంటే ఆలోచనా విధానం అని అంటారు. థింకింగ్ కెపాసిటీని పెంపొందించడానికి అనేక కార్యకలాపాలను ప్రవేశపెట్టి, అన్నింటికీ మార్కులు వేస్తారు. చదువుకి మాత్రమే కాదు. అతని పరిశోధనాశక్తికి, ఆలోచనాశక్తికి మార్కులు ఉంటాయక్కడ. సృజనను వెలికితీయడమే ధ్యేయంగా చదువులుంటాయి.

విద్యార్థులను చదువు అనే ఏకైక మూసలోనుంచి చూడటం మానేయాలి. చదువుతోపాటు వారిలో ఉన్న ఇతర ప్రావీణ్యాలను వెలికి తీసే విద్యా విధానం కావాలి. సమాజానికి అన్ని రకాల అవసరాలు ఉంటాయి. వివిధ రంగాల్లో వారి నైపుణ్యానికి సానబట్టే వ్యవస్థలుండాలి. అతను ఏ విద్యలో ప్రావీణ్యుడో గ్రహించే సామర్థ్యం మన విద్యా విధానంలో ఉండాలి. జీడీపీ రేట్ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పైన ఆధారపడి ఉంటుంది. ప్రతి మనిషి శ్రమ చేసేలా విద్య అందుబాటులో ఉండాలి. అందులో వారికి ప్రత్యేక శిక్షణ అవసరం. సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో ఆ ప్రగతి కనిపిస్తోంది. అదే అందరికీ వర్తింప చేయడానికి కృషి జరగాలి. ప్రత్యామ్నాయాలను శోధించాలి. ప్రత్యామ్నాయాలను ఆలోచించడానికి బదులు శిక్షించడం నెగటివ్ థింకింగ్ అవుతుంది.

మారిన పరిస్థితుల్లో ప్రభుత్వం అవకాశాలను పెంచే విషయంపై ఆలోచించాలి. బోధనా పద్ధతులు మార్చాలి. సంపన్న వర్గాల కోసం తయారుచేసిన విద్యా వ్యవస్థకు స్వస్తి పలకాలి. అదే చదువు అందరికీ కుదరదు. తొలితరం విద్యావకాశాలను అందిపుచ్చుకుంటున్న వారికి విద్యా బోధనలో మరింత ప్రత్యేక శ్రద్ధ అవసరం. మార్పు కోసం ఇతర దేశాల్లో కొత్త విధానాలను వెతుకుతున్నారు. ఆఫ్రికా ఖండ దేశాలలో డిటెన్షన్ అనే విధానమే లేదు.

బోధనా పద్ధతుల్లో రీసెర్చ్ చేయాలి. సమర్థవంతంగా బోధించండి. ఒక మూసలో ఒదగనప్పుడు ప్రత్యామ్నాయాలను ఆలోచించండి. ప్రతి వ్యక్తిలో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయండి. మానసిక వికలాంగులకు, అంధులకు చదువుచెప్పే ప్రత్యేక పద్ధతులు ఉన్నప్పుడు ఈ రోజు వరకు బడిబాటనే ఎరుగని వర్గాల వారికి డిటెన్షన్ విధానం తీరని చేటు చేస్తుందనడంలో సందేహంలేదు. ఈ సాంకేతిక యుగంలో మావనవనరుల నిర్వహణ అనేది చాలా క్లిష్టమైన సమస్య. ఆ దృష్టితో పరిశీలించాలనేది నా మనవి.

వ్యాసకర్త ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి మాజీ సభ్యులు

బలిపీఠంపై భారత రైతాంగం

మనం ఆర్‌సీఈపీ ఒప్పందంపై సంతకాలు చేస్తే, ఏ సుంకాలూ లేని దిగుమతులు మన దేశంలో శాశ్వతంగా తిష్టవేస్తాయి. ఇది, 60 కోట్ల మంది రైతుల జీవనోపాధికి భద్రతను కల్పించే హక్కు మనకు లేకుండా చేస్తుంది.

విశ్లేషణ



దేవిందర్‌శర్మ

వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టం రైతులకు సంబంధించి భవిష్యత్తులో ఎదుర్కొనవలసిన అతి పెద్ద ఆందోళనకరమైన సమస్య. కాగా, పుష్కలంగా పంటలు పండి, చేతికి వచ్చాక ధరలు ఘోరంగా పతనం కావడం వల్ల రైతులు ఎదుర్కొనవలసి వస్తున్న విపత్కర పరిస్థితి అంతకంటే పెద్ద సమస్య. 'ఉత్పత్తి చెయ్యి, నాశనమై పో' అని నేను అనేది దీన్నే. రెండేళ్లు వరుసగా దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొన్న రైతులపైన ఎట్టకేలకు ఆ వాన దేవుడు అనుగ్రహం చూపాడు. గత రెండేళ్ల నష్టాలను కొంత వరకైనా భర్తీ చేసుకోవాలనే ఆశతో రైతులు కష్టించి పని చేశారు. పుష్కలంగా పంటలు పండించారు. కానీ హఠాత్తుగా మార్కెట్‌లో ధరలు పాతాళానికి పడి పోయాయి. పప్పు, టమాటా, బంగాళదుంప, ఉల్లి, ఆవ, కూరగాయలన్నిటి ధరలు ఘోరంగా పడిపోయాయి. రైతుకు, పంటను రోడ్లపై కుమ్మరించిపోక తప్పని దుస్థితి ఏర్పడింది. రైతుల ఆగ్రహం భారీ నిరసనగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో మొదలైంది. పోలీసు కాల్పుల్లో ఐదుగురు రైతులు మరణించారు. రైతు సంఘాలు ఆగస్టు 9–15 మధ్య జైల్‌భరో ఆందోళనను మరింత భారీ ఎత్తున చేపట్టాయి. వ్యవసాయ రుణాల మాఫీని, ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభాన్ని ఇవ్వాలన్న స్వామినాథన్ కమిటీ సిఫారసును అమలు చేయాలని వారి డిమాండు.



కానీ, ప్రస్తుతం సాగుతున్న అంతర్జాతీయ వాణిజ్య చర్చలు భారత వ్యవసాయానికి మరింత పెద్ద ముప్పును తేనున్నాయని వారికి తెలియదు. నిజానికి ఆ ఒప్పందం అమల్లోకి వస్తే, భారీ సబ్సిడీలతో కూడిన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను ఎలాంటి పన్నులూ లేకుండా, అడ్డూ అదుపూ లేకుండా దేశంలోకి అనుమతిస్తారు. ఈ దిగుమతులు, చిన్న రైతులను వ్యవసాయాన్ని వదిలి పెట్టేసేలా చేస్తాయి. 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఉనికిలోకి వచ్చినప్పటి నుంచి వాణిజ్యపరమైన అడ్డంకులను, దిగుమతి సుంకాలను ఎత్తివేయాలని వర్ధమాన దేశాలను నిర్బంధించే యత్నాలు జరుగుతున్నాయి. దేశీయ మార్కెట్‌ను ఇతరుల కోసం బార్లా తెరవడం వల్ల భారత్‌కు పెద్దగా ఎలాంటి లాభమూ చేకూరలేదుగానీ, మన వ్యవసాయరంగానికి అపార నష్టం వాటిల్లిందని పలు అధ్యయనాలు స్పష్టం చేశాయి.

తిరువనంతపురానికి చెందిన తనల్ అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన ఆర్. శ్రీధర్ డబ్ల్యూటీఓ ప్రోత్సాహంతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ), ఆగ్నేయ ఆసియా దేశాల వాణిజ్య కూటమి (ఆసియాన్) ప్లాంటేషన్ పెంపకందార్ల జీవనోపాధిని ఎలా దెబ్బ తీశాయో వివరించారు. ''ఏడేళ్ల క్రితం, కేరళ ప్రభుత్వం, మేమూ కలసి దిగుమతి సుంకాల తగ్గింపు... కేరళపై, ప్రత్యేకించి రబ్బరు, మసాలా దినుసుల విషయంలో తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతుంది'' అని హెచ్చరించాం. అలాగే దిగుమతులు పెరిగి, ధరలు పడిపోయాయి. తమ హెచ్చరికను పెడచెవిన పెట్టి ఒప్పందంపై సంతకాలు చేశారు. కానీ నష్టపోయిన రైతులకు లేదా ఉపాధులను కోల్పోయిన వారికి నష్టపరిహారాన్ని లేదా సహాయాన్ని అందించలేదు రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందుతున్న 30% రైతులు తప్ప మిగతా వారు వ్యవసాయం వదలాల్సి వచ్చింది.

ఇప్పుడు ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఆర్‌సీఈపీ) కుదుర్చుకుంటున్నారు. వాణిజ్యం జరిపే వస్తువులలో 92 శాతంపై దిగుమతి సుంకాలను పూర్తిగా ఎత్తివేయడాన్ని పరిశీలిస్తున్నారు. ఈ ఒప్పందం కింద ఒకసారి దిగుమతి సుంకాలను సున్నాకు తగ్గించాక, తర్వాత సుంకాలను పెంచడానికి వీల్లేదు. ఇది, డబ్ల్యూటీఓ సైతం విధించని నిబంధన. ఈ ఒప్పందంపై సంతకాలు చేయడానికి అంగీకరిస్తే, దిగుమతి సుంకాలే లేని దిగుమతులు మన మార్కెట్లో శాశ్వతంగా తిష్టవేస్తాయి. ఇది, 60 కోట్ల మంది రైతుల జీవనోపాధికి భద్రతను కల్పించే, పరిరక్షించుకునే హక్కు మనకు లేకుండా చేస్తుంది.

మన దేశం ప్రపంచంలోనే అతి పెద్ద పాల ఉత్పత్తిదారు. ప్రస్తుతం పాలు, పాల ఉత్పత్తుల దిగుమతులపై 40 నుంచి 60 శాతం దిగుమతి సుంకాలున్నాయి. ఇది, స్థానిక డెయిరీలకు రక్షణను కల్పించి, స్థానిక పోటీతత్వాన్ని పెంపొందింపజేస్తోంది. పాల దిగుమతులకు తలుపులను బార్లా తెరవడంతో ఆస్ట్రేలియా, న్యూజీలాండ్‌ల నుంచి చౌకగా లభించే పాలు దేశాన్ని ముంచెత్తుతాయి. ఆస్ట్రేలియాలో 6,300 మంది, న్యూజీలాండ్‌లో 12,000 మంది పాడి రైతులే ఉన్నారు. అవి ఆ కొద్దిమంది రైతుల ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ కోసం తమ దిగుమతులను రుద్దడానికి యత్నిస్తుంటే... 15 కోట్ల పాడి రైతుల జీవనోపాధిని త్యాగం చేయడానికి భారత్ సిద్ధమౌతోంది. మన ఐటీ నిపుణులకు మరిన్ని అవకాశాలను కల్పించడానికి అవి సుముఖతను కనబరచినంత మాత్రాన, భారత పాడి రైతులను బలిపీఠంపైకి ఎక్కించేస్తామనడం అర్థరహితం.

ఆర్‌సీఈపీ ఒప్పందం, పాలు, పాల ఉత్పత్తులకే పరిమితం కాదు. పళ్లు, కూరగాయలు, పప్పులు, బంగాళదుంపలు, మసాలా దినుసులు, ప్లాంటేషన్లు, విత్తనాలు, పట్టు, ప్రాసెస్డ్ ఆహారం తదితర మార్కెట్లన్నిటా ఇదే పరిస్థితి నెలకొంటుంది. ఈ ఆర్‌సీఈపీ చర్చలను పూర్తి రహస్యంగా సాగిస్తున్నారు. కొందరు వ్యక్తులు పకడ్బందీ ఏర్పాట్లతో రహస్యంగా జరిపే చర్చల ద్వారా జరిగే నిర్ణయాలు, చివరకు 99 శాతం జనాభా భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి. ఇది పూర్తిగా అన్యాయం.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్ : hunger55@gmail.com

మామా అల్లుళ్ల సవాల్

కాలం మారుతోంది. ట్రంప్ వంటి నాయకుల నుంచి 'హెచ్1–బి' వీసాల కరువునుంచి వాణిజ్యాన్ని కాపాడవలసిన అగత్యం ఈ తరానికి ఎంతయినా ఉంది. అందుకు విశాల్ సిక్కాల అవసరం ఎంతయినా ఉంది.

విశ్లేషణ




గొల్లపూడి మారుతీరావు

మామ చక్కటి కూతుర్ని కన్నాడు. అల్లారుముద్దుగా 21 ఏళ్లు పెంచాడు. మొట్టమొదటిసారిగా పై ఇంటి వాడిని అల్లుడిగా తెచ్చుకుని పిల్లని అతని చేతుల్లో ఉంచాడు. అక్కడితో ఊరుకోకుండా కూతురు కాపురాన్ని మేడమీదే పెట్టించి కింద కాపురం ఉన్నాడు. క్రమంగా అల్లుడిగారి ధోరణి మామగారికి నచ్చలేదు. ఆ దశలో నచ్చవలసింది తన కూతురికీ, అతని చుట్టూ ఉన్న మనుషులకీ కానీ తనకి కాదని మరచిపోయాడు మామ. ఎంతైనా కన్న కడుపు. కూతుర్ని ఎలా చూసుకోవాలో, అలా ఎందుకు చూసుకోకూడదో అల్లుడి చెవిలో ఇల్లు కట్టుకుని పోరడం ప్రారంభించాడు. అల్లుడు యోగ్యుడు. మామగారిమీద అమితమైన గౌరవం ఉన్నవాడు. పరోక్షమైన ఈ స్వారీని తట్టుకోలేక ఓ రోజు అల్లుడు లేచి చక్కాపోయాడు. స్థూలంగా ఇదీ ఇన్ఫోసిస్ కథ.

నారాయణ మూర్తిగారు సజ్జనుడు. మహామేధావి. పదిమందిని కలుపుకునే స్వభావం కలవాడు. 1981లో ఇన్ఫోసిస్‌ని పూనాలో ప్రారంభించి, బెంగళూరులో నిలదొక్కుకుని 21 సంవత్సరాల ఆధిపత్యంలో దేశంలోకెల్లా గొప్ప స్థాయిలో నిలిపి, గద్దెదిగి మరో పదేళ్లు చైర్మన్‌గా వ్యవహరించి, మొదటిసారి ప్రారంభకులను దాటి పైవాడిని తెచ్చి ఆధిపత్యం ఇచ్చారు. ఇచ్చారన్నమాటేగానీ, మరీ బాధ్యతా రహితంగా ఖర్చులు పెంచడం, ఉద్యోగం మానిపించిన రాజీవ్ బన్సల్కు 23.02 కోట్లను ముట్టజెప్పడం, ప్రైవేటు విమానాల్లో తిరగడం వంటివి మామగారికి నచ్చడం లేదు. నచ్చడం లేదని చెప్పే హక్కు లేని స్థితి నారాయణ మూర్తి గారిది. కారణం ఆయన కంపెనీలో కేవలం 3.44 శాతం వాటాదారుడు. కానయితే ఆయన నారాయణమూర్తి. ఇది బోర్డు మెంబర్లకు మింగుడు పడని ఇబ్బంది. వంటగదిలో జరిగే ప్రతీ వంటా– కింద కాపురం ఉంటున్న మామగారికి నచ్చ చెప్పాలి. తినేది అల్లుడు. అతను యోగ్యుడు. ఈ పితలాటకం నుంచి– నారాయణ మూర్తి మీద పూర్తిగా గౌరవం ఉన్న అల్లుడు ఏం చెయ్యాలి? ఓ మంచి రోజు చూసుకుని మూటా ముల్లె సర్దుకుని వాళ్ల ఊరెళ్లిపోయాడు. ఇదీ స్థూలంగా ఇన్ఫోసిస్ కథ.

జీవన కాలమ్



ఈ కథలో నీతి కాపురానికి పంపాక– కూతురు మీద ప్రేమ ఉండవచ్చు కానీ 'అధికారాలు' చెల్లవు. తీరా కల్పించుకుంటే మొదటికే మోసం వస్తుంది.

ఈ దేశంలో టాటా గ్రూపు తర్వాత అంత పెద్ద సంస్థ ఇన్ఫోసిస్. 2 లక్షల సిబ్బందితో 122 దేశాలతో సత్సంబంధాలు గల గొప్ప పేరున్న సంస్థ. నారాయణ మూర్తి దక్షతలో, నిజాయితీలో, నీతిలో పేరున్న మనిషి. కానీ పెళ్లయిన కూతురిమీద చెల్లనంత వ్యామోహం పెంచుకున్న మామగారు. అదీ చిక్కు.

దాదాపు ఇలాంటి గొడవే ఆ మధ్య టాటా సంస్థలో జరిగింది. తమ కుటుంబానికి చేరువగా ఉన్న మనిషికి సైరస్ మిస్త్రీకి– కుటుంబంలోని ఆఖరి పెద్ద రతన్ టాటా ఆధిపత్యాన్ని ఇచ్చారు. కానీ కూతురు కాపురం మాట అలా ఉండగా ఇల్లు చెడిపోతోందని గ్రహించి అడ్డం పడ్డారు. ఇది చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. రతన్ టాటా పెద్దరికాన్ని ఎరిగిన వారికి ఇది విడ్డూరంగా కనిపించినా, ఆక్షేపణీయం అనిపించలేదు. కాగా సైరస్ అల్లుడు కాదు. వారసత్వాన్ని అందిపుచ్చుకున్న పెంపుడు కొడుకు. శృతి మించితే పెంపకాన్ని వదులుకునే హక్కు పెద్దాయనకి ఉంది.

ఈ మధ్య ఇలాంటిదే మరో గొడవ. ఈ దేశం క్రికెట్ సంస్థ పాలనను సరిచేయడానికి ముగ్గురు పెద్దల్ని సుప్రీం కోర్టు నియమించింది. తగని ఖర్చులు పెడుతూ, కోట్లకు కోట్లు ఖర్చు చేస్తున్న క్రికెట్ కంట్రోల్ బోర్డు ఉద్యోగులు– సీకే ఖన్నా, అమితాబ్ చౌదరీ, అనిరుధ్ చౌదరీలను తక్షణం బర్తరఫ్ చెయ్యాలని వీరు కోరారు.

గమనించాలి. ఈ మూడూ మూడు రకాలైన వేర్వేరు కథలు. పిల్లనిచ్చిన మామగారు అల్లుడుగారు చేస్తున్న అనవసరమైన ఖర్చులు గురించి వాపోయారు– మొదటి కథలో. అసలు వారసుడి వ్యవహారమే బొత్తిగా నచ్చలేదు రెండో కథలో. తీరా మూడో కథ అల్లుళ్ల కథ కాదు. సుప్రీం కోర్టు మామని కాదు– కొత్త 'మొగుళ్ల'ని తీసుకొచ్చి నిలిపింది. కనుక వారి డిమాండ్‌కి ప్రత్యామ్నాయం లేదు.

ఏతావాతా ఇన్ఫోసిస్ దేశంలో పేరూ, ప్రతిష్టా ఉన్న సంస్థ. నారాయణ మూర్తి పేరూ, ప్రతిష్టని ఆర్జించిన వ్యక్తి. అయితే– తను పదవిలోకి వచ్చిన మూడేళ్లలో విశాల్ సిక్కా అనే యోగ్యుడైన మేధావి– ఇంతకాలం డాలరు–రూపాయిల వ్యత్యాసంతో లాభాలను సంపాదించుకునే సంస్థగానే మిగిలిపోకుండా cost-based దశ నుంచి innovation-based స్థాయికి పెరగనివ్వాలని ప్రయత్నించాడు. దీనిని మామలు గ్రహించాలి.

కాలం మారుతోంది. వ్యాపారం రూపురేఖలు మారుతున్నాయి. ట్రంప్ వంటి నాయకుల నుంచి 'హెచ్1–బి' వీసాల కరువునుంచి వాణిజ్యాన్ని కాపాడవలసిన అగత్యం ఈ తరానికి ఎంతయినా ఉంది. అందుకు విశాల్ సిక్కాల అవసరం ఎంతయినా ఉంది.

విక్టోరియా మెమోరియల్ హోమ్ ఇక చరిత్రేనా?


విక్టోరియా మెమోరియల్ హోమ్

క్రమక్రమంగా చేజారిపోతున్న ట్రస్టు స్థలాలు

- ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు వరుసగా కేటాయింపులు
- మొత్తంగా ఉన్నది 73 ఎకరాలు
- పండ్ల మార్కెట్, జగ్జీవన్‌రామ్ భవన్, రిలయన్స్ బంకు, రోడ్డు విస్తరణతో 28 ఎకరాలు ఫట్.. ఆక్రమణలతో మరో రెండెకరాలు మాయం
- ఇప్పుడు రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు 10 ఎకరాలు కేటాయింపు
- మరో 26 ఎకరాల్లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి ప్రతిపాదనలు
- బాల బాలికల వసతిగృహాలు, తరగతి గదుల ఏర్పాటుకు స్థలాభావం

సాక్షి, హైదరాబాద్: విక్టోరియా మెమోరి యల్ (వీఎం) హోమ్... అనాథలు, తల్లి దండ్రులను కోల్పోయిన పిల్లలకు వసతి కల్పిస్తూ విద్యా బుద్ధులు నేర్పిస్తున్న విద్యాలయం. కానీ ఇప్పుడీ హోమ్‌కు కష్టాలు వచ్చిపడ్డాయి. మెల్లమెల్లగా ఈ హోమ్ భూమి అంతా కుంచిం చుకుపోతోంది. వివిధ ప్రభుత్వ కార్యాలయా లు, ఇతర అవసరాలకు ప్రభుత్వం వీఎం హోమ్ భూములను కేటాయిస్తూ పోతుండ టంతో.. రెసిడెన్షియల్ స్కూలుకే సరిపడే స్థలం లేకుండా పోయే పరిస్థితి ఏర్పడుతోంది. తొలుత వీఎం హోమ్‌కు 73 ఎకరాల స్థలం ఉండగా.. ఇప్పు టికే 43 ఎకరాలకు చేరుకుంది. తాజాగా రాచకొండ పోలీస్ కమిషనరేట్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు ప్రతి పాదనల తో కేవలం ఎనిమిది ఎకరాలే మిగలనుంది.

అవసరాలు అనేకం..

ప్రస్తుతం వీఎం హోమ్ ట్రస్టు ఆధ్వర్యంలో అనాథ పిల్లలు, నిర్లక్ష్యానికి గురై వదిలి వేయబడిన పిల్లల కోసం రెసిడెన్షియల్ పాఠ శాల కొనసాగుతోంది. ఇందులో మొత్తం 676 మంది పిల్లలున్నారు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు కో–ఎడ్యుకేషన్, ఎనిమిది నుంచి పదోతరగతి వరకు బాలలు, బాలికలకు వేరువేరుగా తరగతులు నిర్వహిస్తారు. బాల బాలికలకు ప్రత్యేక డార్మిటరీలు ఉన్నాయి. వాస్త వానికి వీఎం హోమ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 900 మంది పిల్లలను చేర్చుకునే సామర్థ్యం ఉంది. 2017–18లో ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పిల్లల చేరిక సైతం పెరిగింది. ఈ లెక్కన పూర్తి స్థాయిలో విద్యార్థులు చేరితే వసతుల సమస్య తలెత్తే అవకాశముంది. బాలికల వసతిగృహా లను రెండేళ్ల క్రితమే నిర్మించినా.. బాలుర వసతిగృహాలు మాత్రం ఇప్పటికే శిథిలావస్థలో ఉన్నాయి. తరగతి గదులను సైతం కొత్తగా నిర్మించాల్సి ఉంది. ప్రస్తుత మున్న భవనం చారిత్రక కట్టడంకావడంతో కొత్తగా తలపెట్టే నిర్మాణాలన్నీ ఇతర ఖాళీ స్థలంలో నిర్మించాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపులు జరిపితే రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహణ ఇబ్బందికరం కానుంది. మరోపక్క వీఎం హోమ్ భూములను రాచకొండ కమిష నరేట్‌కు అప్పగించవద్దని, అనాథ బాలల పాఠశాల భూములను కాపాడమంటూ విద్యార్థులు పోస్ట్ కార్డుల ఉద్యమం చేప ట్టారు. ఈ మేరకు భూములను కాపాడాలని తెలంగాణ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో హైకోర్టుకు బుధవారం వీఎం హోమ్ అనాథ విద్యార్థులు లేఖలు రాసి పంపారు.



విక్టోరియా మెమోరియల్ హోమ్ స్థలంలో బాబూ జగ్జీవన్‌రామ్ భవన్

అనాథలకు చేదోడుగా..

ఆరో నిజాం నవాబు మీర్ మహమూద్ అలీఖాన్ నిర్మించిన విక్టోరియా ప్యాలెస్‌ను కొన్ని కారణాల వల్ల 1903లో అనాథల కోసం కేటాయించారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండల పరిధిలో ఉన్న ఈ ప్యాలెస్ అనంతరం విక్టోరియా మెమోరియల్ ట్రస్టుగా మారి సేవలందిస్తోంది. అనాథలు, తల్లిదండ్రులను కోల్పోయి నిర్లక్ష్యానికి గురైన పిల్లలను అక్కున చేర్చుకుని వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. ఎస్సీ అభివృద్ధి శాఖ పర్యవేక్షణలో ఉన్న ఈ ట్రస్టుకు కార్యనిర్వాహక చైర్మన్‌గా ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి, సభ్యులుగా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి, విద్యాశాఖ కమిషనర్, సాంకేతిక విద్య, కార్మిక, దేవాదాయ శాఖల ఉన్నతాధి కారులు ఉన్నారు. కానీ 115 సంవత్సరాలుగా సేవలందిస్తూ.. సుదీర్ఘ చరిత్ర ఉన్న విక్టోరియా మెమోరియల్ హోమ్ చరిత్ర ఇప్పుడు చెదిరిపోతోంది. హోమ్ పేరిట ఉన్న సువిశాల స్థలాన్ని క్రమక్రమంగా ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు కేటాయిస్తుండడంతో కుంచించుకుపోతోంది.

రోజురోజుకూ తగ్గిపోతోంది..

వీఎం హోమ్‌కు 73 ఎకరాల స్థలం ఉంది. 1997లో అప్పటి ప్రభుత్వం వీఎం హోమ్ భూముల నుంచి 20 ఎకరాలను పండ్ల మార్కెట్‌కు లీజురూపంలో కేటాయించింది. తర్వాత రిలయన్స్ పెట్రోల్ బంక్‌కు రెండెకరాలు ఇవ్వగా.. మరో రెండున్నర ఎకరాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ ఆడిటోరియాన్ని నిర్మించారు. ఇంకో రెండెకరాల స్థలం ఆక్రమ ణలకు గురైంది. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో మరో నాలుగె కరాలు పోయింది. ఇలా ఇప్పటికే ముప్పై ఎకరాలకుపైగా స్థలం కోల్పోయిన వీఎం హోమ్‌పై ఇప్పుడు మరో పిడుగు పడింది. ఉన్న భూమిలోంచి పదెకరాల స్థలాన్ని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు లీజుకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మరో 26 ఎకరాల స్థలంలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు వైద్యారోగ్య శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ప్రస్తుతం ఈ ఫైలు ప్రభుత్వ పరిశీలనలో ఉంది. దీనికి ఆమోదం లభిస్తే ఇక వీఎం హోమ్‌కు మిగిలేది కేవలం ఎనిమిది ఎకరాలు మాత్రమే.

భూకేటాయింపులను అడ్డుకుంటాం



"అనాథల కోసం నిజాం ఇచ్చిన భూము లను ఇతర సంస్థలకు కేటాయించడం ట్రస్టు నిబంధనలకు విరుద్ధం. హైదరా బాద్ చుట్టూ పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములున్నాయి. వాటిల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవచ్చు. రాచకొండ కమిషనరేట్‌కు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి కేటాయించాలన్న ప్రతిపాదనలు ఉపసం హరించుకోవాలి. వీఎం హోమ్ విద్యార్థు లకు కొత్త వసతిగృహాలు నిర్మించాలి. అందులో జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీ లను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం స్పం దించకుంటే న్యాయపోరాటం చేస్తాం.."

– బి.రవీందర్ రెడ్డి, వీఎం హోమ్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి

చక్కెర ధరలు పెంచితే కఠిన చర్యలు

పౌర సరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా చక్కెర నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ చక్కెర వ్యాపారులను హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చక్కెర ధరల నియంత్ర ణకుగాను ఆయన రాష్ట్రంలోని హోల్‌సేల్ చక్కెర వ్యాపా రుల సంఘం ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. చక్కెర నిల్వలు, లావాదేవీలపై పరిమితులు విధిస్తూ కేంద్రం గతంలో విడుదల చేసిన ఉత్తర్వులను మరో 6 నెలల (ఈ ఏడాది అక్టోబర్ 28) వరకు పొడిగించింది. లైసెన్స్ పొందిన వ్యాపారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన ధర కన్నా ఎక్కువకు చక్కెర అమ్మకూడదని కమిషనర్ అన్నారు. 5 క్వింటాళ్ల కంటే ఎక్కువ చక్కెర నిల్వ చేసే వ్యాపారినే డీలర్‌గా పరిగణిస్తామని, వారు సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారి, తహసీల్దార్ దగ్గర హోల్‌సేల్, రిటైల్ లైసెన్స్ తీసుకోవా లని, లేనిపక్షంలో వారిపై నిత్యావసరాల చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చక్కెర నిల్వలపైనా కమిషనర్ పరిమితి విధించారు.

చేనేతను జీఎస్‌టీ నుంచి మినహాయించాలి

తెలంగాణ చేనేత కార్మిక సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: చేనేత రంగాన్ని జీఎస్‌టీ పరిధి నుంచి మినహాయించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డి.రాజాను ఢిల్లీలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వెంకట్రాములు నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం కలసి వినతి పత్రాన్ని సమర్పించింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, కేంద్ర జౌళి మంత్రి స్మృతి ఇరానీ, జీఎస్‌టీ కౌన్సిల్ సభ్యుడు సంతోష్‌కుమార్ గంగ్వార్‌లకు సంఘం తరపున వినతిపత్రాలు పంపామని టి.వెంకట్రాములు ఓ ప్రకటనలో తెలిపారు. నేటికీ చేనేత రంగంపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ప్రభుత్వం నుంచి సరైన సహకారం లభించక ఈ రంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సిందిపోయి, జీఎస్‌టీలో చేర్చి నూలుపై 5 శాతం, వస్త్రాలపై 18 శాతం పన్ను విధించడం వల్ల చేనేత రంగం మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

'పారిశుధ్యం'పై నెలాఖరుకు గడువు

సాక్షి, హైదరాబాద్: స్వచ్ఛ భారత్‌లో భాగంగా పారిశుధ్యం, పరిశుభ్రతల సత్వర పరిష్కారానికి నూతన ఆలోచనలను కేంద్రానికి పంపేందుకు గడువు తేదీని నెలాఖరుకు పొడిగించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 35 సాంకేతిక విద్యా కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించి వెబ్‌సైట్లో వారి ఆలోచనలను పంచుకునేందుకు ప్రోత్సహించామని పేర్కొన్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులు, వృత్తి నిపుణులు, వృత్తి విద్యా, స్టార్టప్ సంస్థలు, వివిధ నైపుణ్యాలు కలిగిన వ్యక్తుల నుంచి ఈ ఆలోచనలు, సూచనలు, నమూనాలను ఆరు విభాగాలలో పంపించవచ్చని వెల్లడించారు. ఔత్సాహికులు వారి ఆలోచనలను ప్రభుత్వంతో పంచుకోవడానికి 'స్వచ్ఛ భారత్ హ్యాకతాన్ 1.0.' ఓ సదవకాశమని తెలిపారు.

ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డు, వైకుంఠ ధామాలు

గ్రామీణాభివృద్ధి మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డు, వైకుంఠ ధామాలు (శ్మశాన వాటిక) ఏర్పాటు చేసే దిశగా సన్నద్ధం కావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. అందుకోసం యుద్ధప్రాతిపదికన భూసేకరణను పూర్తిచేసి పనులు ప్రారంభించాలని కోరారు. పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణానికి సర్పంచులను ఎంపీడీవోలు సన్నద్ధం చేయాల న్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పథకాలపై బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పూర్తి స్థాయిలో ఉపాధి నిధులను సద్వినియోగం చేసుకోగలిగా మన్నారు. ఈ ఏడాది కూడా ఉపాధి పనులు సాగుతున్నప్పటికీ కొన్ని గ్రామాలు ఇంకా వెనుకబడ్డాయన్నారు. ప్రతి మండలంలో వెనుకబడ్డ రెండు గ్రామాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన పనులు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ, స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణంలో వేగం పెంచాల్సిన అవసరముందన్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ 2లోగా స్వచ్ఛ తెలంగాణ సాధ్యం కావాలంటే ప్రతి ఒక్కరూ అంకితభా వంతో పనిచేయాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి కేంద్రం నుండి రావాల్సిన బకాయిలపై సంప్రదింపులు జరపాలని ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్‌లను ఆదేశించారు. సమావేశంలో అధికారులు వెస్లీ, రామారావు, ఆశ తదితరులు పాల్గొన్నారు.

బేవరేజ్ కార్పొరేషన్‌ను మెరుగుపరుస్తాం: దేవీప్రసాద్



సాక్షి, హైదరాబాద్: అందరికీ అందు బాటులో ఉండేలా బేవరేజ్ కార్పొరేష న్‌ను ఆబ్కారీ భవన్‌లో ఏర్పాటు చేశా మని బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ దేవీ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆబ్కారీ భవన్ ఐదో అంతస్తులో నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లా డుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి పద్మారావు ఆధ్వర్యంలో కార్పొరేషన్ పనితీరు మెరుగుపరుస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చంద్రవదన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, టీజీవో జనరల్ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు. పలువురు దేవీప్రసాద్‌ను ఈ సందర్భంగా సన్మానించారు.

కేసీఆర్ పాలనలో దళితులకు ఒరిగిందేమీ లేదు

జంతర్‌మంతర్ వద్ద మాలమహానాడు ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం కేసీఆర్ పాలనలో దళితులకు ఒరిగిందేమిలేదని తెలంగాణ మాలమహానాడు మండిప డింది. రాష్ట్రంలో దళితులపై దాడులకు నిరసనగా ఆ సంఘం అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో బుధవారం జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సామాజికవేత్త స్వామి అగ్నివేశ్, ప్రొ.కోదండ రాం, ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. నేరెళ్లలో 8 మంది దళితులను అక్రమంగా నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హక్కుల ఉల్లంఘన అని పేర్కొన్నారు. ధర్నాలో సంఘం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పిల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ పాల్గొన్నారు.

నాఫెడ్ కూడా పత్తి కొనుగోళ్లు జరపాలి

కేంద్రాన్ని కోరిన మార్క్‌ఫెడ్ చైర్మన్


లోక బాపురెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండి యా (సీసీఐ)తోపాటు నాఫెడ్ (జాతీయ వ్యవసా య సహకార మార్కెటింగ్ సమాఖ్య) కూడా రాష్ట్రం లో పత్తి కొనుగోళ్లు జరపాలని తెలంగాణ మార్క్ ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, జీఎం కె.రాములు కేంద్రాన్ని కోరారు. బుధవారం ఢిల్లీలో నాఫెడ్ ఎండీ సంజీవ్ కుమార్ చడ్డాను కలసి విన్నవించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పత్తి సాగు అధికంగా జరిగిందని, దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశముందని వివరించారు. సీసీఐతోపాటు నాఫెడ్ కూడా పత్తి కొనుగోళ్లు జరపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో నాఫెడ్‌లో తమకున్న షేర్లను తెలంగాణ మార్క్‌ఫెడ్‌కు బదిలీ చేయాలని కోరినట్లు తెలిపారు.

గోదావరిలో తగ్గిన వరద ఉధృతి!

ఎస్సారెస్పీకి 27,405 క్యూసెక్కులు, సింగూరుకు 8,331 క్యూసెక్కులు

సాక్షి, హైదరాబాద్: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరిలో వరద ఉధృతి తగ్గింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మంగళవారం వరకు లక్ష క్యూసెక్కుల మేర ప్రవాహాలు కొనసాగగా... అవి బుధవారానికి 27,405 క్యూసెక్కులకు తగ్గిపోయాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 24.79 టీఎంసీలు నిల్వ లున్నాయి. ఇక సింగూరు ప్రాజెక్టుకు ప్రవాహాలు పెరిగాయి. మంగళవారం సింగూరులోకి 5,858 క్యూసెక్కుల మేర ప్రవాహం రాగా.. బుధవారానికి 8,331 క్యూసెక్కులకు చేరింది. దీంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నిల్వ 18.73 టీఎం సీలకు చేరింది. ఇక నిజాంసాగర్‌కు 1,215 క్యూసెక్కులు, కడెంకు 1,380, ఎల్లంపల్లికి 2,022 క్యూసెక్కుల మేర ప్రవాహాలు వస్తున్నాయి.

ప్రాజెక్టుల్లో ప్రవాహాలు ఇలా (నిల్వ .. టీఎంసీల్లో, ఇన్‌ఫ్లో .. క్యూసెక్కుల్లో)

ప్రాజెక్టు	వాస్తవ నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో
ఎస్సారెస్పీ	90.31	24.79	27,405
ఎల్లంపల్లి	20.18	11.8	2,022
కడెం	7.60	7.12	1,380
నిజాంసాగర్	17.80	2.11	1,215
సింగూరు	29.91	18.73	8,331
ఎల్ఎండీ	24.07	7.33	0
గైక్వాడ్	102.73	73.98	23,504

ప్రశ్నిస్తే పోలీసులతో దాడులు చేయిస్తారా?

టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై అభ్యంతరాల గురించి మాట్లాడిన మాజీమంత్రి శ్రీధర్‌బాబుపై పోలీసులతో దాడులు చేయించారని, ప్రజాస్వామ్యంలో ఇలాంటివి సమంజసమేనా.. అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రజాభిప్రాయ సేకరణలో టీఆర్ఎస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రైతుల తరపున ప్రశ్నించడం చట్ట వ్యతిరేకమా, నేరమా.. అని భట్టి ప్రశ్నించారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ప్రజాస్వామికంగా ప్రశ్నించిన శ్రీధర్‌బాబును అరెస్టు చేయడం సరికాదని, దీనిని ఖండిస్తున్నామని భట్టి అన్నారు. శ్రీధర్‌బాబుకు టీఆర్ఎస్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అబద్ధాల చిట్టాతో ఢిల్లీలో తిరుగుతున్నారు


జేఏసీ చైర్మన్ కోదండరాంపై ఎమ్మెల్సీ కర్నె ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ఢిల్లీలో అబద్ధాల చిట్టా పట్టుకుని తిరుగుతున్నారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీలో కోదండరాం అబద్ధాలతో ఎవరినీ మెప్పించలేరని అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,45,000 కోట్లు అప్పులు తెచ్చినట్లుగా మాట్లాడుతున్నారని, అప్పులు తీర్చగలిగే వారికి ఎవరైనా అప్పులు ఇస్తారని ఎద్దేవా చేశారు. దేశంలో మిగతా రాష్ట్రాలు అప్పులు చేయడం లేదా ? ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడే అప్పులు తెస్తున్నామన్న విషయం కోదండరామ్‌కు తెలియదా అని ప్రశ్నించారు.

సుప్రీం తీర్పుతో ముస్లిం మహిళలకు ఊరట

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ట్రిపుల్ తలాక్‌ను ఆరునెలల పాటు నిషేధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ముస్లిం మహిళలకు పెద్ద ఊరట కలిగించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. తలాక్‌పై తీర్పు నేపథ్యంలో పలువురు ముస్లిం మహిళలు బీజేపీ కార్యాలయంలో లక్ష్మణ్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళలకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ముస్లిం దేశాల్లో కూడా ట్రిపుల్ తలాక్ అమలులో లేదన్నారు. భారతదేశంలో తలాక్‌ను నిషేధించడాన్ని మతపరంగా చూడొద్దని, ఒక సామాజిక రుగ్మతగానే చూడాలని కోరారు.

గల్ఫ్ బాధితులను ఆదుకోరా?: సురేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మూడేళ్లలో 6 వందల మంది గల్ఫ్‌లో చనిపోయారని, అయినా టీఆర్ఎస్ ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలేదని మాజీ స్పీకర్ కె.ఆర్.సురేశ్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ గల్ఫ్ ఎన్ఆర్ఐల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్ఆర్ఐ పాలసీని రూపొందిస్తున్నట్టుగా ప్రకటించి ఏడాది దాటినా అతీగతీలేదన్నారు. పాలసీ పూర్తిచేయాలంటూ ఎన్ఆర్ఐ ప్రతినిధులు సలహాలు, సూచనలు ఇచ్చినా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. మూడేళ్లలో ఆరు వందల మంది గల్ఫ్‌లో చనిపోయారని, బాధితులకు ప్రభుత్వం నుంచి ఒక్క పైసా సహాయం అందలేదని చెప్పారు. అక్కడ జైళ్లలో ఉన్న తెలంగాణవారికి న్యాయపరమైన సహాయం కూడా ప్రభుత్వం నుంచి అందించడం లేదని సురేశ్‌రెడ్డి విమర్శించారు.

బలనిరూపణా.. ప్రజాభిప్రాయ సేకరణా?

సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరంపై ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను టీఆర్ఎస్ నేతలు బలనిరూపణ కార్యక్రమంగా మార్చారని సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బాధితులతో బలవంతంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు పెట్టిస్తున్నారని ఆరోపించారు. భూసేకరణ చట్టం–2013ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో భూనిర్వాసితులకు నష్టపరిహారాన్ని తగ్గించడం దారుణమని జీవన్‌రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి, కాంట్రాక్టర్లకు వేల కోట్లు కట్టబెడుతున్న ప్రభుత్వం భూ నిర్వాసితులపై అరాచకాలకు, దాడులకు పాల్పడటం బాధాకరమన్నారు. ప్రభుత్వంలో ఉన్నవారు భేషజాలకు పోకుండా రైతులను ఆదుకోవాలనే, కాపాడుకోవాలనే విశాలమైన దృక్పథంతో ఆలోచించాలని కోరారు.

చర్చకు భయపడిన జూపల్లి పెద్దోడా?

ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పాలమూరు ప్రజలకు ద్రోహం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చకు రావాలంటే భయపడుతున్నారని, అలాంటి జూపల్లి పెద్దోడెలా అవుతాడని ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టు ఆయకట్టును తగ్గిస్తూ జీవో వచ్చిందని, దానిని నిరూపించలేకపోతే ముక్కు నేలకు రాయడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. టీఆర్ఎస్ నేతలు, పచ్చి అబద్ధాలు, అసత్య ఆరోపణలు చేసి తప్పించుకుంటున్నారని విమర్శించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి జరిగిన నష్టం గురించి ప్రశ్నిస్తున్నానని, పదవుల కోసం ప్రజలకు నష్టం చేసే మంత్రి జూపల్లిని చెంచా అని, తొత్తు అని అనకుండా ఇంకా ఏమంటారో చెప్పాలని వంశీచంద్‌రెడ్డి ప్రశ్నించారు. టీఆర్ఎస్ చేస్తున్న ద్రోహాన్ని, మోసాన్ని వదిలిపెట్టేది లేదని, అసెంబ్లీలోనే నిలదీస్తానని వంశీచంద్‌రెడ్డి హెచ్చరించారు.

కాంగ్రెస్‌కు రాష్ట్రాభివృద్ధి ఇష్టం లేదు

టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం అభివృద్ధి చెందడం ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి ఏ కోశాన ఇష్టం లేదని టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులపై ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా టీఆర్ఎస్ బలప్రదర్శనకు దిగుతోందని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో పసలేదన్నారు. ఇప్పటికే ప్రజల అండతో తాము బలవంతులుగా ఉన్నామని అన్నారు. అధికారంలో లేనప్పుడే 20 లక్షల మందితో బహిరంగసభ పెట్టిన చరిత్ర టీఆర్ఎస్‌కు ఉందని, తల దగ్గర ప్రాజెక్టులు కట్టకుండా తోక దగ్గర కాల్వలు తవ్వి ప్రజలను భ్రమింప చేసిన చరిత్ర కాంగ్రెస్ నేతలదని ఎద్దేవా చేశారు. 'అభివృద్ధిని నిరోధించడమే కాంగ్రెస్ పని, భూసేకరణలో భాగంగా ఎకరాకు పది లక్షల రూపాయల పరిహారం ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ నేతలకు ఉందా..'అని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టులు అడ్డుకుంటే పేద రైతుల ఉసురు కాంగ్రెస్‌కు తగలక మానదన్నారు. కేంద్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జాతీయ రహదారులపై శీతకన్ను వేసిందని, కేంద్ర మంత్రి గడ్కరీకి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా రోడ్డు ప్రాజెక్టులు కేటాయించడంలేదని విమర్శించారు.

జాతీయహోదా సాధించే దమ్ము ఉందా?

సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకు అయినా జాతీయహోదాను సాధించే దమ్ము ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉందా అని శాసనమండలిలో కాంగ్రెస్ ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరంపై ప్రజాభిప్రాయసేకరణ సందర్భంగా ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో వ్యవహరిస్తున్న టీఆర్ఎస్ నేతలకు తగిన సమయంలో ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. శ్రీధర్‌బాబు అరెస్టు అప్రజాస్వామికమని అన్నారు. జాతీయహోదా సాధించడం చేతకాని ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో ప్రశ్నించే వారిపై పోలీసులతో దాడులు చేయించడం దారుణమన్నారు.

210 మండలాల్లో లోటు వర్షపాతం

నిజామాబాద్ జిల్లాలో 22 మండలాల్లో లోటు • ఇటీవలి వర్షాలతో పుంజుకున్న వరినాట్లు: వ్యవసాయ శాఖ

15.5 లక్షల ఎకరాల్లో వరి... 45.6 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఇటీవల పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసినా ఇప్పటికీ 210 మండలాల్లో లోటు వర్షపాతమే కనిపిస్తోంది. 302 మండలాల్లో సాధారణం, 71 మండలాల్లో అధిక వర్షపాతం రికార్డు అయింది. ఒకే ఒక మండలంలో తీవ్ర వర్షాభావం నెలకొందని వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 13 శాతం లోటు వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 22 మండలాల్లో లోటు వర్షపాతం రికార్డు అయింది. మంచిర్యాల జిల్లాలో 17, జగిత్యాల జిల్లాలో 16 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జనగాం జిల్లా రఘునాథపల్లి మండలంలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఈ ఏడాది జూన్‌లో 47 శాతం అధిక వర్షపాతం రికార్డు అయింది. సాధారణంగా ఆ నెలలో రాష్ట్రంలో సరాసరి 12.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఏకంగా 18.8 సెంటీమీటర్లు నమోదైంది. అయితే రుతుపవనాలు తగ్గుముఖం పట్టడంతో జూలైలో పరిస్థితి తిరగబడింది. ఆ నెలలో 24.2 సెంటీ మీటర్లు నమోదు కావాల్సి ఉండగా, కేవలం 14.6 సెంటీమీటర్లకే పరిమితమైంది. ఏకంగా 40 శాతం లోటు రికార్డు అయింది. ఈ నెలలో ఇప్పటివరకు 21.8 సెంటీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా, కేవలం 12.8 సెంటీమీటర్లు నమోదైంది. ఏకంగా 21% లోటు రికార్డు అయింది.

పుంజుకున్న వరి నాట్లు..

గత వారంతో పోలిస్తే ఈ వారం వరి నాట్లు కాస్తంత పుంజుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్‌లో సాధారణంగా 23.35 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, బుధవారం నాటికి 15.5 లక్షల ఎకరాల్లో



నాట్లు పడ్డాయి. గత వారం వరి నాట్లు 53 శాతానికి చేరుకోగా, ఈ వారం అది 66 శాతానికి చేరింది. వారం వ్యవధిలో 13 శాతం నాట్లు పెరిగాయి. మొత్తం ఖరీఫ్ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 90.52 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. మొత్తం పంటల సాగులో సగం అంటే 45.6 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కావడం గమనార్హం. ఇక పప్పుధాన్యాల సాగు సాధారణ విస్తీర్ణం 10.55 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 8.92 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఇక మిర్చి సాధారణ సాగు విస్తీర్ణం 1.70 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 17,500 ఎకరాల్లోనే సాగైంది.

రేపటి నుంచి 3 రోజులు భారీ వర్షాలు

ఉపరితల ఆవర్తనం కారణంగా రుతుపవనాలు ఊపందుకొని ఈ నెల 25, 26, 27 తేదీల్లో అనేకచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై.కె.రెడ్డి తెలిపారు. గురువారం చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదవుతాయని ఆయన వివరించారు. గత 24 గంటల్లో మిర్యాలగూడ, రామన్నపేట, కొణిజర్లలలో 4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

స్కోచ్ అవార్డుకు కేసీఆర్ కిట్

2017కు నామినేట్ అయిన పథకం

సాక్షి, హైదరాబాద్: సర్కారీ దవాఖానాల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం తాజాగా స్కోచ్ అవార్డు–2017కు నామినేట్ అయ్యింది. పేదల కోసం ప్రభుత్వం చొరవ తీసుకుని అమలు చేసే కార్యక్రమాల విభాగంలో ఈ పథకం నామినేట్ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న ఈ పథకాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవించిన వారికి రూ.12 వేలు.. ఆడపిల్ల పుడితే అదనంగా మరో వెయ్యి(రూ.13 వేలు) అందిస్తోంది. 4 దశలుగా ఈ సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. కాన్పు జరిగిన వెంటనే శిశువు సంరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన కిట్‌ను అందిస్తున్నారు. వైద్య శాఖ ఆగస్టు 21 వరకు 57,627 కిట్లను పంపిణీ చేసింది. జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులలో 15,839 మందికి కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. జూలైలో ఈ సంఖ్య 34,963కు పెరిగింది. 1997 నుంచి గుర్గావ్ కేంద్రంగా స్కోచ్ పనిచేస్తోంది. సామాజిక, ఆర్థిక అంశాలు, సమ్మిళిత వృద్ధి తదితర అంశాలపై ఈ సంస్థ అధ్యయనం చేస్తుంది.

'ప్రైవేట్' లెక్క ఎంత?

- శిక్షణలేని టీచర్ల సంఖ్య తేల్చేపనిలో విద్యాశాఖ
- ప్రైవేటు స్కూళ్లలో బోధనకు టెట్ తప్పనిసరి
- జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ, జిల్లా పరిషత్తు పాఠశాలల్లో 20,40,436 మంది విద్యార్థులుండగా 1,27,843 మంది టీచర్లు పనిచేస్తున్నారు. మరోవైపు 11,304 ప్రైవేటుపాఠశాలల్లో 27,23,601 మంది విద్యార్థులుండగా కేవలం 92,675 మంది ఉపాధ్యాయులే పని చేస్తున్నట్లు ప్రైవేటు స్కూళ్లు 2015–16లో లెక్కలు చెప్పాయి. దీనిని బట్టి ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని అనుసరించడంలేదన్నది స్పష్టం అవుతోంది. అంతేకాకుండా ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్ల సంఖ్యను దాస్తున్నారన్నది అర్థం అవుతోంది. ఇప్పుడు ఆ లెక్కను తేల్చే పనిలో విద్యాశాఖ పడింది. 2019 మార్చి 31 నాటికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ప్రతి టీచర్ ఉపాధ్యాయశిక్షణ తీసుకొని ఉండాలని కేంద్రం స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లోని 92,675 మంది టీచర్లలో 3,905 మంది అన్‌ట్రైన్డ్ టీచర్లు శిక్షణ పొందాలని తేల్చింది. అయితే, ప్రైవేటు పాఠశాలల్లో వాస్తవంగా మరో 30 వేల మందికిపైగా టీచర్లుంటారని విద్యాశాఖ భావిస్తోంది. అధికారికంగా వారి సంఖ్యను చూపిస్తే నిబంధనల ప్రకారం వారికి ప్రయోజనాలు కల్పించాల్సి వస్తుందనే లెక్కలు చెప్పడం లేదేమోనని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ తాజా లెక్కలు తేల్చేందుకు డీఈవోలకు ఆదేశాలు జారీ చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో అర్హత సాధించినవారే ప్రైవేటు పాఠశాలల్లో బోధించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. అందుకే వచ్చే నెల 1 నుంచి ప్రారంభించనున్న విద్యాశాఖ లెక్కల సేకరణలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య, ఉపాధ్యాయ శిక్షణ పొందినవారు, పొందనివారు.. టెట్‌లో అర్హతలకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు సిద్ధం అవుతోంది. ఈసారి టెట్‌ను పక్కాగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో అర్హతలు కలిగినవారి తాజా వివరాలను సేకరించాలని నిర్ణయించింది.

జాతీయ ఓపెన్‌స్కూల్ ద్వారా అర్హతలు పొందే వీలు

ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న అన్‌ట్రైన్డ్ టీచర్లు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) ద్వారా ఉపాధ్యాయ శిక్షణకు తత్సమాన అర్హత పొందేలా కేంద్రం వీలు కల్పించాలని నిర్ణయించింది. ఎన్ఐఓఎస్ ప్రవేశం పొంది, రెండేళ్లలో నిర్వహించే రెండు పరీక్షల్లో అభ్యర్థులు ఉత్తీర్ణత సాధిస్తే వారికి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌కు (డీఎడ్) తత్సమాన సర్టిఫికెట్‌ను అందజేయనుంది. దూరదర్శన్‌కు చెందిన రెండు చానెళ్ల ద్వారా ఈ శిక్షణను అందజేయనుంది. ఇందుకు అభ్యర్థులు రూ. 6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది.

కొత్త జల విధానంతో నీటి కొరత తీర్చండి

కేంద్ర మంత్రికి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: ఎగువన ఉన్న రాష్ట్రాలు తెలంగాణకు నీటి విడుదలలో వివక్ష చూపుతున్నాయని ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. నీటి వినియోగంపై కేంద్రం ఒక నూతన విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతికి బుధవారం లేఖ రాశారు. కర్ణాటకలో రిజర్వాయర్లు నిండుగా ఉంటే.. ఏపీ, తెలంగాణలో మాత్రం ఎండిపోతున్నాయన్నారు. ఎగువన ఉన్న రాష్ట్రాలు కేటాయింపుల కంటే అధిక నిష్పత్తిలో నీటిని వినియోగించుకుంటున్నాయని పేర్కొన్నారు. మరోవైపు కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌ను కలసి భువనగిరికి మంజూరైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ మెడిసిన్ సంస్థ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 35 ఎకరాలు కేటాయించిన నేపథ్యంలో వెంటనే పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోంది

టీఆర్ఎస్‌పై రాష్ట్రపతికి అఖిల పక్షం ఫిర్యాదు

- దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారు
- బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి



బుధవారం ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలసిన అఖిలపక్షం నేతలు. చిత్రంలో ఎల్.రమణ, ఉత్తమ్, డి.రాజా, చాడ, అజీజ్‌పాష, కోదండరాం, సంపత్‌కుమార్

సాక్షి, న్యూఢిల్లీ: టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని అఖిలపక్ష, టీజేఏసీ నేతలు మండిపడ్డారు. ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నిస్తున్న దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలపై పోలీసులను ప్రయోగించి చిత్రహింసలకు గురిచేస్తోందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఫిర్యాదు చేశారు. టీజేఏసీ చైర్మన్ కోదండరాం, పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు రమణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తదితరులు బుధవారం ఢిల్లీలో రాష్ట్రపతిని కలిశారు. బంగారు తెలంగాణ పేరుతో సీఎం కేసీఆర్ ప్రజల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు.

న్యాయవిచారణ జరిపేలా ఆదేశించండి..

ఇసుక దందాలకు పాల్పడుతున్న వారికి వ్యతిరేకంగా ప్రశ్నిస్తున్న దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ తన బంధువులతో కలసి నడుపుతున్న ఇసుక దందాను ప్రశ్నించిన నేరెళ్లకు చెందిన 8 మంది దళితులను పోలీసులు వేధిస్తున్నారని రాష్ట్రపతికి వివరించారు. నేరెళ్లలో ఎస్పీ దగ్గరుండి మరీ దళితులను చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఈ ఘటనలో బాధితులకు న్యాయం జరిగేలా స్వతంత్ర కమిషన్‌తో విచారణ జరిపేలా డీజీపీని ఆదేశించాలని, బాధితులకు నష్టపరిహారమందేలా చూడాలని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని నేతలు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ నియంతృత్వ విధానాల వల్ల రాష్ట్రంలో ఏ వర్గమూ సంతృప్తిగా లేదన్నారు. ఉద్యోగాల కోసం యువత, వ్యవసాయంలో చేయూత కోసం రైతులు ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం వారిని అణగదొక్కుతోందన్నారు. సమావేశం అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను ఎలా కాలరాస్తోందో రాష్ట్రపతికి సమర్పించినట్లు చెప్పారు. దళితులపై జరుగుతున్న దాడులపై విచారణ జరిపించాలని చేసిన విజ్ఞప్తిపై రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణలో ఎంపీటీసీ ఉపట్ల శ్రీనివాస్‌పై జరిగిన దాడిని కోదండరాం ఖండించారు.

పట్టణాభివృద్ధిలో మహిళలు కీలకం

మెప్మా ఉద్యోగులతో మంత్రి కేటీఆర్



సచివాలయంలో మెప్మా ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: పట్టణాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, వారి సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు తెలియజేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఉద్యోగులతో బుధవారం ఆయన ఇక్కడ సమావేశమయ్యారు. మెప్మా రిసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ ఆఫీసర్ల సమస్యలు, ప్రభుత్వం నుంచి వారికి కావాల్సిన సహాయ సహకారాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మెప్మా రిసోర్స్ పర్సన్లు, ముఖ్యంగా మహిళా సోదరీమణుల సహకారంతో ప్రభుత్వం పట్టణాల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న పేదల అభివృద్ధికి తీసుకోవాల్సిన కొత్త కార్యక్రమాలను సూచించాలని వారిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కేసీఆర్ కిట్లు, హరితహారం, బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణాల రూపకల్పన తదితర కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరుపై రిసోర్స్ పర్సన్‌లను వాకబు చేశారు. పలు పురపాలికలు చేపట్టిన తడి–పొడి చెత్త కార్యక్రమం అమలులో, అక్కడి పట్టణ ప్రజలను చైతన్యవంతం చేయడంలో మెప్మా కీలకపాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వం మాతా శిశు సంక్షేమానికి, ప్రభుత్వ వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలపై పట్టణ ప్రజల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. మెప్మా పథకం కింద మహిళలు చేస్తున్న సేవల గురించి సీఎంకి అవగాహన ఉందని, త్వరలోనే మెప్మా ఉద్యోగులతో సీఎం సమావేశమవుతారన్నారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలకంగా పనిచేస్తున్నా, తమకు అతి తక్కువ వేతనాలు ఉన్నాయని, వీటిని పెంచాలని రిసోర్స్ పర్సన్లు మంత్రికి విన్నవించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకుంటారని మంత్రి హామీ ఇచ్చారు.

జల దోపిడీకి దామాషానే విరుగుడు!

- లోటు వర్షపాతం ఉంటే దిగువ ప్రాజెక్టులకు నీటి గండం
- ఎగువ ప్రాజెక్టుల కింద మాత్రం విచ్చలవిడి వినియోగం
- వాటా పేరుతో 1,319 టీఎంసీలు వాడుకుంటున్న కర్ణాటక, మహారాష్ట్ర
- దీనికి దామాషా విధానమే సరైందంటున్న తెలంగాణ
- దీన్నే కేంద్రం, ట్రిబ్యునల్, కోర్టులకు చెప్పాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, ఎగువ నుంచి నీటి ప్రవాహాలు లేకుంటే దిగువ రాష్ట్రాల ప్రాజెక్టుల్లో మట్టే మిగులుతుందన్న తెలంగాణ రాష్ట్ర ఆందోళనను మరింత బలంగా కేంద్రం, సుప్రీంకోర్టు, బ్రిజేశ్ ట్రిబ్యునల్ ముందు వినిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తీవ్ర నీటి కరువును ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాజెక్టులు పూర్తిగా ఎండిన వైనాన్ని వివరించి, దామాషా పద్ధతిన నీటి విడుదల అవసరాన్ని నొక్కి చెప్పాలనే నిశ్చయానికి వచ్చింది. కృష్ణాలో నీటి లోటు ఏర్పడిన సమయంలో సెప్టెంబర్, అక్టోబర్ వరకు ఖరీఫ్ ఆరంభం కష్టమే అన్న వాదనకు, ప్రస్తుత పరిస్థితులు ఏ విధంగా అద్దం పడుతున్నాయో వివరించి న్యాయం చేయాలని కోరేందుకు రాష్ట్రం సిద్ధమైంది.

మిగులు జలాలతో మొదటికే ముప్పు..

వాస్తవానికి ప్రస్తుతం అమల్లో ఉన్న బచావత్ అవార్డు మేరకు కృష్ణాలో కర్ణాటక, మహారాష్ట్రలు 1,319 టీఎంసీల నీటిని వాడుకుంటున్నాయి. అయితే బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ మాత్రం మిగులు జలాలను కూడా పంపిణీ చేసింది. మొత్తం 285 టీఎంసీల మిగులు జలాలు ఉన్నట్టు గుర్తించి, వాటిల్లో కర్ణాటకకు 105 టీఎంసీలు, మహారాష్ట్రకు 35 టీఎంసీలను కేటాయించింది. నికర జలాలు వినియోగించుకుంటేనే ఖరీఫ్ తొలి రెండునెలల్లో చుక్క నీరు కిందకు రాని పరిస్థితి ఉంటే, మిగులు జలాలను నిల్వ చేసుకుంటే పరిస్థితి మరింత భయానకంగా మారనుంది. దీనికి తోడు మిగులు జలాల కేటాయింపు ఆధారంగా కర్ణాటక ఆల్మట్టిలో అదనంగా మరో 100 టీఎంసీల నిల్వ పెంచడానికి వీలుగా ఎత్తును 519.6 నుంచి 524.25 మీటర్లు పెంచుకోవడానికి ట్రిబ్యునల్ అనుమతించింది. ట్రిబ్యునల్ తీర్పు నోటిఫై కాకముందే కర్ణాటక నీటి నిల్వకు దిగడం దిగువ రాష్ట్రాల ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా పరిణమిస్తోంది. ఈ దృష్ట్యా.. ఖరీఫ్ ఆరంభంలోనే ఎగువ ప్రాజెక్టులకు ప్రవాహాలు మొదలైనప్పుడే కేటాయింపుల దామాషా ప్రకారం నీటిని కిందకు విడిచే విధానం ఉండాలని తెలంగాణ కోరుతోంది. ఎగువన 100 టీఎంసీల లభ్యత ఉంటే దామాషా పద్ధతిన దిగువకు కనీసంగా 10 నుంచి 15 టీఎంసీల నీటి వాటా దక్కుతుంది. అలా కాకుండా ప్రస్తుత విధానం కొనసాగి వచ్చిన నీటిని వచ్చినట్లుగా ఎగువనే వినియోగిస్తే దిగువకు ఏటా నీటి గండం తప్పని పరిస్థితి. ఇదే అంశాన్ని ఇప్పటికే బోర్డు దృష్టికి తీసుకెళ్లిన తెలంగాణ, వచ్చే నెల 1వ తేదీన సుప్రీం కోర్టు ముందు జరిగే విచారణలోనూ, తర్వాత 13, 14, 15 తేదీల్లో జరిగే ట్రిబ్యునల్ విచారణలోనూ వివరించి న్యాయం చేసేలా కోరాలని నిర్ణయించింది.

దిగువకు చుక్కనీరు లేదు..

కృష్ణా బేసిన్‌లో సకాలంలో వర్షాలు రాకపోతే దిగువకు కలిగే నష్టాలు ఎలా ఉంటాయో ప్రస్తుత పరిస్థితులు కళ్లకు కడుతున్నాయి. ఎగువ కర్ణాటకలో జూన్ నుంచే విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో ఆల్మట్టి ప్రాజెక్టులోకి ప్రవాహాలు మొదలై సుమారు 160 టీఎంసీలు, నారాయణపూర్‌లో 50 టీఎంసీల నీరు వచ్చింది. వీటికి తోడు మైనర్ ఇరిగేషన్‌కింద ఉన్న చెరువుల్లోకి 200 టీఎంసీల నీరు వచ్చి చేరింది. మహారాష్ట్రలోనే దాదాపు 400 టీఎంసీల మేర నీరు రాగా ఇందులో 100 టీఎంసీలకు పైగా వినియోగం సైతం జరిగిపోయింది. వినియోగమంతా వారి నికర జలాల కేటాయింపుల మేరకే అయినా.. వచ్చిన ప్రవాహాన్ని వచ్చినట్లుగా ఎగువనే వాడుకోవడంతో దిగువకు చుక్క నీరు రాలేదు. దీంతో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు డెడ్‌స్టోరేజీకి చేరి మట్టిదిబ్బలుగా మారాయి. దీంతో సాగర్ కింద 6.6 లక్షల ఎకరాలు, కృష్ణా జలాలపై ఆధార పడ్డ ప్రాజెక్టుల పరిధిలోని మరో 7లక్షల ఎకరాలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 24-8-2017



అమ్మడూ...
లెట్స్ డూ కుమ్ముడు!
- సినిమా పేజీలో



నిద్ర మత్తుతో లేచి బ్రష్ మీద కాస్త పేస్ట్ పూసి
తోం తోం తోం అని తోమడం కాదు...
పళ్లు చిగుర్ల ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే
రైట్ బ్రష్... కరెక్ట్ పేస్ట్...
పర్‌ఫెక్ట్ టెక్నిక్ ఉండాలంతే!
పళ్ల ప్రాబ్లమ్‌లు మిమ్మల్ని కొరుకుతూ ఉంటే
ఈ చిట్కాలను ఒకసారి నెమరేయండి...
పళ్లు నవ్వాలంటే చిగుర్లు బలంగా ఉండాలి!!

తోం తోం తోం

పిల్లలకు డెంటల్ కేర్ అండ్ బ్రషింగ్



వెనకవైపు పళ్లకు, బ్రష్‌ను గుండ్రంగా తిప్పుతున్నట్లుగా బ్రష్ చేసుకునేలా చూడాలి

ముందువైపు పళ్లకు పైన చిగుళ్లూ, పళ్లూ కలిసే చోటి నుంచి కింద మళ్లీ చిగుళ్లూ, పళ్లూ కలిసే చోటు వరకు నిలువుగా బ్రష్ చేసుకునేలా నేర్పాలి.


● పసివయసు పిల్లలకు ప్రతిసారీ పాలుపట్టాక వాళ్ల నోటిని తడి గుడ్డతో గానీ, మామూలు నీళ్లలో ముంచిన దూదితో గానీ శుభ్రం చేయాలి. పాలపళ్లు వచ్చాక టూత్‌బ్రష్‌తో పళ్లు శుభ్రం చేసుకునేలా శిక్షణ ఇవ్వాలి. రెండేళ్ల వయసు కంటే ముందే ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్ వాడాలనుకుంటే మొదట డెంటిస్ట్‌ను కలిసి వారి సలహా తీసుకోవాలి. ● పిల్లలు ఊయగలరు అనీ, టూత్‌పేస్ట్‌ను మింగరు అని నిర్ధారణ అయ్యాక వాళ్ల టూత్‌బ్రష్‌పై కాస్తంత టూత్‌పేస్ట్ వేసి వాళ్ల పళ్లు తోముకునేలా చేయాలి. ● చిన్నారులకు ఆరేళ్ల వయసు వచ్చే వరకు తల్లిదండ్రులే బ్రష్ చేయడం మంచిది. ● పిల్లలు నిద్రపోవడానికి ముందే పాలుపట్టడం పూర్తిచేయండి. వాళ్లు నిద్రపోయాక బాటిల్‌ను అలాగే నోట్లో ఉంచవద్దు. ● పిల్లల మొదటి పుట్టినరోజు నాటి నుంచే వాళ్లు కప్స్ సహాయంతో ఆహారాన్ని చప్పరించి తీసుకునేలా ప్రోత్సహించండి. ● వారు మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా అలవాటు చేయండి. ఆహారంలో ఆకుకూరలు, పళ్లు, కాయధాన్యాలు ఎక్కువగా తినేలా, ఆహారం తీసుకునేప్పుడు చక్కెర పదార్థాలు తక్కువగా తినేలా చూడండి. ● పిల్లలు ఉపయోగించే బ్రష్ మృదువైన బ్రిజిల్స్ ఉన్నదై ఉండాలి. ● బ్రష్ చేసుకునే సమయంలో చాలా మృదువుగా బ్రష్ చేసుకునేలా చూడాలి. రఫ్‌గా బ్రష్ చేసుకోవడం పిల్లల చిగుళ్లకు హాని చేకూర్చవచ్చు. ● పంటికి బయటివైపే కాదు... లోపలి వైపునా బ్రష్ చేసుకోవడం వారికి నేర్పాలి. ● పిల్లలు అదేపనిగా బ్రష్‌ను నములుతూ ఉండకుండా చూసుకోవాలి. ఆ అలవాటును ప్రోత్సహించవద్దు. ● బ్రష్ చేసుకునే ప్రక్రియ కనీసం రెండు నిమిషాల పాటు కొనసాగాలి. మరీ ఎక్కువ సేపు కూడా బ్రషింగ్ వద్దు. ● నాలుకపైనున్న బాక్టీరియాను తొలగించుకునేలా టంగ్‌క్లీనింగ్ పిల్లలకు నేర్పాలి. ● చేత్తో చిగుళ్లపై మృదువుగా మసాజ్ చేసినట్లు రుద్దితే దంతాల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

పిల్లలూ... పిప్పిపళ్లు



పిల్లల్లో పాల పళ్ల దశలో బ్రషింగ్ సరిగా జరగకపోతే కీలకమైన పాలపళ్లు కాస్తా పిప్పిపళ్లుగా మారే ప్రమాదం ఉంటుంది. పిల్లల్లో పాలపళ్లు చాలా ప్రధానమైనవి. ఆహారం నమలడానికి, మాట్లాడటానికి, ఆకర్షణీయంగా కనిపించడానికి ఈ దంతాలు చాలా దోహదపడతాయి. పాలపళ్లు సరిగా ఉంటే భవిష్యత్తుల్లో శాశ్వత దంతాలు సక్రమంగా రావడానికి చాలా ఉపయోగకరం. సాధారణంగా ఆర్నెల్ల వయసులో వచ్చే పాలపళ్లు వచ్చినప్పటి నుంచీ అవి పాడయ్యే అవకాశాలు ఉంటాయి. తీపిపదార్థాలు, చక్కెర ఉన్న పానీయాలు ఎక్కువగా తాగడం, పిల్లలు ఏడ్వకుండా ఉండటానికి పాలపీకను నోట్లో ఉంచేయడం వంటి అలవాట్లతో పళ్లు పాడవుతాయి. పళ్లన్నీ పిప్పిపళ్లుగా మారితే– పాడైన వాటినన్నింటినీ తొలగించాల్సి రావచ్చు. అయితే త్వరగా డాక్టర్‌ను సంప్రదిస్తే వాటిని కాపాడుకోడానికీ అవకాశం ఉంది. అందుకే ఒక వయసు వచ్చాక పిల్లల బ్రషింగ్‌పై తల్లిదండ్రులు తప్పక శ్రద్ధ చూపాలి.

పెద్దలు బ్రషింగ్ ఎలా చేసుకోవాలంటే..!



- మీ దంతసంరక్షణ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి. ప్రతిరోజూ రెండుమార్లు పళ్లు తోముకోండి.
- మీ డెంటిస్ట్‌ను కలిసి క్రమంతప్పకుండా పరీక్షలు చేయించుకోండి.
- మీరు బ్రష్ చేసుకునేందుకు మృదువైన బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌నే వాడండి.
- దంత సంరక్షణను అందించే మంచి టూత్‌పేస్ట్‌ను ఎంచుకోండి.
- పైన చిగుళ్లూ, పళ్లూ కలిసే చోటి నుంచి కింద మళ్లీ చిగుళ్లూ, పళ్లూ కలిసే చోటు వరకు నిలువుగా బ్రష్ చేసుకోండి.
- బ్రష్ చేసుకునే సమయంలో చాలా మృదువుగా బ్రష్ చేసుకోండి. రఫ్‌గా బ్రష్ చేసుకుంటే అది మీ చిగుళ్లకు హాని చేకూర్చవచ్చు. అలాంటప్పుడు అవి త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది.
- మీ పంటికి బయటివైపే కాదు... లోపలి వైపునా బ్రష్ చేసుకోవాలి. నమిలే ప్రదేశాలల్లో పంటిపైన వెడల్పుగా ఉంటే ప్రాంతంలోనూ బ్రష్ చేసుకోవాలి.
- లోపలివైపున బ్రష్ చేసుకోడానికి బ్రష్‌ను నిలువుగా పట్టుకొని పైకీ, కిందికీ మృదువుగా కదిలించండి.
- కనీసం రెండు నిమిషాల పాటు బ్రష్ చేసుకోవాలి.
- నాలుకపైనున్న బ్యాక్టీరియాను తొలగించుకోడానికి కనీసం 30 సెకన్ల పాటు స్క్రబ్ చేయండి.
- బ్రషింగ్ తర్వాత టూత్‌బ్రష్‌ను మృదువుగా రుద్దండి.
- చేత్తో చిగుళ్లపై మృదువుగా మసాజ్ చేసినట్లు రుద్దితే దంతాల ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- ప్రతి మూడు నెలలకు ఓమారు బ్రష్‌ను మార్చేయండి. లేదా బ్రిజిల్స్ వంగినట్లు, దెబ్బతిన్నట్లు కనిపించినా బ్రష్‌ను వెంటనే మార్చండి.



అనేక రకాల టూత్‌పేస్ట్‌లు





మనకు ఇవాళ రకరకాల టూత్‌పేస్ట్‌లు లభ్యమవుతున్నాయి. వాటిలో అనేక రకాల సౌలభ్యాలూ ఉన్నాయంటూ తయారీదారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. దాంతో మనకు ఎలాంటి టూత్‌పేస్ట్ కావాలనే దానిపై సందిగ్ధం నెలకొంటుంటుంది. అయితే ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం ఒకటుంది. ప్రతివారికీ వేర్వేరు జీవనశైలి ఉంటుంది. కాబట్టి ఒకరికి అనువైన టూత్‌పేస్ట్ మరొకరికి అనువుగా ఉంటుందనే నియమం ఉండదు. కాబట్టి ప్రతివారూ తమ అవసరాల మేరకు తమ టూత్‌పేస్ట్‌ను ఎంపిక చేసుకోవాలి. సాధారణంగా మనకు అందుబాటులో ఉండి, ఎంచుకోదగ్గ టూత్‌పేస్ట్‌లు ఇవి...

పిల్లల టూత్‌పేస్ట్‌లు : పిల్లల టూత్‌పేస్ట్‌లలో ఫ్లోరైడ్ పాళ్లు పెద్దవారి టూత్‌పేస్ట్ కంటే తక్కువగా ఉంటాయి. నిజానికి ఫ్లోరైడ్ పాళ్లు ఉండాల్సిన దాని కంటే ఎక్కువగా ఉంటే అది చాలా హానికరం. అలాగే గారపోగొట్టేలా రుద్దగల శక్తి (అబ్రేసివ్‌గుణం) కూడా పిల్లల టూత్‌పేస్ట్‌లో చాలా తక్కువగా ఉండాలి. అలాగే వారి దంతాలు, చిగుర్లు సున్నితంగా ఉంటాయి కాబట్టి శక్తిమంతమైన రసాయనాలు లేని స్వాభావికమైన టూత్‌పేస్ట్‌లను డాక్టర్‌ను సంప్రదించి తీసుకోవాలి.

ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్ట్‌లు : మనదేశంలో ఫ్లోరైడ్ పాళ్లు అవసరమైన దానికంటే ఎక్కువగా ఉన్నందున ఫ్లోరైడ్‌తో కూడిన నీళ్ల వల్ల అనేక సమస్యలు వస్తున్నాయిగానీ... నిజానికి తగిన పాళ్లలో ఉంటే ఫ్లోరైడ్ వల్ల దంతాల ఎనామెల్‌కు రక్షణ కలుగుతుంది. అలాగే దంతాన్ని దృఢంగానూ చేస్తుంది. కాబట్టి మనకు పుష్కలంగా ఫ్లోరైడ్ లభ్యత ఉన్నచోట్ల మినహాయించి తగినంత ఫ్లోరైడ్ లభ్యత లేని మిగతా ప్రాంతాల వారు ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్ట్‌లను వాడవచ్చు.

దంతాలను తెల్లగా చేసేవి (టీత్ వైటెనింగ్ టూత్‌పేస్ట్స్) : దంతాలు కాస్త పసుపుపచ్చగా అనిపిస్తున్నవారు గారపోగొట్టేలా రుద్దగల శక్తి (అబ్రేసివ్ గుణం) ఉన్న టూత్‌పేస్ట్‌లను వాడటం మంచిది. అయితే అలాంటివి వాడేవారు కాస్తంత జాగ్రత్త వహించాలి. ఎందుకంటే గారపోగొట్టే 'యాంటీ స్టెయిన్స్' టూత్‌పేస్ట్‌ను ఎక్కువ మోతాదులో ఉపయోగించడం వల్ల క్రమంగా పంటిపై ఉండే ఎనామెల్ కూడా దెబ్బతినవచ్చు.

సున్నితమైన దంతాల కోసం వాడాల్సినవి (సెన్సిటివ్ టూత్‌పేస్ట్స్) : త్వరగా ప్రభావితం కాగల చాలా సున్నితమైన పళ్లు (సెన్సిటివ్ టీత్) ఉన్నవారు, చిన్న సమస్యకే చిగుర్ల నొప్పి వచ్చేవారు సెన్సిటివ్ టూత్ పేస్ట్‌లు వాడాలి. ఇలాంటివారు పొటాషియమ్ నైట్రేట్ ఉన్న టూత్‌పేస్ట్ వాడటం మంచిది. ఎందుకంటే ఆ రసాయనం నొప్పిని తెలిపే యంత్రాంగాన్ని కాసేపు నిద్రాణంగా ఉంచుతుంది. దాని వల్ల కాసేపు నొప్పి తెలియకుండా ఉంటుంది.

హెర్బల్ టూత్‌పేస్ట్‌లు : నేచురల్ ఆరోగ్యప్రదాయిను లంటూ ఇటీవల స్వాభావికమైన మూలికలు, అటవీ ఉత్పాదనతో తయారు చేసే టూత్‌పేస్ట్‌లు ఎక్కువగా వస్తున్నాయి. సాధారణంగా కొందరికి రసాయనాలతో తయారైన టూత్‌పేస్ట్‌లు కొద్ది మొత్తంలో తీసుకున్నా వారికి సరిపడవు. అలాంటి వారు ఈ హెర్బల్ టూత్‌పేస్ట్‌లను వాడవచ్చు. అయితే ఈ టూత్‌పేస్ట్ లలో ఫ్లోరైడ్ ఉండదు కాబట్టి... ఫ్లోరైడ్ నీళ్లు దొరికే ప్రాంతాల వారు, ఫ్లోరైడ్ అవసరాలు లేనివారు వీటిని వాడవచ్చు. అయితే ఫ్లోరైడ్ ప్రాంతాల వారితో పాటు మిగతా ప్రాంతాలవారు కూడా ఒకసారి తమ దంతవైద్యుడిని సంప్రదించాకే ఈ హెర్బల్ టూత్‌పేస్ట్‌లు వాడటం మంచిది.

గారను తొలగించే పేస్ట్‌లు (యాంటీ ప్లాక్ టూత్ పేస్ట్) : పళ్లపై పేరుకునే పాచికి ఒక లక్షణం ఉంటుంది. వెంటవెంటనే బ్రష్ చేసుకుంటే ఆ పాచి త్వరగా తొలగిపోతుంటుంది. కానీ బ్రష్ చేయడంలో అలసత్వం వహించినప్పుడు అది గార (ప్లాక్)గా ఏర్పడుతుంది. అలాంటి గారను దంతవైద్యుల సహాయంతో స్కేలింగ్ చేయించాలి. ఇప్పుడు ఈ గారను తొలగించేలా బలమైన, శక్తిమంతమైన యాంటీ ప్లాక్ టూత్‌పేస్ట్‌లు దొరుకుతున్నాయి. అయితే వాటిని అవసరమైన వారు కొద్దికాలం పాటు దాన్ని ఉపయోగించాక... గారతొలగిపోయాక మళ్లీ తమ సాధారణ టూత్‌పేస్ట్‌కు మళ్లడం మంచిది. పెద్దగా అవసరం లేకపోయినా అదే పనిగా ఈ యాంటీ ప్లాక్ టూత్‌పేస్ట్‌లు వాడటం వల్ల దంతాలు దెబ్బతినవచ్చు. చిగుర్లు గాయపడి మంట (ఇరిటేషన్) రావచ్చు. పైగా ఇవి చిగుర్లను గాయపరచడం వల్ల బ్యాక్టీరియా పేరుకునేందుకు తావిస్తాయి. దాంతో చిగుర్ల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. అందుకే యాంటీ ప్లాక్ టూత్‌పేస్ట్‌లను దీర్ఘకాలం వాడటాన్ని నిపుణులు అంతగా సిఫార్సు చేయరు.

సాధారణంగా మనకు లభ్యమయ్యే రకరకాల టూత్‌పేస్ట్‌ల తీరుతెన్నులు ఇవి. ఎవరికి వారు తమ విచక్షణ మేరకు అవసరమైన వారు వాటిని వాడవచ్చు. అయితే తమకు ఎలాంటి టూత్‌పేస్ట్ సరిపడుతుందో అనుభవం మీద తెలిశాక... ఒకసారి డాక్టర్‌ను సంప్రదించి దాన్ని కొనసాగించం అన్ని విధాలా మంచిది.

దంత సమస్యల నివారణ ఎలా?





పిల్లలకు గాని, పెద్దలకు గాని చిగుళ్ల జబ్బులు రాకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. పిల్లలకు రెండు పూటలా బ్రష్ చేయించడం, పెద్దలూ రెండు పూటలా బ్రష్ చేసుకోవడం, పంటికి అతుక్కుపోయే పదార్థాలు తీసుకోకపోవడం, తినేవాటిలో జంక్‌ఫుడ్ లేకుండా జాగ్రత్త పడటం అవసరం. దాంతోపాటు స్వీట్స్ తగ్గించాలి. తీపి పదార్థాలు తిన్న ప్రతిసారీ నోటిని నీళ్లతో పుక్కిలించాలి.



డాక్టర్ ప్రత్యూష హెచ్ఓడీ, ఓరల్ మెడిసిన్ & మాక్సీలో ఫేషియల్ రేడియాలజీ, కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్

పంటి చిగుర్లకు ఇన్ఫెక్షన్లు వస్తే..!



పంటి చిగురుకు ఇన్ఫెక్షన్ వస్తే మొదట తీవ్రమైన నొప్పి వస్తుంది. అంతలోనే అకస్మాత్తుగా అది లేకుండా మాయమైనట్లు అనిపిస్తుంది. పంటి చుట్టూ చీము చేరుతుంది. ఈ ఇన్ఫెక్షన్ చిగురుకు పూర్తిగా పాకుతుంది. అది పంటిని వదులు చేస్తుంది. అక్కడో గడ్డ కూడా కావచ్చు. ఒక్కోసారి అది చిదిమినట్లవుతుంది. ఇది జరిగినప్పుడు నొప్పి అకస్మాత్తుగా చేత్తో తీసేసినట్లు అవుతుంది. నొప్పి లేదంటే అదేదో తగ్గిపోయిందనీ, డెంటిస్ట్ దగ్గరికి వెళ్లనక్కర్లేదని అర్థం కాదు. ఒకవేళ చీము అంతా ఎండిపోకపోతే అది క్రమంగా దవడకూ, తలకే కాదు... నొప్పి మెడవరకూ పాకొచ్చు. అది భయంకరంగా మారొచ్చు. నిజానికి మన నోట్లోనే బోల్డన్ని బ్యాక్టీరియా (సూక్ష్మజీవులు) ఉంటాయి. మనలో దంతక్షయంగానీ ఉంటే ఆ దెబ్బతిన్న పన్నులోని మృతకణాలున్న భాగం బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడి ఇన్ఫెక్షన్‌కు దారితీయవచ్చు. దంతంలో ఏదైనా భాగం దెబ్బతిని ఉంటే... అదే బ్యాక్టీరియా విస్తరించేందుకు సింహద్వారమవుతుంది. అలా ఇన్ఫెక్షన్ వస్తే మాటిమాటికీ నొప్పి వస్తూ ఉంటుంది. వేడి లేదా చల్లటి పదార్థాలు తిన్నప్పుడల్లా జిల్లుమంటుంది. అదేకాదు... నమలగానే నొప్పి తక్కున పొడుచుకొని వస్తుంది. అప్పటికీ డెంటిస్ట్‌కు చూపించకపోతే ఆ ఇన్ఫెక్షన్ శరీరంలోని మరే అవయవానికైనా విస్తరిస్తుంది. ఉదాహరణకు గొంతులోని గ్రంథులు వాచినట్లుగా కావచ్చు. నోరు దుర్వాసన వస్తున్నట్లు, మనమేదైనా నోట్లోకి తీసుకుంటే దాని రుచి మారినట్లు అనిపిస్తుంది. ఇలా అనిపిస్తే నోట్లో చిగురు వద్ద వచ్చిన గడ్డ పలిగినందుకు అది సూచన. ఇలాంటప్పుడు నొప్పి తగ్గినట్లు అనిపిస్తుంది గానీ వాస్తవానికి ఇన్ఫెక్షన్ మాత్రం మన శరీరంలోనే ఉంటుంది. ఇది చాలా ప్రమాదకరం కావచ్చు. అందుకే మన పంటికి ఎలాంటి నొప్పి వచ్చినా వెంటనే డెంటిస్ట్‌కు చూపించుకొని తగిన చికిత్స తీసుకోవాలి.

ఆత్మీయం

మూర్తీభవించిన వ్యక్తిత్వవికాసం



శ్రీకృష్ణుని రూపం నల్లటిది. కాని మనసు మాత్రం తెల్లనిది, స్వచ్ఛమైనది. బాల్యం నుంచి – ఆ మాటకొస్తే పుట్టకముందు నుంచే ఆయన ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నాడు? ఎన్ని సవాళ్లను అధిగమించాడు? కన్నతల్లిదండ్రులకు దూరమయ్యాడు. కడుపులో పెట్టుకుని కాపాడవలసిన మేనమామే శత్రువై సంహరింప చూసినా చలించక తామరాకు మీది నీటిబొట్టులా ఉన్నాడు. దేనికీ భయపడలేదు, ఎవరికీ లొంగలేదు. వెన్నుచూపలేదు. కార్యసాధన అంటే ఏమిటో చాటి చెప్పాడు. శరణన్న వారికి సదా రక్షణ వహించాడు. సహాయం కోరిన వారికి ఒట్టి చెయ్యి ఎప్పుడూ చూపించలేదు. మోసాన్ని మోసంతోనే జయించాలని, ముల్లును ముల్లుతోనే తీసివేయాలని, తగిన ఉపాయముంటే ఎంతటి అపాయం నుంచయినా బయట పడవచ్చునని రుజువు చేసి చూపాడు. అవసరమయిన చోట మహిమలు చూపాడు. యుద్ధంలో విజయం సాధించడానికి భుజబలమే కాదు, బుద్ధిబలం ఉంటే చాలునని కొన్ని అక్షౌహిణుల సేనను, రథ, గజ, తురగ పదాతి దళాలను కౌరవుల పరం చేసి, తానొక్కడు మాత్రం పాండవుల పక్షం వహించి, వారిని విజయం వైపు నడిపించి నిరూపించాడు. అసలైన వ్యక్తిత్వ వికాసమంటే ఏమిటో గీత ద్వారా బోధించి చూపాడు. శ్రీకృష్ణుని లీలలు తెలుసుకోవడమే కాదు, ఆయన మంచితనాన్ని, ఉన్నత వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలి. ఆయన చేసిన గీతాబోధను ఆకళింపు చేసుకోవాలి. అర్థం అయిన వాటిని వ్యర్థం చేయకూడదు. ఆచరణలో పెట్టగలగాలి. అప్పుడే మనం కృష్ణునికి ప్రియభక్తులమవుతాం.

హెల్త్ టిప్

చర్మం ఆరోగ్యం కోసం పాలకూర జ్యూస్




చర్మానికి ఫేస్‌ప్యాక్‌లు వాడడం పరిపాటి. వాటితోపాటుగా పాలకూర జ్యూస్ తాగడం వల్ల చర్మానికి సహజమయిన నిగారింపు లభిస్తుంది.

పాలకూర ఆకులు – కొన్ని, **క్యారట్** – 1, **గ్రీన్ ఆపిల్** – 1, **పైనాపిల్ ముక్కలు** – అర కప్పు

తయారి: ● అన్నింటినీ కట్ చేసి జ్యూసర్‌లో వేసి, కొద్దిగా నీటిని జత చేసి జ్యూస్ చేయాలి. ప్రతిరోజూ ఉదయం ఒక్క గ్లాస్ పాలకూర జ్యూస్ తాగితే చర్మసౌందర్యం రెట్టింపవుతుంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం
24-8-2017

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేను బీటెక్ కంప్లీట్ చేశాను. గవర్నమెంట్ జాబ్ కోసం ట్రై చేస్తున్నాను. ఇప్పటి వరకూ నా కాన్‌సెన్‌ట్రేషన్ అంతా నా కెరీర్ మీద, పేరెంట్స్ మీద ఉండేది. త్రీ మంత్స్ బ్యాక్ బస్‌లో వస్తున్నప్పుడు ఒక అబ్బాయి పరిచయం అయ్యాడు. తనకి గవర్నమెంట్ జాబ్ వచ్చిందని పరిచయం చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మా రిలేటివ్స్ కూడా అని తెలిసింది. కామన్ ఫ్రెండ్స్‌కి ఫ్రెండ్ కావడంతో ఫేస్ బుక్ రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేశాను. తన బిహేవియర్ బాగా నచ్చింది. నేనంటే తనకి కూడా ఇష్టమేనని అర్థమయ్యింది. బట్ మా పేరెంట్స్‌కి ఇవన్నీ నచ్చవు. లవ్ అంటే ఒప్పుకోరు. అందుకే కావాలని గొడవ పెట్టుకుని తనతో మాట్లాడం మానేశాను. వన్ ఇయర్‌లో జాబ్ తెచ్చుకుని ఇంట్లో ఒప్పించాలని ఉంది. బట్ తను మిస్ అయిపోతాడేమో అని చాలా భయంగా ఉంది సార్! ఇప్పుడు నేనేం చేయాలి సార్?

- పవిత్ర
(పేరు మార్చడమైంది)

మగాళ్లందరూ బాడ్ బాయిస్ కదా చెల్లెమ్మా!!

'కానీ, వీడు తుంటరి అని చెబుతారు కదా సార్?'

నేనలా చెప్పలేదే!

'చెబుతారు సార్!!'

లేదే..!

'త్రాష్టుడు, దుర్మార్గుడు, డర్టీ ఫెలో, డేంజరస్ డూడ్...'

అయ్యో.. నా నోట్లో లేని మాటలు పెడుతున్నావు!

'సార్ నాకు మీరు బాగా తెలుసు. ఆ అబ్బాయి జాబ్ ఉందికదా అని.. నిన్ను ఇలా ట్రీట్ చేస్తాడు. అసలు వాడి ట్రాప్‌లో పడొద్దు.'

అవ్వ!!

'మీరు ఎవరి లవ్‌నీ పండకుండా చేసే సాడిస్ట్ అనుకుంటారు సార్'

అవ్వ! అవ్వ!!

'ఒక రోజు మెగా బాయ్స్ అంతా వచ్చి... మిమ్మల్ని... కుమ్మేస్తారు!!'

నీకేదో పర్సనల్‌గా నా మీద ఒపీనియన్ ఉండొచ్చు కానీ ఇలా........

'ఇంకేం చెబుతారు సార్ అమ్మాయికి? వేరే ఏమయినా చెబుతారా? ఎప్పుడయినా చెప్పారా? కాపురాలు కూల్చే వాళ్లను చూసేను. బిఫోర్ కాపురం కూల్చే వాళ్లను మిమ్మల్నే చూస్తున్నా...'

ఏమైంది నీలాంబరీ? ఇవాళ రెచ్చిపోతున్నావు?

'ఇది నా మాట కాదు సార్... టోటల్‌గా ఆంధ్రా తెలంగాణా లవర్స్ పెయిన్ సార్'

ఛీ... పో. నాకంత సీన్ ఉందంటావా?

'అబ్బా ఏమి మురిసిపోతున్నారు సార్!'

ఇదమ్మా పవిత్రా! ప్రపంచం. మనం అనేకునే దానికి ఇతరులు రిసీవ్ చేసుకునే దానికి నక్కకు నాకలోకానికి ఉండే తేడా. ఏది చేసినా తొందర పడకుండా ఉద్యోగం వచ్చాక చూద్దాం. ఓకే!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

డంబెల్ షేప్

స్లిమ్ టైమ్

- డమ్‌బెల్ ఒబేసిటీ తగ్గడానికి నిలబడి చేసే ఉత్కటాసనం, త్రికోణాసనం, పరివృత్త త్రికోణాసనం, పార్శ్వకోణాసనం, వీరభద్రాసనం (ఆల్ వేరియంట్స్), గరుడాసనం, ఆల్ ప్లాంక్ పోశ్చర్స్, అంటే చతురంగ దండాసనం, పర్వతాసనం ఉపకరిస్తాయి.
- కూర్చొని చేసేవాటిలో – కోణాసనం, పద్మాసనం, భరద్వాజాసనం, వజ్రాసనం, వీరాసనం, సుప్త వజ్రాసనం, కపోతాసనం, గోముఖాసనం, ఉష్ట్రాసనం మంచి ఫలితాలనిస్తాయి.
- బోర్లాపడుకుని చేసేవాటిలో – శలభాసనం, సర్పాసనం, భుజంగాసనం, ధనురాసనం సాధన చేయవచ్చు.
- వెల్లకిలా పడుకుని చేసే వాటిలో చక్రాసనం చక్కటి ఫలితాన్నిస్తుంది.
- బరువు తగ్గడానికి ఈ ఆసనాలు బాగా పనికివస్తాయి. ప్రాణాయామాల్లో భస్త్రిక కపాలభాతి, అగ్నిసార, ఉడ్డియాన్, నౌలి బాగా ఉపకరిస్తాయి.



మోడల్: ఈషా హిందోచా

ఎత్తుని బట్టి శరీరపు బరువు ఉండాల్సిన దానికన్నా 20% ఎక్కువ ఉన్నట్లయితే ఒబేసిటీగా పరిగణించవచ్చు.. శరీర ఆకృతిని బట్టి ఒబెసిటీని ఇలా విభజించవచ్చు.

1) కేవలం పొట్ట మాత్రమే లావుగా ఉండి మిగిలిన శరీరం మొత్తం ఇంచు మించు సమంగానే ఉన్నట్లయితే దానిని పాట్ బెల్లీ ఒబేసిటీ అంటారు.

2) శరీరం మొత్తం పైనుండి కిందకు పూర్తిగా స్థూలంగా ఉన్నట్లయితే దానిని సిలిండ్రికల్ ఒబేసిటీ అంటారు.

3)పొట్ట కన్నా పిరుదులు, తొడలు, భుజాలు బాగా లావుగా ఉంటే డంబ్‌బెల్ ఒబేసిటీ అంటారు.ఆ డంబెల్ ఒబెసిటీ సమస్యకు పరిష్కారం ఈ ఆసనాలు...

1) పరివృత్త త్రికోణాసన

ఎడమ పాదం ముందుకు, కుడి పాదం పక్కకు, రెండు కాళ్ల మధ్య వీలైనంత దూరం, చేతులు రెండూ 180 డిగ్రీల కోణంలో పక్కలకు ఉంచి శ్వాస వదులుతూ కుడిచేయి కిందకు ఎడమపాదం పక్కకు, ఎడమచేయి పైకి నిటారుగా ఉంచాలి. రెండు చేతులు 180 డిగ్రీల కోణంలో ఉండేటట్లు చూసుకోవాలి. మోకాలి సమస్య ఉన్నా L1 నుంచి L5 లో ప్రాబ్లమ్ ఉన్నా, పించ్ నర్వ్ సయాటికా సమస్య ఉన్నా ఎడమ మోకాలిని సౌకర్యవంతంగా ఉండేటట్లు కొంత వరకే బెండ్ చేయాలి. 3 లేదా 5 సాధారణ శ్వాసల తర్వాత శ్వాస తీసుకుంటూ మళ్ళీ పైకి నిలబడిన స్థితిలోకి రావాలి. ఇదే విధంగా వ్యతిరేక దిశలో కూడా చేయాలి.



2) కోణాసన

కూర్చున్న స్థితిలో కాళ్ళు రెండూ ముందుకు సాగదీసి చేతులు రెండూ వెనుకగా శరీరానికి ఇరువైపులా ఉంచి అరచేతులు వెనుకవైపుకు చూసే విధంగా ఉంచి శ్వాసతీసుకుంటూ సీటు భాగాన్ని నెమ్మదిగా పైకి లేపుతూ శరీరం మొత్తం ఏటవాలు రేఖలో ఉండేటట్లుగా చూసుకోవాలి. ఒకవేళ అరచేతులు చేతివేళ్ళ డైరెక్షన్స్ వెనుకకు ఉంచడం కష్టం అన్పిస్తే లోపల ముందువైపు దిశగా కూడా ఉంచవచ్చు. 5 లేదా 10 శ్వాసల కాలం ఉంటూ శ్వాస వదలిన ప్రతిసారి పొట్టను బాగా లోపలకు లాగుతూ ఉండాలి. శ్వాస వదులుతూ నడుము కిందకు తీసుకురావాలి. ఇలా ఐదు లేదా పది సార్లు చేయాలి.



ఎ.ఎల్.వి కుమార్
ట్రెడిషనల్
యోగా ఫౌండేషన్

3) ఏకపాద కపోతాసన

భరద్వాజాసనంలో రెండు కాళ్ళు ఎడమవైపుకి మడిచి శరీరాన్ని కుడివైపుకి నడుమును కుడివైపుకి ట్విస్ట్ చేస్తూ వెనుకకు కుడి భుజం మీదుగా చేసే ప్రయత్నం. ఈ సిరీస్‌లో చేసే ఆసనం కపోతాసనం. కుడిమోకాలు ముందుకు ఫేస్ చేస్తూ ఎడమ మోకాలు వెనుకకు ఫేస్ చేస్తూ ఎడమ పాదాన్ని పైకి లేపి కుడిచేత్తో ఎడమ పాదాన్ని పట్టుకునే ప్రయత్నం చేయాలి. పట్టుకున్న తరువాత ఆ పాదాన్ని నడుముకు లేదా వీపు భాగానికి బాగా దగ్గరగా ఆనించే ప్రయత్నం చేయాలి. ఇలా ఆనించగలిగిన వాళ్ళు పాదం పక్కకి పడిపోకుండా ఎడమ చేతి మధ్యలో లాక్ చేయాలి. ఈ స్థితి నుంచి గోముఖాసనంలో మాదిరి కుడి చేతిని పైకి తీసుకు వెళ్ళి వేళ్లను లాక్ చేయాలి. శ్వాసతీసుకుంటూ ఆసనంలోకి రావాలి. 3 లేదా 5 సాధారణ శ్వాసల తరువాత శ్వాస వదిలేస్తూ వెనుకకు వచ్చి ఇదే విధంగా రెండవవైపు కూడా చేయాలి. చేయలేని వారు ఎంతవరకు వస్తే అంతవరకు చేయవచ్చు.

– సమన్వయం: **ఎస్. సత్యబాబు,**
ఫొటోలు: **పోచంపల్లి మోహనాచారి**

ఫ్యామిలీ డాక్టర్

హోమియో కౌన్సెలింగ్స్

యానల్ ఫిషర్ అంటే...

నా వయసు 68 ఏళ్లు. నేను మలబద్ధకంతో బాధపడుతున్నాను. మలవిసర్జన సమయంలో తీవ్రమైన నొప్పి వస్తోంది. డాక్టర్‌ను సంప్రదిస్తే యానల్ ఫిషర్ అని చెప్పారు. ఆపరేషన్ అవసరమన్నారు. నాకు ఆపరేషన్ అంటే భయం. హోమియోలో దీనికి చికిత్స ఉందా?

- సంపత్‌కుమార్, నిడదవోలు

మనం తీసుకునే ఆహారంలో పీచుపదార్థాల పాళ్లు తగ్గడం వల్ల మలబద్ధకం వస్తుంది. దాంతో మలవిసర్జన సాఫీగా జరగదు. అలాంటి సమయంలో మలవిసర్జన కోసం విపరీతంగా ముక్కడం వల్ల మలద్వారం వద్ద పగుళ్లు ఏర్పడతాయి. ఇలా ఏర్పడే పగుళ్లను ఫిషర్ అంటారు. ఈ సమస్య ఉన్నప్పుడు మలవిసర్జన సమయంలో నొప్పితో పాటు రక్తస్రావం జరుగుతుంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనవిధానం వల్ల ఈమధ్యకాలంలో ఇలాంటి సమస్యలు మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయి. మలబద్ధకం వల్ల రోగి ఎక్కువగా ముక్కాల్సి రావడంతో మలద్వారంతో పాటు దాని చుట్టుపక్కల ఉండే అవయవాలన్నీ తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. క్రమేపీ అక్కడి ప్రాంతంలో కూడా వాపు రావడం, రక్తనాళాలు చిట్లడం మలంతోపాటు రక్తం పడటం జరుగుతుంది. ఫిషర్ సంవత్సరాల తరబడి బాధిస్తుంటుంది. ఆపరేషన్ చేయించుకున్నా మళ్లీ సమస్య తిరగబెట్టడం మామూలే. ఇది రోగులను మరింత ఆందోళనకు గురి చేస్తుంది.

కారణాలు: ● దీర్ఘకాలిక మలబద్ధకం ● ఎక్కువకాలం విరేచనాలు ● వంశపారంపర్యం – అతిగా మద్యం తీసుకోవడం ● ఫాస్ట్‌ఫుడ్స్, వేపుళ్లు ఎక్కువగా తినడం ● మాంసాహారం తరచుగా తినడం వల్ల ఫిషర్ సమస్య వస్తుంది.

లక్షణాలు : తీవ్రమైన నొప్పి, మంట ● చురుకుగా ఉండలేరు ● చిరాకు, కోపం ● విరేచనంలో రక్తం పడుతుంటుంది ● కొందరిలో మలవిసర్జన అనంతరం మరో రెండు గంటల పాటు నొప్పి, మంట.

వ్యాధి నిర్ధారణ: సీబీపీ, ఈఎస్‌ఆర్, ఎమ్మారై, సీటీస్కాన్

చికిత్స: ఫిషర్ సమస్యను నయం చేయడానికి హోమియోలో మంచి చికిత్స అందుబాటులో ఉంది. వాటితో ఆపరేషన్ అవసరం లేకుండానే చాలావరకు నయం చేయవచ్చు. ఏ సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా చికిత్స చేయడం హోమియో విధానం ప్రత్యేకత. రోగి మానసిక, శారీరక తత్వాన్ని, ఆరోగ్య చరిత్ర వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని హోమియో మందులను అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో వాడితే తప్పక మంచి ఫలితం ఉంటుంది.



డాక్టర్ టి.కిరణ్ కుమార్, డైరక్టర్,
పాజిటివ్ హోమియోపతి, విజయవాడ, వైజాగ్

ఆ గడ్డలు తగ్గుతాయి...

నా వయసు 36 ఏళ్లు. నా ఒంటిపై మాటిమాటికీ బొబ్బల్లా వస్తున్నాయి. ఒక వారం రోజుల పాటు జ్వరం వస్తోంది. ఆ బొబ్బలు నొప్పి కలిగిస్తూ, ఆ తర్వాత గట్టిగా మారి, పగులుతున్నాయి. నా సమస్యకు హోమియోలో పరిష్కారం ఉందా?

- రమ్య, హైదరాబాద్

చర్మం కింద ఇన్ఫెక్షన్ కారణంగా వచ్చే చీముతో నిండిన బొబ్బలను ఆబ్సెస్ / బాయిల్స్ (గడ్డలు / దిమ్మెలు) అంటారు. కురుపులు / గడ్డలు అని కూడా పిలిచే ఈ ఆబ్సెస్ సాధారణంగా బ్యాక్టీరియా / పరాన్నజీవులు లేదా ఇంజెక్షన్ ద్వారా కూడా వస్తుంటాయి. పొగతాగే అలవాటు లేదా ఊబకాయం ఉన్నవారిలో ఇవి సర్వసాధారణం. చర్మం కింద ఉండే సన్నటి పొరలో వ్యాపిస్తాయి. ఇవి ఎగుడుదిగుడుగా ఉండి చీముతో నిండి ఎరుపు / పసుపు / తెలుపు రంగులో చిన్న బంతి లేదా బఠాణీ ఆకృతితో ఉంటాయి. చాలా నొప్పి కలిగిస్తుంటాయి.

ఇవి రావడానికి కారణాలు: ● రోగ నిరోధక శక్తి లోపించడం ● అపరిశుభ్రమైన ఆహారం తినడం ● సూక్ష్మజీవులు లేదా పరాన్న జీవుల ఇన్ఫెక్షన్ వల్ల ● ఈ వ్యాధి సోకిన వారితో సన్నిహితంగా ఉండటం వల్ల

లక్షణాలు: ● చర్మంపై బొబ్బలు / గడ్డలు / గాయాలు ● వికారం ● చర్మం ఎరుపు రంగులోకి మారడం ● గడ్డను తాకితే తీవ్రమైన నొప్పి ● చీము స్రవించడం ● వాపు

చికిత్స: ఆబ్సెస్ / బాయిల్స్‌కి హోమియోలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి లక్షణాలను, శరీరతత్వాన్ని విశ్లేషించి వైద్యులు తగిన మందును సూచిస్తారు. ఈ సమస్యకు హోమియోలో కాల్కేరియా, హెపార్ సల్ఫ్, ఇక్తియోలమ్ వంటి మందులు అందుబాటులో ఉన్నాయి. వాటిని డాక్టర్ల పర్యవేక్షణలోనే వాడాలి.



డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి, ఎండీ (హోమియో)
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

వాస్క్యులార్ కౌన్సెలింగ్

బిగుసుకునే కండరాలు.. తీవ్రమైన నొప్పి

నా వయసు 39 ఏళ్లు. లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. రోజూ కాలేజీకి వెళ్లడం కోసం మూడు గంటల జర్నీ చేస్తుంటాను. గత నాలుగైదు వారాల నుంచి హఠాత్తుగా కాలి పిక్కల కండరాలు బిగుసుకుపోతున్నాయి. తీవ్రమైన నొప్పి వస్తోంది. ఒక్కోసారి క్లాస్‌లో ఇలా జరిగితే భరించలేని బాధతో కళ్లనుంచి నీళ్లు రాలుతుంటాయి. ఇది చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. ఇలా ఎందుకు జరుగుతోంది? పరిష్కారం చెప్పండి.

- సరళకుమారి, హైదరాబాద్

మీరు ఎదుర్కొంటున్న సమస్యను ఇంగ్లిష్‌లో 'మజిల్‌క్రాంప్స్'గా పేర్కొనవచ్చు. రోజూ గంటల తరబడి బస్సులో కూర్చోవడం, ఆపైన క్లాస్‌లో చాలా సేపు నిలబడటం వంటి అంశాలు మీ కండరాలపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తున్నాయి. నిద్ర పోయే సమయంలో విశ్రాంతి చేకూరడం వల్ల కండరాలు కోలుకొని సాధారణ స్థితికి చేరుకుంటాయి. అయితే మీకు అవసరమైనంత నిద్ర లేకపోవడం, ఆహారంలో పోషకాలు లోపించడం వంటి పరిస్థితుల్లో కండరం కోలుకోవడం జరగదు. అప్పుడు కండరాల తీవ్రంగా అలసిపోయి మీ అనుభవంలోకి వస్తున్నట్లుగా బిగుసుకుపోతాయి. ఇలా జరిగినప్పుడు తీవ్రమైన నొప్పి వస్తుంది. రోజులు గడుస్తున్న కొద్దీ అకస్మాత్తుగా జరిగే ఈ కండరసంకోచం నొప్పి విపరీతంగా ఉంటూ రోజువారీ కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం కలిగిస్తుంది. కండరాలు ఒక్కసారిగా గుంజుకుపోయినట్లుగా జరగడం ఎప్పుడైనా జరగవచ్చు గానీ చాలా సందర్భాల్లో నిద్రపోయినప్పుడు కండరాలు బిగుసుకుపోతే ఆ నొప్పితో వెంటనే మేల్కొంటారు. ఇలా కాలికండరాలు అకస్మాత్తుగా మన ప్రమేయం లేకుండా బిగుసుకుపోవడాన్ని 'మజిల్ క్రాంప్స్' / 'చెర్లీ హార్స్' అంటారు. మన వృత్తి, వయసుతో సంబంధం లేకుండా ఎవరికైనా ఈ విధంగా జరిగే అవకాశం ఉంటుంది. మెలకువగా ఉన్నప్పుడు, నిద్రలో, వ్యాయామం చేస్తున్నప్పుడు.. ఎప్పుడైనా ఇలా జరగవచ్చు. బిగుసుకుపోయిన కండరాలు మామూలుకంటే గట్టివిగా ఉండటమే కాకుండా కొన్నిసార్లు వడితిరిగి కనిపిస్తాయి. విపరీతమైన అలసట, డీహైడ్రేషన్, కొన్ని మందులు వాడకం వంటి కారణాలతో మజిల్ క్రాంప్స్ రావచ్చు. కండరాలు తీవ్రంగా అలసిపోవడం, వ్యాయామానికి ముందు తగినంతగా స్ట్రెచ్ చేయకపోవడం, రక్తంలో ఎలక్ట్రోలైట్స్ (సోడియం, పొటాషియం, ఫాస్ఫేట్) పరిమాణం తగ్గిపోవడం ఇందుకు దారితీస్తాయి. ఒక్కోసారి పైన పేర్కొన్న వాటిలో ఒకటి కంటే ఎక్కువ అంశాలు మజిల్‌క్రాంప్స్‌కు దారితీస్తాయి. మంచి పోషకాహారం, కంటి నిండా నిద్ర, వ్యాయామం ప్రారంభించడానికి ముందు స్ట్రెచింగ్ వంటి జాగ్రత్తలతో మజిల్ క్రాంప్స్‌ను నివారించవచ్చు. అయినప్పటికీ మజిల్ క్రాంప్స్ వస్తుంటే వెంటనే డాక్టర్‌కు చూపించుకోవాలి.



డాక్టర్ దేవేందర్ సింగ్, సీనియర్ వాస్క్యులార్ అండ్
ఎండోవాస్క్యులార్ సర్జన్, యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ, హైదరాబాద్

అమ్మడూ... లెట్స్ డూ కుమ్ముడు!



● హన్సిక



● సెట్స్‌లో పీటర్ హెయిన్, హన్సిక

'అమ్మడు' అంటే కాజల్ అగర్వాల్ కాదు. 'లెట్స్ డూ కుమ్ముడు' అంటే స్టెప్పులేయడం కాదు, ఈ మాట అంటున్నది చిరంజీవి అంతకన్నా కాదు. ఇక్కడ అమ్ముడు ఎవరంటే... హన్సిక. 'లెట్స్ డూ కుమ్ముడు' అంటోన్నది ఎవరంటే... యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్. ఈయన గురించి తెలుసుగా. మంచి స్టంట్ సీక్వెన్సులు కొరియోగ్రఫీ చేస్తారు. సో, కుమ్ముడు అంటే కన్ఫర్మ్‌గా కొట్టడమనే! రౌడీలను చితకొట్టేయమని హన్సికతో అంటున్నారు. ఇదంతా సినిమా కోసమే సుమా! 'గులేబకావలి' అనే తమిళ యాక్షన్ కామెడీ సిన్మాలో ప్రభుదేవాకు జోడీగా హన్సిక నటిస్తున్నారు. ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ పాటలకు, హీరోతో రెండు మూడు సన్నివేశాలకు పరిమితమయ్యేది కాదు. హీరోయిన్‌తో ఫైట్లు కూడా చేయిస్తున్నారు. ఏయే సందర్భాల్లో హీరోయిన్ ఫైట్ చేస్తుందనేది సస్పెన్స్. ప్రస్తుతం చెన్నైలో హన్సిక, ఇతర ముఖ్య తారలపై కన్‌స్ట్రక్షన్‌లో ఉన్న బిల్డింగులో ఫైట్ సీన్స్ తీస్తున్నారు. అదండీ సంగతి!!

అందుకు మంచి ఉదాహరణ జయ జానకి నాయక

- బోయపాటి శ్రీను

''తరాలు మారినా మానవ సంబంధాలు మారవు. ఆ పాయింట్‌తో ఎన్ని రకాల సినిమాలు తీసినా హిట్టవుతాయి. అందుకు మంచి ఉదాహరణ 'జయ జానకి నాయక. రెండో వారంలో కూడా అన్ని థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ కలక్షన్స్‌తో దూసుకెళుతున్నందుకు ఆనందంగా ఉంది. ఈ ఘనవిజయానికి కారణం కథే. మిర్యాల రవీందర్‌రెడ్డి రాజీపడకుండా నిర్మించారు. ఆయనతో మళ్లీ సినిమా చేయాలనుంది'' అన్నారు బోయపాటి శ్రీను. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్‌ప్రీత్ సింగ్ జంటగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన 'జయ జానకి నాయక' ఈ నెల 11న విడుదలైన విషయం తెలిసిందే. బుధవారం ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ప్రతి గుండెను తాకే సినిమా అవుతుందనే నమ్మకంతో తీశాం. ప్రేక్షకులు మా సినిమాను వారి గుండెల్లో పెట్టుకుని చూస్తున్నారు. మా నమ్మకం నిజమైంది. నా జీవితం మారిపోయే సినిమా ఇచ్చిన బోయపాటిగారికి థ్యాంక్స్. పోటీ ఉన్నా ఎక్కడా తగ్గకుండా అనుకున్న టైమ్‌కి సినిమాను రిలీజ్ చేసి, మాకు పెద్ద హిట్ ఇచ్చిన రవీందర్‌రెడ్డిగారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ సినిమాను ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు'' అన్నారు. ''నేను ఇన్ని సినిమాలు చేసినా, జానకి పాత్రకు వచ్చినంత రెస్పాన్స్ ఏ పాత్రకూ రాలేదు. బోయపాటిగారితో మరిన్ని చిత్రాలు చేయాలని ఉంది'' అన్నారు రకుల్. ''మా చిత్రం హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతోంది. ఇంత గొప్ప సినిమా నిర్మించినందుకు గర్వంగా ఉంది'' అన్నారు రవీందర్‌రెడ్డి. నటులు ప్రభు, శివన్నారాయణ, శ్రావణ్, నటి రూప, కళా దర్శకుడు సాహి సురేశ్, డిస్ట్రిబ్యూటర్ హరి తదితరులు పాల్గొన్నారు.



● నందు, మిర్యాల రవీందర్, బోయపాటి శ్రీను, రకుల్ ప్రీత్‌సింగ్, సాయి శ్రీనివాస్

నో రెస్ట్... ఓన్లీ వర్క్

- ధనుష్



● ధనుష్, సౌందర్యా రజనీకాంత్

''పిల్లలకు ఆడుకోవడం ఎంత ఇష్టమో.. నాకు పని చేయడమంటే అంత ఇష్టం. చేసే పనిని ఎంజాయ్ చేయాలనుకుంటా. నాకసలు రెస్ట్ అవసరం లేదు. పని చేయడమే రిలాక్సేషన్'' అని హీరో ధనుష్ అన్నారు. ధనుష్, అమలాపాల్ జంటగా సౌందర్యా రజనీకాంత్ దర్శకత్వంలో కలైపులి ఎస్. థాను నిర్మించిన 'వీఐపీ 2' ఈ శుక్రవారం తెలుగులో విడుదలవుతోంది. ధనుష్ మాట్లాడుతూ– ''రఘువరన్ బీటెక్' సినిమా తెలుగులో మంచి హిట్ అవడంతో సీక్వెల్‌ను రెండు భాషల్లోనూ తీశాం. 'వీఐపీ 2'లో వినోదం, భావోద్వేగాలు, మాస్ అంశాలన్నీ ఉంటాయి. తెలుగులో స్ట్రయిట్ ఫిల్మ్‌గా 'వీఐపీ 2' కరెక్ట్ అనిపించింది. తమిళ్‌లో మా సినిమాకి వసూళ్లు బాగున్నాయి. కానీ, క్రిటిక్స్ వేరేలా రాశారు. తమిళ, తెలుగు భాషల్లో ఒకేరోజు విడుదల చేయాలనుకున్నాం. కానీ, తెలుగులో ఒకేరోజు మూడు సినిమాలు రిలీజ్ అవుతుండటంతో చేయలేదు. తమిళంలో ఆ డేట్ దాటితే తర్వాత మంచి డేట్ లేదని అక్కడ రిలీజ్ చేశాం. ఈ సినిమాకు నేనే స్క్రిప్ట్ రాశా. కానీ, సినిమా ఎలా మొదలుపెట్టాలో క్లారిటీ లేదు. సౌందర్య ఆలోచనలు కూడా గ్రాండ్‌గా ఉంటాయి. అందుకే డైరెక్టర్‌గా సౌందర్య బెటర్ అనిపించింది. నేను డైరెక్ట్ చేసిన 'పవర్‌పాండి'ని తెలుగులో డబ్ చేస్తాం. 'మారి 2' తెలుగు, తమిళ భాషల్లో తీయనున్నాం'' అన్నారు. సౌందర్యా రజనీకాంత్ మాట్లాడుతూ– ''సూపర్‌స్టార్ రజనీకాంత్‌గారితో (నాన్న) పనిచేయాలని ఎవరికైనా ఉంటుంది. తొలి సినిమాకే నాకా అవకాశం రావడం అదృష్టం. ధనుష్‌సార్ కూడా మంచి యాక్టర్. వారిని డైరెక్ట్ చేయడం నేను ఎంజాయ్ చేశా. డైరెక్టర్ అంటే డైరెక్టరే. అందులో ఆడ, మగ అనే తేడా ఉండదు. బంధుప్రీతి అన్నది ఒక్క సినిమా రంగంలోనే కాదు అన్ని రంగాల్లోనూ ఉంటుంది. కానీ, ఏ రంగంలో అయినా ప్రతిభ ఉంటేనే మనం నిలబడగలం'' అన్నారు.

ఆ ఆలోచన నుంచి వచ్చిందే అర్జున్‌రెడ్డి



● సందీప్‌రెడ్డి

''చాలా మందికి నిజ జీవితంలో బ్రేకప్ లవ్ స్టోరీ ఉంటుంది. ఆ లవ్ స్టోరీలో ఉండే డార్క్ మూడ్ మీద సినిమా తీయాలనుకున్నాను. ఆ ఆలోచన నుంచి వచ్చిందే 'అర్జున్‌రెడ్డి' సినిమా'' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. విజయ్ దేవరకొండ, షాలిని జంటగా ఆయన దర్శకత్వంలో ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మించిన 'అర్జున్‌రెడ్డి' ఈ శుక్రవారం విడుదలవుతోంది. సందీప్‌రెడ్డి వంగా మాట్లాడుతూ– ''నాది వరంగల్. ఫిజియోథెరపీ చేశాక, ఆస్ట్రేలియాలో ఫిల్మ్ మేకింగ్‌లో పీజీ చేశా. నాగార్జునగారి 'కేడి' సినిమాకు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేశా. 'మళ్ళీ మళ్ళీ ఇది రానిరోజు'కు స్క్రిప్ట్‌వర్క్ చేశా. నా జీవితంలో నా చుట్టూ జరిగిన సంఘటనలు, వ్యక్తుల ఆధారంగా స్ఫూర్తి పొంది 'అర్జున్‌రెడ్డి' కథ రాసుకున్నా. నాది కూడా లవ్ ఫెయిల్యూరే. ఇందులో నా అనుభవాలు కూడా కొన్ని ఉన్నాయి. వారం రోజులు వర్క్ షాప్ చేసిన తర్వాత విజయ్‌ని ఎంచుకున్నా. లిప్‌లాక్ పోస్టర్‌లో హీరో హీరోయిన్ కళ్లు మూసుకునే ఉంటారు. ఆ ఫీలింగ్‌ను క్యాచ్ చేస్తారనుకున్నా, కానీ కొందరు అందులో అశ్లీలతను వెతికారు. సెన్సార్ బోర్డు సూచనతో కొన్ని పదాల్ని మ్యూట్ చేశాం. రెండు కథలు రెడీగా ఉన్నాయి. ఒక పెద్ద హీరో నుంచి కాల్స్ వస్తున్నాయి.'అర్జున్‌రెడ్డి' సక్సెస్ అయితే నెక్ట్స్ స్క్రిప్ట్ మీద వర్క్ చేస్తా'' అన్నారు.



న్యూయార్క్‌లోని లింకన్ సెంటర్‌లో 'డిన్నర్ ఇన్ వైట్' కార్యక్రమంలో పాల్గొన్న వందలాది మంది ఔత్సాహికులు. డిన్నర్‌కు వచ్చేవారు కచ్చితంగా తెలుపురంగు డ్రెస్‌లోనే రావాలి. భోజన ఏర్పాట్లు తామే చూసుకోవాలి. ఈ సంస్కృతి 30ఏళ్ల క్రితం ఫ్రాన్స్‌లో మొదలైంది.

రాష్ట్రాలు కాదు.. ఇక జోనల్ కేడర్!

సివిల్స్ అధికారుల కేడర్ కేటాయింపునకు నూతన విధానం ఖరారు ● జోన్–5లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

న్యూఢిల్లీ: సివిల్ సర్వీస్ అధికారులకు కేడర్ల కేటాయింపులో నూతన విధానాన్ని కేంద్రం ఖరారు చేసింది. ఇందులో భాగంగా ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఓఎస్) అధికారులు ఇకపై రాష్ట్రాలకు బదులుగా జోన్ల కేడర్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సివిల్ సర్వీస్ అధికారుల్లో జాతీయ సమగ్రత భావనను పెంపొందించేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నూతన విధానం ప్రకారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 26 కేడర్లను 5 జోన్లుగా విభజించినట్లు వెల్లడించారు. అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మిజోరాం, కేంద్రపాలిత ప్రాంతాలు, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, రాజస్తాన్, హరియాణా రాష్ట్రాలను జోన్–1లో చేర్చినట్లు తెలిపారు. జోన్–2లో ఉత్తరప్రదేశ్, బిహార్,



జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలు; జోన్–3లో గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఉన్నట్లు తెలిపారు. జోన్–4లో పశ్చిమబెంగాల్, సిక్కిం, అస్సాం, మేఘాలయ, మణిపూర్, త్రిపుర, నాగాలాండ్ ఉండగా, జోన్–5లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ఉన్నట్లు తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విధానం ప్రకారం అభ్యర్థి ప్రతి జోన్‌లోనూ ఒక రాష్ట్రాన్ని మాత్రమే ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు తమ రెండో, మూడో ఆప్షన్ల కింద ఇతర జోన్లను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల ఇకపై ఒకే జోన్‌లో రెండు రాష్ట్రాలకు ఆప్షన్లు ఇవ్వడం కుదరదని చెప్పారు. నూతన విధానాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేసే అవకాశం ఉందన్నారు. తాజా నిర్ణయం వల్ల తమకు సంబంధంలేని ప్రాంతాల్లో సైతం సివిల్ సర్వీస్ అధికారులు విధులు నిర్వహించడం వీలవుతుందన్నారు. సివిల్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మొదట అవరోహణా క్రమంలో తమ ప్రాధాన్యతా జోన్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని, తర్వాత వాటిలో ఎలాంటి మార్పులకు అంగీకరించబోమని స్పష్టంచేశారు. ఒకవేళ అభ్యర్థులు ఎలాంటి ఆప్షన్లు ఇవ్వకుంటే ఆంగ్ల అక్షరమాల క్రమంలో ఖాళీలను బట్టి భర్తీ చేస్తామని తెలిపారు. అభ్యర్థులు సాధించిన మార్కులు, ప్రాధాన్యత, ఖాళీలను బట్టి సొంత రాష్ట్రాల కేడర్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.

గోప్యత ప్రాథమిక హక్కేనా?

నేడు తీర్పు వెలువరించనున్న సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: వ్యక్తిగత గోప్యత అసలు ప్రాథమిక హక్కేనా.. కాదా అనే విషయంపై సుప్రీం కోర్టు గురువారం తీర్పు వెలువరించే అవకాశం ఉంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని 9 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించనుంది. మూడు వారాల్లో 6 రోజుల పాటు వాదనలు విన్న ధర్మాసనం ఆగస్టు 2న తీర్పును రిజర్వు చేసింది. సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారుల ఎంపికలో ఆధార్ కార్డును తప్పనిసరి చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. ప్రజా బాహుళ్యంలో గోప్యత వివరాలు దుర్వినియోగమయ్యే అవకాశాలూ ఉన్నాయని ఆగస్టు 2న ధర్మాసనం పేర్కొంది.

ఉమ్మడి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు బ్రేక్

న్యూఢిల్లీ: 2018 నుంచి దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి ఉమ్మడి పరీక్షను నిర్వహించాలన్న నిర్ణయంపై కేంద్రం వెనక్కి తగ్గింది. ఇటీవల ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్ష విధానాన్ని సమీక్షించిన తర్వాతే ఉమ్మడి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షపై ముందుకు వెళ్లాలని కేంద్ర మానవవనరుల శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై ఓ ఉన్నతాధికారి మీడియాతో మాట్లాడుతూ.. 'వచ్చే ఏడాది జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహించకూడదని నిర్ణయం తీసుకున్నాం. పరీక్ష నిర్వహణ సాధ్యాసాధ్యాలపై ఏఐసీటీఈ నివేదిక సమర్పించిన అనంతరమే తుది నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు.

తొమ్మిదేళ్లకు బయటికొచ్చిన పురోహిత్



న్యూఢిల్లీ: 2008లో మాలేగావ్ పేలుడు కేసులో అరెస్టయి తొమ్మిది ఏళ్లు జైలుజీవితం గడిపిన లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ శ్రీకాంత్ పురోహిత్ బుధవారం బెయిలుపై విడుదలయ్యారు. సుప్రీంకోర్టు బెయిలు మంజూరుచేయడంతో నవీముంబై తలోజా జైలు నుంచి విడుదలైన పురోహిత్ బుధవారం ముంబైలో ఆర్మీ యూనిట్‌కు చేరుకున్నారు. జైలు నుంచి విడుదలైన ఆయనను సైన్యం పటిష్టభద్రత నడుమ దక్షిణముంబైలోని కొలాబాకు తరలించింది. ప్రాణహాని ఉందన్న సమాచారంతో ఆయనకు రక్షణగా పోలీసులను నియమించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

కర్ణాటకలో 'మినీ గోరఖ్‌పూర్'

కోలారు: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో శిశు మరణాల కలకలం సద్దుమణగకముందే కర్ణాటకలో అలాంటి ఘటనే ఆలస్యంగా వెలుగుచూసింది. కోలారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో గత 3 నెలల్లో దాదాపు 35 మంది చిన్నారులు మృతిచెందినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. బాలింతలకు పోషకాహార లోపంతోపాటు చిన్నారులు తక్కువ బరువుతో జన్మించడమే ఈ మరణాలకు కారణమని వెల్లడించాయి. చిన్నారుల మృతిపై కలకలం రేగడంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి రమేశ్ కుమార్, జిల్లా కలెక్టర్ త్రిలోక్ చంద్ర ఆస్పత్రిని సందర్శించారు.

లాలు ర్యాలీకి రాహుల్, సోనియా దూరం

పట్నా/సాక్షి, న్యూఢిల్లీ: ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్ ఆదివారం బిహార్ రాజధాని పట్నాలో నిర్వహిస్తున్న విపక్షాల ర్యాలీకి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ దూరంగా ఉండనున్నారు. అవినీతి కేసులున్న లాలు చేపడుతున్న ఈ ర్యాలీకి సోనియా, రాహుల్ హాజరైతే తమ పార్టీకి లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని బిహార్ కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ తరఫున సీనియర్ నేత ఆజాద్ ర్యాలీలో పాల్గొననున్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, జేడీయూ తిరుగుబాటు నేత శరద్ యాదవ్ హాజరవనున్నారు.

'లింక్‌డ్ ఇన్ ప్రొఫైల్స్'లో మోదీ, ప్రియాంక





ముంబై: ప్రముఖ సామాజిక మాధ్యమం లింక్‌డ్ ఇన్ అత్యంత శక్తిమంతమైన ప్రొఫైల్స్ జాబితాలో ప్రధాని నరేంద్రమోదీ, నటి ప్రియాంక చోప్రాలు చోటు సంపాదించారు. 2017 సంవత్సరానికిగాను భారత్‌కు సంబంధించి అత్యంత శక్తిమంతమైన ప్రొఫైల్స్, ఎక్కువమంది చూసిన ప్రొఫైల్స్ జాబితాను లింక్‌డ్ ఇన్ సంస్థ బుధవారం విడుదల చేసింది. ఈ జాబితాలో మోదీ వరుసగా మూడో సారి చోటు సంపాదించారు. లింక్‌డ్ ఇన్‌లో ఆయనను 22లక్షలు మంది అనుసరిస్తున్నారు. జాబితాలో మొత్తం 50మంది చోటు సంపాదించగా, వారిలో నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి , కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, సిప్లా సీపీఓ ప్రబీర్ ఝా, షయోమీ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్, ఎండీ మను కుమార్ జైన్ తదితరులు ఉన్నారు.

పక్కా ప్రణాళికతోనే దభోల్కర్, పన్సారే హత్య

ముంబై: ప్రముఖ హేతువాదులు దభోల్కర్, పన్సారేలను పక్కా ప్రణాళికతోనే హత మార్చారని బాంబే హైకోర్టు అభిప్రాయపడింది. ఈ రెండు హత్యల మధ్య సంబంధం స్పష్టంగా కనిపిస్తోందని జస్టిస్ ఎస్సీ ధర్మాధికారి, జస్టిస్ విభా కన్కన్‌వాడీల ధర్మాసనం పేర్కొంది. 'ఈ ఘటనల్లో నిందితులకు కొన్ని సంస్థలు వెన్నుదన్నుగా నిలవడంతో పాటు వారు చేసే హత్యలు, దాడులకు కచ్చితంగా ఆర్థికంగా చేయూత అందిస్తున్నాయి. ఈ కేసులో సీబీఐ, సీఐడీలు మరింత లోతుగా, విస్తృతంగా విచారించాల్సి ఉంటుంది' అని బాంబే హైకోర్టు పేర్కొంది. దభోల్కర్‌ను పుణేలో 2013 ఆగస్టు 20న, పన్సారేను కొల్హాపూర్‌లో 2015 ఫిబ్రవరి 16న దుండగులు కాల్చి చంపారు.

ఓబీసీ క్రీమీలేయర్ రూ.8 లక్షలు

ఓబీసీ వర్గీకరణకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- కేంద్ర కేబినెట్ నిర్ణయం
- ప్రస్తుత రిజర్వేషన్ వ్యవస్థను ముట్టుకోం
- ఎస్సీ వర్గీకరణ ప్రతిపాదనల్లేవని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఓబీసీల వార్షిక ఆదాయ పరిమితి (క్రీమీలేయర్)ని రూ. 8 లక్షలకు పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో సమావేశమైన కేబినెట్ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దీంతోపాటుగా.. రిజర్వేషన్ లాభాలను అందరికీ సమానంగా అందజేయాలన్న లక్ష్యంతో కేంద్ర జాబితాలోని ఓబీసీ కులాల వర్గీకరణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఓబీసీల క్రీమీలేయర్‌ను ఏడాదికి రూ. 6లక్షల నుంచి 8 లక్షలకు పెంచాలని ప్రతిపాదించింది. దీనికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ వివరాలను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మీడియాకు వెల్లడించారు. ఎస్సీల వర్గీకరణ విషయంలో ప్రభుత్వం ముందు ఎలాంటి ప్రతిపాదనలూ లేవని స్పష్టం చేశారు.

క్రీమీలేయర్‌పై..

ఇటీవల అస్సాం పర్యటనలో ప్రధాని మోదీ ఓబీసీల క్రీమీలేయర్ పెంపుపై సంకేతాలిచ్చారు. ఓబీసీల వర్గీకరణ జరగాల్సిన అవసరాన్నీ పునరుద్ఘాటించారు. 1993లో ఓబీసీల క్రీమిలేయర్ రూ.లక్షగా నిర్ణయించగా.. 2004లో దీన్ని రూ.2.5 లక్షలకు పెంచారు. అనంతరం 2008లో రూ.4.5 లక్షలకు పెంచగా.. 2014లో రూ.6 లక్షల పరిధిని నిర్ణయించారు. ప్రస్తుతం దీన్ని మరో రెండు లక్షలు పెంచి 8లక్షలకు తెచ్చినట్లు జైట్లీ తెలిపారు.

రిజర్వేషన్ ఫలాలందించేందుకే..

రిజర్వేషన్ ఫలాలను ఓబీసీలకు మరింత సమర్థవంతంగా అందజేసేందుకు ఓబీసీ వర్గీకరణ చేపట్టేందుకు ఓ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని కేబినెట్ నిర్ణయించిందని జైట్లీ వెల్లడించారు. కమిషన్‌కు చైర్మన్ నియామకం జరిగిన తర్వాత 12 వారాల్లో నివేదిక అందుతుందన్నారు. 'ఈ కమిషన్ ఓబీసీ కేటగిరీల్లో (కేంద్ర జాబితాలోని)ని కులాలు, వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు సమానంగా అందుతున్నాయో లేదో పరిశీలిస్తుంది. ఓబీసీల్లో వర్గీకరణకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలు, నిబంధనలను ఈ కమిషన్ ఖరారు చేస్తుంది' అని జైట్లీ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, హరియాణా, జార్ఖండ్, జమ్మూకశ్మీర్, పశ్చిమబెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో ఓబీసీల వర్గీకరణ చేపట్టారన్నారు. కాగా, ప్రస్తుత రిజర్వేషన్ వ్యవస్థపై ప్రభుత్వం పునరాలోచనలో ఉందంటూ వస్తున్న వార్తలను జైట్లీ ఖండించారు. 2015లో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్ విధానాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని చేసిన వ్యాఖ్యలపై జైట్లీ పైవిధంగా స్పందించారు. అయితే రిజర్వేషన్‌పై సమీక్షించాలనే ప్రతిపాదనేదీ లేదని.. భవిష్యత్తులో ఉండదని కూడా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను పెంచాలనే ప్రతిపాదనకూ కేబినెట్ మౌఖికంగా ఆమోదించినట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల విస్తరణ ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.



మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, థావర్‌చంద్ గెహ్లాట్ తదితరులు

బీజేపీ నేతల హర్షం

ఓబీసీల క్రీమీలేయర్ పెంపు, వర్గీకరణ అంశాలపై నిర్ణయం తీసుకోవటం పార్టీకి అనుకూలంగా మారుతుందని బీజేపీ బీసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అద్వితీయం, చారిత్రకమని ప్రశంసించారు. కొన్నేళ్లుగా ఓబీసీలు చేస్తున్న రెండు కీలకమైన డిమాండ్లను కేంద్రం అంగీకరించినట్లయిందన్నారు. 'వెనుకబడిన తరగతుల సాధికారత కోసం ఇదో అద్వితీయమైన నిర్ణయం. దీంతో చాలామందికి రిజర్వేషన్ ఫలాలు అందుతాయి' అని బీజేపీ ప్రధాన కార్యదర్శి భూపీందర్ యాదవ్, కేంద్ర మంత్రి సంతోష్ గంగ్వార్ పేర్కొన్నారు.

మరిన్ని కేబినెట్ నిర్ణయాలు

- కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పథకానికి 'ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన'గా పేరు మార్చేందుకు అంగీకారం. రూ.6వేల కోట్లు కేటాయించిన ఈ పథకం ద్వారా 2020 నాటికి 20 లక్షల మంది రైతులకు మేలు కలగటం, 5.30 లక్షల కొత్త ఉద్యోగాల కల్పన లక్ష్యం.
- నేపాల్ సరిహద్దులో మేచీ నదిపై రూ. 159కోట్లతో వంతెన నిర్మాణానికి ఆమోదం.

పంజాబ్, హరియాణాల్లో హై అలర్ట్

'రాక్‌స్టార్ బాబా' లైంగిక వేధింపుల కేసులో రేపే తీర్పు
- వేల సంఖ్యలో పంచకులకు చేరుకుంటున్న మద్దతుదారులు



చండీగఢ్: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు, డేరా సచ్చా సౌదా చీఫ్, రాక్‌స్టార్‌గా పేరొందిన గుర్మీత్ రామ్ రహీం సింగ్‌పై నమోదైన లైంగిక వేధింపుల కేసులో సీబీఐ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. దీంతో ఆయన మద్దతుదారులు వేల సంఖ్యలో పంచకులకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో హై అలర్ట్ ప్రకటించారు. ఇరు రాష్ట్రాల్లో 144 సెక్షన్ విధించారు. ఇప్పటికే 35 వేల మంది వరకు గుర్మీత్ మద్దతుదారులు పంచకుల బాబా ప్రార్థనా స్థలం నామ్ చర్చా ఘర్‌కు చేరుకున్నారు. రానున్న రెండు రోజుల్లో లక్ష మంది వరకు మద్దతుదారులు చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పంజాబ్, హరియాణాల్లో భారీగా భద్రతా చర్యలు చేపట్టారు. వేల సంఖ్యలో పోలీసులు, భద్రతా దళాలను మోహరించారు. ముందుజాగ్రత్తగా గురు, శుక్రవారాల్లో పంచకులలోని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. పంచకులలోని జిల్లా కోర్టుకు వెళ్లే అన్ని మార్గాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. శుక్రవారం కోర్టు ముందుకు గుర్మీత్ బాబా కూడా హాజరవనున్నారు. తీర్పు నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశముందని నిఘావర్గాలు సైతం హెచ్చరించాయి. పంజాబ్‌కి ఇప్పటికే 75 కంపెనీల కేంద్ర బలగాలు చేరుకున్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ల సహాయంతో నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

తాత్కాలిక జైలుగా క్రికెట్ స్టేడియం

చండీగఢ్‌లోని క్రికెట్ స్టేడియాన్ని తాత్కాలిక జైలుగా మార్చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే అనుమానం వచ్చిన ప్రతిఒక్కరిని శుక్రవారం ఆ క్రికెట్ స్టేడియంలో ఉంచాలని చండీగఢ్ పరిపాలన విభాగం నిర్ణయించింది. 2002లో ఇద్దరు శిష్యురాళ్లను లైంగికంగా వేధించినట్లు గుర్మీత్ రామ్ రహీం సింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.



మెగా టీంకు డీఎంకే కసరత్తు

తమిళనాడులో బీజేపీని అడ్డుకోవడమే లక్ష్యం

సాక్షి, చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో బీజేపీ పాదం మోపకుండా అడ్డుకునేందుకు డీఎంకే నేతృత్వంలో మెగా కూటమి ఏర్పాటుకాబోతోంది. ఇందుకు తగ్గట్టుగా డీఎంకేతో దోస్తీకి ఎండీఎంకే, వీసీకే, వామపక్షాలు కసరత్తు మొదలుపెట్టాయి. గత కొన్నేళ్లుగా డీఎంకేకి వామపక్షాలు దూరంగా ఉంటూ వస్తున్నాయి. డీఎంకే చీఫ్ కరుణానిధికి నమ్మిన బంటుగా ఉన్న వీసీకే నేత తిరుమావళవన్ సైతం 2014 లోక్‌సభ ఎన్నికల అనంతరం హ్యాండిచ్చారు. మరోవైపు 2016 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే, డీఎండికేలు కూటమిగా ఏర్పడి డీఎంకే ఓటమిలో కీలకపాత్ర పోషించాయి. అయితే ప్రస్తుతం తమిళనాడులో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వంపై బీజేపీ పెత్తనం రోజురోజుకూ పెరుగుతోందనే అభిప్రాయం ఉంది. రాష్ట్రంలో క్రియాశీలపాత్ర పోషించేందుకు బీజేపీ ఎత్తుగడలు వేస్తుండటంతో ఆ పార్టీని అడ్డుకునేందుకు డీఎంకే సిద్ధం అవుతోంది. డీఎంకే నిర్వహించే ఆందోళనల్లో సీపీఎం, సీపీఐ, వీసీకేలు పాల్గొనేందుకు సిద్ధమవుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

పళనిపై అవిశ్వాసం పెట్టండి

గవర్నర్‌కు కాంగ్రెస్ లేఖ ● రాజ్‌నాథ్‌తో నేడు గవర్నర్ భేటీ



పుదుచ్చేరి/సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడు ఇన్‌చార్జ్ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు గురువారం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ కానున్నారు. అన్నాడీఎంకేలోని దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు తమిళనాడు సీఎం ఎడపాడి పళనిస్వామికి మద్దతు ఉపసంహరించగా ప్రభుత్వం మైనార్టీలోకి పడిపోయిన విషయంపై వీరివురూ చర్చించనున్నారు. ప్రభుత్వం నిలబడాలంటే పళనిస్వామికి 117 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా ప్రస్తుతం ఆయనవైపు 112 మంది మాత్రమే ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోవాల్సిందిగా పళనిస్వామిని ఆదేశించాలని గవర్నర్‌ను డీఎంకే ఇప్పటికే కోరడం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ కూడా పళనిస్వామిపై విశ్వాసపరీక్షకు డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ నేతలు విద్యాసాగర్‌కు బుధవారం ఓ లేఖ రాశారు. పళనిస్వామి మాత్రం విశ్వాస పరీక్ష పెట్టినా తమ ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదని ధీమాతో ఉన్నారు. ఈ దశలో గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని ఉత్కంఠ నెలకొంది.

అన్నాడీఎంకేలోని రెండు వర్గాల విలీనం తర్వాత తొలిసారిగా ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం కలిసి అన్నాడీఎంకే పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అరియలూరులో జరిగిన ఈ సభలో పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ పార్టీని ఎవ్వరూ ధ్వంసం చేయలేని ఓ కోటగా జయలలిత మలిచారని అన్నారు.

యూపీలో మరో రైలు ప్రమాదం

పట్టాలపై బోల్తాపడ్డ ట్రక్కును ఢీకొన్న కైఫియత్ ఎక్స్‌ప్రెస్
- 100 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం
- రైల్వే బోర్డు చైర్మన్ రాజీనామా.. కొత్త చైర్మన్‌గా అశ్వని లోహియా

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఐదురోజుల్లో మరో రైలు ప్రమాదం జరిగింది. ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ఘటనను మరవకముందే.. ఔరైయా జిల్లాలో బుధవారం తెల్లవారుజామున కైఫియత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. రైల్వేశాఖ నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఈ ఘటనలో 100 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. బుధవారం తెల్లవారుజామున 2.50 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రైలు నిర్మాణ పనులకోసం ఇసుకలోడుతో ఉన్న ట్రక్కును ఢీకొనటంతో కైఫియత్ ఎక్స్‌ప్రెస్ (ఆజాగఢ్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న రైలు)లోని 10 బోగీలు పట్టాలు తప్పాయి. ఇందులో ఒక బోగీ బోల్తా పడటం వల్ల క్షతగాత్రుల సంఖ్య ఎక్కువగా ఉందని ఔరైయా ఎస్పీ సంజయ్ త్యాగి వెల్లడించారు. ఎన్డీఆర్ఎఫ్ రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు ప్రారంభించింది. గాయపడిన వారిని సైఫై, ఎటావా ఆసుపత్రులకు తరలించామని.. ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని త్యాగి తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం కొందరిని డిశ్చార్జ్ చేశారు. ఈ ఘటనతో ఈ మార్గంలో వెళ్లాల్సిన 40 రైళ్లను దారిమళ్లించారు. కాన్పూర్–ఢిల్లీ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ సహా పలు రైళ్లను రద్దుచేశారు. గురువారం నుంచి యథావిధిగా రైళ్లు నడుస్తాయని అధికారులు ప్రకటించారు.



బుధవారం కైఫియత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో పూర్తిగా ధ్వంసమైన ట్రక్కు

ఎలా జరిగింది?: ప్రమాదం జరిగిన మార్గం చాలా ముఖ్యమైనది. ఇటీవల రైళ్ల ట్రాఫిక్ పెరగటంతోపాటుగా ట్రాక్ విస్తరణ చేపట్టారు ఇందుకోసం పాటా, అచ్చాల్దా స్టేషన్ల మధ్య పట్టాలకు ఆనుకునే పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మంగళవారం రాత్రి ఇసుక లోడ్‌తో వచ్చిన ఓ ట్రక్కు ట్రాక్ వద్దకు రాగానే ఓ పక్కకు ఒరిగింది. బరువు ఎక్కువగా ఉండటంతో ట్రక్కు పట్టాలపై పడిపోయింది. ఈ విషయంపై సమాచారం లేకపోవటంతో కైఫియత్ ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చింది. ప్రమాదాన్ని ముందే ఊహించిన డ్రైవర్ ఎస్‌కే చౌహాన్ ఎమర్జెన్సీ బ్రేకుతో రైలు ఆపేందుకు ప్రయత్నించారు. రైలు వేగం కొంత మేర తగ్గినా.. అప్పటికే ట్రక్కు సమీపంలోకి వచ్చేయటంతో ప్రమాదం జరిగింది. రైలు వేగంగా ట్రక్కును ఢీకొట్టడంతో ఇంజన్ సహా బీ2, హెచ్1, ఏ1, ఏ2, ఎస్ 10 బోగీలు పట్టాలు తప్పాయి. ఇందులో ఒక బోగీ బోల్తాపడింది. ట్రాక్‌పై ట్రక్కు పడిన విషయం తనకు ముందే తెలిసుంటే.. ఈ ప్రమాదం జరిగేది కాదని గాయాలతో బయటపడ్డ డ్రైవర్ చౌహాన్ తెలిపారు.

రైల్వే బోర్డు చైర్మన్ ఏకే మిట్టల్ రాజీనామా

ఐదురోజుల్లోనే రెండు రైలు ప్రమాద ఘటనల నేపథ్యంలో రైల్వే బోర్డు చైర్మన్ ఏకే మిట్టల్ రాజీనామా చేశారు. దీనిపై తీవ్ర తర్జనభర్జనల అనంతరం ఈ రాజీనామాను రైల్వే మంత్రి ఆమోదించారు. 2016 జూలైలోనే మిట్టల్ పదవీ కాలం ముగిసింది. అయితే రైల్వే శాఖ వ్యవహారాల్లో అత్యంత సమర్థుడిగా పేరున్న మిట్టల్ పదవీకాలాన్ని మోదీ ప్రభుత్వం జూలై 2018 వరకు పొడిగించింది. కాగా, మిట్టల్ స్థానంలో ఎయిర్ ఇండియా సీఎండీ అశ్వని లోహానీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైల్వే మెకానికల్ సర్వీసెస్‌లో కొంతకాలం పనిచేసిన లోహానీ.. ఢిల్లీ డివిజనల్ రీజనల్ మేనేజర్‌గా, ఐటీడీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

రాజీనామా చేస్తా..

వరుస రైలు ప్రమాదాలతో సురేశ్‌ప్రభు కలత
- రాజీనామాపై తొందరపడవద్దని వారించిన ప్రధాని

న్యూఢిల్లీ: ఐదు రోజుల వ్యవధిలో రెండు భారీ రైలు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో దీనికి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు రైల్వే మంత్రి సురేశ్‌ప్రభు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో జరిగిన సమావేశంలో రైలు ప్రమాదాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తానని చెప్పారు. అయితే రాజీనామాపై తొందరపడవద్దని ప్రధాని సురేశ్‌ప్రభును వారించారు. బుధవారం కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం సురేశ్‌ప్రభు ప్రధానితో సమావేశమయ్యారు. ''నేను ప్రధాని మోదీతో సమావేశమయ్యాను. ప్రమాదాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తానని చెప్పాను. అయితే ఆయన నన్ను వేచి ఉండాలని చెప్పారు'' అని ప్రభు ట్వీటర్‌లో వెల్లడించారు. ఈనెల 19న ఉత్తరప్రదేశ్‌లో కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 23 మంది ప్రయాణికులు మరణించగా.. మరో 150 మంది తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. బుధవారం అదే రాష్ట్రంలో కైఫియత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 70 మంది గాయపడ్డారు. వరుస రైలు ప్రమాదాల నేపథ్యంలో సురేశ్‌ప్రభు తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో ట్వీటర్‌లో ఆయన ఉద్వేగంగా స్పందించారు. యూపీలో జరిగిన రెండు ప్రమాదాలు తనను తీవ్రంగా కలచివేశాయని చెప్పారు. జవాబుదారీతనం అనేది ప్రభుత్వంలో మంచి విధానమని, రైల్వే మంత్రి ప్రతిపాదనపై తుది నిర్ణయం ప్రధాని మోదీదే అని కేబినెట్ సమావేశం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు.




సురేశ్‌ప్రభుని తొలగించాలి: కాంగ్రెస్

రైల్వే మంత్రిగా సురేశ్‌ప్రభు విఫలమయ్యారని, ఆయనను పదవి నుంచి తొలగించాలని, బాధ్యతాయుతమైన వ్యక్తికి ఆ బాధ్యతలను అప్పగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మోదీ ప్రభుత్వం వచ్చాక 28 భారీ రైలు ప్రమాదాలు జరిగాయని, 259 మంది ప్రాణాలు కోల్పోగా.. 973 మంది గాయపడ్డారని పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా చెప్పారు.

✦ సచివాలయానికి కార్పొరేట్ లుక్

- వినోద, క్రీడా సదుపాయాలతో కొత్త భవంతులు
- సీఆర్‌డీఏకు సూచించిన సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: గూగుల్, ఇన్ఫోసిస్ వంటి కార్పొరేట్ కార్యాలయాలకు దీటుగా ఏపీ సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలను నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఆర్‌డీఏకు సూచించారు. కొత్తగా నిర్మించబోయే కార్యాలయాలు ఇప్పుడున్న ప్రభుత్వ కార్యాలయాలకంటే భిన్నంగా ఉండాలన్నారు. ఈ కార్యాలయాల్లో వినోద, క్రీడా సదుపాయాలతో భవంతులు నిర్మించాలన్నారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాజధాని వ్యవహారాలపై సీఆర్‌డీఏతో సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతుల కార్యాలయాలు ఒకేచోట ఉండేలా రూపొందించిన డిజైన్లను నార్మన్ ఫోస్టర్ అండ్ పార్టనర్స్ ప్రతినిధులు సమర్పించారు. వీటిపై కార్యదర్శులు, మంత్రుల అభిప్రాయాలు సేకరించాలని సీఆర్‌డీఏ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చిన సూచనలకు అనుగుణంగా తుది డిజైన్లు సిద్ధం చేయాలని సూచించారు. సెప్టెంబర్ 13వ తేదీ నాటికి తుది డిజైన్లు ఇస్తామని ఫోస్టర్ బృందం ఈసందర్భంగా తెలిపింది.

✦ మంత్రి గంటాకు నాన్‌బెయిలబుల్ వారెంట్

ఆదేశాలు జారీచేసిన అనకాపల్లి కోర్టు



అనకాపల్లి: రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుకు అనకాపల్లి రెండో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జి.వి.వి.సత్యనారాయణమూర్తి నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ చేశారు. 2009 ఎన్నికల్లో గంటా అనకాపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కేసు నమోదైంది. ఈ కేసు విచారణ కోసం మంత్రి గంటా బుధవారం కోర్టుకు హాజరు కావాల్సి ఉంది. అయితే ఆయన విచారణకు రాకపోవడంతో మేజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేశారు.

✦ మీకు జ్ఞానముందా..?

ఏబీఎన్ చానల్‌పై కర్నూలు జిల్లా కలెక్టర్ ఆగ్రహం

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా అత్యుత్సాహం ప్రదర్శించిన ఏబీఎన్ చానల్‌పై కర్నూలు జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిసైడింగ్ అధికారి(పీవో) అస్వస్థతకు గురైతే.. ఏకంగా మరణించారంటూ ఏబీఎన్ చానల్‌లో బ్రేకింగ్ న్యూస్ రావడంపై ఆయన మండిపడ్డారు. 'అసలు మీకు జ్ఞానముందా? వాస్తవం తెలుసుకోకుండా బ్రేకింగ్ న్యూస్ ఎలా ఇస్తారంటూ..' ఏబీఎన్‌ను నిలదీశారు. బుధవారం నంద్యాల మండలం పోలూరులోని పోలింగ్ కేంద్రం– 2లో పీవోగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరెడ్డికి గుండె పోటు వచ్చింది. దీంతో సిబ్బంది ఆయన్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో కొద్దిసేపటికి ఆయన కోలుకున్నారు. అయితే ఏబీఎన్ చానల్‌లో మాత్రం గుండెపోటుతో ప్రిసైడింగ్ అధికారి మృతి అంటూ బ్రేకింగ్ న్యూస్ రావడంతో కలకలం రేగింది. కాన్ఫరెన్స్ హాల్ నుంచి పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యనారాయణ.. ఈ వార్తతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే వివరాలు ఆరా తీశారు.శ్రీనివాసరెడ్డి కోలుకున్నారన్న సమాచారం రావడంతో కలెక్టర్ వెంటనే ఏబీఎన్ చానల్ కార్యాలయానికి ఫోన్ చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీవో కోలుకున్నట్లు వెంటనే బ్రేకింగ్ న్యూస్ ఇవ్వాలని చానల్‌ను ఆయన ఆదేశించారు. లేకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కలెక్టర్ ఆగ్రహంతో ఖంగుతిన్న ఏబీఎన్ చానల్.. పీవో కోలుకున్నారంటూ ఆ తర్వాత స్క్రోలింగ్ ఇచ్చింది.

✦ వీధి రౌడీలా చంద్రబాబు విమర్శలు

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ఓటర్లను ప్రభావితం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీధి రౌడీలా వ్యవహరించారని, తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అవాకులు చవాకులు పేలారని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాలలో ఉప ఎన్నికలో అధికార పార్టీ ఎన్నికల కోడ్‌ను పూర్తిగా ఉల్లంఘించిందని, స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తమ ఎమ్మెల్యేలను నంద్యాలకు పంపించి 'ఏం చేయగలుగుతారో.. చేయండి' అంటూ ఆదేశాలు ఇచ్చారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో వాసిరెడ్డి పద్మ బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన వ్యక్తి ఎన్నికల కోడ్ ఉల్లంఘించడం దారుణమన్నారు. పది మంది టీడీపీ ఎమ్మెల్యేలు నంద్యాలలో బాహటంగా తిరిగినా పట్టించుకోని పోలీసులు, నంద్యాల నివాసి శిల్పా చక్రపాణిరెడ్డిని ఓటర్ కాదంటూ పంపించివేశారని ఆమె ధ్వజమెత్తారు.

✦ రాక్షస పాలన: ముద్రగడ ధ్వజం



జగ్గంపేట: కాపు జాతిపై కక్ష కట్టి రాక్షస పాలన సాగిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుపై కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ధ్వజమెత్తారు. 'మీరు, మీ యువరాజా మాత్రం 2050 వరకు ముఖ్యమంత్రిగా ఉండాలా?' అని ప్రశ్నించారు. కాపు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసంలో బుధవారం నిరసన అనంతరం సాయంత్రం మద్దతు తెలిపేందుకు వచ్చిన వారిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. హక్కుల కోసం పోరాటం చేస్తుంటే అణగదొక్కేందుకు చూస్తున్నారని, అయితే కాపుల సత్తా ఏమిటో త్వరలోనే చూపిస్తామని హెచ్చరించారు. ఓపిక కాదు ఊపిరి ఉన్నంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు.

✦ చంద్రబాబుపై పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు, ఇతర శాసనసభ్యులు ఏపీ పునర్విభజన చట్టనిబంధనల ప్రకారం ప్రమాణం చేయలేదని, అందువల్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబు కొనసాగడానికి వీల్లేదంటూ దాఖలైన వ్యాజ్యాన్ని ఉమ్మడి హైకోర్టు కొట్టేసింది. పునర్విభజన చట్టనిబంధనల ప్రకారం ఇరురాష్ట్రాల శాసనసభ్యులు అపాయింటెడ్ డే నుంచి ఎన్నికైనట్లు పరిగణించాల్సి ఉందని గుర్తు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ తెలప్రోలు రజనీలతో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పునిచ్చింది.

✦ త్వరలో టీడీపీకి గుడ్‌బై చెబుతా

అవమానాలు దిగమింగుకుంటూ కొనసాగలేను: సినీ నటి కవిత



నెల్లూరు(బృందావనం): తెలుగుదేశం పార్టీని వీడటం ఖాయమని, త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తానని టీడీపీ నాయకురాలు, సినీ నటి కవిత స్పష్టం చేశారు. బుధవారం నెల్లూరులో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 1983 నుంచి టీడీపీకి సేవలందించానని చెప్పారు. కానీ టీడీపీ అధినాయకులు తన కష్టాన్ని గుర్తించకపోగా.. ఎన్నో అవమానాలకు గురి చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఏ రోజూ కూడా మీడియా ముందుకు రాలేదని చెప్పారు. 'విశాఖలో నిర్వహించిన మహానాడులో నేను కంటతడి పెట్టడం చూసిన మీడియా పదేపదే ప్రశ్నించడంతో.. నా బాధను వారికి చెప్పాల్సి వచ్చింది. సొంతిల్లు లాంటి టీడీపీని వదిలి రావాలంటే బాధగా ఉంది. కానీ తప్పదు. అవమానాలు దిగమింగుకుంటూ కొనసాగలేను..' అని కవిత చెప్పారు.

✦ 'సదావర్తి' భూములు మళ్లీ వేలం

- సెప్టెంబర్ 14న నిర్వహణ • రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

సాక్షి, అమరావతి: సదావర్తి సత్రం భూముల అమ్మకానికి సెప్టెంబర్ 14న మళ్లీ వేలం నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు జిల్లా అమరావతిలోని సదావర్తి సత్రానికి చెన్నై నగర సమీపంలో ఉన్న 82.11 ఎకరాల భూమి అమ్మకానికి గతేడాది మార్చి 28న అధికారులు నిబంధన లకు విరుద్ధంగా వేలం నిర్వహించడం.. తెలుగుదేశం పార్టీ నేతలు కారుచౌకగా ఆ భూముల్ని దక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాలను 'సాక్షి' బట్టబయలు చేయడం తెలిసిందే. సత్రం భూముల్ని అధికారపార్టీ నేతలు తక్కువ ధరకే కొట్టేసే ప్రయత్నాల్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. భూములకు తిరిగి వేలం నిర్వహించాలని న్యాయస్థానం రాష్ట్రప్రభు త్వాన్ని ఆదేశించడం కూడా విదితమే. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో.. సత్రం భూముల అమ్మకానికి తిరిగి వేలం నిర్వహించడంపై కసరత్తు చేసిన దేవాదాయశాఖ ఉన్నతాధికారులు బుధవారం రాష్ట్రప్రభుత్వా నికి నివేదిక అందజేశారు. సెప్టెంబర్ 14, 15వ తేదీల్లో ఏదో ఒకరోజు వేలం నిర్వహణకు తాము సిద్ధమని నివేదించగా.. 14న వేలం నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం అనుమతి తెలిపింది. కాగా వేలం నిర్వహణకు తొమ్మిదిమంది దేవాదాయశాఖ అధికారుల తో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయిం చారు.

ఓటెత్తిన నంద్యాల

ఉప ఎన్నికలో 79.20 శాతం పోలింగ్

- గోస్పాడు మండలంలో అత్యధికంగా 90.81 శాతం నమోదు
- దశాబ్దాల తర్వాత అత్యధిక పోలింగ్‌గా రికార్డు
- ఉదయం నుంచే బారులుతీరిన ప్రజానీకం
- ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో మహిళలే అధికం
- అధికార పార్టీ ఎమ్మెల్యేల హల్‌చల్.. చివరి 3 గంటలూ దౌర్జన్యం
- రిలీవర్ ఏజెంట్లను లోపలికి అనుమతించని వైనం
- ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులు



బుధవారం నంద్యాలలోని లీడర్ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రజలు

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి రేపిన కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక పోలింగ్ బుధవారం స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఉదయం నుంచే బారులు తీరారు. ప్రధానంగా మహిళలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటల సమయానికి నంద్యాల చరిత్రలో లేని విధంగా 79.20 శాతం ఓటింగ్ నమోదైంది. వైఎస్ఆర్ సీపీ తరపున నంద్యాల ఎమ్మెల్యేగా గెలిచిన భూమా నాగిరెడ్డి పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరాక గుండె పోటుతో మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇందులో భాగంగా బుధవారం పోలింగ్ ప్రారంభం కాగానే ఓటింగ్ శాతం భారీగా పెరుగుతుండటంతో బెంబేలెత్తిన అధికార పార్టీ నేతలు రంగంలోకి దిగి ఓటర్లను ప్రలోభపెట్టడంతో పాటు భయోత్పాతం సృష్టించేందుకు తీవ్రంగా యత్నించారు. ఉదయం నుంచి అత్యంత ప్రశాంతంగా కొనసాగిన పోలింగ్.. చివరి మూడు గంటల్లో రౌడీ రాజ్యాన్ని తలపించింది. 7వ వార్డులో కౌన్సిలర్ కలాంపై టీడీపీ నేత ఏవి సుబ్బారెడ్డి దాడి చేశారు. భూమా మౌనిక, జగత్‌విఖ్యాత్‌రెడ్డిలు భారీగా అనుచరులను వెంటేసుకుని పట్టణంలో హల్‌చల్ చేయడం సామాన్యులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. గాంధీనగర్ పోలింగ్ బూత్ వద్ద వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ రాజగోపాల్‌రెడ్డిపై ఒంగోలు మాజీ ఎమ్మెల్యే రాంబాబు అనుచరులు దాడికి విఫలయత్నం చేశారు. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి కాన్వాయ్‌తో పట్టణంలో కలియ తిరుగుతూ ఇబ్బంది కలిగిస్తున్నా పోలీసులు అభ్యంతరం చెప్పలేకపోయారు. మంత్రి అఖిలప్రియ ఆళ్లగడ్డకు చెందిన వ్యక్తులను వెంటబెట్టు కొని పలు పోలింగ్ బూత్‌లలో కలియతి రిగారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులపై దూషణలకు దిగారు. అయినా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎక్కడికక్కడ సంయమనం పాటించి, పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాయి. కాగా, గెలుపు తమదేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

బారులు తీరిన మహిళలు

ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. పోలింగ్ ప్రారంభమైన రెండు గంటలకు 17 శాతం పోలింగ్ నమోదైంది. ఓటింగ్‌లో అదే పరంపర కొనసాగుతూ వచ్చింది. మధ్యాహ్నం 1 గంట సమయానికి 53 శాతం, సాయంత్రం 5 గంటలకు 77.6 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 79.20 శాతం నమోదైంది. గోస్పాడు మండలంలో అత్యధికంగా 90.81 శాతం, నంద్యాల రూరల్‌లో 87.61 శాతం ఓటింగ్ నమోదు కావడం విశేషం. ముస్లిం మైనార్టీ మహిళలు ఉదయం నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలివచ్చారు. పరిశీలకుల అంచనాలను తలకిందులు చేస్తూ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. ఎవరికి ఓటు వేశారంటూ వివిధ న్యూస్ చానళ్లు, పత్రికలు (సాక్షి కాదు) పలు విధాలా ప్రయత్నించినా ఓటు సీక్రెట్ అంటూ బహిర్గత పరచక పోవడం విశేషం. అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదు కావడంతో ఇది ప్రభుత్వ వ్యతిరేకతను సూచిస్తోందని అధికార పార్టీ నేతలు నిరాశలో ఉండిపోయారు.

టీడీపీ ఎమ్మెల్యేల హల్‌చల్

నియోజకవర్గానికి చెందిన ప్రజలు తప్ప ఇతరులెవరూ నంద్యాల నియోజవర్గ పరిధిలో ఉండకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు లెక్క చేయలేదు. పోలింగ్ మొదలైనప్పటి నుంచి ఇష్టమొచ్చినట్లు తిరుగుతూ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి హల్‌చల్ చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నికల పాస్ లేకుండా కేంద్రాల్లోకి వెళ్లి ఓటర్లు, ఏజెంట్లను ప్రభావితం చేస్తున్నా అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు. పోలింగ్ ప్రశాంతంగా సాగుతోందని అందరూ చర్చించుకుంటున్న సమయంలో తమకు ఓట్లు పడటం లేదని అధికార పార్టీ నాయకులు అనుమానించారు. మరో మూడు గంటల్లో పోలింగ్ గడువు ముగుస్తుందనగా టీడీపీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు బూత్‌లలోకి వెళ్లి ఓటర్లను ప్రలోభపెట్టారు. ఏజెంట్లను లొంగదీసుకునేందుకు బెదిరింపులకు దిగారు. వైఎస్సార్ నగర్‌లో కౌన్సిలర్ శివశంకర్ ఓటర్లకు మరోమారు యథేచ్ఛగా డబ్బులు పంపిణీ చేశారు. పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌ల సమీపంలో టీడీపీకి ఓటు వేస్తామంటే రూ.2 వేలు ఇస్తానంటూ కౌన్సిలర్ జేసీసీ హారిక బహిరంగంగా ప్రలోభాలకు గురిచేస్తూ హల్‌చల్ చేశారు. టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి 7వ వార్డు కౌన్సిలర్ కలాంపై దాడి చేయడం, ఎన్జీవో కాలనీలో మంత్రి అఖిలప్రియ సోదరి మౌనికారెడ్డి, తమ్ముడు జగత్‌విఖ్యాత్‌రెడ్డిలు ఏజెంట్లు, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. ఎన్టీఆర్ షాదీఖాన సమీపంలో దొంగ ఓట్లు వేస్తున్న టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్సీపీ కార్యకర్తలు అడ్డుకోగా.. వారిని ఎమ్మెల్సీ ఫరూక్ తన వాహనంలో ఎక్కించుకుని వెళ్లారు.

యథేచ్ఛగా దొంగ ఓట్లకు తెగించిన టీడీపీ

నందమూరినగర్‌లోని పోలింగ్ బూత్‌లలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారు. అధికార టీడీపీకి అనుకూలంగా ఉంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై వివక్ష చూపారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయాందోళన నెలకొంది. వైఎస్సార్‌సీపీకి చెందిన రిలీవర్ ఏజెంట్లను బయటకు గెంటివేసిన పోలీసులు... తిరిగి వారిని లోపలికి అనుమతించలేదు. నంద్యాల్లోని 18, 18ఏ, 19, 19ఏ, 20, 20ఏ బూత్‌లలో ఉన్న ఏజెంట్లు మధ్యాహ్నం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్తామంటే వారి స్థానంలో రిలీవర్ ఏజెంట్లు మంజుల, రమాదేవిని అనుమతించలేదు. మహిళలు అని కూడా చూడకుండా పోలీసులు వారిని తీవ్ర పదజాలంతో దూషించారు. పూర్తిగా తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వ్యవహరించారు. నందమూరి నగర్‌లోని నాలుగు బూత్‌లలో బనగానపల్లె, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు దొంగ ఓట్లు వేశారు. ఇక్కడికి మొత్తం 60 మందికి పైగా దొంగ ఓటర్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు తెలిపినా పట్టించుకోలేదు. చివరి క్షణంలో స్పందించిన పోలీసులు.. కేవలం ఆరుగురు దొంగ ఓటర్లను మాత్రమే అరెస్టు చేశారు. నందమూరి నగర్ పోలింగ్ బూత్‌లో మూడున్నర గంటలపాటు ఈవీఎం మిషన్‌కు అనుబంధంగా ఉండే వీవీ ప్యాట్ యంత్రం మొరాయించింది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.40 గంటల వరకు మరమ్మతుకు నోచుకోలేదు. క్యూలో 70 మందికిపైగా ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు అదనపు వీవీ ప్యాట్ యంత్రాన్ని అమర్చడంతో దాదాపు 7 గంటలకు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైఎస్ఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ఎదుట ఓటర్లకు టీడీపీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, టీడీపీ నాయకుడు ప్రసాదరెడ్డి డబ్బులు పంచుతుండడంతో స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఆయన ఇటుక పెళ్లతో దాడికి యత్నించారు. కొందరిపై చేయి చేసుకున్నాడు. పోలీసులు కలుగజేసుకొని అక్కడి నుంచి ఇరు పార్టీల నేతలను చెదరగొట్టారు.

రెండు దశాబ్దాల్లో ఇదే అత్యధిక పోలింగ్

- నంద్యాల ఉప ఎన్నికపై సీఈవో భన్వర్‌లాల్
- స్వల్ప సంఘటనలు మినహా అంతా ప్రశాంతం
- దాదాపు 80 శాతం పోలింగ్ నమోదు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సంఘం తీసుకున్న పకడ్బందీ చర్యల వల్ల నంద్యాల ఉప ఎన్నిక ఒకటి రెండు స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి(సీఈవో) భన్వర్‌లాల్ చెప్పారు. ఈ ఉప ఎన్నికలో పోలింగ్ రికార్డు స్థాయిలో దాదాపు 80 శాతానికి చేరిందని, గత రెండు దశాబ్దాల్లో ఇదే గరిష్టమని తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన వివరాలను ఆయన బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాకు వివరించారు. ఆయన ఏం చెప్పారంటే...''నంద్యాల నియోజకవర్గంలో 2009లో 76 శాతం, 2014 సాధారణ ఎన్నికల్లో 71 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుత ఉప ఎన్నికలో సాయంత్రం 5 గంటల వరకు 76 శాతం మందిపైగా ఓట్లు వేశారు. పోలింగ్ ముగిసేటప్పటికి ఇది దాదాపు 80 శాతానికి చేరింది. ఒకటి రెండు స్వల్ప సంఘటనలు మినహా అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనావళిని పాటించాయి. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పోలింగ్ రోజు వరకూ దాదాపు రూ.1.2 కోట్ల నగదు జప్తు చేశాం. 72 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 62 చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం వల్ల అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలింగ్ ముగిసింది. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి రాజకీయ పార్టీలు, మీడియా సహకరించాయి. అందరికీ ధన్యవాదాలు'' అని భన్వర్‌లాల్ పేర్కొన్నారు.

నియమావళి ఉల్లంఘనలపై విచారణ

ఉప ఎన్నిక ప్రచారంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం పట్ల కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాల విషయంలో మేము ఏ అంశాన్నీ తొక్కి పెట్టలేదు. 21వ తేదీ సాయంత్రం 8 గంటలకు మాకు ఎన్నికల సంఘం నుంచి లేఖ అందింది. దీనిపై వెంటనే రిటర్నింగ్ అధికారికి డైరెక్షన్ (సూచన) ఇచ్చాం. 22వ తేదీన రిటర్నింగ్ అధికారి పోలింగ్ ఏర్పాట్లలో బిజీగా ఉన్నందున 23వ తేదీన చర్యలు తీసుకున్నారు. అంతా ప్రొసీజర్ (పద్ధతి) ప్రకారమే జరిగింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై అన్ని పార్టీల నేతలూ ఫిర్యాదులు చేశారు. వాటిపై విచారణ జరిపించి నిర్ణయం తీసుకుంటాం'' అని భన్వర్‌లాల్ చెప్పారు.

28న ఓట్ల లెక్కింపు

''నంద్యాలలో ఈ నెల 28వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తాం. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నానికల్లా తుది ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది'' అని భన్వర్‌లాల్ వెల్లడించారు.

టీడీపీ ఎమ్మెల్యేల హంగామా

సాక్షి ప్రతినిధి, కర్నూలు: నంద్యాల ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు హంగామా సృష్టించారు. బుధవారం ఉదయం పోలింగ్ ప్రశాంతంగానే మొదలైనప్పటికీ.. పోలింగ్ శాతం పెరిగేకొద్దీ అధికారపార్టీలో అసహనం ఎక్కువైంది. దీంతో ఎక్కడికక్కడ టీడీపీ ఎమ్మెల్యేలు పర్యటిస్తూ తమ పార్టీకి ఓటేయాలంటూ బాహాటంగానే ప్రజల్ని హెచ్చరించే ప్రయత్నం చేశారు. ఎన్నికల నిబంధనలను తోసిరాజని కర్నూలు, శ్రీశైలం, కోడుమూరు, బనగానపల్లె, అనపర్తి ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. మంత్రి అఖిలప్రియ సైతం రంగంలోకి దిగి నంద్యాల పట్టణంలో పలువార్డుల్లో పర్యటించారు. ఇంత చేస్తున్నా వారిని నిలువరించేందుకు పోలీసులు ప్రయత్నించలేదు. భూమా నాగిరెడ్డి చిన్న కుమార్తె నాగమౌనిక అయితే పోలింగ్ కేంద్రాల్లో దుర్భాషలాడుతూ హంగామా సృష్టించడం గమనార్హం.

ఎక్కడ చూసినా ఎమ్మెల్యేలు: అధికారపార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఎన్నికల నిబంధనలను సైతం పట్టించుకోకుండా నంద్యాల నియోజకవర్గంలో ఇష్టానుసారంగా తిరిగారు. అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చాపిరేవులలో పర్యటించి పార్టీ నేతలతో మాట్లాడి ఓట్లేయించే ప్రయత్నం చేశారు. ఇక బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి గోస్పాడు మండలంలోని యాళ్లూరులో ఏకంగా డీఎస్పీతోనే మాటామంతీ నిర్వహించారు. అదేరీతిలో కర్నూలు, కోడుమూరు, శ్రీశైలం ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, మణిగాంధీ, బుడ్డా రాజశేఖరరెడ్డిలు పట్టణంలోని నడిగడ్డ, ఎన్‌జీవో కాలనీలలో ప్రధానంగా పర్యటిస్తూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. చివరకు పదేపదే మీడియాలో రావడంతో కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.



బుధవారం నంద్యాల పాత టౌన్ నడిగడ్డలో నిబంధనలకు విరుద్ధంగా వాహనంలో పర్యటిస్తున్న మంత్రి అఖిలప్రియ

అదేబాటలో మంత్రి..: మంత్రి అఖిలప్రియ కూడా ఆళ్లగడ్డ నుంచి నంద్యాలలోకి అడుగుపెట్టారు. బుధవారం ఉదయం ఆళ్లగడ్డ నుంచి బయల్దేరి నంద్యాలకు చేరుకున్న ఆమె అనంతరం టీవీలకు అక్కడి అద్దెభవనం నుంచి ఇంటర్వ్యూలిచ్చారు. అంతేకాక దర్జాగా నంద్యాల నడివీధుల్లో తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారు.

పోలింగ్ బూత్‌లో భూమా నాగ మౌనిక దౌర్జన్యం

వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌ను భయపెట్టేందుకు విఫలయత్నం



ఓ పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి బెదిరింపులకు పాల్పడుతున్న మౌనిక

నంద్యాల అర్బన్ : నంద్యాల అసెంబ్లీ స్థానం ఉప ఎన్నిక సందర్భంగా బుధవారం దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి కుమార్తె భూమా నాగ మౌనిక పోలింగ్ బూత్‌లలో దౌర్జన్యం చేశారు. భారీగా అను చరు లను వెంటే సుకుని వచ్చి ఎన్‌జీఓ కాలనీ పోలింగ్ బూత్‌లో దౌర్జన్యానికి దిగారు. వైఎస్సార్‌సీపీ రిలీవింగ్ ఏజెంట్‌ను బెదిరించడానికి విఫల యత్నం చేశారు. 'అతన్ని అరెస్ట్ చేయండి. మీకు చేతకాకపోతే మా వాళ్లను పంపి సెటిల్ చేస్తా' అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.టీడీపీ కార్యకర్తలు.. వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై చేయి చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అతను వారి దాడి నుంచి తప్పించుకుని పక్కకు వెళ్లగా 'వాన్ని పట్టుకోండి రా..' అని వేలు చూపిస్తూ తన వెంట ఉన్న అనుచరులను ఆదేశించారు. పోలీసులు ఆపేందుకు నానా కష్టాలు పడాల్సి వచ్చింది. 'వాన్ని అరెస్ట్ చేయకపోతే నా మనుషులకు నేను సమాధానం చెప్పలేను.. తక్షణమే అరెస్ట్ చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయి' అంటూ పోలీసులను హెచ్చరించారు.

నంద్యాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం

పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి స్పష్టీకరణ

సాక్షి బృందం, నంద్యాల: నంద్యాల ఉప ఎన్నికలో విజయం సాధించి, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం రాత్రి నంద్యాలలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఉప ఎన్నికలో గెలుపొందడానికి అధికార తెలుగుదేశం పార్టీ చేయని కుట్రలు లేవన్నారు. ఓటింగ్ సరళిని బట్టి చూస్తే ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో తెలుస్తోందన్నారు. తన సోదరుడు శిల్పా చక్రపాణిరెడ్డిని అరెస్టు చేసేందుకు ఎన్నో ఎత్తగడలు వేశారని, మంగళవారం రాత్రి నుంచి పోలీసులు తమ ఇంటిని చుట్టుముట్టి ఇబ్బందులకు గురి చేశారని శిల్పా మోహన్‌రెడ్డి వెల్లడించారు. పార్టీ ఫిరాయించిన 21 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఎన్నికలకు సిద్ధం కావాలని శిల్పా సవాల్ విసిరారు.



తన ఓటు హక్కును వినియోగించుకున్న శిల్పా మోహన్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీకి 30 వేల మెజార్టీ

నంద్యాలలో జరిగిన కురుక్షేత్ర సంగ్రామంలో వైఎస్సార్‌సీపీ బ్రహ్మాండమైన విజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి తేల్చిచెప్పారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ ఉప ఎన్నికలో 30 వేల మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను నిలిపేయలేం..

మాజీ మంత్రి 'శత్రుచర్ల' కేసులో హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఎస్టీ కాదని న్యాయస్థానాలు తీర్పునిచ్చిన నేపథ్యంలో 1999 నుంచి 2004 వరకు శాసనసభ్యునిగా పనిచేసిన కాలానికి జరిమానా చెల్లించాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజును ఆదేశిస్తూ సింగిల్ జడ్జి గతేడాది ఇచ్చిన తీర్పు అమలును నిలిపేసేందుకు హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. ఎమ్మెల్యేగా పనిచేసిన కాలానికి రూ.2.25 లక్షల జరిమానా చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పింది. నాలుగు వారాల్లో ఈ మొత్తాన్ని హైకోర్టు రిజిస్ట్రార్(జ్యుడీషియల్) వద్ద డిపాజిట్ చేయాలని విజయరామరాజును ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నంద్యాలలో ప్రజాస్వామ్యం ఖూనీ

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: నంద్యాల నడి వీధుల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన సీఎం చంద్రబాబు వైఖరిని ప్రజాస్వామ్య వాదులంతా వ్యతిరేకించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.వందల కోట్లు వెదజల్లిన చంద్రబాబు దిగజారుడుతనాన్ని రాష్ట్ర ప్రజలంతా గమనించాలని కోరారు. డబ్బులుంటే చాలు ఎన్నికల్లో నెగ్గొచ్చని భావిస్తున్న చంద్రబాబు ఆలోచనలకు భిన్నంగా నంద్యాల ఓటర్లు తీర్పునిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అంబటి బుధవారం హైదరాబాద్‌లో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

గెలుపు కోసం ఇంతలా బరితెగించాలా?

''నంద్యాల ఎన్నికల సందర్భంగా చంద్రబాబు చేతుల్లో ప్రజాస్వామ్యం మరోసారి అపహాస్యానికి గురైంది. పోలీసు యంత్రాంగం చంద్రబాబు చెప్పుచేతుల్లో నడిచింది. దొంగ ఓట్లు వేయించే దుస్థితికి టీడీపీ దిగజారింది. ఇదేమిటని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. పార్టీ సీఈసీ సభ్యుడు రాజగోపాల్‌రెడ్డిపై దౌర్జన్యం చేసి, గాయపరిచారు. గెలుపు కోసం ఇంతగా బరితెగించాలా?'' అని ప్రశ్నించారు.

జగన్ వస్తే టీడీపీకి భయం

మా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల నుంచి బహిష్కరించాలని, కాకినాడకు వెళ్లకుండా ఉత్తర్వులు ఇవ్వాలని చెప్పే అధికారం మంత్రి యనమల రామకృష్ణుడికి ఎక్కడిది? ప్రతి ఫిర్యాదుపైనా ఎన్నికల సంఘం అన్ని కోణాల్లో విచారిస్తుంది. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. జగన్ కాకినాడకు వెళ్లకుండా అడ్డుకునేందుకు టీడీపీ కుట్ర పన్నుతోంది. జగన్ వస్తే కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలవలేమని భయపడుతోంది'' అని అంబటి అన్నారు.

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: ఫిజిక్స్
- ఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ : రీజనింగ్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?
- యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ(యుఐఐసీ) లిమిటెడ్‌లో 696 అసిస్టెంట్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 28
- ఇస్రోలో 128 డ్రైవర్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 28
- పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్)లో 17 డిప్యూటీ మేనేజర్, సీనియర్ ఇంజనీర్, 'ఆఫీసర్' పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 28



అత్యంత నివాసయోగ్య నగరం?

జాతీయం

'చాంపియన్స్ ఆఫ్ ఛేంజ్'లో ప్రధాని ప్రసంగం



నీతి ఆయోగ్ నేతృత్వంలో ఆగస్టు 17న 'చాంపియన్స్ ఆఫ్ ఛేంజ్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రభుత్వ చర్యలు, కార్యక్రమాలతోనే నవ భారత నిర్మాణం జరగదని, ప్రతి భారతీయుడూ మార్పు కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో 200 మంది యువ స్టార్టప్ వాణిజ్యవేత్తలు పాల్గొన్నారు. సాఫ్ట్ పవర్, ఇంక్రెడిబుల్ ఇండియా 2.0, విద్య- నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం-పౌష్టికాహారం, డిజిటల్ ఇండియా, 2022 నాటికి నవ భారత నిర్మాణం తదితర ఇతివృత్తాలతో ప్రజెంటేషన్ ఇచ్చారు.

డిజిటల్ పోలీస్ పోర్టల్ సేవలు ప్రారంభం

డిజిటల్ పోలీస్ పోర్టల్(డీపీపీ)ని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆగస్టు 21న ప్రారంభించారు. నేరాలు, నేరస్థులపై నిఘా నెట్‌వర్క్ వ్యవస్థలు (సీసీటీఎన్ఎస్) అనే ప్రాజెక్టులో భాగంగా దీన్ని రూపొందించారు. నేరాలు, నేరస్థుల వివరాలతో జాతీయ సమాచార నిధి ఏర్పాటే సీసీటీఎన్ఎస్ లక్ష్యం. ఈ పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల నమోదు, వివరాల ధ్రువీకరణ, అభ్యర్థనలు తదితర సేవలు అందుబాటులో ఉంటాయి. వీటితోపాటు 11 శోధన సదుపాయాలను, 46 నివేదికలను రాష్ట్ర పోలీస్ విభాగాలు, కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు, పరిశోధన సంస్థలు పొందొచ్చు. సీసీటీఎన్ఎస్ సమాచార నిధిలో ఇప్పటివరకు ఏడు కోట్ల నేరాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచారు.

బిహార్ వరదల్లో 98 మంది మృతి

బిహార్‌లో వరదల వల్ల ఆగస్టు 18 నాటికి 98 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 జిల్లాలకు చెందిన 93 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. 2.13 లక్షల మంది 504 సహాయక శిబిరాల్లో తలదాచుకున్నారు. జాతీయ రహదారులతోపాటు 124 రోడ్లు ధ్వంసమయ్యాయి. 70 మంది ఆర్మీ సిబ్బంది, 114 ఎన్‌డీఆర్ఎఫ్, 92 ఎస్‌డీఆర్ఎఫ్ బోట్ల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు.

ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో 22 మంది మృతి

ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా ఖతౌలి వద్ద ఆగస్టు 19న పట్టాలు తప్పడంతో 22 మంది మరణించారు. 156 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదానికి మానవ తప్పిదమే కారణమని ఆ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

అంతర్జాతీయం

అత్యంత నివాసయోగ్య నగరంగా మెల్‌బోర్న్

ప్రపంచంలో అత్యంత నివాసయోగ్య నగరంగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఎంపికైంది. ఆస్ట్రియా రాజధాని వియన్నా, కెనడాలోని వాంకోవర్, టొరంటో, కల్గరీ.. వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. మొత్తం 140 నగరాల్లో స్థిరత్వం, ఆరోగ్య సేవలు, సంస్కృతి, పర్యావరణం, విద్య, మౌలిక వసతులు తదితర 30 అంశాల ఆధారంగా సర్వే చేశారు. ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) నిర్వహించిన ఈ అధ్యయన ఫలితాలను ఆగస్టు 17న న్యూయార్క్‌లో విడుదల చేశారు.

'బాల మేధావి' రాహుల్ దోశి




బ్రిటన్‌లోని టీవీ చానల్ 4 నిర్వహించిన చైల్డ్ జీనియస్ క్విజ్ పోటీల్లో భారత సంతతికి చెందిన రాహుల్ దోశి విజేతగా నిలిచాడు. ఆగస్టు 19న నిర్వహించిన ఈ పోటీలో రాహుల్ 162 ఐక్యూ (ఇంటలిజెంట్ కోయిషెంట్) స్కోర్ సాధించాడు. ఇది అల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ ఐక్యూల కన్నా ఎక్కువ.

కరెంట్ అఫైర్స్

అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలు

అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త వార్షిక సైనిక విన్యాసాలు ఆగస్టు 21న ప్రారంభమయ్యాయి. తమ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతాయన్న ఉత్తర కొరియా అభ్యంతరాల మధ్యే ఈ విన్యాసాలు జరగడం గమనార్హం. వేలాది మంది సైనికులు ఈ ఉల్చి-ఫ్రీడం గార్డియన్ సంయుక్త సైనిక కసరత్తు నిర్వహించారు. దక్షిణ కొరియాలో రెండు వారాల పాటు సాగే ఈ విన్యాసాల్లో క్షేత్ర స్థాయిలో కాల్పులు, యుద్ధ ట్యాంకుల విన్యాసాలు వంటివేవీ లేకుండా కంప్యూటర్ల ఆధారంగా సాధన జరుగుతుంది. వీటిలో సుమారు 17,500 మంది అమెరికా సైనికులు, 50 వేల మంది దక్షిణ కొరియా సైనికులు పాల్గొంటారు. కాగా ఇవి రక్షణాత్మక విన్యాసాలేనని, ద్వీపకల్పంలో ఉద్రిక్తతల్ని రెచ్చగొట్టేవి కాదని దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జేఇన్ పేర్కొన్నారు.

అమెరికాలో 99 ఏళ్ల తర్వాత సంపూర్ణ సూర్యగ్రహణం



అమెరికాలో ఆగస్టు 21న సంపూర్ణ సూర్య గ్రహణం ఏర్పడింది. ఒరెగాన్(పశ్చిమ తీరం)లోని లింకన్ బీచ్‌లో మొదలైన ఈ గ్రహణం 14 రాష్ట్రాల ద్వారా సాగింది. దీని వల్ల 70 కిలోమీటర్ల వెడల్పు ప్రాంతం చీకటిమయమైంది. అగ్రరాజ్యంలో దాదాపు 99 ఏళ్ల తర్వాత సంభవించిన ఈ సంపూర్ణ సూర్యగ్రహణం సుమారు 90 నిమిషాల పాటు కొనసాగింది.

స్పెయిన్ ఉగ్రదాడిలో 13 మంది మృతి

స్పెయిన్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం బార్సిలోనాలోని లాస్ రాంబ్లాస్‌లో ఆగస్టు 17న ఓ వ్యాను పర్యాటకులపైకి దూసుకుపోవడంతో 13 మంది మరణించారు. 50 మందికిపైగా గాయపడ్డారు. ఇది ఉగ్రవాదుల దాడి అని పోలీసులు ధ్రువీకరించారు.

రాష్ట్రీయం


ఉమెన్ హెల్ప్ లైన్ 181 ప్రారంభం

తెలంగాణలో మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 24 గంటల హెల్ప్ లైన్ నంబర్ 181ను ఆగస్టు 19న ప్రారంభించారు. వేధింపులు, దాడులకు గురైన మహిళలు హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సాయం కోరవచ్చు. ఫోన్ చేసిన మహిళలకు సఖీ కేంద్రాలు, అంబులెన్స్, ఆసుపత్రులు, పోలీస్ స్టేషన్ల ద్వారా సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆపదలో ఉన్నవారికి తాత్కాలిక వసతి కూడా కల్పిస్తారు.



వాణిజ్యం

అమెరికా నుంచి భారత్‌కు తొలిసారిగా ముడి చమురు దిగుమతి



ప్రపంచంలో మూడో అతి పెద్ద ముడి చమురు దిగుమతిదారు అయిన భారత్ తొలిసారిగా అమెరికా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. మొదటి దఫా రవాణా ఆగస్టు 8-14 మధ్య మొదలైంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కొనుగోలు చేసిన ఈ చమురు సెప్టెంబర్‌లో భారత్‌కు చేరనుంది. ప్రధాని నరేంద్ర మోదీ జూన్‌లో అమెరికాలో పర్యటించినప్పుడు ఇరు దేశాలు ఇంధన రంగంలో సహకరించుకోవాలని నిర్ణయించడంతో చమురు కొనుగోలు మొదలైంది. ఇందులో భాగంగా ఐఓసీ అమెరికా నుంచి 1.6 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసింది. దీంతో అగ్ర రాజ్యం నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్న దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. దక్షిణ కొరియా, జపాన్, చైనా, థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా, తైవాన్ ఇప్పటికే అమెరికా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నాయి. పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ(ఒపెక్).. ముడి చమురు ఉత్పత్తిలో కోత విధించడంతో ధరలు పెరిగాయి. దీంతో మధ్య ప్రాచ్య దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్న దేశాలు ఇతర ప్రాంతాల నుంచి చమురు కొనుగోలును ప్రారంభించాయి.

సైన్స్ అండ్ టెక్నాలజీ

రోదసీలోకి చేరిన తొలి సూపర్ కంప్యూటర్



మొట్టమొదటి సూపర్ కంప్యూటర్ (స్పేస్ బర్నో కంప్యూటర్) ఆగస్టు 16న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరింది. ఈ ప్రయోగాన్ని ఆగస్టు 7న ఫ్లోరిడాలోని కేప్‌కెనవారాల్‌లో నిర్వహించారు. స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన 2,900 కిలోల మానవ రహిత రవాణా వ్యోమ నౌక డ్రాగన్ ఈ సూపర్ కంప్యూటర్‌ను మోసుకెళ్లింది. ఇప్పటికే రోదసీలో ఉన్న వ్యోమగాములకు ఈ నౌక ఆహారం, ప్రత్యేక దుస్తులను కూడా తీసుకెళ్లినట్లు నాసా పేర్కొంది. సూపర్ కంప్యూటర్‌ను హ్యూలెట్ ఎయాకార్డ్ సంస్థ రూపొందించింది. ఇది స్పేస్ ఎక్స్‌కు సంబంధించి 12వ అంతరిక్ష ప్రయోగం. ఈ సూపర్ కంప్యూటర్ అంతరిక్షంలోని ప్రతికూల వాతావరణంలో పనిచేయగలదా లేదా అనే అంశాన్ని పరిశోధకులు పరీక్షించనున్నారు.

నౌకాదళంలోకి ఉభయచర యుద్ధనౌక

నేల పైన, సముద్రంలోనూ పోరాడగల ఉభయచర యుద్ధనౌక ఆగస్టు 21న భారత నౌకాదళంలో చేరింది. ఈ అధునాతన ల్యాండింగ్ క్రాఫ్ట్ యుటిలిటీ (ఎల్‌సీయూ) ద్వారా యుద్ధ ట్యాంకులను, ఇతర భారీ ఆయుధ వ్యవస్థలను, సైనిక బలగాలను యుద్ధ రంగానికి రవాణా చేయొచ్చు. దీన్ని కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ సంస్థ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించింది. ఈ యుద్ధ నౌక అండమాన్ దీవుల్లో విధులు నిర్వర్తిస్తుంది. ఈ శ్రేణికి చెందిన మరో ఆరు నౌకలు నిర్మాణంలో ఉన్నాయి. ఇవి వచ్చే రెండేళ్లలో నౌకాదళంలో చేరనున్నాయి.

క్రీడలు

లెవోన్ అరోనియన్‌కు చెస్ టైటిల్

ఆర్మేనియాకు చెందిన లెవోన్ అరోనియన్.. సెయింట్ లూసియా ఓపెన్ బ్లిట్జ్ చెస్ టోర్నీ టైటిల్ గెలుచుకున్నాడు. సెయింట్ లూయిస్‌లో ఆగస్టు 17న ముగిసిన ఈ టోర్నమెంట్‌లో లెవోన్ తొలి స్థానంలో, సెర్గీ కర్జాకిన్ తర్వాతి స్థానంలో నిలిచారు. భారత్‌కు చెందిన విశ్వనాథన్ ఆనంద్‌కు తొమ్మిదో స్థానం దక్కింది.

దిమిత్రోవ్, ముగురుజాలకు సిన్సినాటి టైటిల్స్

సిన్సినాటి మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో గ్రిగోర్ దిమిత్రోవ్ (బల్గేరియా), మహిళల సింగిల్స్‌లో ముగురుజా(స్పెయిన్) టైటిల్స్ గెలుచుకున్నారు. ఆగస్టు 21న ఒహాయోలో జరిగిన ఫైనల్స్‌లో నిక్ కిరియోస్(ఆస్ట్రేలియా)ను దిమిత్రోవ్ ఓడించగా, సిమోనా హలెప్ (రొమేనియా)ను ముగురుజా ఓడించారు.

అవార్డులు

కేసీఆర్‌కు అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు



తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు-2017 లభించింది. వ్యవసాయదారుల జీవితాల్లో మార్పు కోసం కృషి చేస్తున్నందుకు ఆయన్ని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు భారత ఆహార, వ్యవసాయ మండలి (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్-ఐసీఎఫ్ఏ) తెలిపింది. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని కమిటీ కేసీఆర్‌ను ఎంపిక చేసింది. ఈ అవార్డును న్యూఢిల్లీలో సెప్టెంబర్ 5న జరగనున్న 10వ ప్రపంచ వ్యవసాయ నాయకత్వ సదస్సులో ప్రదానం చేయనున్నారు. గ్రామీణాభివృద్ధి రంగాల్లో విశేష కృషిచేస్తున్నవారికి ఐసీఎఫ్ఏ 2008 నుంచి ఈ అవార్డును అందిస్తోంది.



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

ఔషధాలు ఎన్ని రకాలు?

గ్రూప్స్ ప్రత్యేకం
జనరల్ సైన్స్

19వ శతాబ్దానికి ముందు మానవుడి సగటు జీవితకాలం 30-40 ఏళ్లు. ఇది ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో రెట్టింపు అయింది. వైద్య శాస్త్ర పురోభివృద్ధి, అందుబాటులోకి వచ్చిన వైవిధ్య, విలక్షణ, శక్తివంతమైన ఔషధాలు తదితరాల వల్ల ఇది సాధ్యమైంది. ఈ ఔషధాల తయారీలో.. దిన దినాభివృద్ధి చెందుతున్న కర్బన రసాయన శాస్త్ర పాత్ర ఎంతో ఉంది. వ్యాధుల గుర్తింపు, నివారణ, చికిత్సల్లో వాడే పదార్థాలే ఔషధాలు. వీటిని వైద్యుల సిఫారసు, పర్యవేక్షణలోనే వాడాలి. ఔషధాలను అధిక మోతాదులో వాడితే విష పదార్థాలుగా మారి దుష్ప్రభావం చూపుతాయి. వ్యాధి చికిత్సకు రసాయన పదార్థాలను ఉపయోగించే ప్రక్రియనే కీమోథెరపీ అంటారు. ఔషధాలను చికిత్సల ఆధారంగా వివిధ రకాలుగా విభజించవచ్చు. అవి.. బాధా నివారిణులు, ఆమ్ల విరోధులు, యాంటీ బయాటిక్‌లు, యాంటీ సెప్టిక్‌లు, గర్భ నిరోధక మందులు మొదలైనవి.



బాధా నివారిణులు(అనాల్జెసిక్‌లు): ఈ మందులు నాడీ సంబంధ అనారోగ్యంపై చురుకుగా పని చేస్తాయి. స్పృహ కోల్పోవడం, మానసిక ఆందోళనకు గురికావడం, మతిస్థిమితం లేకపోవడం, పక్షవాతంతో బాధపడటం లేదా ఇతర రకాల నరాల వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలను కలిగించకుండా నొప్పిని లేదా బాధను మాత్రమే తగ్గించే లేదా పూర్తిగా నయం చేసే మందులే అనాల్జెసిక్‌లు. వీటిలో దురలవాట్లకు గురిచేయని(నాన్ అడిక్టివ్), నార్కోటిక్ వర్గానికి చెందని(నాన్ నార్కోటిక్) అనాల్జెసిక్‌లు మొదటి రకానికి చెందుతాయి. దురలవాట్లకు గురిచేసేవి (అడిక్టివ్), నార్కోటిక్ అనాల్జెసిక్‌లు రెండో రకానికి చెందుతాయి.

1. **నార్కోటిక్ వర్గానికి చెందని అనాల్జెసిక్‌లు:** ఆస్పిరిన్, పారాసిటమాల్, ఎసిటమైనోఫెన్, ఐబూప్రొఫెన్. ఇవి సాధారణంగా వాడే నార్కోటిక్ వర్గానికి చెందని అనాల్జెసిక్‌లు.

- **ఆస్పిరిన్:** ఎసిటైల్ శాలిసిలిక్ ఆమ్ల వ్యాపార నామమే ఆస్పిరిన్. శరీరంలోని కణజాలాల్లో మంటలకు, తద్వారా వచ్చే నొప్పులకు ప్రోస్టాగ్లాండిన్ అనే రసాయన పదార్థాలు కారణం. వీటి ఉత్పత్తి వేగాన్ని ఆస్పిరిన్ తగ్గిస్తుంది. తద్వారా బాధా నివారిణిగా పని చేస్తుంది. కండరాల నొప్పి, తల నొప్పి, పంటి నొప్పిని తగ్గిస్తుంది. జ్వరాన్ని తగ్గించడానికి, కీళ్లవాతం ద్వారా కలిగే ఎముకల సంబంధ బాధలను నివారించడానికి కూడా దీన్ని వాడతారు. రక్తాన్ని పలుచన చేసి, ప్లేట్‌లెట్లు గడ్డకట్టకుండా ఆపి, తద్వారా రక్తం గడ్డకట్టకుండా చూసే గుణం ఉండటం వల్ల ఆస్పిరిన్‌ను గుండెపోటు నివారణలోనూ ఉపయోగిస్తారు. దీనికి వాపులను తగ్గించే గుణం కూడా ఉంది. ఆస్పిరిన్‌ను పేస్ట్‌గా చేసి రాస్తే ముఖంపై మొటిమల పరిమాణం, ఎరుపు తగ్గుతాయి.
- **అసిటమైనోఫెన్(టైలినాల్):** జ్వర తీవ్రతతో పాటు శారీరక నొప్పులనూ తగ్గిస్తుంది. దీన్ని ఆర్థ్రైటిస్ చికిత్సలో కూడా వాడతారు. జలుబు తీవ్రతను తగ్గిస్తుంది. ఆల్కహాల్ తాగినవారు దీన్ని వాడితే కాలేయం దెబ్బతినే ప్రమాదం ఉంది.
- **ఐబూప్రొఫెన్:** వాపులను తగ్గించే నాన్ స్టెరాయిడ్ మందు. నొప్పులను, జ్వరాన్ని తగ్గించేందుకు వాడతారు. దీన్ని సాధారణంగా గర్భిణులకు సూచించరు.
- **జ్వర నివారిణులు(యాంటీ పైరెటిక్స్):** శరీర ఉష్ణోగ్రత వంద డిగ్రీల ఫారన్‌హీట్ దాటితే దాన్ని సాధారణ స్థితికి తగ్గించడానికి ఈ మందులు వాడతారు. ఆస్పిరిన్, అసిటమైనోఫెన్, ఐబూప్రొఫెన్ వంటి మందులు జ్వర తీవ్రతను తగ్గిస్తాయి. అయితే వీటితో పాటు వ్యాధి లక్షణాల ఆధారంగా యాంటీ బయాటిక్‌లను కూడా వాడాల్సి ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్ దాటితే చల్లని నీటితో తడిపిన వస్త్రంతో శరీరాన్ని తుడవాలి(స్పాంజింగ్ చేయాలి). 104 డిగ్రీల ఫారన్‌హీట్ కన్నా అధికంగా జ్వర తీవ్రత ఎక్కువ కాలం ఉంటే మెదడు దెబ్బతిని ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంది.
- **నార్కోటిక్ అనాల్జెసిక్‌లు:** దురలవాట్లకు గురిచేసే అనాల్జెసిక్‌లుగా మార్ఫిన్/దాని ఇతర సమజాత శ్రేణి పదార్థాలైన కొడీన్, థిబీన్ వంటి పదార్థాలను వాడతారు. నల్లమందు (ఓపియా పాపీ) గింజల నుంచి గ్రహించడం వల్ల వీటిని ఓపియేట్లు అని కూడా అంటారు. శస్త్ర చికిత్సల అనంతరం కలిగే నొప్పులు, గుండె జబ్బులు, అవసాన దశలో కేన్సర్ రోగి పడే బాధలు, ప్రసవ వేదన నివారణకు వీటిని విరివిగా వాడతారు. ఈ ఔషధాలను తక్కువ మోతాదులో సేవిస్తే బాధను నివారించి నిద్ర వచ్చేట్లు చేస్తాయి. ఎక్కువ మోతాదులో తాగితే మైకం, అపస్మారక స్థితి, మూర్ఛ, చివరికి మరణం సంభవించవచ్చు.
- మార్ఫిన్‌ను ఎసిటైలేషన్ (ఎస్టరీకరణం) చేసి, మాదకద్రవ్యంగా వాడే హెరాయిన్‌ను తయారు చేస్తారు.
- మార్ఫిన్‌కు ప్రత్యామ్నాయంగా కృత్రిమ నార్కోటిక్ అనాల్జెసిక్‌లైన ట్రమడాల్, మెథడోన్, మెపిరిడీన్‌లను కూడా వాడతారు. శస్త్రచికిత్సల నొప్పుల నివారణకు ప్రధానంగా ట్రమడాల్‌ను ఉపయోగిస్తున్నారు.

ఆమ్ల విరోధులు(యాంటాసిడ్స్): జీర్ణకోశంలో హైడ్రోక్లోరికామ్లం ఉంటుంది. pH విలువ 1.5-3.5. ఇది పెప్సినోజన్‌ను క్రియాశీలం చేసి పెప్సిన్ ఎంజైమ్ ఉత్పత్తిని ప్రేరేపించి జీర్ణక్రియకు తోడ్పడుతుంది. ప్రధానంగా ప్రొటీన్ల జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది. ఉదరంలో సూక్ష్మజీవులు వృద్ధి చెందకుండా, ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. అయితే జీర్ణకోశంలో ఈ ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అయితే ప్రకోపానికి, నొప్పికి దారితీస్తుంది. ఈ ఆమ్ల ఉత్పత్తి తీవ్ర స్థాయిలో ఎక్కువ కాలం జరిగితే జీర్ణకోశంలో పుండ్లు ఏర్పడతాయి. దీని చికిత్సకు వాడే ఔషధాలే ఆమ్ల విరోధులు. ఇవి రెండు రకాలు.

1. **అధికంగా ఉత్పత్తి అయిన ఆమ్లాన్ని తటస్థీకరించేవి:** సోడియం బై కార్బొనేట్ (వంట సోడా) లేదా అల్యూమినియం హైడ్రాక్సైడ్, మెగ్నీషియం హైడ్రాక్సైడ్ (మిల్క్ ఆఫ్ మెగ్నీషియా) వంటి మెగ్నీషియం, అల్యూమినియం సిలికేట్‌ల మిశ్రమాలు ఈ కోవకు చెందుతాయి.

- బేకింగ్ సోడాను వాడితే జీర్ణకోశం క్షారత్వాన్ని సంతరించుకోవడం వల్ల జీర్ణకోశంలో ఆమ్ల ఉత్పత్తి అధికంగా జరుగుతుంది. డైజీన్ వంటి ట్యాబ్లెట్లు ఈ కోవకు చెందుతాయి. ఇవి ఆమ్లత్వ లక్షణాలనే నియంత్రిస్తాయి. కానీ అనారోగ్య పరిస్థితికి దారితీసిన కారణాన్ని నివారించవు.
- **ప్రోటాన్ పంప్ బ్లాకర్స్:** ఆమ్ల ఉత్పత్తిని నియంత్రించే మందులు ఈ కోవకు చెందుతాయి. ఉదా॥ సిమెటిడీన్, రానిటిడీన్, ఒమిప్రజోల్, పాంటప్రజోల్, రాబిప్రజోల్ వంటివి.

హిస్టమీన్ విరోధులు(యాంటీ హిస్టమీన్‌లు): హిస్టమీన్ బలమైన రక్తనాళ విస్తరణకారి. ఇది శ్వాసనాళాల్లోని, పేగుల్లోని మృదు కండరాలను సంకోచింపజేస్తుంది. రక్తనాళాల గోడల్లోని కండరాలను వ్యాకోచింపజేస్తుంది. సాధారణ పడిశం, పుప్పొడి రేణువుల ద్వారా ముక్కు రంధ్రాలు మూసుకుపోవడానికి ఇది కారణం. (అదేవిధంగా జీర్ణకోశంలో పెప్సిన్, హైడ్రోక్లోరికామ్ల ఉత్పత్తిని కూడా ఉత్తేజపరుస్తుంది) వీటి చికిత్సకు వాడే మందులే యాంటీ హిస్టమీన్‌లు. బ్రోమ్‌ఫెనిరామిన్, సిట్రజిన్, టెర్ఫెనడీన్, డైఫెన్‌హైడ్రమీన్(బెనడ్రిల్) వంటి మందులు ఎలర్జీతో కూడిన జలుబును, శ్వాసలో ఇబ్బందిని, దగ్గును తగ్గిస్తాయి.



డా॥ బి. రమేష్
సీనియర్ ఫ్యాకల్టీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జమ్మికుంట.

కాంపిటీటివ్ కౌన్సెలింగ్

గ్రూప్స్ పరీక్షల్లో ఇంధనాలకు సంబంధించి ఎలాంటి ప్రశ్నలు వస్తాయి?




ఏ పోటీ పరీక్ష అయినా ఎగ్జామినర్ మదిలో తప్పనిసరిగా మెదిలే అంశం ఇంధనాలు. వంట చెరుకుగా వాడే పిడకలు, కలప మొదలుకొని ఎల్‌పీజీ, గోబర్ గ్యాస్ వంటివి కూడా ఇంధనాలే. పెట్రోల్, కిరోసిన్, డీజిల్.. ద్రవ ఇంధనాలు. ఎల్‌పీజీ, సీఎన్‌జీ.. వాయు ఇంధనాలు. వీటికి ఆధారం పెట్రోలియం. క్రూడ్ ఆయిల్‌ను 'పాక్షిక అంశిక స్వేదన' పద్ధతిలో రిఫైనరీల్లో శుద్ధి చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తారు. పోటీ పరీక్షల్లో ఈ ప్రక్రియతోపాటు వివిధ ఉష్ణోగ్రతల వద్ద ఏయే అనుఘటకాలు వస్తాయో అడిగే అవకాశం ఉంది. ఇంధనాల్లోని రసాయన పదార్థాల గురించీ అడగొచ్చు. ఇంధనం ఏదైనా అది వివిధ హైడ్రో కార్బన్ల మిశ్రమమే. ఎల్‌పీజీలో ప్రధాన అనుఘటకం బ్యూటేన్. సహజ వాయువులో ఉండే ప్రధాన వాయువు మీథేన్. జీవ వ్యర్థాల నుంచి తయారయ్యేది బయోగ్యాస్. పేడ నుంచి తయారయ్యేది గోబర్ గ్యాస్. ఈ రెండింటిలోనూ ప్రధాన అనుఘటకం మీథేనే. ఇవన్నీ హైడ్రోకార్బన్‌లే. వీటిని మండిస్తే కార్బన్‌డైఆక్సైడ్, నీటి ఆవిరి వెలువడతాయి. రాకెట్లలో.. తక్కువ బరువు ఉండి ఎక్కువ శక్తినిచ్చే ఇంధనాలు అవసరం. ద్రవ హైడ్రోజన్ మంచి ఇంధనం. గ్రామ్ ఇంధనం ఇచ్చే శక్తిని బట్టి దాని సామర్థ్యాన్ని తెలియజేస్తారు. ఎక్కువ కెలోరిఫిక్ విలువ ఉంటే దాని సామర్థ్యం అధికం. ఇంధనాలపై ఈ తరహా ప్రశ్నలు అడుగుతారు. అలాగే హైడ్రోకార్బన్‌ల గురించి కూడా విస్తృతంగా చదవాలి.

ఫ్యూచర్ గాడ్జెట్స్

టెక్ స్టోరీ

భిన్న ఆలోచన..! నిరంతర పరిశోధన..! కొత్త విషయాలు తెలుసుకునేందుకు, నూతన ఆవిష్కరణలకు పునాది ఈ అంశాలే..! ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తున్న కంప్యూటర్, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్.. ఇలా వెలుగులోకి వచ్చినవే..! మనిషి జీవితాన్ని మార్చివేసిన ఈ ఉపకరణాల తరహాలోనే.. దైనందిన వ్యవహారాలను మరింత సులభం చేసే సాంకేతిక పరికరాలు భవిష్యత్తులో అందుబాటులోకి రానున్నాయి. అలాంటివాటిలో కొన్నింటి గురించి..



మైక్రోసాఫ్ట్ హోలో లెన్స్



సైన్స్ ఫిక్షన్ తరహాకు చెందిన ఈ సాంకేతికతను మైక్రోసాఫ్ట్ త్వరలో అందుబాటులోకి తీసుకురానుంది. మున్ముందు రోజుల టెక్నాలజీని హోలోలెన్స్ ద్వారా ఊహించుకోవచ్చు. ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే సాంకేతిక ప్రపంచంలో విప్లవాత్మక మార్పులు ఖాయం.ఈ వర్చువల్ రియాల్టీ హెడ్‌సెట్ ద్వారా స్పష్టమైన 3డీ వ్యూ మన కళ్లెదుట ప్రత్యక్షమవుతుంది.

స్మార్ట్ రింగ్



చూసేందుకు వేలికి ఉంగరంలాగే ఉంటుంది. కానీ.. దీంతో స్మార్ట్‌ఫోన్‌ను తాకకుండానే ఆపరేట్ చేయొచ్చు. టెక్నాలజీ స్టార్టప్ 'ఒరిగామి ల్యాబ్స్' స్మార్ట్ తయారీ ఇది. బోన్ కండక్షన్ టెక్నాలజీ ద్వారా పనిచేసే ఈ స్మార్ట్ రింగ్ 30 మి.మీ. పొడవు, 20 మి.మీ. వెడల్పుతో ఉంటుంది. చూపుడు వేలుకు పెట్టుకుంటే.. కాల్ వచ్చినప్పుడు వైబ్రేట్ అవుతుంది. ఇందుకోసం ఈ రింగ్‌లో డ్యూయల్ బ్లూటూత్ 4.0 రేడియో ఉంటుంది. ఈ బ్లూటూత్ తక్కువ ఎనర్జీ సపోర్ట్‌తో పనిచేస్తుంది. ఇందులో 50 ఎంఏహెచ్ బ్యాటరీని సైతం అమర్చారు. దీని సాయంతో రింగ్ 40 గంటల పాటు స్టాండ్‌బై మోడ్‌లో పనిచేస్తుంది. ఇది సిరి, గూగుల్ అసిస్టెంట్ సాయంతో నడుస్తుంది కాబట్టి ఐవోఎస్, ఆండ్రాయిడ్ యూజర్లు ఎవరైనా వినియోగించవచ్చు.

ట్రాన్స్‌పరెంట్ ట్రక్స్



ప్రపంచ యుద్ధాల మరణాల కంటే.. రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నవారు ఎక్కువ. ముఖ్యంగా జాతీయ రహదారులపై జరిగే దుర్ఘటనలు ఎక్కువ మందిని బలిగొంటున్నాయి. భారీ వాహనాలను అధిగమించే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించకపోవడం.. విలువైన ప్రాణాలను హరిస్తోంది. దీనిని నివారించడం కోసం సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. ఇందులో వాహనాల వెనుక ఒక తెర, ముందు ఒక కెమెరా ఉంటుంది. కెమెరా వీడియో ఫుటేజీ స్క్రీన్‌పై ప్రసారం అవుతుంటుంది. తద్వారా వాహనం ముందు రోడ్డు ఎలా ఉంది..? వేరే ఏమైనా వస్తున్నాయా..? అనే విషయాన్ని తెరపై చూడొచ్చు. ఈ సేఫ్టీ ట్రక్‌ను శామ్‌సంగ్, లియో బర్నెట్ యాడ్ ఏజెన్సీలు సంయుక్తంగా రూపొందించాయి.

సుపీరియర్ స్టెతస్కోప్



స్టెతస్కోప్‌తో గుండె చప్పుడు వినడం అందరు డాక్టర్లు చేసే పనే. అయితే 'ఎకో కోర్' స్టెతస్కోప్ మాత్రం భిన్నమైనది. ఈ స్టెతస్కోప్‌కి చిన్న అడాప్టర్ అమర్చి ఉంటుంది. ఇది హార్ట్‌బీట్ డేటాను రికార్డు చేసి క్లౌడ్‌లో సేవ్ చేస్తుంది. డాక్టర్లు ఈ డేటాను తమ స్మార్ట్‌ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మరోసారి హార్ట్‌బీట్‌ను పరీక్షించినప్పుడు ఈ డేటాతో సరిపోల్చి చూసుకోవచ్చు. ఫలితంగా తేడాలు ఏమైనా ఉంటే సులభంగా గుర్తించడానికి వీలవుతుంది. చెవుల ద్వారా వినలేని అతి చిన్న శబ్దాలను సైతం ఈ స్టెతస్కోప్‌తో కనిపెట్టవచ్చు. దీనివల్ల ఎకో కార్డియోగ్రామ్ వంటి పరీక్షలు చేయించే అవసరం తప్పుతుంది. ఈ ఆవిష్కరణకు ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) ఆమోదం కూడా లభించింది.


బయోనిక్ ఇయర్స్



ట్రాఫిక్‌లో రణగొణధ్వనుల మధ్య ఇరుక్కుపోయారు. అప్పుడు మీకు రెండే ఆప్షన్లు... ఒకటి చెవులు మూసుకోవడం, రెండు శబ్దాన్ని భరించడం. 'బయోనిక్ ఇయర్స్' ఉంటే మాత్రం ఎటువంటి శబ్దం చెవిని చేరకుండా చూసుకోవచ్చు. బయటి శబ్దాలు ఇబ్బందికరంగా ఉన్నప్పుడు ఇవి బాగా ఉపయోగపడతాయి. వీటిలో శబ్దం హెచ్చుతగ్గులు సరి చేసుకోవచ్చు. మ్యుజీషియన్స్‌కు ఇవి బాగా ఉపకరిస్తాయి. డాప్లర్ ల్యాబ్స్ వీటిని తయారు చేసింది.

ఇంకా..

- **స్వరోస్కీ అండ్ మిస్‌ఫిట్ యాక్టివిటీ ట్రాకర్స్ :** జ్యువెలరీ తరహాలో ఉండే ఈ ట్రాకింగ్ మానిటర్ ద్వారా మనిషి ఆరోగ్య స్థితి, ఫిట్‌నెస్ స్థాయిని పరీక్షించుకోవచ్చు.
- **జెడ్ స్కాన్+.. :** మౌస్‌లా ఉండే ఈ డివైజ్.. డాక్యుమెంట్లను ఇట్టే స్కాన్ చేస్తుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు.. ఎక్కడ కావాలంటే అక్కడ ఈ పోర్టబుల్ స్కానర్‌ను ఉపయోగించుకోవచ్చు.



- **మింట్..:** ఈ శ్వాస విశ్లేషణ సాధనం మనిషిలోని ఆల్కహాల్ శాతాన్ని తెలుస్తుంది.
- **సెన్స్..:** ఇది స్లీప్ ట్రాకింగ్ డివైజ్. స్మార్ట్ అలారమ్ వ్యవస్థను కలిగి మన నిద్ర సమయాన్ని బట్టి అలారంను సెట్ చేస్తుంది.
- **చెఫ్‌జెట్ అండ్ చెఫ్‌జెట్ ప్రో..:** ఇవి 3డీ ప్రింటర్లు. తినే పదార్థాలను అప్పటికప్పుడు మన ముందు ప్రింట్ చేసేస్తాయి.
- **పర్సనల్ రోబోట్స్..:** వ్యక్తిగత పనులను ఈ రోబోట్‌లు చక్కబెట్టేస్తాయి. రోబోటిక్స్ విభాగంలో ఇదో విప్లవాత్మక అంశంగా చెప్పుకోవచ్చు.
- **కోపెన్హాగన్ వీల్..:** ప్రత్యేక సాంకేతిక వ్యవస్థతో అందుబాటులోకి రానున్న ఈ సైకిల్.. రైడర్ ఎనర్జీ లెవల్స్‌ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది.
- **ప్యారట్ ఫ్లవర్ పవర్..** ఈ ప్రత్యేకమైన సెన్సార్ వ్యవస్థ మొక్కల చుట్టూ ఉన్న మట్టిని అధ్యయనం చేయడంతో పాటు అవసరమైన కాంతి, ఉష్ణోగ్రత, ఫర్టిలైజర్, తేమ స్థాయిలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తుంది.

ఇష్టంగా చదివితే.. సులభమే

సీఏ సీపీటీలో 197 మార్కులు సాధించిన నల్లాని సాయికృష్ణ

సీఏ సీపీటీ..! చార్టర్డ్ అకౌంటెన్సీ కోర్సులో విద్యార్థులు ఎంతో క్లిష్టంగా భావించే తొలి దశ. ఇంటర్మీడియెట్ నుంచే సీఏ దిశగా అడుగులు వేసేందుకు మార్గమైన సీపీటీ పరీక్షకు దేశవ్యాప్తంగా హాజరయ్యే విద్యార్థుల సంఖ్య వేలల్లోనే ఉంటుంది. అంతటి తీవ్ర పోటీని ఎదుర్కొని.. సీఏ-సీపీటీ (జూన్) పరీక్షలో జాతీయ స్థాయిలో 197 మార్కులతో టాపర్‌గా నిలిచాడు తెలుగు తేజం నల్లాని సాయికృష్ణ. అతని సక్సెస్ స్పీక్స్..



వ్యవసాయ కుటుంబం

మా స్వస్థలం కృష్ణా జిల్లా జగయ్యపేట మండలం బండిపాలెం. నాన్న రుక్మాంధరరావు రైతు. అమ్మ సీతామహాలక్ష్మి గృహిణి. వ్యవసాయమే కుటుంబ ఆధారం. అమ్మ, నాన్న ఇద్దరూ పొలం పనులు చేస్తుంటారు. పిల్లలకు మంచి చదువులు చెప్పించాలనే వారి తపనే నాకు స్ఫూర్తి.

పదో తరగతిలో సీఏ వైపు దృష్టి

పదో తరగతి చదువుతున్నప్పుడు సీఏ కోర్సు గురించి తెలిసింది. అది పూర్తి చేస్తే లభించే అవకాశాలపై అవగాహన ఏర్పడింది. దీంతో సీఏలో చేరాలని నిర్ణయించుకున్నా. స్నేహితులు, బంధువులు మాత్రం 'సీఏ కోర్సు పూర్తిచేయడం చాలా కష్టం. ఎక్కువ సమయం పడుతుంది' అన్నారు. అయినా నేను చేరాలనే నిశ్చయించుకున్నా.

ఎంఈసీ + సీపీటీ

2015లో పదో తరగతి పూర్తయింది. వెంటనే సీఏ కోర్సు మొదటి దశ సీపీటీ (కామన్ ప్రొఫిషియన్సీ టెస్ట్)కి పేరు నమోదు చేసుకున్నా. సీపీటీ సిలబస్‌ను పరిశీలించా. సీపీటీలో ఉండే నాలుగు పేపర్లను అధ్యయనం చేసే అవకాశం ఉంటుందని భావించి ఇంటర్‌లో ఎంఈసీలో చేరా. ఒకే సమయంలో ఇటు ఇంటర్మీడియెట్, అటు సీఏ-సీపీటీ రెండింటికీ సన్నద్ధమయ్యా. ఈ ఏడాది ఇంటర్ కాగానే సీపీటీ పరీక్షకు హాజరయ్యా. ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాశా. 'కీ' చూసుకున్నాక.. మంచి మార్కులు వస్తాయనే నమ్మకం కలిగింది. జాతీయ స్థాయిలో టాప్ మార్కులు పొందడం ఎంతో ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో సీఏలోని తదుపరి దశ అయిన 'ఇంటర్మీడియెట్'కు ప్రిపరేషన్ ప్రారంభించా.

కాన్సెప్ట్స్ అర్థం చేసుకుంటూ

సీపీటీ ప్రిపరేషన్‌లో ప్రతి సబ్జెక్ట్ కాన్సెప్ట్స్ అర్థం చేసుకుంటూ.. అప్లికేషన్ ఓరియెంటేషన్‌లో ప్రాక్టీస్ చేయడం అలవర్చుకున్నా. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ మినహా మిగతా మూడు సబ్జెక్టులు థియరీ ప్రాధాన్యంగా ఉంటాయి. దీంతో థియరీ ఆధారిత ప్రిపరేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చా. క్లిష్టమైన కాన్సెప్ట్‌లను కూడా సులువుగా అర్థం చేసుకోగలిగేలా లెక్చరర్స్ అందించిన చిట్కాలు ఎంతో ఉపయోగపడ్డాయి.

రోజుకు తొమ్మిది గంటలు

ఇంటర్మీడియెట్, సీపీటీ ప్రిపరేషన్ రెండిటికీ రోజుకు తొమ్మిది గంటలు చొప్పున కేటాయించా. మెటీరియల్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయడం.. స్టడీ అవర్స్‌లో ప్రాక్టీస్ చేయడం వల్ల సీపీటీని సులువుగా ఎదుర్కోగలిగా. ఫలితంగా మొత్తం 200 మార్కులకు 197 మార్కులు వచ్చాయి. అకౌంట్స్, జనరల్ ఎకనామిక్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాల్లో ఒక్కో ప్రశ్నను వదిలేయడం వల్ల మూడు మార్కులు తగ్గాయి.

వీక్లీ టెస్ట్స్.. మాక్ టెస్ట్స్

ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాక పూర్తి సమయం సీపీటీకే కేటాయించా. ప్రిపరేషన్‌తో పాటు వీక్లీ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు రాయడం వల్ల పరీక్షలో వ్యవహరించాల్సిన తీరుపై మరింత అవగాహన వచ్చింది. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకున్నా. ఏ టాపిక్‌నూ వదలకుండా సిలబస్‌ను పూర్తి చేశా. ప్రస్తుతం బీకాంలో చేరాను. సీఏ తదుపరి దశ ఇంటర్మీడియెట్‌కు ప్రిపరేషన్ సాగిస్తున్నా. బేసిక్స్ అర్థం చేసుకుంటే కొత్త సిలబస్‌లోనూ సులువుగానే రాణించొచ్చు.

తర్వాత 'లా'..

సీఏ పూర్తి చేసిన తర్వాత న్యాయశాస్త్రం (లా) చదవాలనుకుంటున్నా. అది పూర్తయ్యాక ఉద్యోగం చేస్తాను. సెల్ఫ్ ప్రాక్టీస్‌పై ఇప్పటివరకు అంతగా ఆసక్తి లేదు కానీ.. సీఏ, లా రెండూ పూర్తయ్యేసరికి అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తా. నా ప్రాధాన్యం మాత్రం ఉద్యోగానికే.

ఆందోళన వద్దు

సీఏ కోర్సు ఇష్టంగా చదివితే అన్ని భయాలు ఇట్టే తొలగిపోతాయి. కోర్సు పరంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకుసాగాలి. బుక్స్, మెటీరియల్ ప్రిపరేషన్‌తో పాటు అప్‌డేటెడ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడు కోర్సును తొలి ప్రయత్నంలోనే పూర్తి చేసేందుకు ఆస్కారం లభిస్తుంది.

నల్లాని సాయికృష్ణ.. సీపీటీ మార్కులు..

- ఫండమెంటల్ అకౌంటింగ్ : 59 మార్కులు
- మర్కెంటైల్ లా : 40 మార్కులు
- జనరల్ ఎకనామిక్స్ : 49
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ : 49

అకడమిక్ ప్రొఫైల్

- పదో తరగతి: 9.7 గ్రేడ్ పాయింట్స్
- ఇంటర్మీడియెట్: 967 మార్కులు

బులెటిన్ బోర్డ్

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ 2017

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) పరిధిలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు, ప్రయోగశాలల్లో బోధన, పరిశోధనలకు నిర్వహించే అర్హత, ప్రవేశ పరీక్ష.. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ నోటిఫికేషన్ విడుదలైంది.

- **పరీక్ష పేరు:** సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ 2017
- **పరీక్ష నిర్వహించే విభాగాలు:** కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్.
- **అర్హతలు:** 55 శాతం మార్కులతో ఎంఎస్సీ లేదా తత్సమాన విద్యార్హత/ ఇంటెగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్/ బీఎస్(నాలుగేళ్ల)/ బీఈ/బీటెక్/బీఫార్మా/ ఎంబీబీఎస్/పీహెచ్‌డీ. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు 50శాతం మార్కులు చాలు.



అలాగే 55 శాతం మార్కులతో బీఎస్సీ(ఆనర్స్) లేదా తత్సమాన విద్యార్హత ఉత్తీర్ణులై ఇంటెగ్రేటెడ్ ఎంఎస్-పీహెచ్‌డీలో ఎన్‌రోల్ అయిన అభ్యర్థులూ, తుది సంవత్సరం ఎంఎస్సీ చదువుతున్న విద్యార్థులూ అర్హులే.

- **వయోపరిమితి:** 2017 జూలై 1 నాటికి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అభ్యర్థులకు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. లెక్చరర్‌షిప్ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **ఎంపిక విధానం:** అర్హత పరీక్ష (సీఎస్ఐఆర్ -యూజీసీ నెట్) ద్వారా.
- **పరీక్ష విధానం:** విభాగాల వారీ మొత్తం 200 మార్కులకు రాతపరీక్ష ఉంటుంది.
- **వ్యవధి :** 3 గంటలు. రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహిస్తారు.
- **పరీక్ష కేంద్రాలు (తెలుగు రాష్ట్రాల్లో):** హైదరాబాద్, గుంటూరు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్-రూ.1,000; ఓబీసీ(ఎన్‌సీఎల్)-రూ.500; ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.250.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దానిని ప్రింటవుట్ తీసుకొని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి ' డిప్యూటీ సెక్రటరీ(ఎగ్జామ్), ఎగ్జామినేషన్ యూనిట్, హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ గ్రూప్, సీఎస్ఐఆర్ కాంప్లెక్స్, ఆపోజిట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, లైబ్రరీ ఎవెన్యూ, పూసా, న్యూఢిల్లీ-110012' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 16, 2017
- **దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 23, 2017
- **వెబ్‌సైట్:** www.csirhrdg.res.in

గూగుల్.. బెస్ట్ యాప్స్

టెక్ న్యూస్

'గూగుల్ ప్లే స్టోర్..' యాప్‌ల సముద్రం. ఒకటా..? రెండా..? అందులో ఉన్న యాప్‌లు ఎన్నో లెక్కించడం కష్టం. వీటిలో మనకు కొన్ని మాత్రమే తెలుసు. ఫోన్‌లో మహా అయితే ఓ 50 యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకుని ఉంటాం. చాలావాటిని చూసికూడా ఉండం. అలాంటి ప్లే స్టోర్‌లోని కొన్ని ఉపయుక్త యాప్స్ గురించి తెలుసుకుందాం..!




వాల్‌పేపర్స్



సహజంగా మొబైల్ వాల్‌పేపరుగా నచ్చిన ఫొటోను పెట్టుకుంటాం...! మరికాస్త భిన్నంగా ఉండాలనుకుంటే మాత్రం లైవ్ వాల్‌పేపర్స్ కలెక్షన్ ఉత్తమం. ఇందుకోసం గూగుల్ 'వాల్‌పేపర్స్ యాప్' మంచి ఎంపిక. ఇందులో ఆర్ట్స్ నుంచి టెక్చర్స్ దాకా బోలెడన్ని కలెక్షన్స్ ఉన్నాయి. ముఖ్యంగా ఉపగ్రహం నుంచి తీసిన భూమి ఫొటోల కలెక్షన్ అద్భుతం. వీటిని వాల్‌పేపర్‌గా పెట్టుకుంటే మొబైల్‌కే యూనిక్ లుక్ వస్తుంది. రోజూ వాల్ పేపర్స్ వాటంతటవే మారిపోయే ఆప్షన్ కూడా ఇందులో ఉంది.

ఫొటో స్కాన్



ఇది గూగుల్ ఫొటోస్‌కు ఎక్స్‌టెన్షన్ యాప్. ఈ స్కానర్ యాప్‌తో పాత ఫొటోలను స్కాన్ చేసుకోవడం చాలా సులభం. ఫోన్‌ను ఫొటోపైన పెట్టి యాప్‌ను ఓపెన్ చేస్తే చాలు తర్వాత ఏంచేయాలో యాపే గైడ్ చేస్తుంది. స్కాన్ చేసుకుని కంబైన్ చేసి ఫొటోను ఎన్‌హాన్స్ చేస్తుంది. గూగుల్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఆర్ఐ)ను ఉపయోగించుకుని రంగులను కాలిబ్రేట్ చేసుకుంటుంది. ఎక్కడైనా గ్లేర్ ఎక్కువగా ఉంటే తగ్గిస్తుంది. అంతేకాక స్కాన్ చేసిన ఫొటోలను గూగుల్ ఫొటోస్‌లో ఆటోమేటిగ్గా అప్‌లోడ్ చేయడం దీని మరో ప్రత్యేకత.

స్నాప్ సీడ్




బేసిక్ ఎడిటింగ్ కోసం పవర్‌ఫుల్ ఫొటో ఎడిటర్ యాప్ ఉచితంగా కావాలనుకుంటే.. 'స్నాప్‌సీడ్' మంచి ఆప్షన్. దీని ఇంటర్‌ఫేస్‌లో యాడ్స్ లేకపోవడంతో వినియోగంలో ఇబ్బంది ఉండదు. ఫేస్ ఎన్‌హాన్స్, హీలింగ్, వైట్ బ్యాలన్స్, ట్రూ ఇమేజ్, క్రాప్, రొటేట్ వంటి చాలా ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఫొటో ఫిల్టర్లు మరింత అడ్వాంటేజ్. ఇందులోని డ్రామా కలెక్షన్ ఫిల్టర్స్.. నలుపు తెలుపు ఫొటోలు కోరుకునేవారి కోసం ప్రత్యేకంగా డిజైన్ చేశారు.

క్రోమ్ రిమోట్ డెస్క్‌టాప్

ఎక్కడనుంచైనా పీసీని యాక్సెస్ చేసుకోవాలనుకుంటే.. ప్లే స్టోర్‌లో చాలా యాప్స్ అందుబాటులో ఉన్నాయి. వీటన్నింటిలో క్రోమ్ రిమోట్ డెస్క్ టాప్ యాప్ ఉత్తమం. క్రోమ్ బ్రౌజర్‌లో ఈ ఎక్స్‌టెన్షన్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే.. ఎక్కడినుంచైనా పీసీని ఆండ్రాయిడ్ డివైజ్ ద్వారానే సెక్యూర్డ్‌గా యాక్సెస్ చేసుకోవచ్చు. చాలా యాప్‌లు యాక్సెస్ బ్రౌజర్ వరకే పరిమితం. ఈ యాప్‌తో మాత్రం మొత్తం సిస్టమ్‌ను ఆండ్రాయిడ్ డివైజ్ ద్వారా నడిపించవచ్చు. దీనికి పీసీ, ఆండ్రాయిడ్ డివైజ్ ఉంటే సరిపోతుంది.



ట్రస్టెడ్ కాంటాక్ట్స్



Find My Friendsకు గూగుల్ వెర్షన్ 'ట్రస్టెడ్ కాంటాక్ట్స్' యాప్. దీన్ని మీ ఫోన్‌తో పాటు కుటుంబ సభ్యుల ఫోన్‌లోనూ ఇన్‌స్టాల్ చేసుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది. దీని ద్వారా లొకేషన్ ట్రాకింగ్ చేసుకోవచ్చు. అంతేకాక మీ ట్రస్టెడ్ కాంటాక్ట్ మెంబర్లు లొకేషన్ ఎక్కడుందో మిమ్మల్ని రిక్వెస్ట్ చేయవచ్చు. మీరు వద్దనుకుంటే ఆ రిక్వెస్ట్‌ను డినై చేయవచ్చు. మీరు 5 నిమిషాల్లోగా స్పందించకపోతే మాత్రం మీ లొకేషన్ ఆటోమేటిగ్గా మీ క్లోజ్ కాంటాక్ట్‌లకు షేర్ అయిపోతుంది. ఆఫ్‌లైన్‌లోనూ పని చేయగలగడం దీని ప్లస్ పాయింట్. ప్రయాణంలో ఉన్నప్పుడు ఈ యాప్ బాగా ఉపయోగపడుతుంది.

సాక్షి బిజినెస్

గురువారం 24-8-2017

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
276 ▲	87 ▲
31,568	9,852

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండూ రాత్రి 11:30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	6,274	▽	23
డోజోన్స్	21,827	▽	72
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,383	▲	1
డాక్స్	12,174	▽	55
షాంఘై	3,288	▽	3
నికాయ్	19,435	▲	51

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.26	64.94
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	80.81	83.61
€	యూరో	ఎస్‌బీఐ	74.01	76.63
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.55	59.58
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.66	51.46
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.26	47.84
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.50	18.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.86	18.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.81	11.04

ఉబెర్ రైడ్స్‌కు యూపీఐ ద్వారా చెల్లింపు

ఎన్‌పీసీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులతో భాగస్వామ్యం



న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన క్యాబ్ అగ్రిగేటర్ ఉబెర్ తాజాగా తన ప్లాట్‌ఫామ్‌కు యూపీఐ సేవలను అనుసంధానించింది. దీని కోసం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ), యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీంతో ఉబెర్ ప్లాట్‌ఫామ్‌లో రిజిస్టర్ అయిన 4.5 లక్షలకుపైగా డ్రైవర్లు యూపీఐ ద్వారా పేమెంట్స్‌ను స్వీకరించొచ్చు. అంటే మనం కూడా ఉబెర్ రైడ్స్‌కు అయిన మొత్తాన్ని యూపీఐ ద్వారా చెల్లించొచ్చు. కాగా ఇప్పటి వరకు యూజర్లు క్యాష్, డెబిట్/క్రెడిట్ కార్డులు, పేటీఎం వాలెట్ ద్వారా ఉబెర్ రైడ్స్‌కు చెల్లింపులు చేస్తున్నారు.

ఆ మూడు మార్కెట్‌లపై ప్రధాన దృష్టి

ఉబెర్.. భారత్, బ్రెజిల్, మెక్సికో మార్కెట్లపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. తద్వారా కంపెనీ వృద్ధిని మరింత పెంచుకోవాలని చూస్తోంది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఈ ఏడాది జూలైలో భారత్‌లో 115 శాతం వృద్ధిని సాధించినట్లు ఉబెర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ బిజినెస్) డేవిడ్ రిచ్‌టర్ తెలిపారు. ఆయన ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. తమ ప్లాట్‌ఫామ్‌ను మరింత యూజర్ ఫ్రెండ్లీగా చేయడానికి మరిన్ని సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇప్పటికే కంపెనీ ఈ దిశగా పలు చర్యలు తీసుకుందని, ప్లాట్‌ఫామ్‌కు యూపీఐ సేవల అనుసంధానం ఇందులో భాగమేనని తెలిపారు. తమకు అమెరికా వెలుపల భారత్ అతిపెద్ద మార్కెట్ అని గుర్తు చేశారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ... అందుబాటులో ఉండే, అభివృద్ధికి సహకరించే టెక్నాలజీలను కలిగి ఉండటమే డిజిటల్ ఇండియా ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

రూ. 200 నోట్లు వచ్చేస్తున్నాయ్..



న్యూఢిల్లీ: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) త్వరలో రూ.200 నోట్లను మార్కెట్‌లోకి తీసుకురానుంది. కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త నోట్లకు సంబంధించి ఇప్పటికే ఆర్‌బీఐకి అనుమతినిచ్చింది. వ్యవస్థలో తక్కువ డినామినేషన్ ఉన్న కరెన్సీకి అధిక డిమాండ్ ఉంటున్న నేపథ్యంలో ఆర్‌బీఐ రూ.200 నోట్లను చలామణిలోకి తీసుకువస్తోంది. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం రూ.200 నోట్ల ముద్రణకు అనుమతినిచ్చిందని ఆర్థిక శాఖ తాజా ప్రకటనలో పేర్కొంది.

ఆర్‌బీఐ గవర్నర్ గిరీపై రాజన్ పుస్తకం

సెప్టెంబర్ 4న మార్కెట్లోకి 'ఐ డూ వాట్ ఐ డూ'



న్యూఢిల్లీ: సంక్షోభ సమయంలో రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రఘురామ్ రాజన్.. కొత్తగా మరో పుస్తకాన్ని ప్రచురించారు. 'ఐ డూ వాట్ ఐ డూ' పేరిట ఆయన రాసిన ఈ పుస్తకం సెప్టెంబర్ 4న మార్కెట్లోకి రానుంది. ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన కాలంలో రాజన్ రాసిన వ్యాసాలు, ప్రసంగాలు ఇందులో పొందుపర్చారు. ఆర్థిక, రాజకీయపరమైన అంశాలు దీన్లో చాలా ఉన్నాయి. 2013 సెప్టెంబర్‌లో రాజన్ ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టే నాటికి రూపాయి పతనావస్థలో ఉండగా.. ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయిలో ఉంది. కరుగుతున్న విదేశీ మారక నిల్వలు.. భారీ కరెంటు అకౌంటు లోటు దేశానికి సమస్యాత్మకంగా మారాయి. అయిదు బలహీన ఎకానమీల్లో ఒకటనే ముద్రతో భారత్‌పై నమ్మకం సడలిన పరిస్థితులను రాజన్ సమర్థంగా ఎదుర్కొన్నారని, దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టత... కొనసాగుతున్న సంస్కరణల గురించి ప్రపంచానికి బలమైన సంకేతాలు పంపారని ముద్రణా సంస్థ హార్పర్‌కోలిన్స్ ఇండియా పేర్కొంది. దీర్ఘకాలికంగా వృద్ధి, స్థిరత్వాన్ని సాధించడం, ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పునరుద్ధరించడం వంటి అంశాలపై రాజన్ దృష్టి పెట్టారని తెలిపింది. దోశ ధరతో ముడిపెట్టి ఆర్థికాంశాలను రాజన్ వివరించిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ.. 'దోశనా మిక్స్ లేదా రుణ సంక్షోభ పరిష్కారమార్గాలు కావొచ్చు. రాజన్ ఆర్థిక విషయాలను సరళంగా వివరిస్తారు' అని హార్పర్‌కోలిన్స్ వివరించింది. రాజన్ ఇప్పటికే సేవింగ్ క్యాపిటలిజం ఫ్రం క్యాపిటలిస్ట్‌తో పాటు మరో పుస్తకాన్ని కూడా రాశారు.

నీలేకని రీఎంట్రీ..?



ఆయనను తీసుకోవాలంటూ ఇన్ఫీ బోర్డుకు 12 ఫండ్స్ లేఖ

- జాబితాలో ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఫండ్స్...
- తాజా పరిణామాలు చాలా ఆందోళనకరమని వెల్లడి
- ఇన్వెస్టర్లలో నమ్మకం పెంచడానికి నీలేకని రావాలని వ్యాఖ్య
- నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించొచ్చని ఊహాగానాలు

న్యూఢిల్లీ: విశాల్ సిక్కా రాజీనామా దెబ్బతో గందరగోళంగా తయారైన ఇన్ఫోసిస్‌లో ప్రమోటర్లు మళ్లీ పాగా వేస్తున్నారా? అవుననే వారి వాదనలకు నందన్ నీలేకని రీఎంట్రీకి అన్నివైపుల నుంచి మద్దతు పెరుగుతుండటం బలాన్ని చేకూరుస్తోంది. నీలేకని పునరాగమనం కోసం ఏకంగా సంస్థాగత ఇన్వెస్టర్లు ఇప్పుడు రంగంలోకి దిగారు. ఆయనను మళ్లీ కంపెనీలోకి తీసుకోవాలని పన్నెండు సంస్థాగత ఇన్వెస్టర్లు (ఫండ్స్) మూకుమ్మడిగా బోర్డుకు లేఖ రాశారు. సీఈఓ పదవికి సిక్కా ఆకస్మిక రాజీనామాతో ఇన్ఫీలో అనిశ్చితి నెలకొందని... ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించి, ఇన్వెస్టర్లలో తిరిగి నమ్మకాన్ని తీసుకురావాలంటే నీలేకని పునరాగమనం తప్పనిసరి అని లేఖలో పేర్కొన్నారు. నీలేకని రీఎంట్రీ కోసం ఇప్పటికే ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ అడ్వయిజరీ సర్వీసెస్ అనే సంస్థ గొంతెత్తిన సంగతి తెలిసిందే. కాగా, బుధవారం సంస్థాగత ఇన్వెస్టర్లతో నారాయణమూర్తి మాట్లాడనున్నట్లు తొలుత వార్తలొచ్చాయి. అయితే, ఈ కాన్ఫరెన్స్ కాల్‌ను ఆయన 29కి వాయిదా వేసుకున్నట్లు సమాచారం. తనపై పదేపదే నిరాధార ఆరోపణలు, వ్యక్తిగతంగా దూషణలు చేయడం వల్లే సీఈఓ పదవికి తప్పనిసరి పరిస్థితుల్లో గుడ్‌బై చెప్పినట్లు సిక్కా తన రాజీనామా లేఖలో పేర్కొనడం తెలిసిందే. మూర్తి పేరును ఆయన నేరుగా ప్రస్తావించనప్పటికీ... కంపెనీ డైరెక్టర్ల బోర్డు మాత్రం నారాయణమూర్తి ఆరోపణలవల్లే సిక్కా వైదొలగాల్సివచ్చిందని కుండబద్దలు కొట్టింది. దీంతో ప్రమోటర్లు, బోర్డుకు మధ్య సంబంధాలు మరింత దిగజారాయి. కంపెనీ షేరు ధర 15 శాతానికిపైగా కుప్పకూలి రూ.34 వేల కోట్ల ఇన్వెస్టర్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది కూడా. ఈ పరిస్థితుల్లో ప్రమోటర్ల రీఎంట్రీ వాదనలు జోరుగా తెరపైకి వస్తున్నాయి.

ఏం పోస్టు ఇస్తారో...

ఇన్ఫీని స్థాపించిన ఏడుగురు ప్రమోటర్లలో నీలేకని ఒకరు. 2002 మార్చి నుంచి 2007 ఏప్రిల్ వరకూ ఐదేళ్లపాటు ఆయన సీఈఓగా పనిచేశారు. ఇన్ఫీ నుంచి వైదొలగిన తర్వాత ఆయన ఆధార్ కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐకి చైర్మన్‌గా వెళ్లారు. 2014లో ఎన్నికల్లో పోటీచేయడం కోసం యూఐడీఏఐకి రాజీనామా చేశారు. కాగా, నీలేకనిని నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు చెప్పాయి. ఐఐఏఎస్ కూడా ఇదే వాదనను వినిపించింది. ఆయన రీఎంట్రీపై రెండురోజుల్లో నిర్ణయం ఉండొచ్చని తెలుస్తోంది. 'ఇన్ఫోసిస్‌లోని తాజా పరిణామాలు చాలా ఆందోళన కలిగిస్తున్నాయి. తీవ్రమైన చర్చలు, సంప్రదింపుల తర్వాత... మేమంతా నీలేకనిని బోర్డులో కీలకమైన స్థానంలోకి తీసుకోవాలని కోరాం. వాటాదారులు, క్లయింట్లు, ఉద్యోగులకు కూడా నీలేకనిపై మంచి నమ్మకం ఉంది. ఇవన్నీ పరిశీలిస్తే.. నీలేకని తిరిగి రావటం వల్ల కంపెనీకి సంబంధించిన అన్నిపక్షాల్లో తిరిగి విశ్వాసం పునరుద్ధరించినటవుతుంది. మా సూచనను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నాం' అని ఫండ్ మేనేజర్లు ఇన్ఫీ బోర్డు చైర్మన్‌కు రాసిన సంయుక్త లేఖలో పేర్కొన్నారు. నీలేకనికి మద్దతు పలికిన వారిలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ తరఫున ఎస్.నరేన్, ఐసీసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ తరఫున మనీష్ కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ నుంచి ప్రశాంత్ జైన్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ నుంచి ప్రసున్ గజ్రి, రిలయన్స్ నిప్పన్‌లైఫ్ ఏఎంసీ తరఫున సునిల్ సింఘానియా, ఎస్‌బీఐ ఫండ్ మేనేజర్ నవనీత్ మునోత్, ఎస్‌బీఐ లైఫ్ నుంచి గోపాలకృష్ణ షెనాయ్ తదితరులు ఉన్నారు. ఇంకా, బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, ఐడీఎఫ్‌సీ ఏఎంసీ, డీఎస్‌పీ బ్లాక్‌రాక్, కోటక్ మహీంద్రా ఏఎంసీల ప్రతినిధులు కూడా ఈ జాబితాలో ఉన్నారు.

ఇక చక్రం తిప్పేది ఫండ్సే...

ఇన్ఫోసిస్ కొత్త సీఈఓ ఎంపికతోపాటు బోర్డు నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయిలో సంస్థాగత ఇన్వెస్టర్లకు కంపెనీలో వాటాలున్నాయి. జూన్ చివరినాటికి ఇన్ఫోసిస్‌లో దేశీ మ్యూచువల్ ఫండ్స్‌కు 8.95 శాతం వాటా ఉంది. ఇక బీమా కంపెనీలకు 11.05 శాతం వాటా ఉంది. ఇందులో ఒక్క ఎల్ఐసీ వాటాయే 7 శాతం కావడం గమనార్హం. ఇక ప్రమోటర్లందరికీ కలిపి ప్రస్తుతం ఇన్ఫీలో 12.8 శాతంమేర (మూర్తికి 3.5%) ఉన్నట్లు అంచనా. అయితే, కంపెనీలో అత్యధిక (మెజారిటీ) వాటా మాత్రం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లకు (దాదాపు 38.5 శాతం) ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో కంపెనీలో ఇకపై జరిగే పరిణామాల్లో ఈ సంస్థాగత ఇన్వెస్టర్లే కీలకం కానున్నారని పరిశీలకులు చెబుతున్నారు.

ఇన్వెస్టర్లతో మూర్తి భేటీ 29కి వాయిదా...



ఇన్ఫీలో కీలకమైన గ్లోబల్ ఇన్వెస్టర్లతో నారాయణ మూర్తి భేటీ వాయిదా పడింది. వాస్తవానికి ఆయన బుధవారం ఇన్వెస్టర్లతో మాట్లాడాల్సి ఉంది. అనారోగ్య కారణాలతో దీన్ని ఈ నెల 29కి వాయిదా వేసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సిక్కా ఆకస్మిక రాజీనామా తదనంతరం మళ్లీ ప్రమోటర్లు కంపెనీలోకి రావాలన్న వాదనలు బలపడుతున్న సంగతి తెలిసిందే. కాగా, గ్లోబల్ ఇన్వెస్టర్లతో మూర్తి కాన్ఫరెన్స్ కాల్‌కు బ్రోకర్ ఇన్వెస్టెక్ ఇండియా అనే సంస్థ ఏర్పాట్లు చేసింది. కంపెనీలో కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలు, ఇతరత్రా అంశాలపై ఆయన గ్లోబల్ ఇన్వెస్టర్లకు వివరించనున్నట్లు సమాచారం. సిక్కా రాజీనామా తర్వాత కంపెనీ భవిష్యత్ కార్యాచరణపై సంస్థాగత ఇన్వెస్టర్లు తీవ్రంగా దృష్టి పెట్టిన నేపథ్యంలో మూర్తి సమావేశం కీలకం కానుంది. కాగా, నారాయణ మూర్తి కంపెనీ బోర్డుపై, కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలపై చేసిన బహిరంగ విమర్శలు ఆయన వ్యక్తిగతంగా చేసినవే కావొచ్చని.. మొత్తం ప్రమోటర్ల అభిప్రాయం కాకపోవచ్చని ఇన్వెస్టర్ అడ్వయిజరీ సర్వీసెస్ పేర్కొంది. 'సిక్కా సారథ్యంలో బోర్డు ఆమోదించిన పలు విధానపరమైన ప్రతిపాదనలపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే, మూర్తి తప్ప ఇతర వ్యవస్థాపకులు ఎవరూ వ్యతిరేకించలేదు. ఒకవేళ బోర్డు ప్రతిపాదనలు ఆమోదయోగ్యం కాకపోతే తప్పకుండా వారు అసంతృప్తి వ్యక్తం చేసేవారు' అని ఐఐఏఎస్ తాజా నివేదికలో తెలిపింది.

నీలేకని బెస్ట్: బాలకృష్ణన్



ఇన్ఫోసిస్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనిశ్చిత పరిస్థితుల్లో నందన్ నీలేకనిని చైర్మన్‌గా నియమించడం మంచిదని కంపెనీ మాజీ సీఎఫ్ఓ వి.బాలకృష్ణన్ పేర్కొన్నారు. ఆయనకున్న అపార అనుభవం, క్లయింట్లతో అవినాభావ సంబంధాలు కంపెనీకి చాలా మేలు చేకూరుస్తాయని చెప్పారు. ప్రస్తుత చైర్మన్ ఆర్.శేషసాయి, సహ-చైర్మన్ రవి వెంకటేశన్‌లు తమ పదవులకు రాజీనామా చేయాలని... నిలేకనిని చైర్మన్‌గా నియమించేందుకు బోర్డు తక్షణం చర్యలు తీసుకోవాలని బాలకృష్ణన్ వ్యాఖ్యానించారు. 'నీలేకని సారథ్యంలో ఇన్ఫోసిస్ మంచి పనితీరును కనబరిచింది. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు పేరుప్రఖ్యాతులు, గౌరవం ఉన్నాయి. ఆధార్ సహా పలు భారీస్థాయి ప్రభుత్వ ప్రాజెక్టుల్లో పనిచేసిన అనుభవం ఆయన సొంతం. ఇప్పుడు ఆయన మళ్లీ చైర్మన్‌గా వచ్చి... మంచి సీఈఓను అన్వేషించేందుకు కృషిచేయాలి' అని అభిప్రాయపడ్డారు.

సిక్కా గుడ్‌బైతో ఇన్ఫీకి ఇబ్బందేం లేదు...

OppenheimerFunds
The Right Way to Invest

విశాల్ సిక్కా ఆకస్మిక రాజీనామా కారణంగా ఇన్ఫోసిస్‌కు ఎలాంటి ఇబ్బందీ లేదని ఓపెన్‌హీమర్ ఫండ్స్ అనే ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ పేర్కొంది. ఇన్ఫీలో ఈ ఫండ్స్ సంస్థ మూడో అతిపెద్ద సంస్థాగత వాటాదారు. జూన్ నాటికి దీనికి 2.16 శాతం వాటా ఉంది. కంపెనీకి రానున్న రోజుల్లో సంస్థాగత ఇన్వెస్టర్ల ధోరణి చాలా కీలకం కానున్న నేపథ్యంలో ఈ సంస్థ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'సిక్కా గుడ్‌బై తర్వాత మేం జరిపిన సమీక్షలో కంపెనీపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండబోదన్న అభిప్రాయం వ్యక్తమైంది' అని ఓపెన్‌హీమర్ ఫండ్స్ ప్రతినిధి కింగర్లీ వీన్రిక్ పేర్కొన్నారు.

నేటి నుంచి జియో ఫోన్స్ ప్రి-బుకింగ్

రూ. 500తో..



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో 4జీ ఫీచర్ ఫోన్స్ ప్రి-బుకింగ్ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఫోన్ కావాలనుకుంటున్న వారు రిలయన్స్ రిటైల్ స్టోర్స్, జియో వెబ్‌సైట్, జియో యాప్ ద్వారా సాయంత్రం 5 గంటల నుంచి రూ.500తో ప్రి-బుకింగ్ చేసుకోవచ్చు. ఫోన్ల డెలివరీ (సెప్టెంబర్‌లో) సమయంలో మిగతా రూ.1,000 చెల్లిస్తే సరిపోతుంది. ఫోన్ కొనుగోలుకు వెచ్చించిన మొత్తం రూ.1,500ను కస్టమర్ 36 నెలల తర్వాత తిరిగి తీసుకోవచ్చు.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- ఎఫ్ఐఐలు అమ్మేస్తున్నారు. సగటు ఇన్వెస్టర్లు ఏం చేయాలి ?
- పిట్ట కొంచెం.. లాభాలు ఘనం...
- ఫ్యూచర్ గ్రూప్ షేర్ల 'ఫ్యూచర్' ఏంటి ?
- ఆటో యాన్సలరీ రంగంలో ఆణిముత్యంలాంటి షేర్..
- లాభాల బాటలో టైర్ల షేర్ల పరుగులు
- ఇన్ఫీలోకి నందన్ నీలేకని.. 3 శాతం వరకూ పెరిగిన షేర్
- క్యూ1 ఫలితాలతో పురో'గతి'
- ఆల్‌టైమ్ హైకి అవెన్యూ సూపర్ మార్ట్స్

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..

WWW.SAKSHIBUSINESS.COM

SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

GET IT ON Google Play | Available on the App Store

జోరుగా బ్యాంకుల విలీనాలు..

ప్రతిపాదనల పరిశీలనకు ప్రత్యామ్నాయ యంత్రాంగం ● కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ: పటిష్టమైన, భారీ బ్యాంకుల ఏర్పాటు దిశగా మరిన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీన ప్రక్రియను కేంద్రం వేగవంతం చేసింది. విలీన ప్రతిపాదనలను పరిశీలించి, సత్వర నిర్ణయాలు తీసుకునేలా ప్రత్యామ్నాయ యంత్రాంగం (ఏఎం) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏఎం ఏర్పాటు యోచన ద్వారా పీఎస్‌బీల విలీనానికి కేంద్ర క్యాబినెట్ సూత్రప్రాయంగా ఆమోదముద్ర వేసినట్లు ప్రభుత్వం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'పటిష్టమైన, పోటీతత్వంతో కూడిన బ్యాంకుల ఏర్పాటు దిశగా ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనానికి ఈ నిర్ణయం దోహదపడుతుంది' అని వివరించింది. పీఎస్‌బీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ తొమ్మిది బ్యాంకు ఉద్యోగ సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు దిగిన మరుసటి రోజే కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఏఎం ఏర్పాటు నిర్ణయాన్ని వివరిస్తూ.. విలీనానికి సంబంధించి ఆయా పీఎస్‌బీల బోర్డుల నుంచి వచ్చే ప్రతిపాదనలను ప్రత్యామ్నాయ యంత్రాంగం పరిశీలిస్తుందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. 'ప్రభుత్వ రంగ బ్యాంకులు అనేకం ఉన్నాయి. పటిష్టమైన బ్యాంకుల ఏర్పాటే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇప్పటిదాకా జరిపిన విలీనాల అనుభవం సానుకూలంగానే ఉంది' అని ఆయన చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న రుణ అవసరాలు తీర్చేందుకు, నిధుల కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా పీఎస్‌బీలు సొంతంగా వనరులను సమకూర్చుకునేందుకు కన్సాలిడేషన్ దోహదపడనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే విలీనాలపై కొంత పురోగతి ఉండొచ్చని కేంద్ర ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. ఇటీవలే ఎస్‌బీఐలో అయిదు అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకును విలీనం చేయడం తెలిసిందే. ప్రస్తుతం ఎస్‌బీఐ కాకుండా 20 పీఎస్‌బీలు ఉన్నాయి. విలీనాల వార్తలతో పీఎస్‌బీల షేర్లు బుధవారం పెరిగాయి. బీఎస్‌ఈ బ్యాంకెక్స్ 1.39% లాభంతో 27,455 వద్ద ముగిసింది.

వ్యాపారాంశాలే ప్రాతిపదిక..

పటిష్టమైన బ్యాంకుల ఏర్పాటు నిర్ణయానికి వ్యాపారపరమైన అంశాలే పూర్తి ప్రాతిపదికని జైట్లీ చెప్పారు. ఈ విలీనాల ఊతంతో.. మార్కెట్లపరంగా వచ్చే షాకులను తట్టుకుని నిల్చేలా బ్యాంకింగ్ వ్యవస్థ సామర్థ్యం సంతరించుకోగలదని తెలిపారు. కన్సాలిడేషన్ ప్రతిపాదనలు ఆయా బ్యాంకుల బోర్డుల నుంచే రావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విలీన విధివిధానాల రూపకల్పనకు సూత్రప్రాయ ఆమోదం కోసం బ్యాంకుల నుంచి వచ్చే ప్రతిపాదనలను ఏఎం పరిశీలిస్తుందని జైట్లీ చెప్పారు. పర్యవేక్షణకు మంత్రుల కమిటీ కూడా ఉంటుందని, ఇందులో సభ్యుల ఎంపికపై ప్రధాని తుది నిర్ణయం తీసుకుంటారని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎన్ని బ్యాంకుల విలీనాలు ఉండొచ్చన్న విషయంపై ఇదమిత్థంగా ఆయన సంఖ్యేమీ వెల్లడించలేదు. దేశీయంగా బ్యాంకులు కొన్ని ఉన్నా గానీ.. పటిష్టమైనవిగా ఉండాలని 1991లో నరసింహం కమిటీ సిఫార్సు చేసినప్పటికీ.. 2016లో గానీ చర్యలు పూర్తి స్థాయిలో సాకారం కాలేదని ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఎస్‌బీఐలో 6 బ్యాంకుల విలీనం రికార్డు సమయంలో జరిగిందని తెలిపింది.

ఉద్యోగాల కోత ఉండదు..

ఈ కన్సాలిడేషన్‌తో ఉద్యోగాల కోత ఉండబోదని ఆర్థిక శాఖ వర్గాలు వివరించాయి. విలీనానంతరం ఉద్యోగుల తొలగింపు వంటి చర్యలేవీ ఉండకుండా ప్రభుత్వం చూస్తుందని పేర్కొన్నాయి. బ్యాంక్ జాతీయీకరణ చట్టానికి లోబడి పీఎస్‌బీల విలీనాలు ఉంటాయని తెలిపాయి. ఏఎం నుంచి సూత్రప్రాయ ఆమోదం వచ్చాక మిగతా నియంత్రణ సంస్థల నుంచి కూడా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని, షేర్ల బదలాయింపు నిష్పత్తిని నిర్ణయించాల్సి ఉంటుందని వివరించాయి. అవసరమైన అన్ని అనుమతులు తీసుకున్న తర్వాత విలీనానికి క్యాబినెట్ తుది అనుమతి ఇస్తుంది. మరోవైపు, పీఎస్‌బీల విలీన అంశంపై బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా ఉద్యోగులు సహా అన్ని వర్గాలను సంప్రదించాలని నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ వర్కర్స్ (ఎన్‌ఓబీడబ్ల్యూ) వైస్ ప్రెసిడెంట్ అశ్విని రాణా కోరారు.




వ్యాపారానికి 300 పర్యాటక కేంద్రాలు

- ఇన్వెస్టర్లకు మధ్యప్రదేశ్ టూరిజం బోర్డు పిలుపు
- జల్ మహోత్సవ్‌కు 50 లక్షల మంది రావచ్చని అంచనా



మీడియా సమావేశంలో శ్రీకాంత్ పాండే

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పర్యాటకుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 300 పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసినట్లు మధ్యప్రదేశ్ టూరిజం బోర్డు తెలియజేసింది. ఇప్పటికే 70 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని బోర్డు అదనపు ఎండీ శ్రీకాంత్ పాండే బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. పెట్టుబడికి ఈ కేంద్రాలు అనువైనవని చెప్పారాయన. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ప్రోత్సాహకాల రూపంలో రూ.30 కోట్లు ఖర్చు చేశామంటూ... టూరిజంను ప్రోత్సహించేందుకు ఎంతైనా వెచ్చించేందుకు బోర్డు సిద్ధంగా ఉందని తెలియజేశారు. దళారుల వ్యవస్థ లేకుండా ఆన్‌లైన్ బిడ్డింగ్ రూపంలో స్థలాలను లీజుకు కేటాయిస్తున్నట్టు చెప్పారు. కాగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జల్ మహోత్సవ్‌కు సర్వం సిద్ధమయినట్లు కూడా పాండే ప్రకటించారు. ఇందిరా సాగర్ డ్యామ్‌లో అక్టోబరు 15 నుంచి జనవరి 2 వరకు జరిగే ఈ ఉత్సవానికి 50 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నట్టు బోర్డు ఈడీ ఓమ్ విజయ్ చౌదరి తెలిపారు. గతేడాది 30 రోజుల పాటు నిర్వహించిన జల్ మహోత్సవ్‌కు 12 లక్షల మంది హాజరయ్యారు. భారత్‌లో ఇదే అతిపెద్ద వాటర్ అడ్వెంచర్ కార్నివాల్ అని చెప్పారు.




నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,800 (కనిష్టం) రూ.5,240 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.2,000 (కనిష్టం) రూ.5,000 (గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.3,600 (కనిష్టం) రూ.7,921 (గరిష్టం)
ఉల్లి (కర్నూలు)	రూ.260 (కనిష్టం) రూ.840 (గరిష్టం) (20న ముగింపు)
చక్కెర (చెన్నై)	రూ.4,080
బియ్యం (కరీంనగర్)	రూ.3,600 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,500
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	రూ.6,781











వీఎఫ్ఎస్ గ్లోబల్ చేతికి టీటీఎస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటిగ్రేటెడ్ వీసా ప్రాసెసింగ్ సొల్యూషన్స్ సంస్థ టీటీ సర్వీసెస్ (టీటీఎస్)ను ఔట్‌సోర్సింగ్ మరియు టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీ వీఎఫ్ఎస్ గ్లోబల్ చేజిక్కించుకుంది. దీంతో ప్రభుత్వ, వీసా అప్లికెంట్స్‌కు మరింత నాణ్యమైన సేవలందించే వీలు కలుగుతుందని వీఎఫ్ఎస్ గ్లోబల్ సీఈఓ జుబిన్ కర్కారియా ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్ఎఫ్‌కు 129కి పైగా దేశాల్లో 2,371 అప్లికేషన్ సెంటర్లున్నాయి.

సెప్టెంబర్ 26న ముంబైలో పర్యావరణ ట్రేడ్ షో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐఎఫ్‌టీ ఆధ్వర్యంలో ముంబైలోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో సెప్టెంబర్ 26 నుంచి 28 తేదీ వరకు నీరు, మురుగు నీటి శుద్ధి, రీసైక్లింగ్, పునరుత్పత్తి వంటి అంశాలపై పర్యావరణ వాణిజ్య ప్రదర్శన జరగనుంది. రోడ్ షోలో భాగంగా బుధవారమిక్కడ టాటా ప్రాజెక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ కామత్ మాట్లాడుతూ.. పర్యావరణ సమస్యలు, పరిష్కార మార్గాలు, సవాళ్లు, సాంకేతికాభివృద్ధి వంటి అంశాలపై సరైన అవగాహన కల్పించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. నీటి శుద్ధి, రీ సైక్లింగ్, నీటి యజమాన్యం, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఇంధన సామర్థ్య సాంకేతికత, భూసార శుద్ధి తదితర రంగాలకు చెందిన సంస్థలు ఈ సదస్సులో పాల్గొంటాయని తెలియజేశారు. సదస్సులో 18 దేశాల నుంచి 160కి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటారు.

రూ. 999కే విమానయానం

ఎయిర్‌ఏషియా ఆఫర్

న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఎయిర్‌ఏషియా ఇండియా తాజాగా రూ. 999కే విమాన ప్రయాణ టికెట్ల ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 27 దాకా ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఈలోగా టికెట్లు బుక్ చేసుకున్న వారు వచ్చే ఏడాది ఫిబ్రవరి 26 నుంచి ఆగస్టు 28 మధ్య కాలంలో ప్రయాణించవచ్చు. వెబ్‌సైట్, ఎయిర్‌ఏషియా మొబైల్ యాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని సంస్థ తెలిపింది. అయితే ఈ ఆఫర్ కింద ఎన్ని సీట్లు అందుబాటులో ఉంటాయన్నది ఎయిర్‌ఏషియా ఇండియా వెల్లడించలేదు. సీట్లు పరిమితంగానే ఉంటాయని, అన్ని ఫ్లయిట్స్‌లో అందుబాటులో ఉండకపోవచ్చని పేర్కొంది. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం కోల్‌కతా, బాగ్‌డోగ్రా మధ్య విమాన ప్రయాణ చార్జీలు రూ. 999 నుంచి ఉన్నాయి.

బ్యాంకింగ్ షేర్ల జోరు

- సెన్సెక్స్ 276 పాయింట్లు అప్
- 9,850 పాయింట్లపైకి నిఫ్టీ
- పీఎస్‌యూ బ్యాంకుల విలీనంపై కేబినెట్ నిర్ణయ ప్రభావం
- ప్రపంచ ట్రెండ్ తోడ్పాటు



ముంబై: ప్రపంచ మార్కెట్ ట్రెండ్ పటిష్టంగా వుండటంతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనంపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకోవడంతో బుధవారం భారత్ సూచీలు జోరందుకున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 276 పాయింట్లు జంప్ చేసి 31,593 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 9,850 పాయింట్లపైకి ఎగిసి 87 పాయింట్ల పెరుగుదలతో 9,852 వద్ద ముగిసింది. ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజపర్చడానికి ట్రంప్ యంత్రాంగం ఒక ప్రణాళికను సిద్ధం చేస్తున్నదన్న వార్తలతో క్రితంరోజు అమెరికా మార్కెట్ పెద్ద ర్యాలీ జరిపింది. దీంతో బుధవారం ఆసియా మార్కెట్లు సానుకూలంగా ట్రేడ్‌కావడంతో భారత్ సూచీలు సైతం గ్యాప్‌అప్‌తో మొదలయ్యాయి. ట్రేడింగ్ ముగింపు సమయంలో బ్యాంకుల విలీన వార్త వెలువడటంతో ఒక్కసారిగా మార్కెట్ ర్యాలీ ఊపందుకుని, పటిష్టంగా ముగిసింది.

ఇన్ఫోసిస్ రికవరీ..: ఇన్ఫోసిస్ సీఈఓ పదవి నుంచి విశాల్ సిక్కా వైదొలిగిన తర్వాత పరిణామాల ఫలితంగా గత కొద్ది రోజులుగా పతనమైన ఆ కంపెనీ షేరు తాజాగా కోలుకుంది. 1.98 శాతం పెరుగుదలతో రూ. 893 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ చీఫ్‌గా నందన్ నిలేకేని తిరిగి పగ్గాలు చేపట్టవచ్చన్న వూహాగానాలతో ఈ షేరులో కొనుగోళ్లు జరిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. వివిధ రంగాల సూచీల్లో అన్నింటికంటే అధికంగా బీఎస్ఈ రియల్టీ ఇండెక్స్ 3.48 శాతం పెరిగింది. డీఎల్ఎఫ్ (6 శాతం) ఇండియాబుల్స్ రియల్టీ (6 శాతం వరకూ) షేర్ల పెరుగుదల ఇందుకు ఒక కారణం.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,105
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	23,818
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	7,15,861
ఎఫ్ఐఐ	-1,158
డీఐఐ	930

మళ్లీ టాప్-10లోకి ఇన్ఫోసిస్

అత్యధిక మార్కెట్ విలువకలిగిన టాప్-10 కంపెనీల జాబితాలోకి ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తిరిగి ప్రవేశించింది. సీఈఓగా విశాల్ సిక్కా రాజీనామాతో ఇన్ఫోసిస్ షేరు పతనమై మార్కెట్ విలువను బాగా నష్టపోయిన కారణంగా టాప్-10 జాబితాలో స్థానం కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే బుధవారం ఆ షేరు 2 శాతం వరకూ ర్యాలీ జరపడంతో మార్కెట్ విలువ తిరిగి రూ. 2.05 లక్షల కోట్లకు చేరింది. దాంతో అత్యధిక మార్కెట్ విలువకలిగిన కంపెనీల్లో 10వ స్థానాన్ని ఇన్ఫోసిస్ తాజాగా ఆక్రమించింది. క్రితం రోజు ఈ స్థానంలో వున్న ఓఎన్‌జీసీ 11వ స్థానానికి దిగింది.

భారతి ఎయిర్‌టెల్...ఫ్యూచర్స్ సిగ్నల్స్




బుధవారంనాటి మార్కెట్ ర్యాలీలో బ్యాంకింగ్ షేర్లతో పాటు మెటల్, టెలికం రంగాలకు చెందిన షేర్లు కూడా పాలుపంచుకున్నాయి. వీటిలో టెలికం షేరు భారతి ఎయిర్‌టెల్ 2.6 శాతం పెరిగి 52 వారాల గరిష్టస్థాయి రూ. 432 వద్ద ముగిసింది. జూలై నెలలో ఈ షేరు మూడు దఫాలు రూ. 430 స్థాయిని తాకినప్పటికీ, ఆపైన ముగియలేకపోయింది. తాజా ర్యాలీ సందర్భంగా భారతి ఎయిర్‌టెల్ ఫ్యూచర్ కాంట్రాక్టు ఓపెన్ ఇంట్రస్ట్ (ఓఐ) నుంచి 1.46 లక్షల షేర్లు (0.50 శాతం) కట్ అయ్యాయి. దీంతో మొత్తం ఓఐ 2.90 కోట్లకు తగ్గింది. స్పాట్‌తో పోలిస్తే ఫ్యూచర్ ధర ప్రీమియం సైతం రూ. 1.70 నుంచి రూ. 1కి తగ్గింది. స్వల్పంగా ఓఐ కట్‌కావడం బుల్ అన్‌వైండింగ్‌ను సూచిస్తుండగా, ప్రీమియం తగ్గుదలకు డెరివేటివ్ సెటిల్‌మెంట దగ్గరపడుతుండటం కారణం. ఆప్షన్స్ విభాగంలో రూ. 430 స్ట్రయిక్ వద్ద కాల్ కవరింగ్‌తో లక్ష షేర్లు కట్‌కాగా, బిల్డప్ 5.30 లక్షలకు తగ్గింది. రూ. 440 స్ట్రయిక్ వద్ద స్వల్పంగా కాల్‌రైటింగ్ జరగడంతో 11 వేల షేర్లు యాడ్ అయ్యాయి. బిల్డప్ 5.15 లక్షల షేర్లకు చేరింది. రూ. 420 స్ట్రయిక్ వద్ద భారీ పుట్ రైటింగ్ జరగడంతో 3.72 లక్షల షేర్లు యాడ్ అయ్యాయి. పుట్ బిల్డప్ 7.90 లక్షల షేర్లకు చేరింది. సమీప భవిష్యత్తులో అనూహ్య వార్తలేవైనా వెలువడితే తప్ప, ఈ షేరు తగ్గితే రూ. 420 సమీపంలో మద్దతు పొందవచ్చని, రూ. 430పైన స్థిరపడితే క్రమేపీ రూ. 440 స్థాయిని అధిగమించవచ్చని ఆప్షన్ బిల్డప్ వెల్లడిస్తున్నది.

→ టాటా స్టీల్ డెరివేటివ్ సంకేతాలు ఏమిటి?
ఈ వివరాలు W . లో W

దీర్ఘకాలంలో నోట్ల రద్దు ప్రయోజనాలు

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డీ సుబ్బారావు ఆశాభావం



కోల్‌కతా: పెద్ద నోట్ల రద్దు ప్రతికూల ఫలితాలు గడచిన ఎనిమిది నెలలుగా స్పష్టంగా కనిపించినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు బుధవారం పేర్కొన్నారు. అయితే డీమోనిటైజేషన్ ప్రయోజనాలు దీర్ఘకాలంలో కనిపిస్తాయన్న ఆశాభావాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు. బంధన్ బ్యాంక్ రెండవ వ్యవస్థాపక వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. క్లుప్తంగా ఆయన వ్యాఖ్యల్ని చూస్తే....

- డీమోనిటైజేషన్ వల్ల వేలాది ఉద్యోగాలు పోయాయ్. రోగులకు తగిన వైద్యం అందలేదు. ప్రజలు గంటలకొద్దీ వరుసలో నిలుచున్నారు. ఎంతో వేదన కలిగింది. వీటన్నింటి ప్రతికూలత మనకు గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం (జనవరి–మార్చి) స్థూల దేశీయోత్పత్తి–జీడీపీ వృద్ధి రేటు (6.1 శాతం) రూపంలో కనబడింది.
- ఇంకా నిర్వహించాల్సిన లక్ష్యాల ఆధారంగా ప్రయోజనాలు ఉంటాయి. నల్లధనం తదుపరి సృష్టి జరక్కుండా చర్యలు, ఆర్థికలావాదేవీల డిజిటలైజేషన్, నకిలీనోట్లను రూపుమాపడం... ఇవన్నీ నిర్దేశిత లక్ష్యాల్లో కీలకమైనవి.
- డిజిటలైజేషన్ వైపు నడకకూ–డీమోనిటైజేషన్‌కు సంబంధం లేదు. డీమోనిటైజేషన్ అవసరం లేకుండానే డిజిటలైజేషన్ చర్యలు పటిష్టంగా చేపట్టవచ్చు.
- స్థూల దేశీయోత్పత్తిలో ఆదాపు పన్ను వాటా మరింత పెరగాలి.

ఆర్థిక రికవరీ ఆందోళనే: డీఅండ్‌బీ

భారత్ ఆర్థిక రికవరీ ఇంకా ఆందోళనకరంగానే ఉందని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ (డీఅండ్‌బీ) తన తాజా నివేదికలో పేర్కొంది. వినియోగం, పెట్టుబడుల డిమాండ్ ఇంకా మందకొడిగానే ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. బ్యాంకుల మొండిబకాయిల సమస్య, కంపెనీల బ్యాలెన్స్ షీట్స్ బలహీనత, వ్యవసాయ రుణ మాఫీ తద్వారా ద్రవ్య క్రమశిక్షణకు విఘాతం వంటి ప్రతికూల అంశాలను అమెరికాకు చెందిన ఈ వ్యాపార సేవల కంపెనీ ఉదహరించింది.

స్పైస్‌జెట్‌తో ప్రెగా న్యూస్ జట్టు



న్యూఢిల్లీ: మ్యాన్‌కై ండ్ ఫార్మాస్యూటికల్స్‌కు చెందిన ప్రెగ్నెన్సీ డిటెక్షన్ కిట్ 'ప్రెగా న్యూస్' తాజాగా విమానయాన సంస్థ 'స్పైస్‌జెట్'తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. గర్భిణి స్త్రీలకు విమాన ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశం. భాగస్వామ్యంలో భాగంగా స్పైస్‌జెట్ గర్భిణి స్త్రీలకు ప్రత్యేకమైన సదుపాయాలను కల్పించనుంది. చెకిన్ పాయింట్ దగ్గరి నుంచి విమానాశ్రయంలో కన్వేయర్ బెల్ట్ నుంచి లాగేజ్ తీసుకునేంత వరకు స్పైస్‌జెట్ బృందం గర్భిణి స్త్రీలకు అవసరమైన సహాయాన్ని అందిస్తుంది. అలాగే స్పైస్‌జెట్ ఎయిర్‌క్రాఫ్ట్ బోయింగ్ 737–800 సిరీస్‌పై ప్రెగా న్యూస్ బ్రాండ్ కనిపించనుంది. అదనపు బ్యాగేజ్ చార్జీల పెంపు తాము మార్కెట్‌లో పోటీపడటానికి దోహదపడగలదని స్పైస్‌జెట్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ డెబొజొ మహర్షి తెలిపారు. అదనపు బ్యాగేజ్ చార్జీలు పెంచకపోతే తాము ఆకర్షణీయమైన టికెట్ ధరలను అందిచలేమని పేర్కొన్నారు.

జీఎస్‌టీ పన్ను వసూళ్ల జోరు

జీఎస్‌టీఎన్ చైర్మన్ నవీన్ కుమార్



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను వ్యవస్థ కింద తొలి పన్ను వసూళ్లు పుంజుకుంటున్నాయని ట్యాక్స్ ఫైలింగ్ నిర్వహణా వ్యవహారాల విభాగం– జీఎస్‌టీ–నెట్‌వర్క్ చైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. ఇప్పటికి 20 లక్షల వ్యాపార సంస్థలు రిటర్న్స్ ఫైల్‌చేసి జీఎస్‌టీని చెల్లించాయని పేర్కొన్నారు. శుక్రవారం (25వ తేదీ)తో ముగియనున్న గడువులోపు మరో 30 లక్షల సంస్థ నుంచి జీఎస్‌టీ చెల్లింపులు జరుగుతాయని భావిస్తున్నామని ఆయన తెలిపారు. నిజానికి ఈ ట్యాక్స్ ఫైలింగ్ తుది గడువు ఆగస్టు 20. అయితే చివరి నిముషం జీఎస్‌టీఎన్ పోర్టల్ సర్వీస్ నిలిచిపోయింది. దీనితో ఫైలింగ్ గడువును మరో ఐదు రోజులు పెంచారు.

గూగుల్, వాల్‌మార్ట్ మధ్య ఈ-కామర్స్ ఒప్పందం



శాన్‌ఫ్రాన్సిస్కో: అమెజాన్‌కు చెక్ పెట్టేందుకు టెక్నాలజీ దిగ్గజం 'గూగుల్', ప్రపంచ అతిపెద్ద రిటైలర్ 'వాల్‌మార్ట్' చేతులు కలిపాయి. ఈ ఒప్పందం వల్ల వినియోగదారులు వాల్‌మార్ట్ ఉత్పత్తులను గూగుల్ ఆన్‌లైన్ షాపింగ్ మాల్ గూగుల్ ఎక్స్‌ప్రెస్‌లో కొనుగోలు చేయవచ్చు. అయితే ఈ సేవలు వచ్చే నెలలో అందుబాటులోకి వస్తాయి. అలాగే కస్టమర్లు గూగుల్ అసిస్టెంట్, గూగుల్ హోమ్‌కు వాయిస్ కంట్రోల్ ఇవ్వడం ద్వారా కూడా షాపింగ్ చేయొచ్చు. ఈ సేవలను కోరుకుంటున్న కస్టమర్లు వారి వాల్‌మార్ట్ అకౌంట్‌ను గూగుల్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. కాగా వాల్‌మార్ట్ అమెరికాలో తన వెబ్‌సైట్ ద్వారా కాకుండా, ఇతర దేశాల కస్టమర్ల కోసం ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతుండటం ఇదే తొలిసారి. వేల సంఖ్యలోని ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులో ఉంచడానికి గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నామని వాల్‌మార్ట్ ఈ–కామర్స్ విభాగం హెడ్ మార్క్ లోరే ఈ సందర్భంగా చెప్పారు.

ఎన్‌బీఎఫ్‌సీ కస్టమర్లకూ అంబుడ్స్‌మన్ సేవలు!

న్యూఢిల్లీ: నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) కస్టమర్ల సమస్యల పరిష్కారానికీ అంబుడ్స్‌మన్ వ్యవస్థను రూపొందించే విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరిశీలిస్తోంది. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎన్ఎస్ విశ్వనాథన్ బుధవారం ఈ విషయాన్ని తెలిపారు. సమస్యలు, సేవల లోపం వంటి అంశాల పరిష్కారం విషయంలో బ్యాంకింగ్ కస్టమర్లకు ప్రస్తుతం అంబుడ్స్‌మన్ సేవలు అందుతున్న సంగతి తెలిసిందే.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	29,150	▲	70
బంగారం (99.5, 10గ్రా)	29,000	▲	70
వెండి (కిలో)	39,035	▲	165
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	27,700	▼	20
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	29,580	▲	70
బంగారం (22 క్యారెట్లు)	27,660	▲	70
వెండి(కిలో)	39,265		0
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	29,850		0
బంగారం (22 క్యారెట్లు)	27,680	▼	40
వెండి(కిలో)	40,000		0
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	29,650	▼	270
బంగారం (22 క్యారెట్లు)	27,200	▼	330
వెండి(కిలో)	39,100	▼	400
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	30,100		0
బంగారం (22 క్యారెట్లు)	27,900		0
వెండి(కిలో)	40,000	▼	200
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	30,060	▲	50
బంగారం (22 క్యారెట్లు)	27,830	▲	50
వెండి(కిలో)	40,200	▲	100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	48.31 (రాత్రి 11.30కు)	$47.83 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	52.45 (రాత్రి 11.30కు)	$51.87 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 24-8-2017

విశాఖ	362-00
చిత్తూరు	390-00
వరంగల్	357-00
ముంబై	400-00
చెన్నై	397-00
విజయవాడ	359-00
గోదావరి	359-00
నమక్కల్	387-00
23-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	382-00
ఢిల్లీ	360-00
కోల్‌కతా	394-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ACC LIMITED	1801.9	1789.3
ADANI PORT	385	375.65
AMBUJA CEME	276.65	273.15
ASIAN PAINT	1141.3	1129.45
AXIS BANK L	502.65	499.2
BAJAJ AUTO	2754.65	2740.55

A B C D

3M INDIA LI	14361.1	13864
63 MOONS TE	62.05	60.75
8K MILES SO	497.05	494.35
AARTI DRUGS	517.25	516.75
AARTI INDUS	854.65	859.9
ABAN OFFSHO	173.75	172.65
ABBOTT INDI	4298.4	4299.15
ACCELYA KAL	1383.5	1405.4
BATA INDIA	678.15	683.2
BAYER CROPS	4111.4	4170.7
BEARDSELL L	53	52.25
BEML LIMITE	1804.05	1789.45
BERGER PAIN	237.2	237.15
BF INVESTME	159.1	156.4
BF UTILITIE	325.6	317.05
BGR ENERGY	137.2	128.35
BHAGERIA IN	261.8	259.15
BHANSALI EN	86.85	84.3
BHARAT BIJL	1169.95	1142.75
DHUNSERI IN	361.35	363.05
DHUNSERI PE	82.55	81.65
DHUNSERI TE	284.8	283.35
DIC INDIA L	506.2	505.9
DILIP BUILD	576.75	570.2
DISH TV IND	80.3	79.4
DOLLAR INDU	2227.5	2059.45
DOLPHIN OFF	85.25	83.6
DONEAR IND.	57.35	55.2
DR. LAL PAT	808.8	809.95
DWARIKESH S	62.5	61.3

GUJ STATE F	137.75	131.8
GUJ. APOLLO	186.4	185.25
GUJARAT ALK	409.2	409.5
GUJARAT AMB	111.35	112.05
GUJARAT FLU	752	751.2
GUJARAT GAS	793.45	771.05
GUJARAT MIN	138.7	136.95
GUJARAT PIP	132.1	132.5
GUJARAT STA	197.5	188.95
GULF OIL LU	801.7	803.9
GULSHAN POL	81	81.05
JET AIRWAYS	574.4	556.75
JET FREIGHT	98	93.4
JET KNITWEA	68	57
JHS SVEND.	70.5	66.8
JIND POL IN	56.45	57.2
JINDAL DRIL	160	159.1
JINDAL PHOT	64.45	64.05
JINDAL POLY	362.75	357.45
JINDAL SAW	90.75	90.35
JINDAL STAI	89.95	85.25
JINDAL STAI	183.8	174.85
MANAPPURAM	92.9	91.6
MANG.CHEM.F	62.1	61.85
MANGALAM CE	366.5	366.75
MANGALAM DR	139.9	131.9
MANPASAND B	830.85	819.4
MARATHON NX	280.05	277.45
MASTEK LTD	282.4	272.8
MAWANA SUGA	85.6	85.45
MAX FINANCI	606.2	601.4
MAX INDIA L	138.9	141.9
MAX VENTURE	86.45	86.65

PERSISTENT	619.1	620.05
PETRON ENGG	129	127.05
PFIZER LTD	1808.35	1763.3
PG ELECTROP	320.75	317.2
PHILIPS CAR	620.1	607.15
PHOENIX LAM	207.75	208.65
PI INDUSTRI	734.8	727.2
PIONEER DIS	196.1	190
PLASTIBLEND	256.4	260.8
PNB GILTS L	53.2	53.1
PNB HOUSING	1536.35	1513.2
SEQUENT SCI	116.1	117.35
SESHASAYEE	655.65	680.5
SHAKTI PUMP	494.4	489.05
SHALIM PAIN	211.5	205.3
SHANKARA BL	1179.6	1071.1
SHANTHI GEA	132.95	132
SHARDA CROP	435.65	436.85
SHARDA MOTO	2663.65	2661.35
SHEELA FOAM	1249.95	1294.05
SHEMAROO EN	336.95	335.15
SHILPA MEDI	555.5	552.15
THE MANDHAN	142.65	143.95
THE P K TEA	142.15	141.4
THE PHOENIX	547.7	540.05
THE RAMCO C	666.2	660.85
THE RUBY MI	307.95	305.2
THE STATE T	154.9	151.85
THE TINPLAT	143.15	136.65
THEJO ENGIN	396.9	378
THEMIS MEDI	464.9	434.3
THERMAX LTD	866.85	879.85
THIRU AROOR	53.3	54.1

✦ నాన్నకు.. రూ.4 లక్షల సాయం!

సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేయించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల



కోరుట్ల: స్వైన్‌ఫ్లూతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జగిత్యాల జిల్లా కోరుట్లవాసి ఎక్కల్‌దేవి ప్రకాశ్ దీనస్థితిని 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన క్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు స్పందించారు. రెండు రోజుల క్రితం ఆసుపత్రికి వెళ్లి ఎక్కల్‌దేవి ప్రకాశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. బుధవారం ప్రకాశ్ పరిస్థితిని సీఎం కేసీఆర్‌కు వివరించి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.4 లక్షలు మంజూరు చేయించారు. విద్యాసాగర్‌రావు 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ నిధులను నేరుగా ఆసుపత్రికి విడుదల చేయించినట్లు చెప్పారు. చికిత్సకు అదనంగా అయ్యే ఖర్చును సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదల చేయిస్తామని చెప్పారు.

✦ ఏ పార్టీలోకి వెళ్లినా పదవి వస్తుంది..



కానీ, దళితుల ప్రయోజనాలే ముఖ్యం: మంద కృష్ణ

సాక్షి, నాగర్‌కర్నూలు: తాను ఏ పార్టీలో చేరినా మంచి పదవి లభిస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూలులో జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీల్లో చేరాలని చాలామంది అడిగారని, మంచి పదవులు ఇస్తామని చెప్పినా లొంగలేదన్నారు. ఎమ్మార్పీఎస్ లక్ష్యం నెరవేరనిదే ఏ పార్టీలో చేరకూడదని ఉద్యమాన్ని కొనసాగిస్తున్నానని చెప్పారు. నాగర్ కర్నూలు ఎస్పీ కల్మేశ్వర్ ఇక్కడి దళితులపై రౌడీషీట్లు తెరుస్తున్నారని ఆరోపించారు.

కాళేశ్వరం.. అన్ని వర్గాల ఆమోదం

కామారెడ్డి, చిట్యాల, నారాయణఖేడ్‌లలో ప్రజాభిప్రాయ సేకరణ

- అన్నిపార్టీల మద్దతు.. దివంగత సీఎం వైఎస్సార్‌ను గుర్తుచేసిన నేతలు

సాక్షి, కామారెడ్డి/చిట్యాల/నారాయణఖేడ్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పర్యావరణ అనుమతుల కోసం నల్లగొండ జిల్లా చిట్యాల, కామారెడ్డి జిల్లాకేంద్రం, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. బుధవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రాజెక్టు నిర్మాణానికి మెజారిటీ ప్రజలు, అన్ని పార్టీల నాయకులు ఆమోదం తెలిపారు. చిట్యాలలో మిర్యాలగూడ ఎమ్మెల్యే ఎన్.భాస్కర్‌రావు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.జవహర్, నల్లగొండ ఆర్డీఓ వెంకటాచారి, ఐబీ డీఈ సురేందర్‌రావు, వివిధ శాఖల అధికారులు, చిట్యాల మండలం సుంకేనేపల్లి, వెలిమినేడు, గుండ్రాంపల్లి, గ్రామాలతోపాటు నార్కట్ పల్లి, రామన్నపేట మండలాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు. జేసీ నారాయణరెడ్డి మాట్లాడుతూ మెజారిటీ ప్రజల ఆమోదం మేరకు ప్రాజెక్ట్ నిర్మాణం చేపడతామన్నారు. నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ వృథాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను సాగునీరుగా వినియోగించుకునేందుకు నిర్మించనున్న అద్భుత ప్రాజెక్టు కాళేశ్వరమన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు నిర్మాణంతో వేలాది ఎకరాలకు సాగునీరు వస్తుందని, నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు.

కామారెడ్డిలో: కామారెడ్డిలో ఐదు గంటలపాటు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, హన్మంత్‌సిండే, జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, డీసీఎంఎస్ చైర్మన్ ముజీబుద్దీన్, జేసీ సత్తయ్య, కాళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఈ వేణు, ఈఈ శ్రీనివాస్, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగంగా 22వ ప్యాకేజీకి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కామారెడ్డిలోనే శంకుస్థాపన చేశారని డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, సీడీసీ చైర్మన్ ఇంద్రకరణ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జమునా రాథోడ్ పేర్కొన్నారు. 75 మంది తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. దాదాపు అందరూ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని, భూనిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ప్రాజెక్టును నిర్మిస్తే మేలు జరుగుతుందని టీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం నేతలు అభిప్రాయపడ్డారు.



కామారెడ్డి ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యనారాయణ

నారాయణఖేడ్‌లో

నారాయణఖేడ్‌లో జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్, 400 మంది రైతులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్నసాగర్ నుంచి సింగూరు ప్రాజెక్టుకు నీటిని తరలించాలనే ప్రభుత్వ ప్రణాళికను ముక్త కంఠంతో స్వాగతించారు. వలసలకు మారుపేరుగా ఉన్న నారాయణఖేడ్ ప్రాంతానికి ఈ ప్రాజెక్టు వరప్రదాయనిగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమైంది. డీపీఆర్ లేకుండా ప్రజాభిప్రాయాన్ని సేకరించడంపై కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం తప్పుపట్టాయి.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సేకరణ) విభాగము
ఫారం - VII (ప్రాథమిక డిక్లరేషన్)

(భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం-2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రూల్ 25 సబ్ రూల్ (1)ను అనుసరించి)

కలెక్టర్ ఫైల్ నం. ఓ1/1195/2017 తేది: 22.08.2017
ప్రత్యేక ఉప కలెక్టర్ గారి ఫైల్ నం. బి/332/15,బి/201/16,బి/334/15 తేది: 22.08.2017
గెజిట్ నెం. 109 తేది: 22.08.2017

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం ఈ దిగువ జాబితాలో పేర్కొనబడిన సిద్దిపేట జిల్లా, తొగుట మండలము, ఏటిగడ్డకిష్టాపూర్ గ్రామములోని విస్తీర్ణం ఎ. 56-04 1/4 గుంటలు, తొగుట గ్రామములోని విస్తీర్ణము ఎ. 39.21 గుంటలు, పల్లెపహాడ్ గ్రామములోని విస్తీర్ణము ఎ. 3.00 గుంటలు మరియు తుక్కాపూర్ గ్రామములోని విస్తీర్ణము ఎ.0.04 గుంటల భూమిని ప్రజా ప్రయోజనాల నిమిత్తము అనగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా శ్రీ కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణము కొరకు అవసరమైయున్నదని భావించినందున భూ సేకరణ చట్టం 30/2013 ప్రకారము ఏటిగడ్డకిష్టాపూర్, తొగుట, పల్లెపహాడ్ & తుక్కాపూర్ గ్రామములు, తొగుట మండలము, సిద్దిపేట జిల్లాలోని దిగువ జాబితాలో పేర్కొనబడిన భూములకు ప్రాథమిక డిక్లరేషన్ జారీ చేయనైనది.

షెడ్యూలు

గ్రామము: ఏటిగడ్డకిష్టాపూర్ మండలము: తొగుట జిల్లా: సిద్దిపేట

క్ర.సం	సర్వే నెం	భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ	గుం	ఖాతా నెం	భూమి పట్టాదారు/అనుభవదారు/ఆక్రమణదారు పేరు మరియు చిరునామా	భూమి స్వభావం	సరిహద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	[illegible]
1	2	3A	3B	4	5	6	7A	7B	7C	7D	8
1	637/AA	0	20.00	934	[illegible] తండ్రి [illegible]	Dry	623	638	617	636	
	633/EE	0	10.00	960	[illegible] తండ్రి [illegible]	Dry	640	654	655	652	
	638/[illegible]	0	24.50	960	[illegible] తండ్రి [illegible]	Dry	637	639	617	639	
	మొత్తం	1.00	14.50								
2	694/A	0	3.25	1025	[illegible]	Dry	691	695	693	709	చెట్లు, బావులు, బోర్లు, పైప్‌లైను మరియు ఇతర నిర్మాణాలు
	694/[illegible]	0	3.25	1025	[illegible]	Dry	691	695	693	709	
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
14	174/[illegible]	0	9.00		[illegible] తండ్రి [illegible]	Dry	278	273	279	276	
	మొత్తం	0.00	9.00								
15	303/AA	0	21.50	15	[illegible] తండ్రి [illegible]	Dry	312	300	VB	306	
	మొత్తం	0.00	21.50								
16	568/[illegible]	0	26.00	802	[illegible] తండ్రి [illegible]	Dry	567	387	388	569	
	568/[illegible]	0	23.00	802	[illegible]	Dry	567	387	388	569	
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
12	390	0	3	350	[illegible]	Dry	393	389	391	394	
	395	0	30.75			Dry	398	394	394	396	
	393	0	4			Dry	399	390	392	394	
	396	0	15			Dry	304	398	395	438	
	394	0	24			Dry	398	384	390	395	
	మొత్తం	1	36.75								
13	390	0	3	489	[illegible]	Dry	393	389	391	394	
	395	0	30.75			Dry	398	394	394	396	
	393	0	4			Dry	399	390	392	394	
	396	0	15			Dry	398	384	390	395	
	394	0	24			Dry	304	398	395	438	
	మొత్తం	1	36.75								
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
42	554	0	14.5	62	[illegible] తండ్రి రామయ్య	Dry	543	546	542	543	
43	660	0	9	928	[illegible]	Wet	659	649	661	656	
44	698	0	8	922	[illegible]	Wet	697	699	699	699	
45	452	0	7	1520	[illegible]	Dry	453	451	455	768	
	మొత్తం	39	21								

గ్రామము: పల్లెపహాడ్ మండలము: తొగుట జిల్లా: సిద్దిపేట

క్ర.సం	సర్వే నెం	ఎ	గుం	ఖాతా నెం	పేరు	స్వభావం	తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	
1	564	3	00	484	[illegible] తండ్రి [illegible]	Dry	562	VB	565	VB	0
	మొత్తం	3	00								

గ్రామము: తుక్కాపూర్ మండలము: తొగుట జిల్లా: సిద్దిపేట

క్ర.సం	సర్వే నెం	ఎ	గుం	ఖాతా నెం	పేరు	స్వభావం	తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	
1	155	0	04		గోపని రాములు తండ్రి నర్సయ్య	Dry	149	157	153	156	0
	మొత్తం	0	04								

ఇట్టి ప్రకటన చట్టం 30/2013 లోని సెక్షన్ 15 క్రింద తెలిపిన విధంగా ఆసక్తి గల వ్యక్తులను సంప్రదించి తగు విచారణ చేసిన తరువాత ఈ ప్రకటన చేయబడుచున్నది. ఇట్టి భూసేకరణ వలన భూ పునరావాసము కల్పించబడుచున్న కుటుంబాల వారి కొరకు పునరావాసం కల్పించడానికి ఈ కింద పేర్కొనబడిన భూమిని గుర్తించడం జరిగినది.

ఏటిగడ్డకిష్టాపూర్ గ్రామస్తులకు: విస్తీర్ణము: ఎ. 40.00 గుంటలు, గ్రామము: గజ్వేల్, మండలము: గజ్వేల్, జిల్లా: సిద్దిపేట

పల్లెపహాడ్ గ్రామస్తులకు: విస్తీర్ణము: ఎ. 35.00 గుంటలు, గ్రామము: [illegible], మండలము: కొండపాక, జిల్లా: సిద్దిపేట

ప్రాజెక్టు కొరకు భూమి సేకరించబడుచున్నందున నిర్మాణ దశలో సదరు భూమి లేదా సదరు భూమి యొక్క ఏదేని భాగము, ఇతర భాగాల కింద ఉండే గనులు, ఖనిజాలు [illegible] బొగ్గు, ఇనుము, రాగి, నాపరాయి లేదా ఇతర ఖనిజాల గనుల నుండి వచ్చే ఖనిజాలు అవసరం లేదు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ భూసేకరణ యొక్క ప్లాన్ భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ విభాగము-3, సిద్దిపేట వారి కార్యాలయము పనివేళలో పరిశీలించుటకొరకు నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- తహసీల్దార్, తొగుట మండలము | సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), యూనిట్-3, కాళేశ్వరం ప్రాజెక్ట్ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, సిద్దిపేట జిల్లా | సం/- జాయింట్ కలెక్టర్ సిద్దిపేట జిల్లా | సం/- జిల్లా కలెక్టర్, సిద్దిపేట జిల్లా

DIPR RO No.866/LA/PP/2017-18

మా కొడుకు జాడేది?

వంద రోజులైనా కనిపించని ఆచూకీ బాలుడి తల్లిదండ్రుల ఆవేదన

యాదగిరిగుట్ట: ఓ బాలుడు అపహరణకు గురై వంద రోజులైనా నేటికీ ఆచూకీ లభించడం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన న్యాలపట్ట అశోక్-నిర్మల దంపతుల కుమారుడు అరుణ్ (బిట్టు)(5) మే 16న పక్కనే ఉన్న బంధువుల ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు తమ కుమారుడిని ఎవరో ఎత్తుకెళ్లారని అప్పట్లో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారం రోజులపాటు హడావుడి చేసిన పోలీసులు.. ఆ తర్వాత పట్టించుకోలేదని, వంద రోజులవుతున్నా తమ కుమారుడి జాడ కనిపెట్టలేక పోయారని బాలుడి తండ్రి అశోక్ బుధవారం విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తన కుమారుడి జాడను కనుక్కోవాలని వేడుకున్నారు.

పెద్దపల్లి సభలో బాహాబాహీ..

- మాజీ మంత్రి శ్రీధర్‌బాబు వర్సెస్ ఎమ్మెల్యే పుట్ట మధు
- ప్రాజెక్టుపై అభిప్రాయ సేకరణ సందర్భంగా దాడి

పెద్దపల్లి/పెద్దపల్లి రూరల్: కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టుపై తలపెట్టిన అభిప్రాయ సేకరణలో మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు వర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. పెద్దపల్లిలో బుధవారం పర్యావరణ కాలుష్య నియంత్రణ బోర్డు తలపెట్టిన అభిప్రాయ సేకరణ రసాభాసగా ముగిసింది. ఇరువర్గాల మధ్య దాడిలో ముగ్గురు కాంగ్రెస్ నాయకులకు గాయాలయ్యాయి. మాజీ మంత్రి అనుచరులు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మాట్లాడటం గొడవకు దారితీసింది. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మాట్లాడి అడ్డుకుంటున్న వారిని అరెస్టు చేసి అభిప్రాయ సేకరణ కానిచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. సభ ప్రారంభం కాగానే భూనిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పట్ల శ్రీనివాస్ మైక్ అందుకొని ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రసంగించారు. శ్రీనుపై టీఆర్ఎస్ నాయకులు పిడిగుద్దులు కురిపిస్తూ దాడికి దిగారు. దీనిని వ్యతిరేకించే క్రమంలో మంథనికి చెందిన క్రాంతి, కొత్త శ్రీనివాస్‌లపై కూడా టీఆర్ఎస్ నాయకులు దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై టీఆర్ఎస్ నాయకులు కుర్చీలు విసిరేయడంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను నిలువరించారు. సమావేశానికి హాజరైన శ్రీధర్‌బాబు సహా కాంగ్రెస్ శ్రేణులను అరెస్టు చేసి పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆహారం తీసుకునేందుకు కూడా అనుమతించడం లేదని స్టేషన్ ముందు బైఠాయించారు.



బుధవారం పెద్దపల్లి సభలో కుర్చీలు విసురుకుంటున్న కాంగ్రెస్, టీఆర్ఎస్ కార్యకర్తలు

కాళేశ్వరం ప్రాజెక్టుకు జై: ఇన్‌చార్జి కలెక్టర్

పెద్దపల్లిలో కాలుష్య మండలి ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న 25 మందిలో 23 మంది కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుకూలంగా మాట్లాడారని ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

అభిప్రాయ సేకరణ జరగాలని అంటే..

150 కి.మీ దూరంలోని కాళేశ్వరం వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు కోసం అక్కడి భూనిర్వాసితులతో అభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేస్తే టీఆర్ఎస్ నాయకులు గూండాల్లా వ్యవహరించారని శ్రీధర్‌బాబు విమర్శించారు.

ప్రగతి భవన్‌ను ముట్టడించండి



నిరుద్యోగులకు తమ్మినేని పిలుపు

నల్లగొండ రూరల్: ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ప్రగతిభవన్‌ను ముట్టడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండలో టీ-మాస్ ఫోరం జిల్లా ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. కోర్టులు కొట్టి వేసే విధంగా ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేస్తోం దని ఆరోపించారు. సామాజిక న్యాయం, సామాజిక సంస్కృతి, ఆర్థిక సమానత్వం కోసం టీ-మాస్ అండగా ఉంటుందన్నారు. కులాలవారీగా రిజర్వేషన్లు, రాజకీయ పార్టీలో కూడా ఎవరి వాటా వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజాగాయకుడు గద్దర్ మాట్లాడుతూ త్యాగాల తెలంగాణలో భోగాలు అనుభవిస్తున్నది అగ్రకులస్తులేనని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు మరల కులం పునాదుల్లోకి వెళ్లడం అభినందనీయమని పేర్కొన్నారు.

తొమ్మిది మందిపై నిర్భయ కేసు

కళాశాల బస్సుపై దాడి ఘటన.. నిందితులంతా మైనర్లే

జోగిపేట : కాలేజీ బస్సును ఆపి విద్యార్థులపై దాడి చేసిన ఘటనలో తొమ్మిది మందిపై నిర్భయ కేసు నమోదు చేశారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట పోలీస్‌సర్కిల్ పరిధిలోని పుల్కల్ మండలం వెంకటకిష్టాపూర్, వెండికోలు గ్రామాల మధ్య మంగళవారం సాయంత్రం సంగారెడ్డి ఎస్వీ కళాశాలకు చెందిన బస్సుపై జరిగిన దాడి ఘటన సంచలనం రేపిన విషయం విదితమే. వెంట తెచ్చుకున్న కెమికల్ పౌడర్ చల్లడంతో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థినులపై పడి అస్వస్థతకు గురయ్యారు. నిందితుల్లో ఆరుగురు ఇంటర్ విద్యార్థులు కాగా ఒకరు ఐటీఐ, మరో ఇద్దరు బీరు కంపెనీలో పనిచేసుకునే వారుగా గుర్తించారు. ఇందులో ఒకరు పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితులంతా మైనర్‌లే కావడం విశేషం.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో మహిళ ఆత్మహత్యాయత్నం

మధిర: ఖమ్మం జిల్లా మధిర టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఏపీ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం సత్యాలపాడుకు చెందిన ప్రైవేటు సర్వేయర్ పాయం నాగలక్ష్మి అలియాస్ కల్పన అలియాస్ చంద్రకళ(29) ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మధిరలోని బంజార కాలనీకి చెందిన కంపరాజు లక్ష్మయ్య ఖమ్మంలోని ఓ హోటల్‌లో సప్లయర్. అతడి కొడుకులు సుధాకర్, రాజశేఖర్ ఎంబీఏ, ఎంటెక్ పూర్తి చేశారు. ఈ క్రమంలో వారికి సర్వేయర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పిన కల్పన.. పలు దఫాలుగా లక్ష్మయ్య నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితుడు మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ కోసం చంద్రకళను మధిర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఆమె బాత్‌రూమ్‌కు వెళ్లి తన చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు టౌన్ ఎస్ఐ బెంద్రం తిరుపతిరెడ్డి తెలిపారు. దీనిని గమనించిన మహిళా కానిస్టేబుల్ తోపాటు పోలీసులు చంద్రకళను ఖమ్మంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గోపాల్‌పేట: వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కావలి శ్రీనివాసులు (48) మంగళవారం రాత్రి భోజనం అనంతరం పక్క పొలం రైతు శేఖర్‌రెడ్డితో కలసి పొలం వద్దకు వెళ్లాడు. బోరు ఆన్ చేసి వస్తానని వెళ్లిన శ్రీనివాసులు అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఫ్యూజ్ సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. ఆయన ఎంతకూ రాకపోవడంతో శేఖర్‌రెడ్డి వెళ్లి చూడగా శ్రీనివాసులకు స్పృహ లేకపోవడంతో కుటుంబసభ్యులకు తెలియజేశాడు. అందరూ చేరుకునే సరికి ఆయన మృతి చెందాడు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

నార్నూర్/జైనథ్: ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం ఒకేరోజు ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై హరిశేఖర్ కథనం ప్రకారం.. గాదిగూడ మండలం కొత్తపల్లి జీ గ్రామానికి చెందిన రైతు కాంబ్లే దత్త(30)కు నాలుగెకరాల పొలం ఉండగా, మూడెకరాల్లో పత్తి, ఎకరంలో జొన్న సాగు చేశాడు. రెండు రోజులుగా పత్తి పంట ఎండిపోతుండగా ఆందోళన చెందాడు. సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చేదని మనస్తాపానికి గురై బుధవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. దత్తకు భార్య శశికళ, ఇద్దరు పిల్లలున్నారు. అలాగే, జైనథ్ మండలం గూడ పంచాయతీ పరిధి రాంపూర్(టి) గ్రామానికి చెందిన కౌలు రైతు ఊట్ల లచ్చన్న (45) మూడేళ్లుగా తన తల్లి లక్ష్మికి చెందిన నాలుగెకరాల భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈసారి పత్తి సాగు చేయగా ఇటుక రాయి తెగులు సోకి పంట ఎదుగుదల లోపించింది. దీంతో దిగుబడిపై దిగులు చెందిన లచ్చన్న బుధవారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. లచ్చన్నకు భార్య రాధ, కుమారుడు రాకేశ్ ఉన్నారని, ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుల్లయ్య తెలిపారు.



దత్త మృతదేహం



లచ్చన్న మృతదేహం

పురుగుమందు పిచికారీ చేస్తూ రైతు మృతి

బిచ్కుంద(జుక్కల్): కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం పెద్దతక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు మేకల నారాయణ (48) బుధవారం పురుగుల మందు పిచికారీచేస్తూ మృత్యువాత పడ్డాడు. నారాయణ తైవాన్ పంపుతో సోయా పంటకు పురుగుల మందు పిచికారీ చేస్తున్నాడు. ఈ క్రమంలో పంపు పైపు ఊడిపోయి కళ్లలో, నోటిలో మందు పడింది. దీంతో ఆయన కొద్దిసేపటికే స్పృహ కోల్పోయాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో బిచ్కుంద ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మరణించాడు. మందు కళ్లలోకి పోవడంతో కంటి నాళాల ద్వారా విషం తొందరగా మెదడుకు వ్యాపించి మరణించాడని వైద్యులు తెలిపారు.

అయ్యోపాపం.. ఆటోలో ఆడ శిశువు

అక్కున చేర్చుకుని వరంగల్‌కు తరలించిన అంగన్‌వాడీలు

గోవిందరావుపేట: మనలను కనిపెంచేందుకు తల్లి కావాలి.. పెళ్లి చేసుకునేందుకు అమ్మాయి కావాలి.. మన వంశాన్ని పెంచుకునేందుకు వారు పిల్లలను కనాలి.. కానీ మన పిల్లలుగా ఆడపిల్లలు వద్దనుకునే తీరు మాత్రం మారడం లేదు. సరిగ్గా ఇలాంటి తల్లిదండ్రులే అప్పుడే పుట్టిన ఆడశిశువును వదిలేసిన సంఘటన పస్రా గ్రామంలోని మేడారం రోడ్డులో జెడ్పీ ఉన్నత పాఠశాల పక్కన బుధవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. ఆటో సీటు నుంచి కిందపడి ఏడుస్తున్న పసికందు ఏడుపులు విన్న చుట్టుపక్కల మహిళలు అక్కడి పరిస్థితి చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారి సమాచారంతో స్పందించిన ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ బత్తిని కళ్యాణి స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారమిచ్చారు. వెంటనే అంగన్‌వాడీలు పద్మారాణి, ఝాన్సీ, సరిత, సారాబాయి, ఊర్మిళ అక్కడికి వెళ్లి పాపను తీసుకున్నారు. మట్టి కొట్టుకుపోయిన పాపను తమ పిల్లలా భావించి శుభ్రంగా స్నానం చేయించారు. అనంతరం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి పాప ఆరోగ్యంగా ఉన్నట్లు తెలుపగా, ఆమె ఏడుపులకు చలించిన అక్కడే ఉన్న మరో తల్లి తన చనుబాలను ఆ పాపకు అందించింది. అనంతరం పాపను 108 ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు వరంగల్‌లోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు అప్పగించారు.





ఆటోలో దొరికిన సమయంలో అలా.., అంగన్‌వాడీల చెంత ఇలా..

సాక్షి స్పోర్ట్స్
గురువారం 24-8-2017



తొలి రౌండ్‌లోనే సానియా జంట ఓటమి

కనెక్టికట్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ సానియా మీర్జా (భారత్)–మోనికా నికెలెస్కూ (రొమేనియా) జంట తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. అమెరికాలోని న్యూ హవెన్‌లో బుధవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సానియా–మోనికా ద్వయం 5–7, 6–7 (4/7)తో నికోల్ మెలిచార్ (అమెరికా)–అనా స్మిత్ (బ్రిటన్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. గంటన్నరపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా జంట ప్రత్యర్థి సర్వీస్‌ను మూడు సార్లు బ్రేక్ చేసి, తమ సర్వీస్‌ను నాలుగు సార్లు కోల్పోయింది. తొలి రౌండ్‌లోనే ఓడిన సానియా జోడీకి 3,340 డాలర్ల (రూ. 2 లక్షల 13 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

శభాష్... సాయిప్రణీత్

మూడో గేమ్‌లో వెనుకబడి గెలిచిన తెలుగు తేజం

- శ్రీకాంత్, సైనా కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న భారత బ్యాడ్మింటన్ యువతార భమిడిపాటి సాయిప్రణీత్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మరో ముందడుగు వేశాడు. తొలిసారి ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటున్న ఈ తెలుగు తేజం రెండో రౌండ్‌లో ఓటమి అంచుల్లో ఉన్న దశలో పట్టుదలతో పోరాడి గట్టెక్కాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మరోవైపు ఎనిమిదో సీడ్ కిడాంబి శ్రీకాంత్, 12వ సీడ్ సైనా నెహ్వాల్ అలవోక విజయాలతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

గ్లాస్గో (స్కాట్లాండ్): అత్యున్నత వేదికపై అదరగొట్టే ఆటతీరును ప్రదర్శించేందుకు వచ్చిన అవకాశాన్ని భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వరుసగా ఐదో ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ పతకం గెలిచే దిశగా అడుగులు వేస్తున్నారు. పురుషుల సింగిల్స్‌లో భమిడిపాటి సాయిప్రణీత్, కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ తమ ప్రత్యర్థులను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖాయం చేసుకున్నారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 19వ ర్యాంకర్ సాయిప్రణీత్ 14–21, 21–18, 21–19తో ప్రపంచ 26వ ర్యాంకర్ ఆంథోనీ సినిసుకా జిన్‌టింగ్ (ఇండోనేసియా)పై గెలుపొందగా... శ్రీకాంత్ 21–9, 21–17తో లుకాస్ కోర్వి (ఫ్రాన్స్)ను ఓడించాడు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సమీర్ వర్మ (భారత్) 20–22, 9–21తో 16వ సీడ్ రాజీవ్ ఉసెఫ్ (ఇంగ్లండ్) చేతిలో ఓడాగా... 13వ సీడ్ అజయ్ జయరామ్ 21–13, 21–18తో మార్క్ కాల్జు (నెదర్లాండ్స్)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లో ఐదో సీడ్ చెన్ లాంగ్ (చైనా)తో పోరుకు సిద్ధమయ్యాడు.

మహిళల సింగిల్స్‌లో తొలి రౌండ్‌లో 'బై' పొందిన సైనా నెహ్వాల్ రెండో రౌండ్‌లో 21–11, 21–12తో సబ్రీనా జాక్వెట్ (స్విట్జర్లాండ్)పై విజయం సాధించింది. ఈ గెలుపుతో సైనా వరుసగా ఎనిమిదోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో తన్వీ లాడ్ (భారత్) 9–21, 19–21తో సుంగ్ జీ హున్ చేతిలో, రితూపర్ణ దాస్ (భారత్) 16–21, 13–21తో 16వ సీడ్ క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్) చేతిలో ఓడిపోయారు.

వరుసగా 8 పాయింట్లు...

జిన్‌టింగ్‌తో 72 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాయిప్రణీత్ పుంజుకున్నతీరు అద్భుతం. తొలి గేమ్‌ను కోల్పోయిన ఈ హైదరాబాద్ ప్లేయర్ రెండో గేమ్‌లో కోలుకున్నాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో జిన్‌టింగ్ దూకుడుగా ఆడి 18–12తో ఆధిక్యంలోకి వెళ్లి విజయానికి మూడు పాయింట్ల దూరంలో నిలిచాడు. అయితే ఈ ఏడాది సింగపూర్ ఓపెన్, థాయ్‌లాండ్ ఓపెన్ టైటిల్స్ నెగ్గిన సాయిప్రణీత్ ఓటమి దిశగా పయనిస్తున్నా విజయంపై ఆశలు వదులుకోలేదు. కీలకదశలో ఒత్తిడికి లోనుకాకుండా సంయమనంతో ఆడిన సాయిప్రణీత్... నమ్మశక్యంకాని రీతిలో విజృంభించి వరుసగా ఎనిమిది పాయింట్లు స్కోరు చేసి 20–18తో విజయం అంచుల్లోకి వచ్చాడు. జిన్‌టింగ్ ఒక పాయింట్ గెలిచినా, వెంటనే సాయిప్రణీత్ మరో పాయింట్ సాధించి చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మార్క్ జ్విబ్లెర్ (జర్మనీ) లేదా చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో సాయిప్రణీత్; ఆండర్స్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)తో శ్రీకాంత్; రెండో సీడ్ సుంగ్ జీ హున్ (కొరియా)తో సైనా నెహ్వాల్; ఎన్గాన్ యి చెయుంగ్ (హాంకాంగ్)తో పీవీ సింధు తలపడతారు.

మరోవైపు మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) 22–24, 21–19, 15–21తో రెండో సీడ్ కామిల్లా రైటర్‌జుల్–క్రిస్టినా పెడర్సన్ (డెన్మార్క్) చేతిలో... ఆరతి సారా సునీల్–సంజన సంతోష్ (భారత్) 14–21, 15–21తో యిక్సిన్ బావో–జియోహాన్ యు (చైనా) చేతిలో ఓటమి పాలయ్యారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో మేఘన–పూర్విషా 21–13, 16–21, 8–21తో ముస్కెన్స్–పియెక్ (నెదర్లాండ్స్) చేతిలో... పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అర్జున్–శ్లోక్ 14–21, 21–19, 14–21తో మిన్ చున్–చెంగ్ హెంగ్ సు (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయారు.

అజహర్‌ను 'మోసగించారు'

ఎన్నికల్లో పోటీకి దూరమైన మాజీ కెప్టెన్



హైదరాబాద్: గత జనవరిలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఎన్నికలు జరిగాయి. ఇందులో అధ్యక్ష పదవి కోసం భారత మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఆయనపై ఉన్న ఫిక్సింగ్ ఆరోపణలను కారణంగా చూపిస్తూ రిటర్నింగ్ అధికారి రాజీవ్ రెడ్డి, అజహర్ నామినేషన్‌ను తిరస్కరించారు. తనను 2012లో హైకోర్టు నిర్దోషిగా తేల్చిందంటూ అజహర్ వాదించినా... బీసీసీఐ నుంచి ఈ విషయంలో స్పష్టత లేదంటూ రిటర్నింగ్ అధికారి పట్టించుకోలేదు. అయితే ఇది అజహర్‌ను అడ్డుకునేందుకు ప్రత్యర్థి వర్గం చేసిన కుట్రగా తాజాగా బయట పడింది. పోటీ చేసేందుకు అర్హత ఉందా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలంటూ నాటి అడ్‌హాక్ కమిటీ చైర్మన్ ప్రకాశ్ చంద్ జైన్ బీసీసీఐకి వరుసగా ఇ–మెయిల్స్ పంపారు. అయితే తనకు ఎలాంటి జవాబు రాలేదంటూ జైన్ చెప్పడంతో రిటర్నింగ్ అధికారి తన నిర్ణయానికే కట్టుబడ్డారు. కానీ జనవరి 12నే బీసీసీఐ దీని గురించి హెచ్‌సీఏకు మెయిల్ చేసినట్లు వెల్లడైంది. ఇందులో 'అజహర్‌పై ఎలాంటి కేసు పెండింగ్‌లో లేదు కాబట్టి బోర్డు న్యాయ విభాగానికి కూడా అతని విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేవు' అని స్పష్టంగా పేర్కొంది. మరో ఐదు రోజుల తర్వాత ఎన్నికలు ఉన్నా... ప్రకాశ్ చంద్ గానీ, రాజీవ్ రెడ్డి గానీ ఈ లేఖను బయట పెట్టకుండా తమకు బోర్డు నుంచి సమాచారం లేదంటూ అజహర్ నామినేషన్‌ను తిరస్కరించారు. అతను అసోసియేషన్‌లోకి రాకుండా అడ్డుకునేందుకే ఈ కుట్ర జరిగినట్లు కనిపిస్తోంది. అయితే అలాంటి సమయంలో కూడా బీసీసీఐ తమ లేఖను ఎందుకు బయట పెట్టలేదనేది ఆశ్చర్యకర విషయం. ఈ అంశంపై ప్రస్తుత హెచ్‌సీఏ కమిటీ ఇంకా స్పందించలేదు.

మహిళా రెజ్లర్లు విఫలం

పారిస్: ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో బుధవారం మొదలైన మహిళల ఫ్రీస్టయిల్ బౌట్‌లలో పోటీపడిన భారత రెజ్లర్లు నిరాశపరిచారు. లలిత (55 కేజీలు), పూజా ధండా (58 కేజీలు), శిల్పి షెరాన్ (63 కేజీలు), పూజ (75 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్ దశను దాటలేకపోయారు. గురువారం జరిగే బౌట్‌లలో వినేశ్ ఫొగట్ (48 కేజీలు), శీతల్ (53 కేజీలు), సాక్షి మలిక్ (60 కేజీలు), నవ్‌జ్యోత్ కౌర్ (69 కేజీలు) పోటీపడతారు.

హర్యానా స్టీలర్స్ గెలుపు

లక్నో: ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 27–25తో దబంగ్ ఢిల్లీపై గెలుపొందింది. స్టీలర్స్ జట్టులో దీపక్ దహియా (7 పాయింట్లు), సుర్జీత్ సింగ్ (5), వికాస్ (4) రాణించారు. అనంతరం యూపీ యోధ, తమిళ్ తలైవాస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 33–33తో టైగా ముగిసింది. నేడు జరిగే ఏకైక మ్యాచ్‌లో యూపీ యోధతో తెలుగు టైటాన్స్ తలపడుతుంది.

ఆంధ్ర కోల్ట్స్ విజయం

సాక్షి, హైదరాబాద్: ఆలిండియా మొయినుద్దౌలా గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీలో ఆంధ్ర కోల్ట్స్ జట్టుకు తొలి విజయం లభించింది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 118 పరుగుల భారీ తేడాతో గోవాను చిత్తు చేసింది. ముందుగా ఆంధ్ర కోల్ట్స్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 292 పరుగులు చేసింది. సీఆర్ జ్ఞానేశ్వర్ (63 బంతుల్లో 68; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), డీబీ రవితేజ (73 బంతుల్లో 55; 3 ఫోర్లు), కె.మహీప్ కుమార్ (57 బంతుల్లో 50; 3 ఫోర్లు, ఒక సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం గోవా 49.2 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటైంది. దర్శన్ మిసాల్ (48) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఆంధ్ర తరఫున ఎస్‌కే కమ్రుద్దీన్ 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... సురేందర్ కుమార్, ఎస్‌హెచ్ శ్రీనివాస్ చెరో 2 వికెట్లు తీశారు. ఇతర మ్యాచ్‌లలో విదర్భపై 4 వికెట్లతో 'కాగ్'... కేరళపై 95 పరుగులతో బరోడా... కంబైన్డ్ డిస్ట్రిక్ట్స్ ఎలెవన్‌పై 9 వికెట్లతో ఎయిరిండియా జట్లు విజయం సాధించాయి.

సిఫారసులు ఎందుకు అమలు చేయట్లేదు?



- స్వయంగా కోర్టుకొచ్చి చెప్పండి
- బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శికి సుప్రీం కోర్టు నోటీసు

న్యూఢిల్లీ: భారత సర్వోన్నత న్యాయస్థానం క్రికెట్ బోర్డు వైఖరి పట్ల మళ్లీ మండిపడింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లో సుపరిపాలన, పారదర్శకత కోసం 'లోధా' సిఫారసులను ఎందుకు అమలు చేయడం లేదో స్వయంగా కోర్టు ముందుకొచ్చి చెప్పాలని తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరికి సుప్రీం కోర్టు షోకాజ్ నోటీసు జారీ చేసింది. వచ్చే నెల 19లోపు హాజరు కావాలని ఆదేశించింది. బోర్డు పరిపాలక కమిటీ (సీఓఏ) ఇటీవల జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య బెంచ్‌కు బోర్డు వర్గాల అలసత్వాన్ని నివేదించింది. లోధా సిఫారసులు అమలు చేయడం బోర్డు ఉన్నతాధికారులకు ఇష్టం లేదని, వీళ్లని తప్పించాలని కోర్టుకు అందజేసిన నివేదికలో సీఓఏ పేర్కొంది. దీనిపై విచారించిన జస్టిస్ మిశ్రా, జస్టిస్ ఖాన్విల్కర్, జస్టిస్ చంద్రచూడ్‌లతో కూడిన బెంచ్ బోర్డు తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. కోర్టుకు అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణియమ్ దీనికి బీసీసీఐ ఆఫీస్ బేరర్లు సీకే కన్నా, అమితాబ్ చౌదరి, అనిరుధ్ చౌదరిలదే బాధ్యతని చెప్పారు. కానీ వీరంతా లోధా ప్యానెల్ సిఫారసులను పట్టించుకోవడం లేదని కోర్టుకు తెలిపారు. దీంతో కన్నెర్ర చేసిన బెంచ్... గతంలో జడ్జిమెంట్ ఇచ్చినట్లుగా బీసీసీఐ నియమావళికి ముసాయిదాను సిద్ధం చేయాల్సిందిగా సీఓఏను ఆదేశించింది.

లంక సోమరితనం వీడాలి

సునీల్ గావస్కర్

తొలి వన్డేలో సాధించిన అలవోక విజయంతో భారత్ వన్డే సిరీస్‌నూ టెస్టుల్లాగే ముగిస్తుందనే భరోసా కల్పించింది. అయితే ఇది అనుకున్నంత సులువేం కాదు. ఎందుకంటే మ్యాచ్‌లో మొదట లంక అద్భుతమైన ఆరంభాన్నిచ్చింది. 30 ఓవర్లలో 3 వికెట్లకు 160 పరుగులతో పటిష్టస్థితిలో నిలిచింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇన్నింగ్స్ పూర్తయ్యేసరికి ఈ స్కోరు రెట్టింపు చేసుకోవచ్చు. వికెట్లు చేతిలో ఉన్నప్పుడు ఇదేం అసాధ్యం కాదు. అయితే భారత బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు తీసి లంకను 216 పరుగుల వద్ద కట్టడి చేశారు. అక్షర్ పటేల్ మెరుగ్గా బౌలింగ్ చేయగా... ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ చెత్త షాట్లు భారత్‌కు కలిసొచ్చాయి. క్రీజులో ఉన్నప్పుడు వన్డేల్లో ముఖ్యంగా స్ట్రయిక్ రొటేట్ చేసుకోవాలి. కానీ 30 మీటర్ల సర్కిల్‌లో భారత ఫీల్డర్లు ఆ అవకాశం ఇవ్వకుండా వారిపై షాట్లు ఆడేలా ఒత్తిడి పెంచారు. ప్రపంచ క్రికెట్లో చెప్పుకోదగ్గ ఫీల్డింగ్ భారత్ సొంతం. దాంతో పాటు లంకేయుల సోమరితనం కూడా సింగిల్స్‌ను దూరం చేసింది. భారత ఆటగాళ్లలా డైట్ నియంత్రణ పాటించకపోవడం వల్ల ఒళ్లు చేసిన ఆతిథ్య ఆటగాళ్లు చురుగ్గా సింగిల్స్ తీయలేకపోయారు. దాంతో స్ట్రయిక్ కూడా రొటేట్ కాలేదు. ఇది వారిని అనాలోచిత షాట్లకు ఉసిగొల్పేలా చేసింది. భారత ఇన్నింగ్స్‌లో లంక ఫీల్డర్లు ఏం తక్కువ తినలేదు. డైరెక్ట్ హిట్‌తో అదరగొట్టారు. వారి పదునైన ఫీల్డింగ్‌కు రోహిత్ శర్మ బలయ్యాడు. ఇలాంటి ఫీల్డర్ల వల్ల బౌలింగ్ సులువవుతుంది. ఆతిథ్య బౌలర్లకు ఫీల్డర్ల నుంచి అలాంటి సానుకూలతే లభించింది. కాకపోతే లక్ష్యం మరీ చిన్నది కావడంతో చేసేదేమీ లేకపోయింది. అయినా... పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న భారత్ ముందు 300 కూడా తక్కువ స్కోరే. పైగా శిఖర్ ధావన్ సెంచరీ, కోహ్లి అజేయ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ ఫలితం ఏకపక్షమైంది.

42 బంతుల్లో ఆఫ్రిది సెంచరీ



డెర్బీ: అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైనా తనలో పదును తగ్గలేదని పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షాహిద్ ఆఫ్రిది నిరూపించాడు. నాట్‌వెస్ట్ టి20 బ్లాస్ట్ టోర్నీలో ఆఫ్రిది 42 బంతుల్లోనే సెంచరీ నమోదు చేయడం విశేషం. మంగళవారం డెర్బీషైర్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో హాంప్‌షైర్ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆఫ్రిది 43 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్సర్లతో 101 పరుగులు సాధించాడు. దూకుడైన ఆటకు చిరునామాలాంటి ఆఫ్రిదికి టి20 క్రికెట్‌లో ఇదే తొలి సెంచరీ. ఆఫ్రిది మెరుపులతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన హాంప్‌షైర్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 249 పరుగులు చేయగా... డెర్బీషైర్ 148 పరుగులకే ఆలౌటైంది. ఈ విజయంతో హాంప్‌షైర్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

మరో పంచ్‌కు రెడీ!

నేడు రెండో వన్డే • జోరు మీదున్న భారత్ • శ్రీలంక కోలుకునేనా!



తొలి టెస్టు నుంచి తొలి వన్డే వరకు వరుసగా నాలుగు మ్యాచ్‌లు... ఒకదాన్ని మించి మరో మ్యాచ్‌లో భారత్ అత్యద్భుత ఆటతీరు ఒకవైపు... కనీస పోటీ కూడా ఇవ్వలేకుండా పేలవంగా కుప్పకూలుతున్న శ్రీలంక మరోవైపు... ఇరు జట్ల మధ్య పోరు మరీ ఏకపక్షంగా మారిపోయింది. టీమిండియాలో ప్రతీ ఆటగాడు తన సత్తా చాటేందుకు ప్రయత్నిస్తుంటే... లంక క్రికెటర్లు ఘోరమైన ప్రదర్శన ఇవ్వడంలో ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారు. అభిమానుల ఆసక్తిని దూరం చేస్తున్న ఈ పర్యటనలో మరో మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. మళ్లీ కోహ్లి సేన ఆధిపత్యమా... లేక లంకేయుల పోరాటమా అనేది చూడాలి.

పల్లెకెలె: శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌లో తమ ఆధిక్యం పెంచుకునేందుకు భారత్ సన్నద్ధమైంది. ఇరు జట్ల మధ్య నేడు రెండో వన్డే జరగనుంది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో భారత్ 9 వికెట్లతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే ఆధిక్యం 2–0కు చేరుతుంది. సొంత గడ్డపై కనీసం ఒక్క విజయం కోసం ఆశగా ఎదురు చూస్తున్న శ్రీలంక ఈసారైనా తమ అదృష్టం మార్చుకోవాలని పట్టుదలగా ఉంది. 2019లో జరిగే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించాలంటే లంక ఈ సిరీస్‌లో కనీసం 2 వన్డేలైనా నెగ్గాలి. ఇలాంటి స్థితిలో ఆ జట్టు ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరం.

అదే జట్టుతో...

2019 ప్రపంచ కప్ సన్నాహాల్లో భాగంగా జట్టులో సభ్యులందరికీ వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఇవ్వాలనేది భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచన. అయితే సిరీస్‌లో రెండో మ్యాచే కావడంతో గత మ్యాచ్‌లో ఆడిన టీమ్‌లో మార్పులు లేకుండానే భారత బరిలోకి దిగనుంది. మీడియా సమావేశంలో విరాట్ కోహ్లి కూడా సూత్రప్రాయంగా ఇదే విషయాన్ని వెల్లడించాడు. కాబట్టి రహానే, పాండేలు మరోసారి పెవిలియన్‌కే పరిమితం కానున్నారు. బౌలింగ్ విషయంలో కూడా కుల్దీప్ యాదవ్‌కంటే అక్షర్‌కే కెప్టెన్ ప్రాధాన్యత ఇస్తున్నాడు. అక్షర్‌తో పాటు తొలి వన్డేలో చహల్ చక్కటి బౌలింగ్ ప్రదర్శన కనబర్చాడు. వీరిద్దరి బౌలింగ్ వైవిధ్యం లంక బ్యాట్స్‌మెన్‌కు మరోసారి ఇబ్బందులు సృష్టించనుంది. పార్ట్‌టైమర్‌గా జాదవ్ సత్తా చాటగా... బుమ్రా ఎప్పటిలాగే ఆకట్టుకున్నాడు. అయితే కొత్త బంతితో బౌలింగ్ చేసిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన బౌలింగ్‌ను ఇంకా మెరుగుపర్చుకోవాల్సి ఉంది. అతనికి ఈ మ్యాచ్ ఆ అవకాశం కల్పిస్తోంది. బ్యాటింగ్‌లో ధావన్, కోహ్లి అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. గత మ్యాచ్‌లో విఫలమైన రోహిత్ శర్మ భారీ ఇన్నింగ్స్‌పై దృష్టి పెట్టాడు. అయితే రాహుల్, జాదవ్‌లకు మరింత ప్రాక్టీస్ కల్పించేందుకు వారి బ్యాటింగ్ స్థానాల్లో మార్పులు చేసే అవకాశం మాత్రం ఉంది. ధోనికి కూడా బ్యాటింగ్ అవకాశం రావడం ముఖ్యం.

గెలిపించేది ఎవరు?

ఒక్క విజయం కోసం శ్రమిస్తున్న శ్రీలంక వద్ద అన్నీ సమాధానం లేని ప్రశ్నలే కనిపిస్తున్నాయి. గెలుపు కోసం ప్రయత్నించాల్సిన సమయంలో జట్టులో అభిప్రాయభేదాలు బయటపడినట్లు సమాచారం. గత వన్డేలో టెస్టు కెప్టెన్ చండిమాల్‌కు తుది జట్టులో స్థానమే లభించలేదు. ఓపెనర్ అయిన కెప్టెన్ తరంగ నాలుగో స్థానంలో బరిలోకి దిగడం కూడా అనూహ్య నిర్ణయం. కోచ్ పొథాస్, మేనేజర్ గురుసిన్హా, చీఫ్ సెలక్టర్ జయసూర్య మధ్య సమన్వయ లేమి లంకను దెబ్బ తీస్తోంది. తొలి వన్డేలో శుభారంభం చేసినా... చివరి వరకు అదే జోరును కొనసాగించడంలో శ్రీలంక విఫలమైంది. పేసర్లను సమర్థంగా ఎదుర్కొన్న ఆ జట్టు స్పిన్నర్లకు తలవంచింది. ఈ నేపథ్యంలో రెండో వన్డేలో కొత్త వ్యూహంతో బరిలోకి దిగాలని లంక భావిస్తోంది. బ్యాటింగ్‌లో టాప్–4 డిక్‌వెలా, గుణతిలక, కుశాల్ మెండిస్, తరంగలలో కనీసం ఇద్దరు భారీ స్కోర్లు చేయాల్సి ఉంది. మాథ్యూస్, కపుగెదెర కూడా తమ పాత్రలకు న్యాయం చేయలేదు. బౌలింగ్‌లో ఆ జట్టు పదును పూర్తిగా తగ్గిపోయింది. ముఖ్యంగా సీనియర్ ఆటగాడు మలింగ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోగా... ఫెర్నాండో గత మ్యాచ్‌లోనే అరంగేట్రం చేశాడు. తిసార పెరీరాపై ఈ మ్యాచ్‌లో వేటు పడవచ్చు. అతని మీడియం పేస్ భారత్‌కు ఏమాత్రం ఇబ్బంది సృష్టించలేకపోగా... భారత్ తరహాలో ఆ జట్టు స్పిన్నర్లు ఆకట్టుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో మ్యాచ్‌లో గెలవాలంటే లంక తీవ్రంగా శ్రమించాలి.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: కోహ్లి (కెప్టెన్), ధావన్, రోహిత్, రాహుల్, ధోని, జాదవ్, పాండ్యా, అక్షర్, భువనేశ్వర్, బుమ్రా, చహల్. **శ్రీలంక:** తరంగ (కెప్టెన్), డిక్‌వెలా, గుణతిలక, మెండిస్, మాథ్యూస్, కపుగెదెర, డి సిల్వ, సిరివర్ధన, సందకన్/ధనంజయ, మలింగ, ఫెర్నాండో.

పిచ్, వాతావరణం

సాధారణ బ్యాటింగ్ వికెట్. అయితే రెండో ఇన్నింగ్స్ సమయంలో పేసర్లకు కాస్త అనుకూలించవచ్చు. స్పిన్నర్లు కూడా ప్రభావం చూపించగలరు. మ్యాచ్ రోజున చిరుజల్లులకు అవకాశం ఉంది.

స్కైవేకు సై సై!



- 'జూబ్లీ' నుంచి లోతుకుంట వరకు
- పనులు చేపట్టేందుకు హెచ్ఎండీఏ ఆసక్తి
- అంచనా వ్యయం రూ.1,400 కోట్లు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరాన్ని విశ్వనగరంగా మార్చే ప్రక్రియలో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) కీలకపాత్ర పోషించబోతోంది. నగరవాసులు ప్రధానంగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ వెతలపై అధ్యయనం చేసిన హెచ్ఎండీఏకు చెందిన కాంప్రహెన్సివ్ ట్రాఫిక్ స్టడీ(సీటీఎస్) సూచనల మేరకు నగరంలో నూతన ఫ్లైఓవర్లు, స్కైవే పనులను చేపట్టడంపై దృష్టి సారించింది. బాలానగర్‌లోని నర్సాపూర్ చౌరస్తాపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు శోభనా థియేటర్ నుంచి ఐడీపీఎల్ వరకు ఆరు లేన్ల ఫ్లైఓవర్ పనులకు ఇటీవల భూమిపూజ చేసింది. ఇప్పుడు జూబ్లీ బస్టాండ్ నుంచి లోతుకుంట వరకు ఆరు కి.మీ మేర స్కైవే నిర్మాణ పనులు చేపట్టేందుకు హెచ్ఎండీఏ ఆసక్తి చూపుతోంది. స్కైవే నిర్మాణం, భూసేకరణకు రూ.1,400 కోట్లు అంచనా వ్యయం అవుతుండగా ఇప్పటికే హెచ్ఎండీఏ వద్ద జైకా నుంచి తీసుకున్న రుణంలో రూ.600 కోట్లు ఉన్నాయి. మిగిలిన రూ.800 కోట్లు ప్రభుత్వం సమకూరిస్తే స్కైవే పనులు చేపట్టేందుకు హెచ్ఎండీఏ సిద్ధమవుతోంది.

అద్భుత రీతిలో స్కైవే..

నగరానికే తలమానికమైన 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మించి ప్రపంచం దృష్టిని ఆకర్షించిన హెచ్ఎండీఏ.. అవకాశం వస్తే ఈ స్కైవేను అంతకుమించి అద్భుత రీతిలో నిర్మించాలని యోచిస్తోంది. ఈ స్కైవే నిర్మాణం వల్ల ఓఆర్ఆర్‌కు అనుసంధానం కావడంతో పాటు కరీంనగర్ నుంచి వచ్చే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పనున్నాయి. స్కైవే నిర్మాణం చేపట్టాలనుకుంటున్న ప్రాంతంలో రక్షణ శాఖ భూములు ఉండటంతో వాటిని ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం కోరింది. దీనికి రక్షణ శాఖ అంగీకారం తెలిపినా.. అధికారికంగా ఆదేశాలు రాలేదు. అవి రాగానే స్కైవే నిర్మాణానికి అడుగు పడనుంది. అలాగే ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి వరకు ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న స్కైవేకు నిధులు మంజూరు చేస్తే ఆ పనులు కూడా హెచ్ఎండీఏ చేపట్టేందుకు రెడీగా ఉందని ఓ అధికారి పేర్కొన్నారు.

హెచ్ఎండీఏ భూముల వేలం..

పీవీ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించిన పదేళ్ల తర్వాత హెచ్ఎండీఏ రూ.369.53 కోట్లతో బాలానగర్ నుంచి ఐడీపీఎల్ వరకు 1.09 కిలోమీటర్ల పొడవైన ఆరు లేన్ల ఫ్లైఓవర్ పనులను చేపట్టింది. ఈ నిధుల కోసం హెచ్ఎండీఏకు చెందిన భూములను వేలం వేయాలని భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వానికి గతంలోనే ప్రతిపాదనలు పంపింది. ఉప్పల్ భగాయత్ లే అవుట్‌తో పాటు హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లే అవుట్లలో ఉన్న స్ట్రేబీట్స్‌ను వేలం వేయడం ద్వారా రూ.400 కోట్లు సమీకరించి బాలానగర్ ఫ్లైఓవర్ పనులకు వెచ్చించాలని యోచిస్తోంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే వేలం పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఒక్క ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో ప్లాట్లను విక్రయించడం ద్వారానే రూ.250 కోట్లు వస్తాయని హెచ్ఎండీఏ అధికారులు లెక్కలు వేసుకుంటున్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీ సేవలు కీలకం

ఏజెన్సీల శిక్షణ కార్యక్రమంలో డీజీపీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీజీపీ అనురాగ్ శర్మ

సాక్షి, హైదరాబాద్: సమాజంలో పోలీసులతోపాటు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల సేవలు కూడా ముఖ్యమైనవని డీజీపీ అనురాగ్‌శర్మ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలకు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో ఆరు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర పోలీస్ ముఖ్య కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలు తమ గార్డులకు అనుభవజ్ఞులైన వారితో శిక్షణ ఇప్పించాలని, దీని వల్ల విధి నిర్వహణలో సెక్యూరిటీ గార్డులు మరింత అంకితభావంతో పనిచేస్తారన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు తమ సిబ్బందికి స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ పుస్తకాలను విధిగా అందించాలని, సిబ్బందికి ఐడెంటిటీ కార్డు, యూనిఫాం మెయింటెనెన్స్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని డీజీపీ సూచించారు. మొయినాబాద్‌లో ఆరు రోజులపాటు 40 ఏజెన్సీల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఏజెన్సీలకు డీజీపీ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది, ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు

ఎక్కువ మార్కులొచ్చాయని విషమిచ్చింది

వాటర్ బాటిల్‌లో దోమల నివారణ మందు కలిపి..

సత్నా(ఎంపీ): పరీక్షలో తనకన్నా ఎక్కువ మార్కులు పొందిన సహ విద్యార్థిని నీళ్ల సీసాలో మరో బాలిక దోమల నివారణ మందు కలిపి విషతుల్యం చేసింది. పోలీస్ కేసుకు భయపడి తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలి పరిస్థితి నిలకడగా ఉండగా, నిందితురాలి ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం...మధ్యప్రదేశ్‌లోని సత్నాకు చెందిన ఇద్దరు బాలికలు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. సోమవారం పాఠశాలలో నిందితురాలు దోమల నివారణ మందు కలిపిన నీటిని తాగిన తరువాత బాధితురాలు అస్వస్థతకు లోనైంది. ఈ సంగతిని పాఠశాల యాజమాన్యం ఆమె తల్లిదండ్రులకు తెలపడంతో వారు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. నిందిత బాలిక వాటర్ బాటిల్‌ను విషతుల్యం చేసి, దోమల నివారణ మందుని మరొకరి బ్యాగులో పెట్టడం సీసీటీవీ కెమెరాలో కనిపించింది. ఆమె కన్నా తాను ఎక్కువ మార్కులు పొందినందుకు అసూయతోనే ఇలా చేసి ఉండొచ్చని బాధితురాలు పేర్కొంది. మరోవైపు నిందితురాలు కూడా మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

అవినీతి కేసులో విజయన్‌కు ఊరట



కోచ్చి: రెండు దశాబ్దాలుగా వెంటాడుతున్న అవినీతి కేసులో కేరళ ముఖ్యమంత్రి పి.విజయన్‌కు ఊరట లభించింది. ఎస్ఎన్‌సీ లావ్లిన్ కేసులో ఆయన్ని నిర్దోషిగా ప్రకటించడాన్ని కేరళ హైకోర్టు బుధవారం సమర్థించింది. ప్రాథమికంగా ఆయనపై ఎలాంటి కేసు నమోదుకాకున్నా సీబీఐ పొరపాటున విజయన్‌ని అందులో నిందితుడిగా చేర్చిందని పేర్కొంది. కేసులో కుట్రను నిరూపించడానికి దర్యాప్తు అవసరమన్న సీబీఐ విన్నపాన్ని కొట్టివేసింది. 1996లో విజయన్ విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కెనడా కంపెనీ ఎస్ఎన్‌సీ లావ్లిన్‌కు కట్టబెట్టిన కాంట్రాక్టుల్లో అవినీతి జరిగిందన్నది ప్రధాన ఆరోపణ. దీని వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.374.50 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ కేసులో విజయన్‌తో పాటు మరి కొందరు నిర్దోషులని తిరువనంతపురంలోని సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. దీన్ని సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

పైన మొక్కజొన్న.. కింద గంజాయి..

- ఓఆర్ఆర్‌పై 300 కేజీల గంజాయి పట్టివేత
- విశాఖ జిల్లా నర్సీపట్నం నుంచి రవాణా
- ఐదుగురి అరెస్ట్.. పరారీలో మరో ముగ్గురు

హైదరాబాద్: పైన మొక్కజొన్న సంచులు.. కింద గంజాయి బ్యాగ్‌లు.. మాదకద్రవ్యాల రవాణా కోసం స్మగ్లర్లు ఎన్నుకున్న మార్గమిది. బుధవారం ఔటర్ రింగ్ రోడ్డుపై బొలేరో వాహనంలో తరలిస్తున్న 300 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేశారు. బుధవారం శంషాబాద్ డీసీసీ పీవీ పద్మజ విలేకరులకు వివరాలు వెల్లడించారు. వారం రోజులుగా ఔటర్‌పై ఆర్‌జీఐఏ పోలీసులతో పాటు ఎస్ఓటీ, సీసీఎస్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో అనుమానాస్పదంగా వెళుతున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనం లోడులో పై భాగం మొత్తం మొక్కజొన్న సంచులతో నింపి.. కింది భాగంలో 11 బ్యాగుల్లో తరలిస్తున్న 300 కేజీల గంజాయి గుట్టు రట్టయ్యింది. విశాఖ జిల్లా చింతపల్లి తొట మామిడి గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు, సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ గ్రామానికి చెందిన పరుశురాంతో గంజాయిని స్మగ్లింగ్ చేసే విషయంలో ఒప్పందం కుదుర్చుకున్నాడు. విశాఖ జిల్లా నర్సీపట్నం నుంచి బొలేరో వాహనంలో మూడు క్వింటాళ్ల గంజాయిని బ్యాగుల్లో సర్దుకుని, దానిపై భారీగా మొక్కజొన్న సంచులను వేసుకుని విశాఖ జిల్లా కోడుగుమ్మడి గ్రామానికి చెందిన తంబెల్లి చందర్‌రావు(24), తుని మండలానికి చెందిన జొక్కన్న శ్రీను బయలుదేరారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన మోహన్(20), సీహెచ్ వెంకట్(29) ఇండికా కారులో పరుశురాం సూచనల మేరకు సూర్యాపేట నుంచి బొలేరో వాహనానికి పైలట్‌గా వస్తూ పోలీసు తనిఖీల గురించి బొలేరోలో ఉన్న వారికి సమాచారం అందిస్తున్నారు. శంషాబాద్ కొత్వాల్‌గూడ పరిధిలోకి వచ్చిన వీరి వాహనాలను పోలీసులు తనిఖీ చేయడంతో గంజాయి రవాణా గుట్టు రట్టయింది. రూ.30 లక్షల విలువ చేసే 300 కేజీల గంజాయితో పాటు రెండు వాహనాలు, రూ.4,250 నగదు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చందర్‌రావు, శ్రీను, మోహన్, వెంకట్‌తోపాటు విశాఖ వాసి బొంతల నాగులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. లక్ష్మణ్‌రావు, పరుశురాంతో పాటు విశాఖ వాసి తంబెల్ల సురేశ్ పరారీలో ఉన్నారు.



తనిఖీల్లో పట్టుబడిన గంజాయి

హ్యాష్‌ట్యాగ్‌కు పదేళ్లు పూర్తి

పారిస్: నేటి సామాజిక మాధ్యమాల్లో కీలకంగా వాడే హ్యాష్‌ట్యాగ్(#)కు బుధవారంతో పదేళ్లు పూర్తయ్యాయి. అమెరికాకు చెందిన క్రిస్ మెస్సినా అనే సామాజిక మాధ్య మ నిపుణుడు హ్యాష్‌ట్యాగ్ విధానాన్ని రూపొందించి, తొలిసారిగా 2007 ఆగస్టు 23న ఓ ట్వీట్‌లో '#barcamp' అనే హ్యాష్‌ట్యాగ్‌ను వాడారు. అప్పటి నుంచి కోట్లాది మంది హ్యాష్‌ట్యాగ్‌లను సామాజిక మాధ్యమాల్లో వాడుతున్నారు.

బీజింగ్ వెలుపల న్యూ సిటీ

బీజింగ్: దేశ రాజధాని బీజింగ్‌పై ఒత్తిడి తగ్గించడంలో భాగంగా 'జియాంగ్జన్ న్యూ ఏరియా' పేరిట కొత్త నగరాన్ని నిర్మిస్తున్నట్లు చైనా తెలిపింది. బీజింగ్‌లో నివసిస్తున్న ప్రజల్లో దాదాపు 3 నుంచి 5 లక్షల మందిని ఈ నగరానికి తరలించే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. దీన్ని బీజింగ్‌కు సమీపంలోనే నిర్మిస్తున్నట్లు తెలిపింది. రాజధానిలో జరిగే కార్యకలాపాలకు జియాంగ్జన్ దూరంగా ఉండాలని అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అభిలషిస్తున్నట్లు తెలిపింది.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.